పందొమ్మిదవ జన్మదిన ప్రత్యేక సంచిక

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 19 సంచిక : 1 హైదరాబాద్ 231 జనవరి 2021 పేజీలు : 84 రు. 25

- వ్యవసాయ చట్టాలు - రైతుల ప్రతిఘటన ఎనిమిది ప్రతిస్పందనలు
- కార్పొరేట్ కౌగిలిలో బ్యాంకులు
- తెలంగాణ ఎన్నికలు - ప్రజాస్వామ్యం ఎక్కడ?
- నూతన విద్యా విధానం చెప్పే సంస్కృతి
- దేశభక్తికి యోగ్యతా పత్రాలు
- ఆర్‌సిఇపిలో భారత్ అవకాశాలు - సవాళ్లు

పాఠకులకు, రచయితలకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు, అభిమానులకు
2021 నూతన సంవత్సర శుభాకాంక్షలు

పందొమ్మిదో పుట్టిన రోజున...

ఈ సంచికతో వీక్షణం పందొమ్మిదో సంవత్సరంలోకి ప్రవేశిస్తున్నది. మీ కళ్ల ముందర పుట్టిన బిడ్డ, తడబడే బుడిబుడి అడుగుల నడక ప్రారంభించిన శిశువు, క్రమక్రమంగా తెలుగునాట ప్రభావశీల పత్రికగా కౌమారదశ దాటి, తొలియవ్వనంలో ప్రవేశించి తన రెండో దశకాన్ని పూర్తి చేసుకునే స్థాయికి నవనవోన్మేషంగా ఎదుగుతున్నది. పద్దెనిమిది సంవత్సరాలు, 230 సంచికలు, దాదాపు నాలుగువేల రెండు వందల వ్యాసాలు – ఈ చలనానికీ వికాసానికీ అధ్యయనానికీ చైతన్యవ్యాప్తికీ ప్రభావానికీ మీ సంపూర్ణ సహాయ సహకారాలే ఏకైక కారణం. వేలాది మంది పాఠకులు, రచయితలు, అనువాదకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు మా ఈ పనిని సుసాధ్యం చేశారు. ముద్రాపకులు, ప్రింటింగ్ ప్రెస్ సిబ్బంది, పోస్టల్ సిబ్బంది, న్యూస్ ఏజెంట్లు తమ అమూల్య సహకారం అందించకపోతే ఈ పని ఈ స్థాయిలో జరిగి ఉండేదే కాదు. ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు. నిర్వాహకులుగా, సంపాదకులుగా, సిబ్బందిగా మేము చేసినదల్లా ఈ ప్రత్యామ్నాయ ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక మాసపత్రికను మీ ఆకాంక్షలకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నించడమే. ఆ ప్రయత్నంలో జరిగిన, జరుగుతున్న లోపాలను ఎప్పటికప్పుడు సరిచేసుకుంటూ, మీ సంతృప్తి సూచకమైన ఆమోదాన్ని స్వీకరిస్తూ ముందుకు సాగే దీక్షకు ఈ పందొమ్మిదో పుట్టినరోజున పునరంకితమవుతున్నాం.

ఎప్పటిలాగే మీ ఆదరణ, స్నేహ హస్తం, ఆర్థిక, హార్దిక సహకారం కొనసాగుతాయని ఆశిస్తూ...

– వీక్షణం కలెక్టివ్

చందాలు, విరాళాలకు

VEEKSHANAM

ఆంధ్రాబ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం అయినందువల్ల ఐఎఫ్ఎస్‌సి నంబర్ మారింది.

ఇక నుంచి అకౌంట్ నెంబర్ – **013911011002175**

యూనియన్ బ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

ఐఎఫ్ఎస్‌సి నం **UBIN0801399**

ఈ అకౌంట్ నంబర్‌తో ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్‌తో పాటు
గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎంల ద్వారా కూడా చెల్లించవచ్చు.

పాఠకులకు, రచయితలకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు, న్యూస్ ఏజెంట్లకు

2021 నూతన సంవత్సర శుభాకాంక్షలు

231 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

జనవరి 2021
సంపుటి : 19
సంచిక : 01

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓ.లు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌పై **'VEEKSHANAM'** అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **UBIN0801399** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

పాఠకుల వీక్షణం

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన డా. వి. ఉపేందర్ రావు, కొత్తగూడెం - రు. 25,000; జాతీయ స్ఫూర్తి పక్షపత్రిక, ఏలూరు - రు. 5,000; వి, రేణుక, హైదరాబాద్ - రు. 5,000; షేక్ కరిముల్లా, గుంటూరు - రు. 2,000; కె. రమేష్, విజయవాడ - రు. 1,000; వై. క్రిష్ణయ్య, రిటైర్డ్ టీచర్, ఖమ్మం - రు. 10,000; శ్రేయోభిలాషి, కాకినాడ - రు. 2,000; డా. నళిని, గద్వాల - రు. 2,000; బి. శ్రీనివాస్, గద్వాల - రు. 1,000; డా. కె. శంకరయ్య, గద్వాల - రు. 1,000; ఆలూరు ప్రకాశ్ గౌడ్, గద్వాల - రు. 1,000; నాగార్జున్ రెడ్డి, గద్వాల - రు. 1,000; పటేల్ ప్రభాకర్ రెడ్డి, గద్వాల్ - రు. 1,000; బి. రమాసుందరి, ఒంగోలు - రు. 2,000; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణం డిసెంబర్ సంచికలో ప్రచురించిన అన్ని వ్యాసాలు ఆసక్తిని రేకెత్తించేలా ఉన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగే విషయాలు ఇక్కడి (తెలంగాణ) దిన పత్రికలలో చాలా తక్కువగా వస్తున్నాయి. వీక్షణంలో ప్రతినెలా ఒక్క వ్యాసమైన వస్తున్నది. కాని అమరావతి రాజధాని కోసం అక్కడి రైతులు చేస్తున్న ఆందోళనలు, దళితులపై జరుగుతున్న పోలీసుల దాడులు, ఇంకా ఎన్నో విషయాలు తెలియడం లేదు. వీక్షణంలో ఆంధ్రప్రదేశ్ లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై, జగన్ ప్రభుత్వం అమరావతి రాజధాని గ్రామాల ప్రజలపై కొనసాగిస్తున్న అణచివేతపై ఇంకా ఎన్నో వ్యాసాలు ప్రచురించాల్సిన అవసరం ఉంది. బర్నబాస్ గారు రాసిన వ్యాసం చదువుతుంటే ఎపిలోని పోలీసు వ్యవస్థ ఎంత ఘోరంగా ఉందో చక్కగా వివరించారు. అమాయక ముస్లింపై దొంగతనం నేరం మోపి, ఆ దొంగతనాన్ని ఒప్పుకోవాలని అతనిపై ఒత్తిడి తేవడం చూస్తుంటే అక్కడి పోలీసులు అమాయక జనాల పట్ల ఎంత అమానవీయంగా వ్యవహరిస్తున్నారో తెలుస్తుంది. చేయని నేరానికి తనను అవమానించించారనే బాధ భరించలేక కుటుంబంతో సహా ఆత్మహత్యకు పాల్పడినాడంటే పోలీసులు అతడిని ఎంతగా హింసించారో తెలుస్తుంది. అధికారం తమ చేతుల్లో ఉంటే రాజకీయ నాయకులు కాని, పోలీసులు కాని సామాన్య జనంపై ఎంతటి ఘోరానికైనా పాల్పడతారని అర్థం అవుతున్నది. అలాగే తెలంగాణలో ఆర్ఎస్ఎస్, బిజెపి మద్దతుతో దళితులపై అగ్రవర్ణాల దాడులు ఎక్కడో ఒకచోట కొనసాగుతూనే ఉన్నాయి. 'రామోజిపేట దళితులపై దాడులు' వ్యాసం ఇందుకు చక్కటి ఉదాహరణ. భారతదేశంలో కుల, మత వివక్ష లేకుండా, అందరూ సమానులే అని, రాజ్యాంగం ద్వారా అందరికి సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని సిరిసిల్లా జిల్లా, రామోజీపేట గ్రామ దళితులు అనుకున్నారు. కాని విగ్రహం పెట్టనివ్వకపోవడమే కాకుండా, అదే సాకుతో దళితవాడకు చెందిన కొంతమందిని అదే గ్రామ ముదిరాజ్ వర్గానికి చెందినవారు ఆర్ఎస్ఎస్, బిజెపి మద్దతుతో తీవ్రంగా కొట్టడం చూస్తుంటే దేశంలో దళితులపై బిజెపి, ఆర్ఎస్ఎస్ దాడులు ఎంత దారుణంగా ఉంటున్నాయో తెలుస్తున్నది. దేశంలో జరుగుతున్న అనేక పరిణామాల గురించి ఎప్పటికప్పుడు వీక్షణంలో కొత్త కొత్త విషయాలతో వ్యాసాలు అందిస్తూ మాలాంటి వారిని ఎంతో ఆలోచింపజేయడంతో తోడ్పడుతున్న వీక్షణం బృందానికి నా ధన్యవాదాలు.

– కృష్ణహరి
మహబూబ్‌నగర్

వీక్షణం ప్రతి పత్రికలో దేశంలో, అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు విశ్లేషణతో కూడిన వ్యాసాలను అందిస్తున్నందుకు కృతజ్ఞతలు. పాలకులు ప్రజలను రకరకాల ప్రలోభాలకు, భావోద్వేగాలకు గురిచేస్తూ ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ఎన్నికల్లో గెలుస్తూ అదే ప్రజామోదంగా భ్రమింపజేస్తున్నారు. ఈ భ్రమలను దేశవ్యాప్తంగా వ్యాపింపజేస్తున్న పరిస్థితి నేడు నెలకొని ఉంది. కాబట్టి ఇటువంటి దుర్మార్గాలపై విశ్లేషణతో కూడిన వ్యాసాలు వీక్షణంలో ఈ సందర్భంలో రావాల్సిన అవసరం ఉంది. ప్రజలను సవాలక్ష ప్రలోభాలకు గురిచేసి ఎన్నికల్లో నెగ్గిన పాలకుల స్వభావాన్ని ప్రజల ముందు బట్టబయలు చేయాల్సిన అవసరం ఉంది. ఎన్నికలు నిజంగా ప్రజామోదానికి గీటురాయేనా? మొత్తం ఓటర్లెంత? అందులో ఎంత మంది ఎన్నికల్లో పాల్గొంటున్నారు? గెలిచామనుకుంటున్న పార్టీ ప్రలోభాలకు ఎంతమంది ఓటేశారు? ఇలాంటి అంశాలపై వివరమైన వ్యాసాలను ప్రచురించి నాలాంటి వారి అవగాహనను పెంచగలరని మనవి.

– వి. ప్రభాకర్
పటాన్‌చెరువు

వీక్షణంలో వస్తున్న ప్రతినెలా సంపాదకీయం, సంపాదకీయ వాఖ్యలు చదువుతుంటే ఎపి, తెలంగాణలో జరుగుతున్న పరిణామాల గురించి కళ్లకు కట్టినట్లుగా ఉంటున్నాయి. ఎపి, తెలంగాణనే కాకుండా ఇతర రాష్ట్రాల, దేశాల ప్రజల సమస్యల మీద మంచి వ్యాసాలు ప్రచురిస్తున్నారు. ప్రతి రోజు ఎక్కడో ఒకచోట సామాన్య జనం మీద (దళితులపై) అగ్రవర్ణాల దాడులు, అమాయక ప్రజలపై పోలీసుల దాడులు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు (హాథ్రస్ ఘటన), ప్రశ్నించే వారిని (ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రజా సంఘాల నాయకులను) అరెస్ట్ చేయడం జరుగుతూనే ఉన్నాయి. వాటిపై దినపత్రికలలో ఎక్కడో ఒకచోట వార్తలు వస్తుంటాయి. కాని వెలుగులోకి రానివి ఎన్నో ఉన్నాయి. వాటిపై లోతయిన విశ్లేషణతో కూడి అసలు కారణాలను తెలిపే వ్యాసాలు వీక్షణంలో వస్తే బాగుంటుంది. ఈ సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు, పోలీసు యంత్రాంగం మాత్రం అయిన వారికే అండగా ఉంటున్నారు. ఇలాంటి తరుణంలో వీక్షణం పత్రిక అవసరం ఎంతగానో ఉన్నది. ప్రతి సామాన్యుడు పాలకులు అనుసరిస్తున్న తప్పుడు విధానాలను అర్థం చేసుకొని ప్రశ్నించే గొంతుకలా వీక్షణం పత్రిక తోడ్పడాలి. ఇప్పుడున్న పరిస్థితులలో ఇలాంటి పత్రిక అవసరం చాలా ఉన్నది. ప్రతినెలా క్రమం తప్పకుండా తెస్తున్నందుకు వీక్షణం కలెక్టివ్ వారికి కృతజ్ఞతలు. అలాగే పాఠకులుగా మనం కూడా పత్రికకు మనవంతు సహాయాన్ని అందించి పత్రికకు అండగా ఉండడం కూడా మన బాధ్యత.

– మాధవ్ కుమార్
జహీరాబాద్

కోవిడ్ వల్ల పత్రికలలో సాధారణ వార్తలు రావడం లేదు గనుక అసహజ మరణాల సూచి సమగ్రంగా తయారు చేయడం సాధ్యం కావడం లేదు. కొద్దికాలంగా అసహజ మరణాల సూచి వేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం. సం.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

ఈ పోరాటం జయించాలి, ప్రజల స్వప్నం ఫలించాలి

వీక్షణం

వీక్షణం పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ సందర్భంలో సరిగ్గా ఏడాది కింద వీక్షణం జనవరి 2020 సంచికకు 'దేశానికి సంఘ్ పరివార్‌ను ప్రతిఘటించే ఉత్సవ సందర్భం' అనే శీర్షికతో రాసిన సంపాదకీయం గుర్తుకొస్తున్నది. సరిగ్గా ఇప్పుడు ఢిల్లీని నలువైపులా ముట్టడించి, మోడీ-షాల దుర్మార్గ పాలన మెడలు వంచడానికి ప్రయత్నిస్తున్న రైతు ఉద్యమం లాగనే అప్పుడు కూడ దేశవ్యాప్తంగా సిఎఎ-ఎన్‌ఆర్‌సికి వ్యతిరేకంగా మహా ఉద్యమం సాగుతున్నది. కొవిడ్ లాక్‌డౌన్ వచ్చి, "సంక్షోభాలను అవకాశాలుగా మార్చుకోవాలి" అని మోడీ విషపు కోరలు సాచకపోయి ఉంటే, ఆ సిఎఎ వ్యతిరేక ఉద్యమం కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి ఉండేది. లాక్‌డౌన్ పేరిట ప్రజా చలనాన్నీ, ప్రజా చైతన్యవ్యాప్తినీ అరికట్టిన, ఎక్కడ ప్రశ్న తలెత్తినా దమననీతి అమలు చేసిన పాలకులు, ఆ తొమ్మిది నెలల్లోనే కార్మిక వ్యతిరేక చట్టాలు తెచ్చారు, ప్రభుత్వరంగ సంస్థలను ఎడాపెడా అమ్మకానికి పెట్టారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల వశం చేసే చట్టాలు తెచ్చారు. పౌరహక్కు లను కాలరాశారు. ఎదురులేదన్నట్టుగా విర్రవీగుతూ ముందుకు సాగుతున్న మోడీషా రథం ఇప్పుడు వ్యవసాయ చట్టాలకు రైతుల ప్రతిఘటనతో ఇరకాటంలో పడింది. ఆ ఉద్యమం మరింత విశాలమై, బలం పుంజుకుని పాలకరథాన్ని అడ్డుకోగలుగుతుందా, ఆ రథచక్రాల కింద నలిగిపోతుందా రానున్న కాలమే తేల్చిచెపుతుంది. కాని ఏడాదికింద ప్రజాఉద్యమ శిబిరం ఎంత ఉత్సాహంగా ఉండిందో, ఇప్పుడు మళ్లీ అంత ఉత్సాహంగా ఉండే అవకాశం వచ్చింది. ఈ మధ్యలో ఎనిమిది తొమ్మిది నెలలపాటు దిక్కు తోచని చీకటి, దమనకాండ, అన్యాయం, అక్రమం నిరాశలో ముంచెత్తి నప్పటికీ, ఇవాళ్టి వెలుగును ఆహ్వానించవలసి ఉంది. ఈ పోరాటం జయించాలని మనస్ఫూర్తిగా కోరుకోవలసి ఉంది. ఈ ఉద్యమం విస్తరించి ఈ దేశ ప్రజల స్వప్నం సాకారం కావాలని కోరుకోవలసి ఉంది.

"సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, హిందుత్వ ఫాసిజం కోరలు చాచి విస్తరిస్తున్న ఈ సమయంలో కాలండర్ మారిన సందర్భాలకూ శుభాకాంక్షలకూ ఔచిత్యం ఏమిటని అనిపించవచ్చు. కాని చార్లెస్ డికెన్స్ రెండు మహానగరాలు ప్రారంభంలో రాసినట్టు ఇది ఎంత విచారకరమైన, విషాదగ్రస్తమైన, నిరాశాజనకమైన వల్లకాటి అధ్వాన్న శకంగా కనబడుతున్నప్పటికీ, అదే సమయంలో ఇది ఒక ఉత్సాహభరితమైన, ఉత్తేజకరమైన, ఆశాసూచనలు వెల్లివిరుస్తున్న వైభవోజ్వల శకం కూడ. ప్రజావ్యతిరేక దుర్మార్గ శక్తుల దుందుడుకు వేగం ఎంత నిజమో, ప్రజా చైతన్య, సమీకరణ, ప్రతిఘటన సమరోత్సాహం కూడ అంతే నిజం. నిజంగానే గడిచిన ఐదు సంవత్సరాలు, మరీ ముఖ్యంగా గడిచిన సంవత్సరం ప్రపంచం మొత్తంగానూ, దేశంలోనూ, రాష్ట్రంలోనూ నిరాశాజనకమైన ప్రజావ్యతిరేక పరిణామాలెన్నో సంభవించాయి. అనేక దేశాలలో అభివృద్ధి నిరోధక శక్తులు అధికారానికి వచ్చాయి. అంతర్జాతీయంగా సామ్రాజ్యవాద శక్తులదే పైచేయి అయింది. నరేంద్ర మోడీ-అమిత్ షా ద్వయం మితిమీరిన ఆధిక్యతతో గద్దెనెక్కింది. అంతర్జాతీయంగానూ దేశీయంగానూ ఆర్థిక సంక్షోభం వడివడిగా పరుగెత్తుకొస్తున్నది. దేశంలోనూ, రాష్ట్రంలోనూ కనీస పౌర, ప్రజాస్వామిక హక్కుల మీద ఉక్కుపాదం అమలవుతున్నది. ఎటు చూస్తే అటు నిరాశ, అటు దుఃఖం. నిజమే. కాని, అదే సమయంలో అన్ని ఖండాలలోనూ అనేక దేశాలలో రాజధానీ నగరాలలో, కీలక స్థలాలలో లక్షలాదిగా ఉవ్వెత్తున లేచి నిలిచి అధికారాన్నీ అవ్యవస్థనూ ప్రశ్నిస్తున్న ప్రజా సమూహాలు, నాయకత్వం ఉన్నా లేకపోయినా, శాస్త్రీయ పథంలో అయినా కాకపోయినా వెల్లివిరుస్తున్న ధిక్కారం, చుట్టూ రాతిగోడలు కట్టి బంధించిన కొద్దీ ఎక్కడికక్కడ ఎప్పటికప్పుడు బండల మధ్య నుంచి తొంగిచూస్తున్న చిగుళ్ల స్వేచ్ఛాగీతాలు, అణచివేసిన కొద్దీ ఉక్కుపాదాలను పడదోస్తున్న చైతన్య సంకేతాలు, మహా విష సర్పాలను చుట్టుముడుతున్న చలిచీమల గుంపులు. ఆ నిరాశ ఎంత నిజమో, ఈ ఆశా అంతే నిజం" అని ఏడాది కింద ఈ సంపాదకీయం రాసింది.

అవును, ఆ ఏడాది కిందటి ఆశాసూచిక సిఎఎ వ్యతిరేక ప్రజా ఉద్యమం దారుణ దమనకాండకు, ఢిల్లీ కల్లోలాల కుట్రకు బలి అయి ధ్వంసమైపోయినప్పటికీ, ఇప్పుడు అదే ఢిల్లీ అంచులలో మరొక ఆశ మోసులెత్తుతున్నది. ఈ ఉద్యమం పైకి చూడడానికి ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు వ్యవసాయ రంగ చట్టాల ఉపసంహరణ అనే పరిమిత లక్ష్యంతో సాగుతున్నట్టు కనబడుతున్నది. నిశితంగా పరిశీలిస్తే అందులో మరెన్నో కోణాలున్నాయి. ఇది ఈ దేశపు రైతాంగ చైతన్యం ఎంత క్రియాశీలమైనదో చూపుతున్నది. రైతాంగం తలచుకుంటే మహా శక్తిమంతమైన ప్రభుత్వాన్నీ కార్పొరేట్లనూ ప్రతిఘటించగలదని చూపుతున్నది. అత్యంత ప్రమాదకారులుగా, ప్రధాన ప్రజా శత్రువులుగా కనబడుతున్న కార్పొరేట్ల ఆర్థిక మూలాలను ప్రజలు తలచుకుంటే దెబ్బ కొట్టగలరని, వారి సరుకులను బహిష్కరించగలరని, వారి కార్యాలయాల ముందర ప్రదర్శనలు నిర్వహించగలరని, వారి సామాజిక ప్రతిష్ఠను భంగపరచగలరని ఈ ఉద్యమం చూపుతున్నది. గజ బందిపోట్ల ఇష్టారాజ్యపు దోపిడీకి స్థావరాలుగా ఉన్న టోల్ గేట్లను ప్రజలు తలచుకుంటే ముట్టడించగలరనీ, తిరస్కరించగలరనీ ఈ ఉద్యమం చూపుతున్నది. కరోనా వైరస్ వల్ల మనుషుల మధ్య దూరం పాటించాలని హెచ్చరికలు వస్తుండగా, చలికాలపు ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోతుండగా కూడ ప్రజల పోరాట దీక్ష చెక్కు చెదరడం లేదంటే, ఈ చట్టాల ప్రమాదం జీవన్మరణ సమస్య అని రైతాంగ భావిస్తున్నదని ఈ ఉద్యమం చూపుతున్నది. చర్చలంటూ పిలుస్తూ, అసలు విషయాలు చర్చించకుండా తాత్సారం చేస్తున్న ప్రభుత్వ కార్పొరేట్ దాస్య స్వభావాన్ని ఈ ఉద్యమం బట్టబయలు చేస్తున్నది. ఒక నిజమైన ప్రజా సమస్య మీద, విస్తృతమైన భాగస్వామ్యంతో సాగుతున్న ప్రజా ఉద్యమాన్ని పట్టించుకోకుండా, అబద్ధాలు ప్రచారం చేస్తూ, తప్పుడు విశ్లేషణలు చేస్తూ కాలం గడుపుతున్న ప్రధానస్రవంతి ప్రచార సాధనాలు పాలకవర్గాల పెంపుడు జంతువులనే వాస్తవాన్ని ఈ ఉద్యమం చూపుతున్నది. నిజమైన ప్రజా ఉద్యమం విశాలమైన ప్రజా సంఘీభావాన్ని కూడగట్టుకోగలదని ఈ ఉద్యమం చూపుతున్నది. తన లక్ష్యాలు సాధించడంలో ఈ ఉద్యమం గెలుస్తుందా లేదా అనేది సమస్య కాదు. అది ఇప్పటికే ప్రజా చైతన్యాన్ని విస్తరించడంలో విజయం సాధించింది. ఆ ప్రజా చైతన్యాన్ని అందిపుచ్చుకుని, విశాలం చేసి, మరిన్ని ప్రజారాశులలోకి ప్రవహింపజేసి, దిశానిర్దేశం చేసి, నాయకత్వం వహించి, అంతిమ ప్రజారాజ్య, సమసమాజ లక్ష్యం దాకా నిర్వహించవలసిన నిజమైన ప్రజాశక్తుల కోసం ఈ దేశం ఎదురుచూస్తున్నది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

దొర మాటలు, చేతలు - అబ్బ ఎంత ఉల్టా పల్టా?

రైతుల భూములు గుంజుకోని కంపెనీలకు కట్టబెట్టుటానికి, రైతులు ఏమి పండిచ్చాల్నో, ఏమి పండిచ్చొద్దో కంపెనీలు చెప్పుటానికి, తిండిగింజలు గుమ్ముల్ల దాసుకొని కరువు పుట్టిచ్చి పిరంగ అమ్ముకోవటానికి కంపెనీలకు సౌలత్ జెయ్యటానికి ఢిల్లి సర్కారు ఖానూన్లు జేసింది. ఆ ఖానూన్లకు ఖిలాఫ్ గ దేశం దేశమంత ఒక్క దిక్కయితున్నది. ఆ ఖానూన్ల మీద భైస్ జరిగేటప్పుడు దొర నేను భీ ఖిలాఫే అన్నడు. గప్పుడె పట్నంల ఓట్ల పండుగొచ్చింది. దొరకూ పువ్వు గుర్తోళ్లకూ పెద్ద లడాయి అయితానట్టు కనబడ్డది. ఎహె గదంత ఉల్లెక్కాల, నువ్వు కొట్టినట్టు జెయ్యి, నేను ఏడ్చినట్టు జేత్త అని శాత్రం జెప్పినట్టు గది దోస్తానె అని దోస్తులన్నరు గని నేను నమ్మలె. ఇగ ఖానూన్ అయిపొయ్యి, గాడ సిక్కులోల్లు, వేరెటోల్లు ఎగుసందార్లందరు ధర్నా జేసుడు మొదలు బెట్టంగనె దొర గుడ గాలి ఎట్టెట్టనో ఉందిరో అనుకున్నడు. గాలి ఎటుదిక్కు వోతె గటు దిక్కె మనం గద. ఖానూన్లకు ఖిలాఫ్ గ దేశమంత బంద్ అంటె దొర గుడ ఔ నిచ్చమే, బంద్ జెయ్యాలె అన్నడు. పాపం శాన రోజులకు చిన్నదొర రోడ్డు మీద గూసునె. గులాబి జెండ బట్టుకోని పట్నమంత గాయి గాయి జేసిరి. ఢిల్లి సర్కారు తోటి, పువ్వు గుర్తోల్ల తోటి యుద్ధమే అని దొర లడాయి గీత గీసె. అబ్బో జోరుగున్నదిరో కత అనుకుంటి. కని ఇండ్ల ఏదో ఇక్మతుంటది, దొర మాదండి మనిషి, గంత అల్కటోడు గాదు అని సోంచాయిస్తనే ఉన్న. ఇగ రెండొద్దులు గాంగనె దొర ఢిల్లికి పాయె. ఆడ ఇద్దరు లీడర్ల ముంగట తల్కాయొంచుకోని నిలబడె. కావలిచ్చుకునె. శాలువ గప్పె. ఇదేందిరో గిట్లొచ్చింది కత. కొండంత రాగం దీసి అని సామెత జెప్పినట్టు లడాయి లడాయి అనుకుంట కత్తి దీస్కోని ఉరికి, ఆడికి పొయి ఒరల నుంచి సర్రుమని తీశెటాలకు గండ్ల కత్తి లేకపాయెనా, పువ్వే ఉండెనా అని ఇచ్చిత్ర పడ్డ. ఢిల్లి నుంచి గాలి మోటర్ల పట్నం వచ్చి దొర సీద ఎర్రవల్లికి పాయె. కోరంటో గీరంటో ఏదో అంటరు గద, గత్తర రాకుంట. గది గావచ్చులే, రెండు వారాలు గాంగనె ఇంట్లకెల్లి ఎల్లుతడు, మల్ల కత్తి దూస్తడు, అవ్వల్ దర్జ లడాయి జేస్తడు. ఇగ ఢిల్లి తోని ఆర్ పార్. సర్దార్ పాపన్న మల్ల పుట్టిండు సూడు అనుకున్న. రెండు వారాలయింది. ఇగ దొర ఇంట్లనుంచి ఎల్తాండు, పట్నం వస్తాండు, అగ్వారోల్లతోని మాట్లాడ్తాండు అంటె మస్తు సంబురపడితి. నేను గుడ దొర ఎన్క నిలబడి లడాయిల దిగుదునా, కత్తి పట్టుకుందునా, టుపాకి పట్టుకుందునా అని మన్సుల తల్లడం బిల్లడం అయితి. ఇగ ఏం జెప్పుదు కత! ఢిల్లి జేసిన ఖానూన్లు అవ్వల్ దర్జ ఖానూన్లు. గీడ తెలంగాణల గుడ గవ్వి ఎంటనె అమల్ల బెడ్త అంట జెప్పుకొచ్చె దొర. లడాయి యాడ బాయెనో, తిట్లు దిగబారబోసుడు యాడ బాయెనో, అచ్చం మోడి మాట్లాడినట్టు, అమిత్షా మాట్లాడినట్టు మాట్లాడబట్టె దొర. గింత ఉల్టపల్ట ఎట్లాయె. అయినా నమ్మినోని పిచ్చి గాని దొర ఎన్నడన్న పువ్వు గుర్తుకు ఖిలాఫున్నడా, నాకు దెల్వకడుగుత. నన్ను మించిన ఇందువున్నడా అన్నోడేనాయె, చంద్రబాబును మించి కంపెనీలకు సాతిచ్చిటోడే నాయె. అన్నిటికన్న బరాబర్ సాటుగ ఇద్దరే కూసున్నప్పుడు అమిత్షా ఏం కేసు కాయిదాలు దీసిండో, ఎప్పుడు గిరఫ్తార్ జేత్తనని బెదిరిచ్చిండో. పాపం, దొర ఉట్టిగనే ఉల్టాపల్టా అయితడా, ఎంత మోపయిందో... వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

ప్రజల పక్షాన నిలబడితే అక్రమ కేసులు, నిర్బంధాలు

ఆంధ్రప్రదేశ్ పోలీసు యంత్రాంగం ప్రజా ఉద్యమాల మీద దమనకాండకు దిగుతున్నదనీ, రాష్ట్రం పోలీసు రాజ్యంగా మారుతున్నదనీ గత సంచిక సంపాదకీయ వ్యాఖ్యలో అప్పటికి రెండు మూడు రోజుల కింద బనాయించిన రెండు అక్రమ కేసుల గురించీ, అరెస్టు చేసిన ఇద్దరు ప్రజా సంఘ కార్యకర్తల గురించీ ప్రస్తావించాం. నెల తిరిగేసరికల్లా ఆ అక్రమ కేసుల నిర్బంధాలకు మరొక ఏడుగురు గురయ్యారు. నిజానికి ఆ రెండు కేసుల్లోనూ జరిగిన నేరాల ప్రస్తావన ఏమీ లేదు. విశాఖపట్నం జిల్లా ముంచంగిపుట్ లో, గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో నమోదు చేసిన ఆ కేసుల్లో కేవలం ఒక నిషిద్ధ పార్టీతో సంబంధాలు ఉన్నట్టు, నిషిద్ధ పార్టీ తరఫున పని చేస్తున్నట్టు ఆరోపణలు మాత్రమే ఉన్నాయి. చట్టప్రకారం నిర్దిష్టంగా నేరంగా నిర్వచించిన చర్యలో భాగస్వామి అని నిస్సందేహమైన సాక్ష్యాధారాలు ఉంటే తప్ప, కేసులో నిందితులుగా చూపగూడదని, ఒక రాజకీయాభిప్రాయం ఉండడం నేరం కాదని, చివరికి నిషిద్ధ సంస్థ సభ్యులైనా, నాయకులైనా కూడ నిర్దిష్ట చర్యతో సంబంధం లేకుంటే నేరం కాదని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు, రాష్ట్రాల హైకోర్టులు ఇచ్చిన తీర్పులకు సుప్రీం కోర్టు నిర్ధారణ ఆంధ్రప్రదేశ్ పోలీసులకు కనబడుతున్నట్టు లేవు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధ) చట్టం – ఊపా – అలా అభిప్రాయాలు కలిగి ఉండడాన్నే నేరంగా పరిగణించింది గాని, దాన్ని దేశంలో ఎన్నో న్యాయస్థానాలు తోసిపుచ్చాయి. అలా నేరమనేదే లేకపోవడం వల్ల, దాని గురించి ఎవరూ ఫిర్యాదు చేసిన దాఖలా లేదు. సాక్ష్యాధారాలేమీ లేవు. కాని పోలీసు రాజ్యంలో పోలీసుల ఇష్టారాజ్యంగా కేసులు నమోదవుతున్నాయి. ఎవరి పేరు పడితే వారి పేరు ఎక్కించినట్టుగా ఒక కేసులో 64 మంది పేర్లు, మరొక కేసులో 27 మంది పేర్లు నిందితులుగా నమోదయ్యాయి. వారిలో నవంబర్ 27 నుంచి డిసెంబర్ 26 నాటికి సరిగ్గా నెల రోజుల్లో తొమ్మిది మందిని అరెస్టు చేశారు. అలా అరెస్టయినవారందరూ కేవలం కొన్ని అభిప్రాయాలు కలిగి ఉన్నవారు. అవి వ్యక్తీకరించే శక్తి ఉన్నవారు. అనేక బహిరంగ వేదికల మీద వ్యక్తీకరిస్తున్నవారు. రచనలు చేస్తున్నవారు. పాటలు పాడుతున్నవారు. కార్మికుల హక్కుల కోసం పనిచేస్తున్నవారు. మహిళల సమస్యల మీద పోరాడుతున్నవారు. న్యాయవాదులుగా, న్యాయశాస్త్ర విద్యార్థులుగా ఉన్నవారు. ప్రజా సంఘాల బాధ్యులుగా ఉన్నవారు. ఒక్క కలం పోటుతో వారందరూ ఇవాళ ఊపా కింద "నేరస్తులై"పోయి జైలు నిర్బంధంలో ఉన్నారు. భారత నేర శిక్షా స్మృతి ప్రకారం తొంభైరోజుల లోపల ఏ నేరం కింద నిర్బంధించారో చెప్పాల్సి ఉండగా, అక్రమ చట్టంగా తయారైన ఊపా ఆ గడువును నూట ఎనభై రోజులకు పెంచింది. ఏ నేరం చేయకపోయినా, ఏ నేరం కింద విచారణ జరుపుతారో తెలియకపోయినా, అసలు విచారణ ప్రారంభమే కాకపోయినా "నిందితులు" ఆరు నెలల పాటు జైలు శిక్షను అనుభవించ వలసిందే. మరొక పక్క మహా ఘనత వహించిన భారత న్యాయశాస్త్రం 'చట్టబద్ధమైన విచారణలో నేరం రుజువయ్యేవరకూ నిందితులను నిర్దోషులుగా, అమాయకులుగానే పరిగణించాలి' అనీ, 'వందమంది దోషులు తప్పించుకుపోయినా ఫరవాలేదు గాని, ఒక నిర్దోషి శిక్షించబడగూడదు' అనీ, 'జైలు మినహాయింపు, బెయిల్ సాధారణం' అనీ ధర్మసూత్రాలు ప్రవచిస్తుంది. ఇప్పుడు తొమ్మిది మంది అమాయకులు, నిర్దోషులు, కవులు, గాయకులు, న్యాయవాదులు, కార్మిక, మహిళా హక్కుల నేతలు అక్రమ జైలు నిర్బంధంలో ఉన్నారు. ఇంత అన్యాయం, దుర్మార్గం అమలవుతున్న రాజ్యాన్ని ప్రజాస్వామ్యం అనీ, రాజ్యాంగబద్ధ పాలన అనీ అనుకోవడాన్ని మించిన అమాయకత్వం ఉంటుందా? వీ

ఇజ్రాయెల్ అమెరికా దుష్ట చర్య..

- బైరెడ్డి సతీష్

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు 'రిమెంబర్ ఫక్రి జాదే' అని కొన్నాళ్ల క్రితం అణు వ్యవహారాలపై మాట్లాడుతూ ప్రత్యేకంగా నొక్కి చెప్పాడు. సరిగ్గా అదే ఫక్రి జాదే నవంబర్ 27న ఇరాన్ రాజధాని టెహ్రాన్ నగర సరిహద్దుల్లో దారుణంగా హత్య చేయబడ్డాడు. మొహసిన్ ఫక్రి జాదే ఇరాన్ అణుశాస్త్ర పితామహుడిగా పేరుగాంచాడు. ఈ హత్య పశ్చిమాసియా రాజకీయాలను ఒక్కసారిగా కుదిపేసింది. ఇరాన్‌తో కుదుర్చుకున్న అణు ఒప్పందం నుండి ట్రంప్ వైదొలగడం, అనంతరం తీవ్రమైన ఆంక్షలు విధించడం వెనువెంటనే జరిగిపోవడంతో ఇరాన్ ఆర్థికంగా బాగా దెబ్బతిన్నది. దానిని పూడ్చుకునే క్రమంలోనే చైనాతో పాటు తనతో స్నేహపూర్వకంగా మెదిలే అనేక దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుని కుదుటపడే ప్రయత్నం చేసింది. ఒక రకంగా ఆంక్షల ఒత్తిడి తీవ్రమవడం, అణు ఒప్పందం తాలూకు తప్పనిసరి నిబంధనలు ఏమీ లేకపోవడంతో అణు కార్యక్రమాన్ని వేగవంతం చేసింది ఇరాన్. ఇరాక్‌లో పట్టును పెంచుకోవడం, లెబనాన్ హిజ్బుల్లాతో స్నేహ సంబంధాలు కొనసాగించడం, సిరియా అంతర్యుద్ధ సంక్షోభ నేపథ్యంలో రష్యా జోక్యంతో ఇరాన్ పాత్ర పెరగడమే కాకుండా చైనా లాంటి దేశాల ద్వారా కూడా ఆర్థిక వెసులుబాటును పెంచుకునే పనిలో పడింది. ఈ మొత్తం పరిణామాలు ప్రత్యేకించి యురేనియం ఎన్‌రిచ్‌మెంట్ కార్యక్రమం యుద్ధ ప్రాతిపదికన కొనసాగిస్తూ ఉండడం ఇజ్రాయిల్‌కి మింగుడు పడలేదు. ఇక అమెరికాకు కూడా సైనిక జోక్యం చేసుకోవడానికి మిగిలి ఉన్న ఏకైక ప్రాంతం ఇరానే! అయితే అమెరికా అప్పటికే ఆఫ్ఘనిస్థాన్‌లో కూరుకుపోవడం, కరోనా తెచ్చిన ఆర్థిక కష్టాలు తోడవడంతో ఇరాన్‌పై సాయుధ చర్యకు ఉపక్రమించే సాహసం చేయకుండా సంవత్సరం క్రితమే ఇరాన్ కమాండర్ కాసీం సులేమాన్‌ని అంతమొందించేలా ఆదేశాలు ఇచ్చాడు ట్రంప్. అమెరికాలో ఎన్నికలు జరుగుతున్న కాలంలోనే ఆ దేశ విదేశాంగ మంత్రి మైక్ పాంపేయ్ ఇజ్రాయిల్, ఇతర అరబ్బు దేశాలలో పర్యటించాడు. ఈలోగా ట్రంప్ ఓటమి పాలవడంతో అణు ఒప్పందానికి అనుకూలంగా ఉన్న డెమోక్రటిక్ బైడెన్ గెలుపొందడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. అధ్యక్ష పీఠాన్ని అధిష్టించాక ఇరాన్‌తో అణు చర్చల ప్రక్రియ ఎలాగూ మొదలవుతుందని ట్రంప్, నెతన్యాహు ఇద్దరూ గ్రహించారు. ఆంక్షలు అమలైన ఈ నాలుగేళ్ల కాలంలో అణు కార్యక్రమం అవిచ్ఛిన్నంగా కొనసాగడం, రేపు ఆంక్షలు ఎత్తివేసి చర్చల ప్రక్రియ మొదలైతే ఆర్థికంగా కూడా ఇరాన్‌కు వెసులుబాటు దొరుకుతుంది.

ఈ రెండు పరిణామాలు ఇజ్రాయిల్‌కి ఏమాత్రం మింగుడు పడనివి. సరిగ్గా ఇక్కడే 'రిమెంబర్ ఫక్రి జాదే' అనే మాటను ఈ రూపంలో ఇజ్రాయిల్ గుర్తుంచుకొన్నది. ఇలా అత్యున్నత శ్రేణి అణు శాస్త్రజ్ఞున్ని అంతం చేయడంతో తక్షణమే ఇరాన్ కయ్యానికి కాలు దువ్వుతుందని, అదే సాకుతో ఇరాన్‌పై యుద్ధం చేయవచ్చని ట్రంప్, నెతన్యాహు ఇద్దరూ భావించారు. ఆ యుద్ధంతో ఇరాన్‌ను అణు చర్చలకు దూరంగా పెట్టి ఒంటరి చేయొచ్చనే పథకం ఈ హత్య వెనుక ఉన్నది. దాంట్లో భాగంగానే ఇరాన్ అణు స్థావరాలపైనా దాడులు చేయడం, ఆ తదుపరి ఇరాన్ ఆర్థికంగా చితికిపోయేలా చేయాలానుకున్న వారి భారీ పథకం. ఆ దేశ రాజకీయ నాయకత్వం కనబర్చిన పరిపక్వత, తక్షణ విజ్ఞత వల్ల మొత్తంగా విఫలమైంది. బైడెన్ మీద కోపంతో పోతూ పోతూ ఇరాన్ పైన నాలుగు బాంబులు వేయాలనుకున్న ట్రంప్ కోరికా తీరలేదు. ఒక్క హత్యతోనే మొత్తం పరిస్థితిని తనకు అనుకూలంగా మలచుకోవాలనుకున్న ఇజ్రాయెల్ పాచికా పారలేదు. గతంలోనూ నలుగురు అణు శాస్త్రజ్ఞులను పోగొట్టుకున్న ఇరాన్ ఈ మొత్తం పరిణామంలో నిస్సహాయంగా ఉండిపోయిన పాలస్తీనా పట్ల మరింత నిబద్ధతను కనపరుస్తూనే భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలి. ఇజ్రాయెల్ తన దూకుడు, దురుసుతనాన్ని నిలిపివేయాలి. అమెరికా కొత్త అధ్యక్షుడు బైడెన్ తన చిత్తశుద్ధిని నిరూపించుకునేలా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్వహించుకునే హక్కును, పౌర వినియోగ స్వేచ్ఛను గుర్తిస్తూనే చర్చల ప్రక్రియను మొదలు పెట్టాలి. లేదంటే పశ్చిమాసియాలో మిగిలేది విధ్వంసం, మారణహోమమే. వీ



రాజధాని దీక్షా శిబిరంపై రాళ్ల దాడి

అమరావతిని ఏకైక రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్న ఉద్దండ రాయునిపాలెంలోని రైతుల దీక్షా శిబిరంపై డిసెంబర్ 6న రాళ్ల దాడి జరిగింది. గ్రామంలో ఇంటింటికీ అమరావతి కార్యక్రమం నిర్వహిస్తున్న మహిళలను.. మూడు రాజధానులకు మద్దతుగా దీక్ష చేస్తున్న శిబిరానికి చెందిన వ్యక్తులు అడ్డుకున్నారు. ఈ గ్రామంలోకి రావద్దంటూ దాడికి యత్నించారు. భయంతో మహిళలు అమరావతి దీక్షా శిబిరంలోకి వెళ్లారు. అయినా మహిళలపై రాళ్లతో దాడిచేశారు. ఈ ఘటనలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు శిబిరం వద్దకు చేరుకున్నారు.

హక్కుల కోసం ఆదివాసుల ఆందోళన

ఎస్‌టి జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలు ఆందోళన బాటపట్టారు. ఆదివాసీ సంఘాలు, తుడుం దెబ్బ డిసెంబర్ 9న ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపు మేరకు ఆదిలాబాద్, నిర్మల్, కొమరం భీం, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో బంద్ జరిగింది. ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్‌టిసి బస్ డిపోల ముందు ఆదివాసీలు బైఠాయించి బస్సులను బయటికి రాకుండా అడ్డుకున్నారు. దీంతో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. లంబాడాల కుల, ఏజెన్సీ ధ్రువ పత్రాలను రద్దు చేసి, ఆదివాసీలు సాగుచేస్తున్న అటవీ భూములకు హక్కు పత్రాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. జిఓ నెంబర్ 8ని యథావిధిగా కొనసాగించాలని, నాన్ ఏజెన్సీ గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించి, ఏజెన్సీ ప్రాంతంలో ఎఆర్‌ఎ పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సంఘాల నాయకుల నిర్బంధంపై నిరసనలు

విశాఖ జిల్లా ముంచంగిపుట్టు, గుంటూరు జిల్లా పిడుగురాళ్ల పోలీసు స్టేషన్‌లలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపా కేసులు పెట్టింది. ఈ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఉపా రద్దు పోరాట కమిటీ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లా కలెక్టరేట్‌ల ముందు ధర్నా నిర్వహించారు. ఉపా లాంటి నిర్బంధ చట్టాలను ప్రయోగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇటీవల అక్రమంగా అరెస్ట్ చేసిన అమరుల బంధు మిత్రుల సంఘం, చైతన్య మహిళా సంఘం, ప్రగతిశీల కార్మిక సమాఖ్య, ప్రజా కళామండలి, విప్లవ రచయితల సంఘానికి చెందిన నాయకుడు శ్రీనివాస్‌ని డిసెంబర్ 26న అక్రమంగా అరెస్టు చేశారు. దీంతో 9 మందిని అరెస్టు చేసినట్లయింది. వారిని వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ఉపా రద్దు పోరాట కమిటీ, అట్లాగే తెలంగాణలో నిర్బంధ వ్యతిరేక వేదికల తరఫున ధర్నాలు, పత్రికా విలేకరుల సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి ప్రజా సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, ఉపా చట్టాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణలో జర్నలిస్టుల నిరసనలు

జర్నలిస్టులను దూషిస్తూ భావప్రకటన స్వేచ్ఛను కాలరాసే అధికారం ఎంఎల్‌ఏకు ఎవరిచ్చారని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ ప్రశ్నించారు. వార్త విలేకరి సంతోష్ నాయక్‌పై పటాన్‌చెరువు ఎంఎల్‌ఏ మహిపాల్ రెడ్డి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు, బెదిరింపులను నిరసిస్తూ గురువారం నాడు పటాన్‌చెరువులోని తొమ్మిదో నెంబర్ జాతీయ రహదారిపై టియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో జర్నలిస్టులు రాస్తారోకో నిర్వహించారు. వీధి గుండాల్లా జర్నలిస్టుల పట్ల వారు అనుసరిస్తున్న ప్రవర్తనతో సభ్యసమాజం సిగ్గు పడుతుందన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి వాస్తవాలు వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టుల పట్ల నారాయణ్ ఖేడ్, దుబ్బాక, మల్కాజిగిరి ఎంఎల్‌ఏలు, తాజాగా పటాన్ చెరువు ఎంఎల్ఏ మహిపాల్ రెడ్డిలు చేసిన వ్యాఖ్యలు, హెచ్చరికలు రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా ఉన్నాయన్నారు. తన వ్యాఖ్యలతో జర్నలిస్టు లోకాన్ని అవమానపర్చిన మహిపాల్ రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని జర్నలిస్టులు నిరసన ప్రదర్శనలు చేశారు.

ఏపిలోని దివీస్ కంపెనీ ముందు రైతుల ఆందోళన

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలం దానవాయిపేట పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న దివీస్ లేబొరేటరీ ముందు రైతులు ఆందోళనకు దిగారు. తమ భూములను కంపెనీకోసం సేకరించొద్దని ఉద్యమిస్తున్న అన్నదాతల ఆందోళనతో డిసెంబర్ 17న పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తాత్కాలిక కార్యాలయానికి ఆందోళనకారులు నిప్పుపెట్టి ప్రహరీని కూల్చారు. పోలీసులు అడ్డుకుంటున్నా వందలాది మంది కంపెనీలోకి దూసుకెళ్లి నిర్మాణ పనులకోసం వేసిన రేకుల షెడ్లు, జనరేటర్‌ను ధ్వంసం చేశారు. దివీస్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో ఈ ఆందోళన నిర్వహించారు.

అమరావతి రాజధానిగా కొనసాగించాలని నిరసనలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని కొనసాగించాలని లేదంటే మూడు రాజధానుల అంశంపై రెఫరెండం నిర్వహించాలని టిడిపి నేత చంద్రబాబునాయుడు తెలిపారు. 2019 డిసెంబర్ 17న సిఎం జగన్ చేసిన మూడు రాజధానుల ప్రకటనకు నిరసనగా రాజధానిగా అమరావతినే కొనసాగించాలని 29 గ్రామాల రైతులు చేస్తున్న ఉద్యమానికి ఏడాది పూర్తి అయింది. ఈ సందర్భంగా జెఏసి అమరావతి జనరణభేరి బహిరంగ సభను గుంటూరు జిల్లా రాయపుడి వద్ద నిర్వహించింది.

సందె రవి మృతి

సందె రాజమౌళి తమ్ముడు సందె రవి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ డిసెంబర్ 17న గుండెపోటుతో మరణించాడు. ఆయన స్వగ్రామం కరీంనగర్ జిల్లాలోని గూడెం. ఆయన తెలంగాణ సాధన కోసం తెలంగాణ ప్రజా ఫ్రంట్‌లో కరీంనగర్ సహాయ కార్యదర్శిగా పనిచేశారు. జిల్లాలో జరిగే ప్రజాస్వామిక ఉద్యమాలలో ఎంతో కృషి చేశారు. ఈ క్రమంలో పోలీసులు అరెస్ట్ చేసి తీవ్ర చిత్రహింసలకు గురిచేయడంతో ఆయన ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతిన్నది. ఇదే సందర్భంలో కరోనా వ్యాధికి గురవడంతో ఆయన ఆరోగ్యం క్షీణించి మరణించారు.

నూతన వ్యవసాయ చట్టాల రద్దు కోరుతూ ఆందోళనలు

పార్లమెంట్‌లో మెజారిటీ ఉందని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇష్టానుసారం వ్యవహరిస్తోందని సిపిఐ నాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి విమర్శించారు. పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. నూతన వ్యవసాయ చట్టాలను రద్దుచేయాలని కోరుతూ ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 18న ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన ధర్నాలో సుధాకర్ రెడ్డి మాట్లాడారు. డిసెంబర్ 20న రచయితల సంస్థల ఆధ్వర్యంలో రైతుల పోరాటానికి మద్దతుగా సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తూ రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా వివిధ రూపాల్లో రైతులు, విద్యార్థులు, మేధావులు మద్దతును తెలియజేస్తున్నారు.

వ్యవసాయ చట్టాలు - రైతుల ప్రతిఘటన

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలనూ, వాటి పట్ల రైతుల ప్రతిస్పందననూ విశాల రాజకీయార్థిక అవగాహనా చట్రం నుంచి ఎలా చూడాలో వివరిస్తున్నారు ఎన్. వేణుగోపాల్

భారత వ్యవసాయ రంగ సంక్షోభాన్ని ఎలా అర్థం చేసుకోవాలనే, ఎలా పరిష్కరించాలనే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు గాని, అసలు భారత వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్నదనే విషయం మీద దాదాపు అందరిదీ ఒకటే అభిప్రాయం. ఈ సంక్షోభానికి అతి తీవ్రమైన వ్యక్తీకరణలుగా ఒకవైపున వ్యవసాయాన్నే వదిలేసే రైతుల ఆత్మహత్యలు, పట్టణాలకు వలసలు వంటి చర్యలు కనబడుతున్నాయి. మరొకవైపున వ్యవసాయ రంగంలో కొనసాగాలనుకుంటున్న వారికి కూడ పెరుగుతున్న పెట్టుబడి వ్యయంతో, దక్కని గిట్టుబాటు ధరలతో వ్యవసాయం నానాటికీ అసాధ్యమవుతున్న స్థితి పెరుగుతున్నది. రైతాంగపు వ్యక్తిగత స్థాయిలో, ప్రతి గ్రామంలోనూ ఈ సంక్షోభ సూచనలు ఉండగా, దేశం మొత్తం మీద ఉత్పత్తి, ఉత్పాదకత సూచికలు సానుకూల వృద్ధినీ, తలసరి లభ్యత, కొనుగోలుశక్తి సూచికలు ప్రతికూలతనూ చూపుతున్నాయి.

ఈ గ్రామీణ వ్యవసాయ రంగ దుస్థితి నాణానికి మరొకవైపున వినియోగదారుల దగ్గరికి వచ్చేసరికి వ్యవసాయోత్పత్తుల ధరలు విపరీతంగా పెరిగిపోతుండడం కనబడుతున్నది. ఏ వృత్తిలో ఉన్నా, ఏ భావజాలంలో ఉన్నా ప్రతి ఒక్కరూ వ్యవసాయోత్పత్తుల వినియోగదారులుగా ఉండక తప్పదు గనుక ఈ ధరల పెరుగుదలను, ముఖ్యంగా ఆహారధాన్యాల ధరల పెరుగుదలను గుర్తించని వాళ్లెవరూ లేరు. అటు చివరన వ్యవసాయ ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధరలు అందక, ఇటు చివరన వ్యవసాయోత్పత్తుల వినియోగదారులు విపరీతమైన ఖరీదుకు కొనుక్కోవలసిన వాస్తవిక దృశ్యం ప్రతి ఒక్కరి దృష్టిలోనూ ఉంది. అందువల్లనే, అర్థశాస్త్ర పరిభాషలో వాల్యూ చెయిన్ (విలువ పెరుగుతూ పోయే గొలుసు) అనే ఈ సరఫరా గొలుసులో మధ్యలో ఉన్నవారే ఈ లాభమంతా చేసుకుంటున్నారనే అభిప్రాయం ఒకటి దేశంలో బలంగానే ఉన్నది. మధ్యవర్తులు, దళారులు, కమిషన్ వ్యాపారులు, అడ్తి వ్యాపారులు, మండీ నిర్వాహకులు, హోల్ సేలర్లు, డిస్ట్రిబ్యూటర్లు అనే అనేక మజిలీల మీదుగా సాగే ఈ గొలుసు పట్ల, ఈ మధ్యవర్తులు చేసుకుంటున్న లాభాల పట్ల సాధారణ అసంతృప్తి, ఆగ్రహం అటు వ్యవసాయదారుల్లోనూ, ఇటు వినియోగదారుల్లోనూ దశాబ్దాలుగా స్థిరపడ్డాయి. ఈ అసంతృప్తి, ఆగ్రహాల భూమిక మీదనే ఇవాళ ప్రభుత్వం రైతు ఉద్యమం పట్ల సాగిస్తున్న దుష్ప్రచారం ఆధారపడింది. ఈ ఉద్యమం దళారీలు ప్రోత్సహిస్తున్న ఉద్యమం అని ఆరోపించడం ద్వారా ఉద్యమం పట్ల వ్యతిరేకత కలిగించవచ్చునని ప్రభుత్వం పగటికలలు కంటున్నది.

వ్యవసాయ ఉత్పత్తిదారులకూ, వ్యవసాయోత్పత్తుల వినియోగదారులకూ మధ్య ఉన్న ఈ గొలుసు తప్పనిసరిగా తీవ్రంగా ఆలోచించవలసిందే, కాని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నట్టుగా అదే ప్రధాన సమస్య కాదు, అంతకు మించిన విశాలమైన సమస్యలెన్నో ఉన్నాయి. ఈ వ్యవసాయోత్పత్తుల గొలుసు మీద దేశవ్యాప్తంగా జరిగే వ్యాపారం సాలీనా ఇరవై లక్షల కోట్ల రూపాయలని ఒక అంచనా. ఈ విషయంలో మార్కెటేతర లావాదేవీలు కూడ చాల ఉండే అవకాశం ఉంది గనుక ఈ అంకె కన్న చాల ఎక్కువ వ్యాపారం కూడ జరుగుతుండవచ్చు. ఇంత పెద్ద వ్యాపారాన్ని తమ గుప్పెట్లోకి తీసుకుని తద్వారా ఇబ్బడి ముబ్బడి లాభాలు గడించాలని బహుళ జాతి సంస్థలు, వాటి దళారీ సంస్థలు, దేశ దేశాల వ్యవసాయ వ్యాపార కంపెనీలు ఎంతో కాలంగా అవకాశం కోసం చూస్తున్నాయి. ఇంత విస్తారమైన, అత్యంత లాభసాటి అయిన మార్కెట్‌లోకి తమ చొరబాటుకు, విస్తరణకు త్వరితగతిన వీలుకల్పించాలని ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పడినప్పటి నుంచీ భారత పాలకుల మీద ఒత్తిడి పెరుగుతున్నది. భారత రైతాంగానికి విత్తనాలు, ఎరువులు, నీరు, విద్యుత్తు, క్రిమిసంహారకాలు, రుణ పరపతి సౌకర్యాలు, మార్కెటింగ్ వంటి వేరువేరు రంగాలలో ఇస్తున్న సబ్సిడీని తగ్గించాలనేది, ప్రభుత్వ నియంత్రణాధికారాన్ని తొలగించాలని, భారత వ్యవసాయ రంగాన్ని అంతర్జాతీయ మార్కెట్ శక్తుల స్వేచ్ఛా విహారానికి సిద్ధం చేయాలని ప్రపంచ వాణిజ్య సంస్థ భారత ప్రభుత్వం మీద చిరకాలంగా ఒత్తిడి తెస్తున్నది. నూతన ఆర్థిక విధానాలలో, ముఖ్యంగా గాట్ చర్చల్లో భాగంగా, భారత వ్యవసాయ రంగాన్ని, వ్యవసాయోత్పత్తుల మార్కెట్‌ను బహుళ జాతి సంస్థల, వారి తైనాతీల రథ చక్రాలకు కట్టివేసే ప్రయత్నం ప్రారంభమైంది. భారత రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం రాష్ట్ర జాబితాలో, రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలో ఉండడం వల్ల, బహుళ పార్టీల ఐక్య సంఘటన రాజకీయాల వల్ల, దేశంలో వాతావరణ, వ్యవసాయ, పంటల పద్ధతులలో తీవ్రమైన ప్రాంతీయ తేడాలు ఉండడం వల్ల బహుళజాతి సంస్థల ఆదేశాలను ఈ రెండున్నర దశాబ్దాలుగా భారత పాలకవర్గాలు పూర్తిగా అమలులోకి తేలేకపోయాయి. పారిశ్రామిక, సేవా రంగాల్లో, ద్రవ్య వ్యవహారాల్లో, మొత్తంగా పాలనా నిర్ణయాల్లో సాధించినంత ప్రైవేటీకరణ-సరళీకరణ-ప్రపంచీకరణ చొరబాటును వ్యవసాయరంగంలో సాధించలేకపోయాయి.

చట్టాలకు ముందు...

నరేంద్ర మోడీ ప్రభుత్వం 'ఒకే దేశం – ఒకే మార్కెట్' అనే తన గుత్తాధిపత్య భావజాలం వల్ల, బహుళజాతి సంస్థలకు గత పాలకుల కన్న ఎక్కువ దాసోహం అంటున్న ఆర్థిక విధానాల వల్ల, బహుళజాతి సంస్థల దళారులుగా ఉన్న తన ఆశ్రితులు అంబానీ–అదానీ వంటి

భారతీయ పెట్టుబడిదారుల ఒత్తిడి వల్ల వ్యవసాయరంగ సంస్కరణలు వేగవంతం చేయాలని ఆలోచించింది. మోడీ 2014 మేలో అధికారానికి వచ్చిన మూడు నెలలకే ఆగస్ట్‌లోనే హర్యానా ముఖ్యమంత్రి, భాజపా సీనియర్ నాయకుడు శాంత కుమార్ నేతృత్వంలో నియమించిన వ్యవసాయ ఉన్నతాధికార సంఘం ఈ కార్యక్రమానికి అనుకూలమైన సిఫారసులు చేసింది. ఆ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం 2017 డిసెంబర్ 23 కాంట్రాక్ట్ వ్యవసాయ చట్టం నమూనా తయారు చేసి అటువంటి చట్టాలు ఆమోదించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. రాజ్యాంగం ప్రకారం కాంట్రాక్టులు రాష్ట్ర ప్రభుత్వ జాబితాలో ఉండడం వల్ల ఇది తప్పలేదు. ఇలా నమూనా తయారుచేసి ఇచ్చి మరీ ఆమోదించమన్న చట్టాన్ని చాల రాష్ట్ర శాసనసభలు పరిగణనలోకే తీసుకోలేదు. ఏడాదిన్నర చూసి ఇక కేంద్ర ప్రభుత్వమే ఈ చట్టంలో పురోగతిని చర్చించడానికి ఏడుగురు ముఖ్యమంత్రులతో ఒక కమిటీని నియమించింది. దాని కొనసాగింపుగా, కొవిడ్ మహావిపత్తు వల్ల ప్రజా వ్యతిరేకత వ్యక్తం కాకపోవచ్చుననే ధైర్యంతో, మోడీ ప్రభుత్వం 2020 జూన్ 5న వ్యవసాయరంగంలో బహుళజాతి సంస్థల, కార్పొరేట్ల చొరబాటుకూ, విస్తరణకూ అవకాశమిచ్చే మూడు ఆర్డినెన్సులను తీసుకువచ్చింది.

ఆ ఆర్డినెన్సులు వెలువడిన రోజునుంచే పంజాబ్, హర్యానాల్లో రైతులు నిరసన తెల్పడం ప్రారంభించారు. ఆ ఆర్డినెన్సులలో రైతు వ్యతిరేకంగా, దేశ వ్యతిరేకంగా, కార్పొరేట్ అనుకూలంగా, ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశాల మేరకు ఉన్న నిబంధనలను ఎత్తి చూపడం ప్రారంభించారు. కాని ఈ నిరసనలను ఎంతమాత్రం ఖాతరు చేయని ప్రభుత్వం అవే ఆర్డినెన్సులను అక్షరం మార్చకుండా బిల్లులుగా మార్చి సెప్టెంబర్ 15న, 18న లోక సభలో, 20న, 22న రాజ్యసభలో ఆమోదింపజేసుకుంది. లోకసభలోనైతే ఆధిక్యత ఉంది గనుక బిల్లులకు సులభంగానే ఆమోదం దొరికింది గాని, రాజ్యసభలో అధికార పార్టీకీ, కూటమికీ కూడ ఆధిక్యత లేదు. బిల్లును పునరాలోచించమనీ, సెలెక్ట్ కమిటీకి పంపమనీ, సవరణలు చేయమనీ, వోటింగ్ జరపమనీ ప్రతిపక్ష పార్టీలు సూచించాయి. ఆ ప్రతిపక్ష పార్టీలన్నీ కూడ ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశాలను అంగీకరించేవే గాని అప్పటికే సాగుతున్న పంజాబ్, హర్యానా రైతుల నిరసన, అధికారపక్షాన్ని వ్యతిరేకించాలనే వైఖరి వారిని ఈ సూచనలకు పురికొల్పాయి. కాని అధికారపక్షం ప్రతిపక్ష సూచనలన్నిటినీ తొక్కిపెట్టి బిల్లులను మూజువాణి వోటు ద్వారా ఆమోదింపజేసుకుంది. అలా ఆ మూడు బిల్లులూ చట్టాలుగా మారి, సెప్టెంబర్ 24, 26 ల్లో రాష్ట్రపతి అనుమతి పొంది, సెప్టెంబర్ 27న గెజెట్‌లో వెలువడ్డాయి.

ఈ చట్టాల్లో ఏముంది?

ఇవి ది ఫార్మర్స్ (ఎంపవర్ మెంట్ అండ్ (ప్రొటెక్షన్) అగ్రిమెంట్ ఆన్ ప్రైస్ అష్యూరెన్స్ అండ్ ఫార్మ్ సర్వీసెస్ ఆక్ట్, ది ఫార్మర్స్ ప్రొడ్యూస్ ట్రేడ్ అండ్ కామర్స్ (ప్రమోషన్ అండ్ ఫెసిలిటేషన్) ఆక్ట్, ది ఎసెన్షియల్ కమాడిటీస్ (అమెండ్ మెంట్) ఆక్ట్ అనే మూడు చట్టాలు. ఇవి చాల క్లుప్తంగా రాసిన చట్టాలు. వీటిలో మొదటిదైన ధరల హామీ, వ్యవసాయ సేవల రైతు ఒప్పందాల (సాధికారత, పరిరక్షణ) చట్టంలో 25 సెక్షన్లు, రెండవదైన రైతు ఉత్పత్తుల వ్యాపార, వాణిజ్య (ప్రోత్సాహం, సౌలభ్యం) చట్టంలో 20 సెక్షన్లు, మూడవదైన నిత్యావసర సరుకుల (సవరణ) చట్టంలో మూడు సెక్షన్లు ఉన్నాయి.

మొదటి చట్టం "వ్యవసాయ వ్యాపార సంస్థలతో, శుద్ధిదారులతో, టోకు వర్తకులతో, ఎగుమతిదారులతో, బడా చిల్లర వర్తకులతో వ్యవసాయ సేవల కోసమూ, భవిష్యత్తు పంటలను ఇరుపక్షాలకూ ఆమోదయోగ్యమైన గిట్టుబాటు ధరలకు, న్యాయంగా, పారదర్శకంగా అమ్ముకోవడం కోసమూ ఒప్పందాలు కుదుర్చుకునే రైతులను పరిరక్షించడానికీ, సాధికారత ఇవ్వడానికీ ఒక జాతీయ చట్రాన్ని తయారు చేసే లక్ష్యంతో" తయారయిందని చెప్పుకుంది.

రెండో చట్టం, "పోటీ పడే ప్రత్యామ్నాయ వ్యాపార మార్గాలలో గిట్టుబాటు ధరలు పొందేలా అమ్మకాలూ కొనుగోళ్లూ జరిపే స్వేచ్ఛను రైతులకూ, వ్యాపారులకూ ఇవ్వడానికీ, సమర్థమైన, పారదర్శకమైన, నిరాటంకమైన రాష్ట్రాంతర, అంతర్రాష్ట్ర వ్యాపారానికీ, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయోత్పత్తి మార్కెటింగ్ చట్టాల కింద ఏర్పడిన మార్కెట్లకు బైట అమ్ముకునే వీలు కల్పించడానికీ, ఎలక్ట్రానిక్ వ్యాపార సౌలభ్యం కల్పించడానికీ" తయారయిందని చెప్పుకుంది.

మూడో చట్టం, 1955 నిత్యావసర సరుకుల చట్టం సెక్షన్ 3లో అదనంగా ఒక ఉప సెక్షన్ చేర్చడానికి ఉద్దేశించినది.

ఈ ఆకర్షణీయమైన పదజాలాన్నీ, చట్ట పరిభాషలో సాధారణ ప్రజలను, విద్యావంతులను కూడ మోసం చేసే పదప్రయోగాన్నీ దాటి, అసలు ఈ చట్టాలు ఏమి చెపుతున్నాయో, ఏమి దాస్తున్నాయో, చెప్పినవీ, చెప్పనివీ ఏ రూపంలో అమలులోకి వచ్చే అవకాశం ఉందో పరిశీలించాలి. మొదటి రెండు చట్టాలలో రైతుల హక్కుల, ప్రయోజనాల రక్షణ లక్ష్యంగా ఒకటి రెండు సెక్షన్లు లేకపోలేదు గాని, ప్రజానుకూల నిబంధనలు కాగితాలకే పరిమితం కావడం, ప్రజావ్యతిరేక నిబంధనలు మాత్రం రాసినదానికన్న ఎక్కువ అమలు కావడం గత ఏడు దశాబ్దాల అనుభవంలో ఉన్నదే.

చట్టాలలోని ప్రజావ్యతిరేక అంశాలు

ఈ మూడు చట్టాలలో ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక అంశాలు ఒకటో రెండో, ఒకటి రెండు స్థాయిల్లోనో కాదు, అనేక స్థాయిల్లో, అనేక రకాలుగా, ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రమాదకరంగా ఉన్నాయి. అందువల్లనే ఇవాళ ప్రభుత్వం అంటున్నట్టుగా ఏదో ఒక సెక్షన్‌ను తీసివేయడమో, పదాలూ వాక్యాలూ మార్చడమో సరిపోదనీ, అసలు ఈ చట్టాల ఉద్దేశమే దుర్మార్గమైనది గనుక మొత్తంగా చట్టాలను రద్దు చేయాలనీ రైతు ఉద్యమం కోరుతున్నది.

మొట్టమొదట ఇవి రాజ్యాంగ వ్యతిరేకమైనవి. భారత రాజ్యాంగం వ్యవసాయ రంగాన్ని రాష్ట్ర జాబితాలోనూ, వ్యవసాయోత్పత్తుల నియంత్రణ, సరఫరా, పంపిణీలను ఉమ్మడి జాబితాలోనూ చేర్చింది. ఒక రంగాన్ని మొత్తంగా రాష్ట్ర జాబితాలో పెట్టినప్పుడు, ఆ రంగపు ఉత్పత్తుల నియంత్రణ, సరఫరా, పంపిణీలను ఉమ్మడి జాబితాలో పెట్టడం అనే అపసవ్యత ఎందువల్ల జరిగిందో, అది ఇన్నాళ్లుగా ఎందుకు మారలేదో చర్చించడం ఇప్పుడు అప్రస్తుతం. ఒక్కొక్క రాష్ట్రం, కొన్ని సందర్భాలలో ఒకే రాష్ట్రంలోని భిన్న ప్రాంతాలు ఒక్కొక్క వాతావరణ క్షేత్రంలో ఉన్నందువల్ల, ఒక్కొక్క రాష్ట్రంలో భిన్నమైన పంటల పద్ధతి, ఆహారపుటలవాట్లు ఉన్నందువల్ల, ఉత్పత్తుల నియంత్రణ, సరఫరా, పంపిణీల మీద కూడ రాష్ట్రాలకే అధికారం ఉండాలి. ఆ చర్చ అలా ఉంచి, ఉమ్మడి జాబితాలో ఉన్న అంశాల విషయంలో కూడ రాష్ట్రాలకు సమాచారం ఇవ్వకుండా, చర్చించకుండా, అనుమతి తీసుకోకుండా, దురాక్రమణ పూరితంగా కేంద్రం జోక్యం చేసుకోవడం అనుచితం,

నిరంకుశం. వ్యవసాయరంగాన్ని లోతుగా ప్రభావితం చేయనున్న ఈ చట్టాలను ప్రవేశపెట్టిన, ఆమోదించిన, చర్చకు అవకాశం ఇవ్వని పద్ధతి కూడ రాజ్యాంగ వ్యతిరేకమైనది, అప్రజాస్వామికమైనది, నిరంకుశమైనది.

చట్టాలు ప్రవేశపెట్టిన పద్ధతి అలా ఉంచి, చట్టాలలో వాడిన భాష, పదప్రయోగాలు, నిర్వచనాలు, అవకాశాలు, పరిమితులు అన్నీ కూడ కచ్చితంగా దురుద్దేశాలను చూపుతున్నాయి. ఏ చట్టంలోనైనా తొలి సెక్షన్లలోనే ఆ చట్టంలో వినియోగిస్తున్న పదాల అర్థాలు, నిర్వచనాలు సందేహాతీతంగా, స్పష్టంగా, నిర్దిష్టంగా వివరించడం ఆనవాయితీ. అలా ఇచ్చిన నిర్వచనాలలో రైతు, రైతు ఉత్పత్తిదారు సంఘం, వ్యాపార, వాణిజ్య ఒప్పందం, ఉత్పత్తి ఒప్పందం, వ్యవసాయోత్పత్తులు, వ్యాపార ప్రాంతం అనే మాటలకు ఇచ్చిన అర్థాలు నిజమైన రైతుల, ప్రజల ప్రయోజనాలకు భంగకరమైన పద్ధతిలో వర్తింపజేయడానికి అవకాశాలు వదిలారు. అంతకన్న ఘోరంగా వ్యక్తి (పర్సన్) అనే మాటను నిర్వచిస్తూ అందులో మనిషి, భాగస్వామ్య సంస్థ, కంపెనీ, సహకార సంఘం, సముదాయం వంటి అనేక అర్థాలను గుదిగుచ్చి, వ్యక్తికీ సమష్టికీ వ్యాపార సంస్థకూ మధ్య తేడా చెరిపేసి గందరగోళం చేశారు. మధ్యవర్తులను, దళారులను, వారి దోపిడీని తొలగించే సదుద్దేశంతోనే ఈ చట్టాలు తెస్తున్నామని పదేపదే చెపుతున్నారు గాని ఈ చట్టాలలో స్పాన్సర్ (ప్రాయోజకుడు), అగ్రిగేటర్ (సమీకర్త) అనే మాటల ద్వారా కొత్త దళారీలను కొనసాగించారు. వ్యవసాయోత్పత్తుల కోసం, వ్యవసాయ సేవల కోసం ఒప్పందం కుదుర్చుకోవచ్చుననే పేరుతో కాంట్రాక్టు వ్యవసాయానికి తలుపులు బార్లా తెరిచారు.

దేశంలో పెద్ద ఎత్తున కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రవేశపెట్టడానికి ఇరవై సంవత్సరాలుగా జరుగుతున్న ప్రయత్నాలను చట్టబద్ధమైన మరొక మెట్టు ఎక్కించారు. ఈ కాంట్రాక్టు అమలులో అన్యాయం జరిగితే న్యాయవ్యవస్థను ఆశ్రయించడానికి వీలులేని స్థితిని చట్టంలో భాగం చేశారు. న్యాయస్థానాలకు అధికారపరిధి లేనేలేదని రాశారు. అన్యాయం జరిగిన సందర్భంలో, వివాదం రేకెత్తినప్పుడు ఆ వివాద పరిష్కారాన్ని అధికారవ్యవస్థ చేతుల్లో పెట్టారు.

ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏదైనా చట్టంలో ఇందుకు భిన్నమైన అంశాలుంటే అవి చెల్లవని రాసి సమాఖ్య స్వభావాన్ని కాలరాశారు. వ్యాపార ప్రాంతాన్ని విశాలంగా నిర్వచించినట్టు ఒకవైపు కనబడుతూనే అందులోనుంచి ప్రభుత్వ మార్కెట్లను, రాష్ట్రాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చట్టాల ద్వారా ఏర్పడిన కొనుగోలు క్షేత్రాలను, ప్రభుత్వ ఆమోదంతో నడిచే ప్రైవేటు వ్యాపార క్షేత్రాలను మినహాయించారు. అంటే ప్రభుత్వ అనుమతి, నియంత్రణ, చట్టపరిధి లేని ప్రైవేట్ లాభార్జనాపరుల కొనుగోలు కేంద్రాలు మాత్రమే ఉండే స్థితి కల్పించారు. నిత్యావసర సరుకుల చీకటి బజారుకు, కృత్రిమ కొరతకు, కృత్రిమ ధరల పెంపుదలకు అవకాశం ఇచ్చేలా పెద్ద స్థాయిలో నిలువ చేయగూడదని ఇప్పటివరకూ నియంత్రిస్తున్న నిత్యావసర సరుకుల చట్టానికి సవరణ చేసి, ఏ సరుకైనా ఎంత స్థాయిలోనైనా నిలువ చేసుకోవచ్చునని నిబంధన రాశారు.

పూలు, పళ్ల ఉత్పత్తుల ధరలో వందశాతం, నిలువ ఉండే ఆహార దినుసుల ధరలో యాభై శాతం పెరుగుదల ఉన్నప్పుడు మాత్రమే నిలువలను నియంత్రించవచ్చునని సన్నాయి నొక్కు నొక్కారు గాని, ఆ మినహాయింపు మీది కన్న ఆంక్షల తొలగింపు మీదనే చట్టపు ప్రధాన దృష్టి ఉంది.

అసలీ చట్టాలు ఎందుకోసం?

ఈ చట్ట నిబంధనల రూపం ఎలా ఉన్నా, సారం మాత్రం కార్పొరేట్ల అనుకూలత. కార్పొరేట్ల చేతికి కాంట్రాక్టు వ్యవసాయం పేరుమీద విశాల భూ క్షేత్రాలు అందించడం, కార్పొరేట్ వ్యవసాయ వ్యాపారానికి అవసరమైన పంటలను ప్రోత్సహించడం, వ్యవసాయ వ్యాపార కార్పొరేట్లకు అనుకూలమైన మార్కెటింగ్ వ్యవస్థను చట్టబద్ధం చేయడం, కార్పొరేట్ వ్యవసాయ వ్యాపార సంస్థలు ఎన్ని అన్యాయాలు చేసినా న్యాయస్థానాల బోను ఎక్కనవసరం లేని విచారణాతీత, శిక్షాతీత స్థితి సృష్టించడం, కార్పొరేట్ వ్యవసాయ వ్యాపార సంస్థలు టన్నుల కొద్దీ ఆహార పదార్థాలను, నిత్యావసరాలను నిలువ చేసి, మార్కెట్‌లో కృత్రిమ కొరతలను సృష్టించి, ధరలను విపరీతంగా పెంచి, ఇబ్బడి ముబ్బడిగా లాభాలు చేసుకునే అవకాశాలు కల్పించడం – ఇవీ ఈ చట్టాల ద్వారా మోడీ ప్రభుత్వం సాధించదలచిన లక్ష్యాలు. ఈ లక్ష్యాలు ఏక కాలంలో ముప్పేట ప్రయోజనాలు సాధిస్తాయి. అవి భారత పాలకవర్గాల యజమానులైన సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల ప్రయోజనాలు, ప్రస్తుత పాలకుల గురువైన సంఘ్ భావజాల ప్రయోజనాలు, వారి స్నేహితులూ ఆశ్రితులూ యజమానులూ అయిన అంబానీ–అదానీల ప్రయోజనాలు.

ఈ లక్ష్యాల సాధన అమలులోకి వస్తే ఈ దేశపు కోట్లాది మంది చిన్న, మధ్యతరగతి రైతుల భూమి పిడికెడు మంది కార్పొరేట్ల చేతికి చిక్కుతుంది. సామ్రాజ్యవాద దళారీ అయిన నయా భూస్వామ్యం చలామణీలోకి వస్తుంది. ఆ విశాల భూక్షేత్రాల దెబ్బకు ధనికరైతుల వ్యవసాయం కూడ కుదేలైపోతుంది. వికేంద్రీకృతంగా, చిన్న, మధ్యతరగతి వ్యాపారుల నిలయాలుగా ఉన్న ఈ దేశపు వ్యవసాయ మార్కెట్లు ఆ చిన్న, మధ్యతరగతి వ్యాపారులందరూ ధ్వంసమైపోయి, బహుళ జాతి సంస్థల చేతికీ, వారి తైనాతీల చేతికీ చిక్కుతాయి. అక్కడక్కడా ఉన్న బడా వ్యాపారులు కార్పొరేట్ల జూనియర్ భాగస్వాములుగా, సేర్ దార్లుగా, గుమస్తాలుగా మారిపోతారు. అలా వ్యవసాయోత్పత్తి దారులైన రైతులు, ఆ ఉత్పత్తులపై ఆధారపడిన వ్యాపారులు కార్పొరేట్ల దయాదాక్షిణ్యాలకు లొంగి ఉండే పరాధీన స్థితికి, బానిసత్వం స్థితికి దిగజారుతారు. ఇది జరగడానికి సమయం పట్టవచ్చు. ఈ లోగా అక్కడక్కడా రైతులు మిగిలి ఉండవచ్చు, కొద్ది స్థాయిలో కార్పొరేటేతర వ్యాపారం సాగుతుండవచ్చు. కాని ఆ వ్యవసాయమూ వ్యాపారమూ కూడ కార్పొరేట్ గుత్తాధిపత్యం వల్ల నానాటికీ నష్టాలతో దిగజారుతూ అంతిమంగా రద్దయ్యే దిశలో ఉంటాయి. ఈ పరిణామాలకు పర్యవసానంగా వ్యవసాయోత్పత్తులకు, ఆహారోత్పత్తులకు వినియోగదారులు చెల్లించవలసిన ధరలు విపరీతంగా, కార్పొరేట్ల ఇష్టారాజ్యంగా ఆకాశానికి ఎగురుతూ ఉంటాయి. దేశప్రజల ఆహారభద్రత పూర్తిగా ధ్వంసమైపోయి కృత్రిమ కరువులూ, ఆకలిచావులూ, ఆత్మహత్యలూ, నేరాలూ పెరిగిపోతాయి. సమాజమే విధ్వంసం దిశగా నడుస్తుంది.

చట్టాలకు ప్రజల ప్రతిఘటన

ఈ మూడు కొత్త చట్టాలు మాత్రమే కాదు, ఇవి భాగమైన ప్రపంచీకరణ ప్రక్రియ, సమాజాన్ని ఎట్లా అమానవీకరిస్తుందో, విధ్వంసం వైపు నడుపుతుందో పూర్తిగా అర్థమైనా కాకున్నా, ఆయా వర్గాలు తమ జీవనోపాధికి రాగల ప్రమాదాన్ని గుర్తించి ఈ చట్టాలను ప్రతిఘటించడం ప్రారంభించాయి. కనీస మద్దతు ధర, ప్రభుత్వ మార్కెట్లు, ప్రభుత్వ

నియంత్రిత మార్కెట్లు రద్దు కానున్నాయని, కార్పొరేట్లతో తాము కుదుర్చుకునే కాంట్రాక్టుల వివాదాల పరిష్కారానికి న్యాయస్థానాలకు వెళ్లే అవకాశం ఉండదని తెలుసుకున్న పంజాబ్, హర్యానా రైతులు మొట్టమొదట ఈ చట్టాలను ప్రతిఘటించడం ప్రారంభించారు. ఈ చట్టాల వెనుక అంబానీ–అదానీలు ఉన్నారని, వారి ప్రయోజనాలు నెరవేర్చడానికే ఈ చట్టాలు తీసుకువచ్చారని పూర్తిగా నమ్ముతున్న పంజాబ్ రైతాంగం తమ విమర్శను, దాడిని ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాత్రమే కాక, అంబానీ, అదానీల మీద కూడ ఎక్కుపెట్టింది. అంబానీ, అదానీ కార్యాలయాల ముందు ప్రదర్శనలు, గోడల మీద రాతలు, కరపత్రాలు, వారి వస్తువుల బహిష్కరణ మీద పిలుపులు, ఆస్తుల మీద దాడులు జరుగుతున్నాయి.

క్రమక్రమంగా రాజస్తాన్, గుజరాత్, ఉత్తరాంచల్, ఉత్తరప్రదేశ్ రైతులు కూడ ఈ ప్రతిఘటనలో భాగమయ్యారు. నాలుగు వైపుల నుంచీ రాజధాని మీద రైతులు సాగిస్తున్న ముట్టడి ఇప్పటికి ఐదు వారాలుగా క్రియాశీలంగా, వీరోచితంగా, సృజనాత్మకంగా కొనసాగుతున్నది. దాదాపు రెండు వందల యాభై రైతు సంఘాలతో ఏర్పడిన అఖిల భారత కిసాన్ సంఘర్ష్ సమన్వయ సమితి, సంయుక్త్ కిసాన్ మోర్చాల నాయకత్వంలో ప్రారంభమైన ఈ ముట్టడిలో క్రమక్రమంగా ఉపాధ్యాయులు, రవాణా కార్మికులు, కూలీలు వంటి మరెన్నో జీవనరంగాల శ్రామికుల సంఘాలు కూడ చేరాయి.

ప్రస్తుతం దాదాపు ఐదు వందల రైతుల, వ్యవసాయ కూలీల, కార్మికుల, ఉద్యోగుల సంఘాల మద్దతుతో సాగుతున్న ఈ ఉద్యమం ఇది రాస్తున్న సమయానికి పది ప్రధాన కోరికలతో ఉంది: 1. మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయడానికి ప్రత్యేక పార్లమెంటు సమావేశం ఏర్పాటు చేయాలి. 2. కనీస మద్దతు ధర, ప్రభుత్వ ధాన్య సేకరణ చట్టబద్ధ హక్కులుగా గుర్తించాలి. 3. ఇప్పటివరకూ ఉన్న ధాన్య సేకరణ వ్యవస్థ కొనసాగుతుందని హామీ ఇవ్వాలి. 4. ఉత్పత్తి వ్యయం కన్న 50 శాతం ఎక్కువతో కనీస మద్దతు ధర నిర్ణయించాలని స్వామినాథన్ కమిటీ చేసిన సిఫారసును అమలు చేయాలి. 5. వ్యవసాయానికి వినియోగించే డీజిల్ ధరను సగానికి తగ్గించాలి. 6. వరి, గోధుమ గడ్డి తగులబెట్టడం పై విధించిన ఆంక్షలను, శిక్షలను రద్దు చేయాలి. 7. పంజాబ్‌లో వరి గడ్డి తగులబెట్టినందుకు అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలి. 8. విద్యుత్ ఆర్డినెన్సు 2020ని ఉపసంహరించు కోవాలి. 9. రాష్ట్రాల జాబితాలో ఉన్న అంశాలలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోగూడదు, వికేంద్రీకరణను వాస్తవంగా అమలుచేయాలి. 10. రైతు నాయకుల మీద పెట్టిన కేసులను ఉపసంహరించుకుని, వారందరినీ విడుదల చేయాలి.

ఈ ముట్టడి ఢిల్లీ సరిహద్దుల దాకా రాకుండా చెయ్యడానికి ప్రభుత్వం అత్యంత దుర్మార్గమైన దమననీతిని ప్రయోగించింది. చర్చలకు సిద్ధమని అంటూనే కాలికి వేస్తే మెడకు, మెడకు వేస్తే కాలికి అన్నట్టు రైతుల నిజమైన ఆకాంక్షలను పక్కనపెట్టి ఏవో పద ప్రయోగాలు మార్చడానికి సిద్ధపడుతున్నది. మరొకవైపు తన పెంపుడు జంతువుల్లా ప్రవర్తిస్తున్న ప్రధానస్రవంతి ప్రచారసాధనాల ద్వారా ఉద్యమంపై దుష్ప్రచారాలు సాగిస్తున్నది. ఈ ఉద్యమం వెనుక ఖలిస్తానీలున్నారని, మావోయిస్టులు ఉన్నారని, పాకిస్తాన్ ఉందని నీలాపనిందలు వేసింది. ప్రధానస్రవంతి ప్రచారసాధనాలలో అత్యధిక భాగం, నిపుణులుగా, వ్యాఖ్యాతలుగా చలామణీలో వ్యవస్థ సమర్థకులు ఉద్యమాన్ని అప్రతిష్టపాలు చేయడానికి అబద్ధాలు, తప్పుడు వాదనలు ముందుకు తెస్తున్నారు. ప్రభుత్వంలో కీలకమైన స్థానాల్లో ఉన్నవారే ఉద్యమం మీద అపోహలు కలిగించేలా నిందారోపణలు చేస్తున్నారు. ఉద్యమం మీద తప్పుడు ప్రచారానికీ, దాడికీ అవకాశాలు వెతుకుతూ తన సొంత కుట్రదారులను ఉద్యమంలో ప్రవేశపెడుతున్నారు. ఉద్యమంలో కుల, మత, ప్రాంత, వర్గ విభేదాల మీద చీలికలు తేవడానికి ప్రయత్నిస్తున్నారు.

అయితే ప్రభుత్వం, పాలకవర్గాలు, పాలకవర్గ మేధావులు ఎన్ని రకాల కుటిల ప్రయత్నాలు చేసినా రైతు ఉద్యమం అప్రతిహతంగా ముందుకు సాగుతున్నది. ఢిల్లీని హర్యానాతో, ఉత్తరప్రదేశ్‌తో కలిపే సరిహద్దు మార్గాలు దిగ్బంధనంలో ఉన్నాయి. హర్యానా వైపు నుంచి ఢిల్లీలో ప్రవేశించే రహదారులు సింఘు, టిక్రి, ఔచండి, పియావు మన్యారి, సబోలి, మంగేష్‌ల దగ్గర ముట్టడిలో ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ వైపు నుంచి చిల్లా, ఘాజిపూర్ సరిహద్దులు మూతబడి ఉన్నాయి. ఈ ముట్టడి ప్రాంతాలలో కనీసం మూడు లక్షల మంది రైతులు నిలకడగా, శిబిరాలు ఏర్పాటు చేసుకుని, కొద్ది నెలల పాటు చక్రబంధాన్ని కొనసాగించే దీక్షతో, గడ్డకట్టే చలిలో కొనసాగుతుండగా, ప్రతిరోజూ దేశం నలుమూలల నుంచీ వేలాది మంది సందర్శకులు వచ్చి సంఘీభావం ప్రకటిస్తున్నారు. అఖిల భారత బంద్ ద్వారా దేశమంతా ఈ ఉద్యమానికి తన సంఘీభావాన్ని ప్రకటించింది. టోల్‌గేట్ల దగ్గర టోల్ ఫీ చెల్లించడానికి నిరాకరించడం వంటి అనేక కొత్త పోరాట రూపాలకు ఈ ఉద్యమం నాంది పలికింది.

నిరసనకారులను తీసుకువచ్చిన వేలాది ట్రాక్టర్లు, ట్రాలీలు, వాహనాలు రహదారుల మీద నిలిచి ఉన్నాయి. తల్లిదండ్రులతో పాటు వచ్చిన పిల్లల చదువులు కూడ ఆ వాహనాలలోనే సాగుతున్నాయి. సందర్శకులు చెపుతున్న ప్రకారం వందలాది చోట్ల వంటలు, రహదారుల మీద సామూహిక భోజనాలు సాగుతున్నాయి. దేశవ్యాప్తంగా అందుతున్న సంఘీభావంతో నిరసనకారులకు అవసరమైన అనేక వస్తువులు గుట్టలుగా తరలివస్తున్నాయి. ఉపన్యాసాలు, పాటలు, కళా ప్రదర్శనలు, నృత్యాలతో అది ఒక ఉత్సవ సందర్భం లాగున్నది. ముట్టడి స్థలాల్లో గ్రంథాలయాలు నెలకొన్నాయి. ఉద్యమం పక్షాన ఒక పత్రిక ప్రచురణ కూడ ప్రారంభమైంది.

ఆర్డినెన్సులు వెలువడినప్పటి నుంచీ ఆరు నెలలుగా పంజాబ్, హర్యానా రైతులు ప్రకటిస్తున్న నిరసనలు, ప్రత్యేకంగా చట్టాలుగా మారిన తర్వాత విస్తరించిన ఆందోళన, ఇప్పటికి నెల రోజులుగా ఢిల్లీ సరిహద్దుల్లో సాగుతున్న క్రియాశీలమైన ముట్టడి దేశవ్యాప్తంగా అనేక రకాల వ్యాఖ్యలకు దారి తీశాయి. రైతుల ఉద్యమాన్ని సమర్థిస్తున్నవారు, వ్యతిరేకిస్తున్నవారు మాత్రమే కాక, ఉద్దేశపూర్వకంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నవారు, తమ అపోహలను, అరకొర సమాచారాన్ని, అపార్థాలను ప్రచారం చేస్తున్నవారు, కొన్ని అంశాలను సమర్థిస్తున్నవారు, కొన్ని అంశాలను వ్యతిరేకిస్తున్నవారు, ఉద్యమాన్ని తమ నిరాశలకు, అత్యాశలకు అనుగుణంగా తమ దృక్కోణాల నుంచి వ్యాఖ్యలూ విశ్లేషణలూ చేస్తున్నవారు ఎందరో ఉన్నారు.

రైతు ఆందోళనపై భిన్న వాదనలు

అటువంటి భిన్నమైన, వైవిధ్యభరితమైన, పరస్పర వ్యతిరేకమైన వ్యాఖ్యలూ విశ్లేషణలూ అన్నిటినీ ఒక్కచోట సమీకరించి, వాటి ఉచితానుచితాలను పరిశీలించడం ఇక్కడ సాధ్యం కాదు గాని కొన్ని ముఖ్యమైన వాదనలను మాత్రం చూడవలసి ఉంది.

ఈ రైతు ఉద్యమం పట్ల ప్రజల్లో వ్యతిరేకత కలిగించడానికి ప్రభుత్వానికి సులభంగా దొరికిన ఆయుధాలు ఒకటి రెండున్నాయి. ఒకటి, ఇది మధ్య దళారీల ఆందోళనే తప్ప రైతుల ఆందోళన కాదనేది. రెండు, ఇది కేవలం కనీస మద్దతు ధర ద్వారా లాభాలకు అలవాటు పడిన పంజాబ్, హర్యానా రైతుల ఆందోళనే తప్ప దేశవ్యాప్త రైతుల ఆకాంక్ష కాదనేది. ఈ ప్రభుత్వ దుష్ప్రచారానికి కొందరు ప్రధానస్రవంతి విలేఖరుల, సందర్శకుల తప్పుడు భావజాలం, దురభిప్రాయాలు మరింత ఆజ్యం పోశాయి. నిరసన స్థలంలో రైతులు పిజ్జాలు తింటున్నారని, మంచి భోజనాలు చేస్తున్నారని, విరివిగా ఆహారం దొరుకుతున్నదని, అన్ని సౌకర్యాలూ కల్పించుకున్నారని, మొత్తంగా ఇది ధనికుల ఆందోళనే తప్ప, పేద రైతుల ఆందోళన కాదని కొందరు సందర్శకులు వ్యాఖ్యానించారు. ఈ ఉద్యమాన్ని కాస్త లోతుగా చూసిన సందర్శకులు, పరిశీలకులు, ఈ ఉద్యమంలో ధనికరైతులే తప్ప చిన్న, మధ్యతరగతి రైతులు లేరని, అసలు వ్యవసాయ కూలీల ఊసే లేదని వ్యాఖ్యానించారు. ధనికులకూ ఇంకా పెద్ద ధనికులకూ మధ్య జరుగుతున్న ఘర్షణ గనుక దీనికి అంత ప్రాధాన్యత ఇవ్వనక్కరలేదని నిర్ధారించారు.

మరొక వైపు నుంచి ఈ ఉద్యమాన్ని సంపూర్ణంగా సమర్థిస్తూ ఇది దేశంలో కార్పొరేట్ ల మీద, అంబానీ–అదానీల మీద ఎక్కుపెట్టిన మొదటి ఆందోళన అని, ఈ దేశంలో కార్పొరేట్ వ్యతిరేక పోరాటం రైతుల నాయకత్వంలో జరగబోతున్నదనడానికి ఇది సూచిక అని, ఆ రకంగా ఇది పాత సిద్ధాంత అవగాహనను మార్చే ఆందోళన అని కొందరు వ్యాఖ్యానించారు. ఈ ఉద్యమం భారత వ్యవసాయ రంగంలో పెట్టుబడి ప్రవేశించిందా లేదా అని దశాబ్దాలుగా జరుగుతున్న చర్చకు ముగింపు పలుకుతున్నదని, ధనిక, పెట్టుబడిదారీ రైతుల బలాన్ని చూపుతున్నదని కొందరు వ్యాఖ్యానించారు. ఈ వాదనల్లో ప్రతి ఒక్కటీ ఏదో ఒక కోణంలో కొంత నిజమేననిపిస్తాయి. కాని వాటి తార్కిక కొనసాగింపులో ఉద్యమాన్ని వ్యతిరేకించేవి గానో, తప్పుడు కారణాలతో సమర్థించేవి గానో, భౌతిక వాస్తవికత మీద విశ్లేషణగా కాక తమ సొంత దృక్కోణపు ప్రకటనగానో మిగులుతాయి.

ఈ ఉద్యమంలో, ప్రధానంగా పంజాబ్, హర్యానా ఉద్యమంలో మధ్యవర్తుల, దళారీల పాత్ర కొంతమేరకు ఉందన్నది వాస్తవమే. ఆ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉన్న మండీల వల్ల, ఆ మండీల మీద ఆధారపడిన మధ్యవర్తుల, టోకు వ్యాపారుల, చిల్లర వ్యాపారుల సంఖ్య చాల ఎక్కువ. అలాగే ప్రభుత్వమే ప్రోత్సహించిన వరి, గోధుమ పంటల వల్ల, కనీస మద్దతు ధరల వల్ల లాభపడిన ధనిక రైతాంగం కూడ చాల ఎక్కువ. పొరుగు రాష్ట్రాల్లో కన్న కనీస మద్దతు ధర క్రమబద్ధంగా అమలైనందువల్ల, పొరుగు రాష్ట్రాల్లో తక్కువకు కొనుగోలు చేసి, తమ రాష్ట్రంలో కనీస మద్దతు ధరకు అమ్ముకుని లాభపడిన వ్యాపారులు కూడ ఎక్కువే. ఈ వర్గాలు ప్రస్తుత ఉద్యమంలో తప్పనిసరిగా ఉన్నాయి. కాని ఉద్యమం పూర్తిగా వాళ్లదే కాదు. సింఘు, టిక్రి సరిహద్దుల్లో నిరసనకారుల్లో ఒకటి రెండు హెక్టార్ల కన్న తక్కువ ఉన్న చిన్న, సన్నకారు రైతులున్నారని, దళిత, బహుజన రైతులు కూడ ఉన్నారని వారి ఇంటర్వ్యూలు ప్రకటించిన చిన్న, ప్రత్యామ్నాయ పత్రికలున్నాయి. న్యూస్ లాండ్రీ వెబ్ పత్రికలో అనుమేహా యాదవ్ రాసిన ప్రకారం పంజాబ్ లోని పదమూడు వేల గ్రామాల నుంచి ప్రతి గ్రామానికి యాభై నుంచి వంద మంది చొప్పున అన్ని కులాల, అన్ని ఆర్థిక స్థాయిల రైతులు ఢిల్లీ ముట్టడిలో పాల్గొన్నారు.

ఇది కనీస మద్దతు ధర సౌలభ్యానికి అలవాటు పడిన పంజాబ్, హర్యానా రైతుల ఆందోళన మాత్రమేనని, మిగిలిన రాష్ట్రాలలో రైతులు ఆందోళనకే గురి కావడం లేదని, ప్రభుత్వం చేసిన దుష్ప్రచారం అబద్ధమని అతి త్వరలోనే తేలిపోయింది. ఢిల్లీ ముట్టడిలో సామీప్యం వల్ల, ప్రయాణ సౌలభ్యం వల్ల పంజాబ్, హర్యానా రైతులు మొదట, ఉత్తరాంచల్, ఉత్తరప్రదేశ్ రైతులు ప్రధాన స్థానంలో ఉన్నప్పటికీ క్రమక్రమంగా రాజస్తాన్, మహారాష్ట్ర, తమిళనాడు, బెంగాల్ వంటి సుదూర ప్రాంతాల రైతులు కూడ ఢిల్లీ చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో కాకపోయినా దాదాపు ప్రతి రాష్ట్రం నుంచీ రైతులు, రైతాంగ సమస్యల మీద ఆసక్తి ఉన్నవారు పాల్గొన్నారు.

నిరసనకారుల ఏర్పాట్లు, సౌకర్యాల గురించి మాట్లాడుకోవడం అనవసరం. వాటిని ప్రస్తావించడం మధ్యతరగతి, పట్టణ విద్యావంతులలో గ్రామీణ, వ్యవసాయరంగ వ్యక్తుల పట్ల ఉండే చిన్నచూపుకు నిదర్శనం. తప్పనిసరిగా ఈ ఉద్యమంలో కొంత కలిగినవారు, ధనికులు ఉన్నారు. ఇది పూర్తిగా పీడిత వర్గ ఉద్యమమేమీ కాదు. భూమిలేని నిరుపేద కూలీ నుంచి ధనికరైతు దాకా అనేక వర్గాల ప్రయోజనాలు కలగలిసిన ఉద్యమమిది. ఇటువంటి ఉద్యమంలో అన్ని వర్గాల భాగస్వామ్యమూ ఉంటుంది, అన్ని వర్గాల ధోరణులూ, నినాదాలూ, ప్రవర్తనలూ ఉంటాయి. ప్రతి వర్గమూ ఉద్యమపు అంతిమ లక్ష్యాల దాకా ఉద్యమంలో కొనసాగుతుందనే హామీ కూడ ఉండదు. ఇటువంటి బహు వర్గ ఉద్యమపు స్వభావమే బహుళత్వం. ఈ బహుళత్వాన్ని ఎంత జాగ్రత్తగా అంతిమలక్ష్యందాకా ఎవరూ జారిపోకుండా, అంతే బలంగా, అంతే దృఢదీక్షతో నడిపించగలరనేదే నాయకత్వపు దూరదృష్టికీ, విశాల, సమన్వయ దృష్టికీ గీటురాయి. గత నెల రోజులుగానైతే ఈ ఉద్యమ నాయకత్వం ఆ దూరదృష్టినీ, విశాల సమన్వయ దృష్టినీ ప్రదర్శించింది.

మోడీ పాలన తర్వాత ఇంత విస్తృత స్థాయిలోనే సి ఎ ఎ – ఎన్ ఆర్ సి వ్యతిరేక ఉద్యమం కూడ నడిచింది. కాకపోతే అది ప్రధానంగా ముస్లిం మైనారిటీల ప్రయోజనాల ఉద్యమం గనుక ఇవాళ్టి రైతు ఉద్యమం పొందినంత విశాలమైన మద్దతును అది పొందలేకపోయింది. ఆ ఉద్యమం పూర్తి కాకముందే కొవిడ్ లాక్ డౌన్ ప్రారంభమై, మోడీ అన్నట్టుగా ప్రభుత్వం సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకోగలిగింది. బహిరంగ ప్రజా ప్రదర్శనలను, నిరసనలను పూర్తిగా అడ్డుకోగలిగింది. ఆ లాక్ డౌన్ చీకటిలో తొమ్మిది నెలల పాటు ప్రభుత్వం ఇష్టారాజ్యంగా ఎన్నో దుర్మార్గాలు సాగించినా ప్రజా నిరసన, ప్రతిఘటనకు అవకాశం లేకపోయింది.

ఆ నేపథ్యంలో ప్రస్తుత రైతు ఉద్యమం ప్రజాస్వామ్యవాదులలో కొత్త ఆశలు రేకెత్తించింది. నిరసనలు, ప్రతిఘటనలు, ఉద్యమాలు సాధ్యం కావనుకుంటున్న తరుణంలో ఇంత విస్తారమైన ఉద్యమాన్ని నిర్వహించి రైతాంగం ఒక కొత్త ఉదాహరణను దేశం కళ్ల ముందుంచారు. అది ఎంత మిరుమిట్లు గొలిపే అద్భుతమైనప్పటికీ, దాని మీద అతివ్యాప్తి విశ్లేషణలు కూడ సరికాదు. మన కళ్ల ముందే ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి అద్భుతమైన ప్రజా ప్రదర్శనలు జరిగాయి. నాయకత్వ లేమి వల్ల, దృక్పథ లేమి వల్ల అవి ఎక్కువ కాలం మనలేకపోయాయి. కనుక ప్రస్తుత రైతు ఉద్యమాన్ని కూడ జాగ్రత్తగా, విమర్శనాత్మకంగా పరిశీలించడం అవసరం. ప్రత్యేకంగా అదానీ %––% అంబానీల పేరు పెట్టి కార్పొరేట్ల మీద సాగిన మొదటి ప్రజా ఉద్యమంగా దీన్ని అభివర్ణించడం అతిశయోక్తి. నూతన ఆర్థిక విధానాలు మొదలయినప్పటి నుంచీ కూడ కార్పొరేట్లకు వ్యతిరేకంగా దీనితో

సమానమైనవీ, చిన్నవీ పెద్దవీ ఎన్నో ప్రతిఘటనలు జరిగాయి. జాబితా అవసరం లేదు గాని 1990ల మొదట్లోనే కర్ణాటక రాజ్య రైతు సంఘ ఆధ్వర్యంలో బెంగళూరులో కె ఎఫ్ సి మీద, అప్పుడే విప్లవోద్యమ నాయకత్వంలో మంగళగిరిలో కోకా కోలా కంపెనీ మీద, కార్మికుల సొంత చొరవతో మానెసర్ లో సుజుకి మీద, యానాంలో రిజెన్సీ మీద జరిగిన ప్రతిఘటనల వంటివి గత ముప్పై సంవత్సరాలలో కార్పొరేట్ల మీద వ్యక్తమైన ప్రజాగ్రహ చిహ్నాలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం రైతు ఉద్యమం అంబానీ %--% అదానీల మీద, కార్పొరేట్ల మీద ఎక్కు పెడుతున్న దాడికి ఆ వరుసలో మరింత విస్తృతంగా, క్రమబద్ధంగా జరుగుతున్నది. ఇది సామ్రాజ్యవాద ప్రపంచీకరణను ఎదిరించే విశాల పోరాటంలో ఒకానొక భాగమే తప్ప కొత్త సిద్ధాంతాలు చేయవలసిన, పాత సిద్ధాంతాలను మార్చుకోవలసిన గుణాత్మక మార్పేమీ కాదు. ఇవాళ రైతు ఉద్యమంలో తమ చైతన్యం వల్ల, తమకు అందుబాటులో ఉన్న సమాచార సాధనాల వల్ల ధనిక రైతాంగం ప్రభావశీల స్థానంలో ఉన్నట్టు కనబడవచ్చు గాని, మొత్తంగా పంజాబ్, హర్యానాల్లో ఇప్పటికీ మూడింట రెండు వంతులకు పైగా చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతాంగమేనని గణాంకాలు చూపుతున్నాయి. ఉద్యమంలో భాగస్వామ్యం కూడ ఈ నిష్పత్తిలోనే ఉండవచ్చు గాని, ఇది ప్రధానంగా పెట్టుబడిదారీ రైతుల బలాన్ని చూపే ఉద్యమమేమీ కాదు. నిజానికి దేశం పెట్టుబడిదారీ విధానంలో ప్రవేశించిందని, ఇప్పుడు రైతాంగానికి, వ్యవసాయానికి ప్రాధాన్యత తగ్గిపోతున్నదని అర్థశాస్త్రవేత్తలు, సిద్ధాంత కర్తలు చేస్తున్న వాదనలను ఈ ఉద్యమం ప్రశ్నిస్తున్నది. ఈ దేశ ఆర్థిక వ్యవస్థలో, పాలనా వ్యవస్థలో, ప్రజా ఉద్యమాలలో వ్యవసాయానికి, రైతాంగానికి, రైతాంగ చైతన్యానికి ఉన్న స్థానం యథాతథంగా ఉన్నదని ఈ ఉద్యమం చూపుతున్నది.

వ్యవసాయ సంక్షోభ వ్యక్తీకరణ

ఇవాళ్టి రైతు ఉద్యమం నిజానికి భారత వ్యవసాయ రంగ, గ్రామీణ సంక్షోభానికి ఒక బలమైన వ్యక్తీకరణ. ఈ గ్రామీణ, వ్యవసాయ సంక్షోభానికి అనేక ముఖాలున్నాయి. అన్నిటికన్న ప్రధానమైనది, మౌలికమైనది వ్యవస్థాగత సంక్షోభం. అమలు కాని భూసంస్కరణలు, భూసంబంధాలలో తీవ్రమైన అసమానత, భూమి మీద, వ్యవసాయం మీద ఆధారపడదగిన జనాభా కన్న ఎక్కువ మంది ఆధారపడి ఉండడం, అనుపస్థిత భూస్వామ్యం, కౌలుదారీ పద్ధతి, గిట్టుబాటు కాని కమతాల విస్తీర్ణం, భూగర్భజలాలు అడుగంటడం, పెరుగుతున్న వ్యవసాయ పెట్టుబడి, పెరిగిపోతున్న రసాయనిక ఎరువుల, క్రిమిసంహారకాల వాడకం, గిట్టుబాటు ధరలు రాని స్థితి, కొత్త తరంలో వ్యవసాయరంగం పట్ల పెరుగుతున్న విముఖత వంటి అనేక సమస్యలు వ్యవసాయ రంగాన్ని పట్టి పీడిస్తున్నాయి. చారిత్రకంగా చూస్తే, వీటిలో అనేక సమస్యలను పెట్టుబడిదారీ వర్గం నాయకత్వంలో భూస్వామ్య వ్యతిరేక బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలు పరిష్కరించాయి. కాని భారతదేశంలో ప్రవేశించేటప్పటికీ పెట్టుబడి సామ్రాజ్యవాద, ద్రవ్య పెట్టుబడి దశకు, అంటే మరణశయ్య మీద ఉన్న అత్యున్నత దశకు ఎదిగి ఉంది గనుక అది ఇక్కడ భూస్వామ్యంతో మిలాఖత్తయింది.

కాగితం మీద మాత్రమే భారీ భూయాజమాన్యాన్ని తొలగిస్తున్నట్టు ప్రకటించింది గాని, వాస్తవికంగా భూసంబంధాలలో, సంస్కృతిలో, భావజాలంలో భూస్వామ్యాన్ని కొనసాగనిచ్చింది. వలస పెట్టుబడి అయినా, అర్ధవలస పెట్టుబడి అయినా భూస్వామ్యంతో రాజీపడి, భూస్వామ్యాన్ని ఎదిరించకుండానే, దాన్ని తన సామాజిక పునాదిగా మార్చుకుంది. ఆ పునాది మీద స్థిరపడి, స్వతంత్ర పెట్టుబడిగా ఎదగకుండా సామ్రాజ్యవాద ద్రవ్యపెట్టుబడికి దళారీగా తన ప్రయోజనాలు నెరవేర్చుకోదలచుకుంది. అందువల్లనే బూర్జువా ప్రజాస్వామిక విప్లవం ద్వారా ఎదిగిరావలసిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, అధికార విభజన, స్వతంత్ర న్యాయవ్యవస్థ, స్వతంత్ర పత్రికారంగం, వ్యక్తి స్వాతంత్ర్యం ఇక్కడ ఉనికిలోకి రాలేదు. భారత వ్యవసాయ రంగపు మౌలిక సంక్షోభం అది. మిగిలిన సంక్షోభ వ్యక్తీకరణలు ఎన్నైనా ఉండవచ్చు గాని అవన్నీ ఆ బోన్సాయి పెట్టుబడికి పూసిన వాసనలేని పూలే, తినడానికి పనికి రాని కుక్కమూతి పిందెలే.

పంజాబ్ లో హరిత విప్లవ పర్యవసానాలు ఆ మౌలిక, ప్రాథమిక సంక్షోభాన్ని కొనసాగించాయి, ఉధృతం చేశాయి. హరిత విప్లవం, రసాయనిక ఎరువుల వాడకం, మితిమీరిన భూగర్భజలాల వినియోగం, అందువల్ల కలుపు, చీడ పీడలు పెరగడం, అందువల్ల ఎక్కువ కలుపు సంహారకాలు, క్రిమి సంహారకాలు వాడడం, పెరిగిన పెట్టుబడికి తగినట్టుగా ఫలసాయం, ఆదాయం రాకపోవడం, అందువల్ల ప్రభుత్వ ప్రోత్సాహకాల మీద, కనీస మద్దతు ధర మీద, ప్రభుత్వ మార్కెట్ల మీద ఆధారపడడం ఒక క్రమంలో జరిగాయి. ఈ దుష్పరిణామాలు కేవలం ఆర్థిక వ్యవస్థలో మాత్రమే కాదు, మతవాదం రూపంలో రాజకీయాల్లో వ్యక్తమయ్యాయి.

కాన్సర్ రూపంలో ఆరోగ్యంలో వ్యక్తమయ్యాయి (పంజాబ్ నుంచి రాజస్తాన్ లోని బికనీర్ లో ఉన్న కాన్సర్ ఆస్పత్రికి ప్రతిరోజూ వందలాది మంది కాన్సర్ రోగులను తీసుకుపోయే రైలుకు కాన్సర్ ట్రెయిన్ అని పేరు!). యువతరంలో నిరాశా నిస్పృహలు పెరిగి, మాదక ద్రవ్యాలకు బానిసలైన రూపంలో సామాజిక, సాంస్కృతిక రంగంలో వ్యక్తమయ్యాయి. ఈ వ్యక్తీకరణలతో మౌలిక సంక్షోభం మరింత తీవ్రతరంగా విస్ఫోటనం చెందుతున్నది.

విస్తృతం కావలసిన ఆందోళన

కనుక ఇప్పుడు కనీస మద్దతు ధర అందితేనో, మండీలు మళ్లీ తెరిస్తేనో, నిత్యావసర వస్తువుల సవరణ తొలగిస్తేనో, ఈ మూడు చట్టాలను ఉపసంహరిస్తేనో ఈ ఉద్యమం ఆగిపోవచ్చు గాని, మౌలిక సమస్య పరిష్కారం కాదు. ఆ మౌలిక సంక్షోభం మరొక రూపంలో, మరొక చోట విస్ఫోటనం చెందుతుంది. ఇప్పుడు జరగవలసినది ఆ మౌలిక సంక్షోభాన్ని పరిష్కరించే ప్రయత్నం. ఆ సంక్షోభం వల్ల జీవితాలనూ, జీవనోపాధులనూ, భవిష్యత్తునూ కోల్పోతున్న అన్ని సామాజిక వర్గాల విశాల ఐక్యతను సాధించి, ఈ సంక్షోభ కారకులను ముట్టడించడం, ఓడించడం. ఇవాళ్టి ఉద్యమం ఇక్కడితో ఆగిపోగూడదు. ఇది కేవలం రైతుల ఉద్యమం కాదు, ఇది ఈ దేశపు ఉద్యమం ఈ వ్యవస్థలో అనివార్యమైన ఉద్యమం. ప్రస్తుత ఉద్యమాన్ని సమర్థించడం, ఇది అన్నదాతల ఉద్యమం కనుక సమర్థించాలని భావోద్వేగానికి గురి కావడం ఒక మెట్టు. కాని అంతకన్న పైమెట్టు అసలు ఈ ఉద్యమానికి మూల కారణమైన వ్యవస్థా సంక్షోభాన్ని గుర్తించడం. ఆ సంక్షోభ పరిష్కారంలో తమ వంతు భాగం పంచుకోవడం. అదే ఇవాళ రైతు ఉద్యమం గురించి ఆలోచిస్తున్న, దాన్ని సమర్థిస్తున్న, రైతుల పట్ల ప్రేమ కనబరుస్తున్న బుద్ధిజీవుల కర్తవ్యం. వీ

(రచయిత వీక్షణం సంపాదకుడు)

ఉద్యమంలో రైతులు - కార్పొరేట్ల సేవలో పాలకులు

దేశ ప్రజల సంక్షేమాన్ని పణంగా పెట్టి కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం శతవిధాల ప్రయత్నం చేస్తున్నదని అంటున్నారు **బి. రామకృష్ణ**

జూన్ 2020లో వ్యవసాయానికి, రైతులకు సంబంధించి మూడు ఆర్డినెన్స్‌లను మోడీ ప్రభుత్వం తెచ్చింది. వీటిని బిల్లు రూపంలో ప్రవేశ పెట్టి చర్చకు అవకాశం ఇవ్వకుండానే పార్లమెంట్‌లో ఆమోదింప చేశారు. ప్రతిపక్షాల అభిప్రాయాలను గౌరవించాలని, పోనీ కనీసం వినాలని కూడా అనుకోలేదు. ఈ బిల్లులు సెప్టెంబర్ 24, 26లలో రాష్ట్రపతి ఆమోదం పొంది చట్టాలుగా మారాయి. ఇవి జూన్ 5 నుండే అమలులోకి వచ్చాయని ఈ చట్టాలు చెబుతున్నాయి. అవి (1). రైతుల (సాధికారత, రక్షణ) ధరల హామీ, వ్యవసాయ సేవల చట్టం 2020. (2). రైతుల ఉత్పత్తి వర్తక వాణిజ్య (ప్రోత్సాహక, సులభతర) చట్టం 2020. (3). నిత్యావసర సరుకుల సవరణ చట్టం 2020. రైతులకు సాధికారత, రక్షణ, ధరలకు హామీ, రైతు ఉత్పత్తులకు ప్రోత్సాహం, సులభతర వ్యాపారం అనే పదాలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. రైతులకు సాధికారత రక్షణలు ఇస్తామంటే వారు సంతోషించకుండా ఉండగలరా? రైతులు ఉత్పత్తి చేసే వాటికి ధరల హామీ వారు సులభంగా అమ్ముకోవడానికి ప్రోత్సాహకాలు ఉంటాయని చెబుతున్నప్పుడు సంబరపడవల్సిందే కదా.

వ్యవసాయ ఉత్పత్తులు, సేవలకు సంబంధించి న్యాయమైన, పారదర్శకమైన రీతిలో వ్యవసాయ సంబంధిత వ్యాపార కంపెనీలు, హోల్‌సేలర్లు, ఎగుమతిదారులు, పెద్ద రిటైలర్లతో పరస్పర అంగీకార ఒప్పందం చేసుకోవడంలో రైతులకు సాధికారత రక్షణ పొందడానికి జాతీయ చట్రాన్ని కల్పిస్తుందని ఒకటవ చట్టం చెబుతుంది. పోటీతో కూడిన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రైతుల ఉత్పత్తుల అమ్మకం, కొనుగోళ్లకు సంబంధించి ఎవరికైనా ఎక్కడైనా నచ్చిన ధరలు పొందే స్వేచ్ఛను ఇస్తుందని రెండవ చట్టం చెబుతుంది. అడ్డంకులు లేని విధంగా సమర్థవంతంగా, పారదర్శకంగా తమ రాష్ట్రంలో గానీ, ఇతర రాష్ట్రాల్లో గానీ ఆయా రాష్ట్ర చట్టాల పరిధిలోని వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీలకు అవల వ్యాపారం చేయడానికి ప్రోత్సాహం ఇస్తూ ఇంటర్నెట్ వర్తకం చేసుకోవడానికి వెసులుబాటు కల్పించే చట్రాన్ని అందిస్తుందని ఈ చట్టం చెబుతున్నది. ఒక్కో చట్టంలోని మొదటి వాక్యాలివి. ఇవి చదువుతుంటే ఎంత సానుకూల అంశాలు వీటిలో ఇమిడి ఉన్నాయోనని అనిపించకుండా ఉంటుందా?

రైతు ఎక్కడైనా తమ రాష్ట్రంలో గానీ, రాష్ట్రానికి అవల గానీ అమ్ముకోవచ్చని దీన్నే సాధికారత అని, స్వేచ్ఛ అని అంటున్నారు. 2015-16 వ్యవసాయ జనాభా లెక్కల ప్రకారం దేశంలో 85 శాతం పైగా రైతులందరూ 2 లేదా 5 ఎకరాల భూములను కలిగి ఉన్నారు. వారి పొలాల్లో పండించే కొద్ది మొత్తాలను దూర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకో గలరా? కనీసం పక్క జిల్లాకు వెళ్లలేరు. ఇంకా ఇతర రాష్ట్రాలకు వెళ్తారా? అదనంగా రానుపోను రవాణా ఖర్చుల భారం తప్పిస్తే. ఈ చట్టం వ్యాపారులు వ్యవసాయ కంపెనీలు కార్పొరేట్ల నుండి మార్కెట్ కమిటీల ద్వారా వసూలు చేయబడే పన్నుల రాబడికి గండి కొడుతున్నది. వ్యవసాయ మార్కెట్లలో వసూలు చేయబడే పన్నులను ఆ ప్రాంత అభివృద్ధి కొరకు, మౌలిక వసతుల ఏర్పాటుకు వినియోగించుకునే అవకాశం ఉన్నది. ఎలాంటి సెస్ లేకుండానే మార్కెట్ కమిటీలకు అవల కొనుగోలు చేసే అవకాశాన్ని ఇస్తున్నది. కనీస మద్దతు ధర ప్రసక్తి లేకుండా ప్రైవేటు మార్కెట్లు విస్తరించేలా మార్కెట్ శక్తులకు స్వేచ్ఛను, వెసులుబాటును ఇస్తూ రైతులకు నష్టాన్ని కలుగజేస్తుంది. ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ల అవసరం తీరిపోయిందని నవంబర్ 2019లో కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పారు. దానికి అనుగుణంగానే ఈ చట్టాలు వచ్చాయని తెలుసుకోవచ్చు.

వ్యాపారవర్గాలు సిండికేట్‌గా మారి, అతి తక్కువ ధర నిర్ణయించి సంబంధం లేకుండా రైతు పండించిన పంటను నష్టంతోనో లేదా ఖర్చులకు సరిపోను నామమాత్రపు ధరకు అమ్ముకునే అనివార్యతను సృష్టించడాన్ని నివారించే రక్షణలు ఈ చట్టంలో లేవు. అంటే వ్యాపార వర్గాలు వ్యవసాయ వ్యాపార కార్పొరేట్ శక్తుల కుట్రలకు బక్క రైతులు బలయ్యే దౌర్భాగ్యానికి దారులేస్తున్నాయి ఈ చట్టాలు.

వ్యవసాయ మార్కెట్లు అన్ని దళారులచే నిండి ఉన్నాయని అంటున్నారు. ఈ వ్యవసాయ మార్కెట్లను నిర్వహించేది ప్రభుత్వాలే మరి అక్కడ దళారులు ఎందుకు వచ్చినట్లు? వారిని ప్రోత్సహించేది కూడా ప్రభుత్వాలే అని తెలుస్తున్నది. అటువంటి వారిని తొలగించే చర్యలు తీసుకోవాలి కదా. వారి స్థానంలో ఈ చట్టాల వల్ల కార్పొరేట్ శక్తులు వస్తాయి. వాటికి దారి సుగమం చేయడమే ఈ చట్టాల ఉద్దేశం అని స్పష్టమవుతున్నది.

గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీలు పెత్తనం చెలాయిస్తున్నాయి అని అంటున్నారు. వ్యవసాయ ఉత్పత్తి మార్కెట్ కమిటీల ద్వారా కనీస మద్దతు ధరకు ప్రభుత్వం గానీ, ప్రైవేటు వ్యక్తులు గానీ కొనే పరిస్థితి రైతులకు ఉన్నది. అది కూడా లోపభూయిష్టంగానే ఉన్నది. అయినా కనీస మద్దతు ధర గురించిన ప్రస్తావనతో రైతులకు ఎంతో కొంత సహాయకారిగా ఉన్నది. ఎక్కువ మొత్తంలో ఈ మార్కెట్లలో కాకుండా రైతులు స్థానిక ధాన్య వ్యాపారులకు, ఎరువుల మందుల సరఫరా దారులకు, రవాణా చార్జీలు భరించలేక స్థానిక వ్యాపారులకు తక్కువ ధరలకే అమ్ముకుంటున్నారు. నేడు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీలు పనిచేస్తున్నప్పటికీ, కనీస మద్దతు ధర లభించేది కేవలం

ఆరు శాతం మంది రైతులకు మాత్రమే. 63 శాతం వ్యాపారం మార్కెట్ యార్డులకు బయటే జరుగుతున్నది. మార్కెట్ కమిటీలకు (మండీలకు) బయట అమ్ముకునే వెసులుబాటు ఎన్నో రాష్ట్రాల్లో ఉన్నది. 18 రాష్ట్రాలలో మార్కెట్ కమిటీలకు బయట ప్రైవేట్ మార్కెట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్నది. 19 రాష్ట్రాలలో రైతుల దగ్గర నేరుగా కొనుక్కునే అవకాశం ప్రైవేట్ వ్యక్తులకు ఉన్నది. ప్రైవేట్ మార్కెట్లో కూడా వ్యవసాయ మార్కెట్ కమిటీలలో చెల్లించే పన్నులకు సమానంగా లావాదేవీలు, ఖర్చులు ఉంటాయి. అక్కడ రైతులకు అధిక ధర గ్యారెంటీ లేదు.

2006లో ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ కమిటీలు రద్దు చేసిన బీహార్‌లో నేడు రైతుకు క్వింటాల్‌కు రు. 800 నుండి రు. 900 వరకు వస్తుంది. అదే పంజాబ్, హర్యానాలలో కనీస మద్దతు ధర ఉన్నందున కనీసం రు. 1,892 వస్తుంది. ప్రైవేటు మార్కెట్లలో మొదట్లో బాగానే ఉండవచ్చు. ఒకసారి ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్లు కనుమరుగైతే వాటిని రద్దు చేసిన తర్వాత బీహార్‌లో రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితే వస్తుంది.

ఈ చట్టాల అమలుతో ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ కమిటీలు క్రమేపీ కనుమరుగవుతాయి. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే గోడౌన్లు కూడా రాను రాను తెరమరుగవుతాయి. ఎప్పుడూ కూడా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గోదాముల్లో కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు సక్రమంగా నిల్వ చేయక పనికిరాకుండా పోతున్నాయి. మరోవైపు కోట్ల కొద్దీ ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. దీన్ని అధిగమించాల్సింది పోయి వీటిని మూసేయడానికి ఈ చట్టాలు దారులేస్తున్నాయి. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మూసివేయబడి వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ ఆగిపోతే ప్రభుత్వం దగ్గర ఆహార నిలువలు ఉండవు. ప్రజా పంపిణీ వ్యవస్థ రద్దు అవుతుంది. పేదలకు రేషన్ షాపులు ఉండవు. మొత్తం ఆహార ధాన్యాలు, పంటలు అన్ని కూడా కార్పొరేట్ శక్తుల, బడా పెట్టుబడిదారుల చేతుల్లోకి పోతాయి.

ఒకసారి వ్యవసాయ మార్కెట్ కమిటీలు కనుమరుగైపోయాక ప్రైవేట్ మార్కెట్‌లు ప్రవేశించి వ్యాపారం మొదలైతే కనీస మద్దతు ధరకు అవకాశమే లేకుండా పోతుంది. అప్పుడు ప్రైవేట్ మార్కెట్‌లను, కార్పొరేట్ వ్యాపార వర్గాలను కనీస మద్దతు ధర ఇవ్వమని నియంత్రించే అధికారం, ఆసక్తి ప్రభుత్వాలకు ఉండదు. ప్రస్తుతం ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రైవేట్ హాస్పిటల్, ప్రైవేట్ రవాణా సంస్థలు వసూలు చేస్తున్న అధిక మొత్తాలను ప్రభుత్వాలు నియంత్రించలేకపోతున్నాయి.

రైతుకు మంచి ధర వస్తుందని చెబుతున్నారు. గిట్టుబాటు ధర అటుంచి కనీస మద్దతు ధరను ప్రభుత్వాలు అయితేనేమి, ప్రైవేట్ వ్యాపార వర్గాలు అయితేనేమి గ్యారెంటీ చేయలేని చట్టాలు తెచ్చిన మోడీ ప్రభుత్వం రైతులకు మంచి ధర వస్తుందని చెప్పడం ఎంత మోసమో అర్థం చేసుకోవచ్చు. రైతుల నుండి నేరుగా పంట పొలాల వద్ద ప్రభుత్వమే సేకరించి, మధ్య దళారులకు అవకాశం ఇవ్వకుండా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గోడౌన్లలో నిల్వ చేసి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు తక్కువ ధరకే అందించవచ్చు.

'ఈ చట్టాల వల్ల రైతుల ఆదాయం పెరుగుతుంది, రిస్కు తగ్గుతుంది, గ్రామీణ ఉపాధి పెరుగుతుంది' అని అంటున్నారు. రైతులు పండించే పంటను మంచి ధరకు అమ్ముకునే వాతావరణం ఉంటే కదా ఇవన్నీ జరిగేది? కనీస మద్దతు ధర గురించి, దానికి రక్షణ గురించిన ప్రస్తావన లేని ఈ చట్టాల ద్వారా రైతుల ఆదాయం ఎలా పెరుగుతుంది?

నిజానికి రైతుకు సాధికారత రక్షణ ప్రజలకు ఆహార భద్రత కల్పించవలసి వస్తే గనుక వ్యవసాయ యోగ్యమైన భూములను దేశవ్యాప్తంగా గ్రామాల వారిగా ఎవరెవరికి ఎంతెంత భూములు ఉన్నాయో గుర్తించాలి. వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు వ్యవసాయమే బతుకుగా జీవిస్తున్న వారికి భూములను పంచడానికి చట్టాలు చేయాల్సి ఉంటుంది. ప్రతి రైతుకు కనీసంగానైనా భూమి ఉండేలా చూడాలి. ఆ భూముల్లో పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి, ప్రకృతికి నష్టం చేయని విధంగా, అధిక దిగుబడులు వచ్చేలా వ్యవసాయ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే ప్రయత్నాలు చేయాల్సి ఉంటుంది. అందులో రైతులను భాగస్వాములను చేయాలి. అటువంటి ప్రయత్నాలను ఇంతకుముందు ప్రభుత్వాలు గానీ, ఇప్పటి మోడీ ప్రభుత్వం గానీ చేయడం లేదు.

రైతులు పండించిన పంటలు ధాన్యం చివరకు ప్రజలందరికీ అందవలసినదే కదా. శ్రమించిన రైతుకు తగిన ఫలితం అందడంతో పాటుగా ప్రజలందరికీ నాణ్యమైన ఆహారం అందించబడాలి కదా. వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు అందించడానికి సంబంధించిన ప్రభుత్వ యంత్రాంగం గురించి ఈ ప్రభుత్వానికి పట్టింపులు లేవు. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయడం దీనికి పరిష్కారంగా ఉంటుంది. అటువైపుగా చట్టాలు చేయడం లేదు.

ప్రతి మండలంలోనూ గోదాములను నిర్మించి ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తృత పరిచి సక్రమంగా నిర్వహించడం ద్వారా పండించే రైతుకు, వినియోగదారులకు ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు తదితరాలకు సంబంధించి భరోసా రక్షణ కల్పించవచ్చు. అలా చేయడం లేదంటే కార్పొరేట్ల ప్రవేశానికి చట్టబద్ధత కల్పించడమే ఈ చట్టాల ఉద్దేశ్యం అని అనుకోవాలి.

వ్యవసాయం అనేది రైతుకు మాత్రమే సంబంధించినట్లుగా చూస్తున్నారు. ఇది మొత్తం ప్రజానీకానికి సంబంధించినది. అందరికీ ఆహారం కావాల్సిందే కదా. రైతుల ఉత్పత్తులు చివరికి ఎవరికీ చేరాల్సి ఉంటుందంటే ప్రజలకేనన్నది స్పష్టమే. రైతులు నష్టపోకుండా అమ్ముకునే ధరకు, వినియోగదారులు కొనుక్కునే ధరకు వ్యత్యాసం తక్కువ ఉండాలి. అందుకు ప్రభుత్వం పటిష్ట రక్షణ ఏర్పాటు చేయాలి. ఒకవేళ ప్రైవేట్ వ్యాపార వర్గాలకు ఇస్తే గిస్తే స్వల్ప మార్జిన్లు ఇవ్వవచ్చు. కానీ మొత్తంగా రైతు ఉత్పత్తులపై గుత్తాధిపత్యం వారి చేతుల్లో పెట్టడం ద్వారా రైతులు, వినియోగదారులైన ప్రజలు నష్టపోయి మధ్య దళారులు, కార్పొరేట్ శక్తులు, వ్యక్తులు లాభపడతారు.

చిన్న రైతులు స్వేచ్ఛా మార్కెట్‌లో నిలబడలేరు. స్వేచ్ఛ ఉండేది కేవలం కార్పొరేట్ శక్తులకే. స్వేచ్ఛా మార్కెట్‌లో జాతీయ, అంతర్జాతీయ, బహుళజాతి సంస్థలు మాత్రమే ఆధిపత్యాన్ని కలిగి ఉండి వ్యవసాయ మార్కెట్‌ను తమ హస్తగతం చేసుకుంటాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా మోన్‌శాంటో, కార్గిల్, డ్యూపాంట్, డౌ, బేయర్ వంటి బహుళజాతి సంస్థలు వ్యవసాయం, దాని ఆధారిత అంశాలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఆహార ఉత్పత్తులు మొదలగు వాటిపై నియంత్రణ ఆధిపత్యాన్ని కలిగి ఉన్నాయి. అలాంటి వాటికి మరింతగా ద్వారాలు విశాలం చేయడానికి ఈ చట్టాలు పనికొస్తాయి. రైతులను బలి తీసుకునే

విధానాలు పంటలపై, భూములపై రైతులకు స్వేచ్ఛ లేకుండా చేసే విధంగా 1980ల నుండి ప్రపంచ బ్యాంకు ప్రతిపాదించిన వాటికి అనుకూలంగానే ఈ చట్టాలు ఉన్నాయి. 2006లో అప్పటి పరిశ్రమల వాణిజ్య శాఖ మంత్రి కమల్‌నాథ్ ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందంపై సంతకం చేశాడు. దాని ప్రకారం వ్యవసాయ రంగంలో సబ్సిడీలను క్రమేపీ తగ్గించాలి, స్వేచ్ఛా మార్కెట్‌కు వీలు కల్పించాలి. దానికి కొనసాగింపుగానే ప్రస్తుతం మోడీ ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను తెచ్చింది.

రైతు సాధికారత పంటలు ధరల సేవల ఒప్పంద చట్టం ప్రకారం తనకు ఇష్టమైన కంపెనీతో ఒప్పందం చేసుకోవచ్చు. రైతు పండించే పంటకు సంబంధించి విత్తనాలు వేసే నుండి పంట కోసి అప్పగించే వరకు విత్తనాలు, ఎరువులు, మందులు, సలహాలు, సూచనలు, యంత్ర పరికరాలు వంటివన్నీ కూడా ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీ చెప్పినవే వాడాల్సి ఉంటుంది. వీటన్నింటిపై రైతుకు నిర్ణయాధికారం ఉండదు. ఈ ఒప్పందం ప్రకారం రైతులు పండించిన పంటను సకాలంలో కంపెనీలు అంగీకరించిన ప్రమాణాలతో అందించాల్సి ఉంటుంది. లేదంటే రైతులకు ఇవ్వాల్సిన ధరను ఇవ్వడం జరుగదు. కనీస మద్దతు ధరతో సంబంధమే ఉండదు . ఒప్పందం చేసుకున్నాక మార్కెట్లో ధరలు పెరిగితే రైతుకు ఆ పెరిగిన ధరలు ఇవ్వరు.

పంటలు వేసే ముందే రైతులు వ్యాపారులతో ఒప్పందాలు చేసుకోవచ్చు. ఈ ఒప్పందాలు పంటకాలం పూర్తయ్యే వరకు లేదా ఐదేళ్లు మరి ఆపైన కూడా చేసుకోవచ్చు. ఆ కాలంలో పంటల అధిక దిగుబడికోసం కార్పొరేట్ల చేతుల్లో ఉన్న రసాయన మందులను రైతులతో వాడేలా చేస్తాయి. రసాయనిక ఎరువులు, పురుగుల మందులు వాడడం వలన వ్యవసాయ భూములు తక్కువ కాలంలోనే సారాన్ని కోల్పోతాయి. ఆ తరువాత వ్యవసాయానికి పనికిరాకుండా తయారవుతాయి.

వ్యాపార వర్గాల నిర్దేశాల మేరకు ఏ పంటలు వేయాలి, ఎలా పండించాలి, ఏ మందులు వాడాలి అనే విషయాలు వ్యాపార వర్గాల, మార్కెట్ శక్తుల చేతుల్లోకి పోతాయి. ఇక పంటలు పండించే రైతుకు తన భూమిలో ఎలా పండించుకోవాలో, ఏమి పండించుకోవాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉండదన్నమాట. మార్కెట్ శక్తుల అభీష్టం మేరకు, ఆదేశాల మేరకు నడుచుకుంటారన్నమాట. కాబట్టి రైతుకు సాధికారత రక్షణ అనేవి డొల్ల మాటలవుతాయి.

2005 వరకు ఒప్పంద వ్యవసాయంపై నిషేధం ఉంది. 2004లో పంటలు వేసే ముందే రైతులు వ్యాపారులతో ఒప్పందాలు చేసుకోవచ్చు. ఈ ఒప్పందాలు పంట కాలం పూర్తయ్యే వరకు లేదా ఐదేళ్లు మరి ఆపైన కూడా చేసుకోవచ్చు. వ్యవసాయంపై ముసాయిదా తయారు చేశారు. దానిలో భాగంగా వ్యవసాయ మార్కెట్ల చట్టంలో సవరణలు వచ్చాయి. 2005లో అనేక రాష్ట్రాలు కాంట్రాక్టు వ్యవసాయ చట్టాలు చేశాయి. దీని కోసం 2000 నుండి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంటే అప్పటి బిజెపి వాజ్‌పేయి ప్రభుత్వం నుండి అన్నమాట. ఆ తర్వాత మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న యుపిఏ ప్రభుత్వం వీటిని కొనసాగించింది. అయితే మోడీలా పార్లమెంటులో చట్టం అయితే చేయలేదు. ఇక్కడ పాలకులే మారుతున్నారు. యుపిఏ నా, ఎన్‌డిఏ నా, కాంగ్రెసా, బిజెపా అన్నది కాదు ప్రశ్న. ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థలను వెనకనుండి నడిపించే ప్రపంచ కార్పొరేట్ శక్తుల అజెండాలో భాగంగానే పాలనా నమూనాలు ఉంటున్నాయి.

గత మూడు – నాలుగు దశాబ్దాలుగా ప్రపంచబ్యాంకు ప్రపంచ వాణిజ్య సంస్థల అభివృద్ధి నమూనా విధానాలను భారత పాలకులు పాటిస్తూ వస్తున్నారు. వీటివలన రైతుల జీవితాలకు భరోసా, రక్షణ లేకుండా పోయింది. ఫలితంగా అనేక రాష్ట్రాలలో రైతు ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. గత ఐదేళ్లలో 1,39,123 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం 2019లో 42,563 మంది దినసరి వేతన కార్మికులు, రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇవి దేశంలోని వ్యవసాయ సంక్షోభాన్ని, ఆర్థిక విధానాల దుష్ఫలితాలను ప్రతిబింబిస్తున్నాయి.

2011లో బిజెపి ప్రతిపక్ష స్థానంలో ఉన్నప్పుడు ఇదే ప్రధాని మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నాడు. కనీస మద్దతు ధరకు గ్యారెంటీ ఉండాలని, దానికి ఏదైనా విఘాతం కలిగితే దాన్ని పరిష్కరించడానికి ప్రత్యేక కోర్టులు ఉండాలని ప్రతిపాదించాడు. నేడు మోడీ ప్రభుత్వం చేసిన చట్టంలో కనీస మద్దతు ధరకు రక్షణ ఇవ్వలేదు. వ్యవసాయ ఒప్పందంలో రైతులకు ఏమైనా నష్టం వస్తే సివిల్ కోర్టుకు వెళ్లే అవకాశాన్ని రద్దుచేశారు. ఇదే విషయాన్ని రైతుల సాధికారత రక్షణ ధరల హామీ వ్యవసాయ సేవల ఒప్పంద చట్టంలోని 19వ సెక్షన్, రైతుల ఉత్పత్తి వర్తక వాణిజ్య (ప్రోత్సాహక సులభతర) చట్టంలోని 15వ సెక్షన్‌లు చెబుతున్నాయి. రైతు న్యాయవాదిని పెట్టుకోలేడు. వీటి ప్రకారం వివాదాల పరిష్కారానికి సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ (ఆర్‌డిఒ), ఆపై కలెక్టర్ లేదా కలెక్టర్‌చే నియమించబడిన అదనపు కలెక్టర్‌ను కలవాల్సి ఉంటుంది.

కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వ లేదా రాష్ట్ర ప్రభుత్వ అధికారికి లేదా దీనికి సంబంధించిన మరే ఇతర వ్యక్తికి వ్యతిరేకంగా ఈ చట్టాల కింద సదుద్దేశంతో చేసిన, చేయాలనుకున్న వాటి గురించి న్యాయపరమైన ఫిర్యాదు గానీ, దావాలు గానీ, న్యాయ విచారణ గానీ ఉండవు. ఈ విషయాన్ని రైతు ఉత్పత్తుల అమ్మకం వాణిజ్య చట్టంలోని 13వ, ఒప్పంద వ్యవసాయ చట్టంలోని 18వ సెక్షన్లు స్పష్టం చేస్తున్నాయి. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గానీ, ప్రభుత్వ అధికారులను గానీ ఈ చట్టంలోని ప్రశ్నించడానికి, విచారించడానికి, న్యాయపరంగా కోర్టులకీడ్చడానికి అవకాశం ఉండదన్న మాట. ప్రభుత్వాలనే తమకు అనుకూలంగా మలుచుకుంటున్న కార్పొరేట్ శక్తులకు ఈ అధికారులు ఒక లెక్క కాదు. ఒకవేళ అధికారులు నిజాయితీగా, నిక్కచ్చిగా ఉంటే బదిలీ కావడమో, మరేతర వాటిలో ఇరికించడమో, బెదిరించడమో జరుగుతుంది. ఈ అధికారులు ప్రభుత్వ విధానాలను అమలు చేసే వారే కానీ ప్రశ్నించే వారు కాదు.

కానీ కోర్టులు ప్రశ్నించగలవు. రాజ్యాంగాన్ని, దాని విలువలను వ్యాఖ్యానించగలవు. చట్టాల న్యాయ రాజ్యాంగ బద్ధతను ప్రశ్నించగలవు. సరే అవి ఆ పని ఎంతవరకు చేశాయి, చేస్తున్నాయి, చేస్తాయి అనేది వేరే విషయం. కానీ ఆ పని చేయగల వెసులుబాటు వాటికి ఉన్నది. రైతులు పెద్ద మొత్తంలో నష్టపోతే కంపెనీలు చెల్లిస్తాయా అనేది కష్టమే. కంపెనీల యజమానులు ఎగ్గొట్టి ఎంచక్కా దేశాన్ని వదిలి వెళ్లి పోగలరు. విదేశీ కంపెనీలు అయితే అటువైపు మోహం కూడా చూడవు. గతంలో భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కంపెనీ యజమాని ఆండర్సన్

విషయంలో ఇదే జరిగింది. అప్పటి రాజీవ్ గాంధీ నుండి నేటి వరకు ఈ దేశానికి ఈ దేశ న్యాయ స్థానాల్లో అతన్ని విచారించిందీ లేదు, శిక్షించిందీ లేదు. బ్యాంకుల్లో రుణాలు తీసుకుని ఎగ్గొట్టిన విజయ్ మాల్యా, నీరవ్ మోడీ వంటి ఎందరినో ప్రభుత్వాలు, న్యాయ స్థానాలు ఏమీ చేయలేకపోతున్నాయి. వాళ్లంతా దేశం విడిచి విదేశాల్లో దర్జాగా, జల్సాగా బతుకుతున్న విషయం తెలిసిందే. తమ భూములను వదిలి వెళ్లనిది రైతులే కదా. వారికి చావైనా, రేవైనా తమ భూమి, తమ సొంత ఊరే కదా. కంపెనీలకు ఏమైనా నష్టం వస్తే నిర్బంధంగా న్యాయస్థానాల సహాయంతో పోలీసులు తదితర యంత్రాంగంతో ముక్కుపిండి రైతుల నుండి వసూలు చేసే శక్తివంతమైన ప్రభుత్వాలు మనవి కదా. చివరకు రైతులు ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటారు.

రాష్ట్రాలు తయారు చేసిన చట్టాలు కేంద్రం చేసిన ఈ చట్టాలకు అడ్డంకిగా వస్తే గనుక అవి చెల్లవని రైతు ఉత్పత్తుల అమ్మకం వాణిజ్య చట్టంలోని 14వ, ఒప్పంద వ్యవసాయ చట్టంలోని 20వ సెక్షన్లు చెబుతున్నాయి. రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులు అనేది రాష్ట్రాల పరిధిలోనిది. ఈ చట్టాల ద్వారా రాష్ట్ర అధికారాలను కేంద్రం చేతిలోకి తీసుకున్నట్లయింది. మార్కెట్‌కు ఏకీకరణ కావాలి. పెద్ద మొత్తంలో ఎక్కడికైనా సులువుగా ప్రవేశించి లాభాలు చేసుకునేందుకు తగిన రక్షణ, భద్రతా వ్యవస్థలు కావాల్సి ఉంటుంది. నీతి అయోగ్ ముఖ్యుడు చెప్పినట్లుగా నాలుగైదు కంపెనీలను గ్లోబల్ ఛాంపియన్లుగా మోడీ ప్రభుత్వం చేయాలనుకుంటున్నది. అవి ప్రపంచ మార్కెట్లో పోటీ పడతాయి. అందుకోసం దేశవ్యాప్తంగా ఒకే మార్కెట్‌ను సిద్ధం చేసి వాటి చేతుల్లో పెట్టడంలో భాగంగా వ్యవసాయ చట్టాలు చేయబడ్డాయని అర్థం చేసుకోవచ్చు.

నిత్యావసర సరుకుల ధరలు పెరగకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు వాటి నిల్వలపై ప్రభుత్వం పరిమితులు విధించేది. నిత్యావసర సరుకుల సవరణ చట్టం 2020 ఈ పరిమితులను ఎత్తివేసింది. దీని ప్రకారం సప్లై చైన్‌లో రైతుల నుండి రిటైలర్ వరకు ఎవరైనా ఎంతైనా నిలువ చేసుకోవచ్చు. చిరు ధాన్యాలు, పప్పులు, ఆలుగడ్డ, ఉల్లిగడ్డ, నూనెగింజలు, వంటనూనెల సరఫరాను యుద్ధం కరువు ధరల్లో అసాధారణ పెరుగుదల తీవ్రమైన, ప్రకృతి వైపరీత్యాలు వంటి సందర్భాలలో తప్పిస్తే నియంత్రించడం జరుగదు. ఆహారధాన్యాల ధరలు 100 శాతం పెరిగితేనే కూరగాయలు, పండ్లు వంటి వాటి ధరలు 50 శాతం పెరిగితేనే నిలువల మీద ఆంక్షలు ఉంటాయి. 85 శాతం ఉన్న చిన్న, సన్నకారు రైతులు నిలువ చేసుకోలేరు. వెంటవెంటనే అమ్ముకోవాల్సిందే. అధిక మొత్తాలలో నిలువ చేసుకునే సామర్థ్యం బడా కార్పొరేట్ సంస్థలకే ఉంటుంది. అవి మార్కెట్‌లోని డిమాండ్‌ను బట్టి అవసరమైతే కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు దేశంలోనే అమ్ముకోవచ్చు. లేదంటే ప్రపంచ మార్కెట్లో పేద దేశాలకో, ఇతరులకో అమ్ముకోవచ్చు. అంటే చివరకు నష్టపోయేది ఉత్పత్తి చేసిన రైతులు, చివరికి వినియోగదారులైన ప్రజలేనన్నమాట.

భారతదేశం ఆహార ధాన్యాలను ప్రపంచవ్యాప్తంగా 70కి పైగా దేశాలకు అమ్ముతున్నది. దీనిని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సమన్వయ పరుస్తుంది. ప్రస్తుత వ్యవసాయ చట్టాల ఫలితంగా కార్పొరేట్ శక్తులు ఆహార ధాన్యాలపై గుత్తాధిపత్యాన్ని పొంది, ప్రపంచ మార్కెట్‌లో ఎక్కడ ధర ఎక్కువ ఉంటే అక్కడ అమ్ముతాయి. ఫలితంగా పేద దేశాల ప్రజలు కూడా నష్టపోతారు.

ఈ చట్టాల వలన వ్యవసాయ ఉత్పత్తులు రైతుకు భరోసా, ప్రజలకు ఆహార భద్రత వంటివి ప్రభుత్వ బాధ్యత నుండి తొలగిపోతాయి. ఇప్పుడు ఇవి ఉన్నాయని అనుకోనక్కర్లేదు. ఉన్న ఏ కొంచెం అయినా కూడా కార్పొరేట్‌ల చేతుల్లోకి పోతాయి. ఇప్పటికే వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల అమ్మకం సరఫరా రిటైల్ రంగంలోకి టాటా బేయర్, ఆదాని, అంబాని వంటి బడా కార్పొరేట్ శక్తులు వచ్చి ఉన్నాయి. అవి పెద్ద ఎత్తున చాలాకాలం వరకూ నిలువ చేయగలిగే సామర్థ్యం ఉన్న గోడౌన్లను నిర్మించి ఉన్నాయని తెలుస్తున్నది. భవిష్యత్తులో వాటిని మరింతగా పెంచుకుంటాయి. కనీస మద్దతు ధర లేదు కాబట్టి అటువంటి సంస్థలు రైతుల నుండి తక్కువ ధరలకు వ్యవసాయ ఉత్పత్తులను కొని పెద్ద మొత్తంలో నిలువ చేసుకుంటాయి. అధిక ధరలకు అమ్ముకుంటూ అందుకు తగిన యంత్రాంగాన్ని, మంత్రాంగాన్ని పటిష్టం చేసుకుంటాయి. అందులో భాగమే ఈ చట్టాలు అని కూడా అర్థం చేసుకోవాలి. బతకడానికి తినాలి కాబట్టి ఆహార సంబంధిత వాటికి తప్పనిసరిగా మార్కెట్ ఉంటుంది. ఈ మార్కెట్‌ను బడా కార్పొరేట్ శక్తులు తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి దారి సుగమం చేయడానికే నిత్యావసర సరుకుల చట్టానికి సవరణలు జరిగాయి.

ఈ చట్టాల వలన ప్రైవేట్ బడా కార్పొరేట్ శక్తులు వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార పదార్థాలు, తిండి సంబంధిత వస్తువులపై ఆధిపత్యాన్ని కలిగి ఉంటాయి. ప్రపంచ మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా అవసరమయ్యే పంటలను వేయిస్తారు. ఎగుమతికి డిమాండ్ ఉంటే ఎక్కువ మొత్తంలో ఎంతైనా నిలువ చేసుకోవచ్చని నిత్యావసర సరుకుల సవరణ చట్టం చెబుతున్నది. ప్రభుత్వ పరంగా ప్రజలకు కనీసం అందవలసిన విద్య, వైద్యం, ఆహారం అన్ని రంగాలను ప్రైవేట్ పరం చేస్తున్నారు. ఇక పాలకులకు మిగిలిందేమంటే కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కాపలాగా ఉండడం. అందుకోసం పోలీసు యంత్రాంగం, పాలనా వ్యవస్థలు చట్టాల్లో మార్పులను, న్యాయవ్యవస్థను తమ గుప్పిట్లో పెట్టుకుని బలమైన అణచివేత సాధనంగా ఉంటారన్నమాట.

వ్యవసాయ రంగాన్ని, ప్రజాపంపిణీ వ్యవస్థను, కేంద్ర – రాష్ట్ర సంబంధాలను దెబ్బతీసే చట్టాలు ఇవి. ఓ వైపు కరోనాతో, లాక్ డౌన్‌తో ఇబ్బంది పడుతున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా ఈ వ్యవసాయ చట్టాలను తీసుకురావడం అనేది వారి కార్పొరేట్ అనుకూల స్వభావాన్ని తెలుపుతున్నది.

26 నవంబర్ 2020 నుండి ప్రత్యక్షంగా ఢిల్లీ సరిహద్దుల్లో పెద్ద ఎత్తున పిల్ల జెల్లా, ముసలి ముతక, ఆడా, మగా అనే తేడా లేకుండా నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయించాకే ఇంటి ముఖం పడతామని దృఢమైన సంకల్పంతో నిరసనలు తెలుపుతున్నారు. వణికిస్తున్న చలిలో ఆరోగ్యాలను లెక్క చేయకుండా ప్రభుత్వ వ్యవసాయ విధానాలకు వ్యతిరేకంగా ఇంత పెద్ద సంఖ్యలో, ఇన్ని రోజులుగా నిరంతరాయంగా ఇంటికి, ఊరికి దూరంగా ఉంటూ ఆందోళనలో పాల్గొనడం చరిత్రలో నిలిచిపోతుంది. ఇది దేశ చరిత్రలోనే అతిపెద్ద ప్రజా సమీకరణగా గుర్తించబడుతున్నది. రైతుల ఉద్యమానికి దేశవ్యాప్తంగా అన్ని సెక్షన్ల ప్రజల నుండి పూర్తిస్థాయి ప్రత్యక్ష, పరోక్ష

మద్దతు, నైతికత లభించడం బిజెపి పాలకులకు చెంపపెట్టు వంటిది. భారతదేశ చరిత్రలో తొలిసారిగా 500కు పైగా రైతు సంఘాలు ఏకతాటి మీదకు వచ్చి వ్యవసాయ చట్టాలను రద్దు చేయడానికి ఉద్యమించడం గొప్ప విషయం.

రైతులు పెద్ద ఎత్తున ఢిల్లీ తరలివస్తున్న సందర్భంలో వారిని అడ్డుకునేందుకు రోడ్లకు అడ్డంగా బారికేడ్లు, వాహనాలను, రాళ్లను ఉంచారు. రోడ్లపై కందకాలు తవ్వారు. ఆందోళనకారులపై వాటర్ కెనాన్‌లను, నీటి ఫిరంగులను ప్రయోగించారు. లాఠీచార్జీలకు పాల్పడ్డారు. వందలాది మందిని అరెస్టు చేశారు. రాజ్యాంగాన్ని, దాని స్ఫూర్తిని తుంగలో తొక్కుతూ, ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తూ నిరసన తెలిపి పోరాడే హక్కును, భావప్రకటనా స్వేచ్ఛను నిరోధించే హక్కులను అపహాస్యం చేస్తూ, రాజ్యాంగం ఆమోదించిన రోజు అంటే నవంబర్ 26న రైతు ఉద్యమకారులపై ప్రభుత్వం దమనకాండను ప్రయోగించి తన స్వభావాన్ని బయటపెట్టుకున్నది.

ఈ ఉద్యమానికి ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, పాకిస్తాన్, యునైటెడ్ కింగ్డమ్, అమెరికా దేశాలలోని ప్రజల నుండి మద్దతు లభించింది. ఆయా దేశాల్లోని భారత కార్యాలయాల ముందు నిరసనలు జరిగాయి. ప్రజలు శాంతియుత నిరసనలు తెలిపే హక్కును కలిగి ఉంటారని, వారు నిరసనలను ప్రకటించడాన్ని అడ్డుకోవద్దని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ప్రకటించారు.

పెద్ద ఎత్తున నిరసనలు సమీకృతం అవుతున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం చర్చలకు దిగి వచ్చింది. చట్టంలో సవరణలు కానీ, రాతపూర్వక హామీలు కానీ కాదని చట్టాలను రద్దు చేయడమేననీ స్పష్టంగా తమ డిమాండ్‌ను ప్రకటించారు.

ప్రభుత్వాలు చేసిన చట్టాల అమలుకే ఏ దిక్కు మొక్కు లేదు. ఇక రాతపూర్వక హామీలకు సాధికారత ఎక్కడిదని ప్రశ్నిస్తున్నారు. గతంలో మోదీ విదేశాల నుండి 70 లక్షల కోట్ల నల్లధనంను తెప్పించి ప్రతి వ్యక్తి ఖాతాలో 15 లక్షలు వేస్తామని, పెద్ద నోట్ల రద్దుతో మూడు లక్షల కోట్ల నల్లధనం బయటపడుతుందని, అలాగే నగదు వ్యాపారాలు రద్దయిపోతాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పారు. 2014 ఎన్నికల మేనిఫేస్టోలో ఎం.ఎస్. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేస్తామని ఇలా మరెన్నో చెప్పిన మోడీ ఆ తర్వాత చేతులు ఎత్తేశారు. 2014లో అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా కాకముందే తాను ఇచ్చిన హామీలను తానే వ్యతిరేకిస్తూ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధర ఇస్తే మార్కెట్ ధరలు దెబ్బతింటాయని కాబట్టి వాటిని అమలు చేయలేమని సుప్రీం కోర్టులో మోడీ ప్రభుత్వం అఫిడవిట్ వేసింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ చట్టాల్లో సవరణలు కాదని, హామీలు కాదని, చట్టాలను రద్దు చేయమని రైతులు స్పష్టంగా డిమాండ్ చేస్తున్నారు.

ఒకప్పటి ఈస్టిండియా కంపెనీ వలే అదాని, అంబానీలు మారాయని, వాటి ఉత్పత్తులు బహిష్కరించాలని రైతులు సరిగ్గానే పిలుపునిచ్చారు. లక్షలాదిగా రైతులు పట్టుదలతో ఉద్యమంలో పాల్గొనడం అనేది ఫాసిస్టు నిర్బంధ పూరిత పాలనలో ప్రజా ఉద్యమాలకు ఆశగా కనిపించక మానదు.

వ్యవసాయ చట్టాల వ్యతిరేక ఉద్యమం తీవ్రమై ఈ ఉద్యమంలో 40కి పైగా రైతులు చనిపోయినప్పటికీ కూడా మోడీ ప్రభుత్వం పట్టుదలగా కార్పొరేట్లకు అనుకూలంగా ఉంటున్నది గానీ, రైతుల అభిప్రాయాలను గౌరవించడం లేదు. పైగా రైతు ఉద్యమం పైన బురదజల్లే ప్రయత్నం చేస్తున్నది. పోటీగా రైతు సంఘాలు ఏర్పాటు చేస్తున్నారు. వాటి ద్వారా వ్యవసాయ చట్టాలను సమర్థింపచేస్తున్నారు. దేశవ్యాప్తంగా బిజెపి శ్రేణుల ద్వారా కేంద్రం తెచ్చిన వ్యవసాయ చట్టాలకు మద్దతుగా ప్రచారం మొదలుపెట్టారు. వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తున్న రైతుల ఉద్యమాన్ని తప్పుడిదిగా చిత్రీకరిస్తున్నారు. అది రైతుల ఉద్యమం కాదని వారి వెనక కాంగ్రెస్, కమ్యూనిస్టులు, అర్బన్ నక్సలైట్‌లు, మావోయిస్టులు, విదేశీ శక్తులు, పాకిస్తాన్ ఏజెంట్‌లు ఉన్నారని ఇష్టం వచ్చినట్లు అంతూ పొంతూ లేని దుర్మార్గపు అబద్దాలు చెబుతున్నారు.

ఉద్యమంలో రైతులు లేరని, కిరాయి మనుషులని మోడీ-షా ప్రభుత్వం, దాని అనుంగు మీడియా ప్రచారం చేసింది. లక్షలాదిగా తరలివచ్చిన రైతులు ఇది సరైంది కాదని నిరూపించారు. ఈ ఉద్యమం పంజాబ్‌కే పరిమితమైందని అన్నారు. మొదట్లో పంజాబ్‌లోనూ ఆ తర్వాత హర్యానాలోనూ తీవ్రమైన నిరసనలు వచ్చినప్పటికీ రానురానూ ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరఖండ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటుగా దేశవ్యాప్తంగా అందరు రైతులు ఈ ఉద్యమానికి మద్దతునిస్తూ పోరాటంలో నిలుస్తున్నారు. నవంబర్ 26న ఢిల్లీ చలో, డిసెంబర్ 8న భారత్ బంద్‌లతో రైతుల ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తృతి చెందిందని నిరూపించింది.

ఢిల్లీ సరిహద్దుల్లో వణికించే చలిలో, ఆరు బయట ప్రదేశాల్లో, తాత్కాలిక టెంట్‌లతో తిండి, కాలకృత్యాలు, స్నానాలు, నిద్ర వంటి వాటికి అష్టకష్టాల పాలవుతూ ఉద్యమంలో పాల్గొంటున్న వారిని కిరాయి రైతులని ప్రచారం చేయడం ఎంత దుర్మార్గమైనది.

ఢిల్లీ సరిహద్దుల్లో ఎంతో కష్ట నష్టాలకోర్చి ఆహార పదార్థాలను సమకూర్చుకుని, వంటావార్పు చేసుకుంటూ ఇంటికి, ఊరికి దూరంగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఆరుబయట రోడ్లపై మట్టిలో నెలరోజులుగా దీక్షలను, నిరసన, ఆందోళనలను నిర్వహిస్తున్న వారి నిజాయితీ, ఆరాటం, జీవన్మరణ పోరాటం ప్రభుత్వానికి కనిపించడం లేదు. కానీ రైతులకు డబ్బు ఎక్కడి నుండి వస్తున్నది అని, దాంట్లో విదేశీ హస్తం ఉన్నదని కుంటిసాకులు వెతుకుతున్నది. కొద్ది మంది కార్పొరేట్ల కోసం మోడీ ప్రభుత్వం దేశ ప్రజల సంక్షేమాన్ని పణంగా పెట్టడానికి శతవిధాల ప్రయత్నం చేస్తున్నది.

సిక్కులు రైతు ఉద్యమంలో పాల్గొంటే ఖలిస్తాన్ వాదులని, మేధావులు గొంతు కలిపితే అర్బన్ నక్సలైట్లనీ, ముస్లింలు మద్దతు తెలిపితే పాకిస్థానీ ఏజెంట్‌లని అంటున్నారు. దేశ విద్రోహ శక్తుల వల్లనే ఈ ఉద్యమం జరుగుతుందని ప్రచారం చేస్తున్నారు. వారి చేతిలో కిరాయి మీడియా, అధికారిక రాజ్య యంత్రాంగం ఉండనే ఉన్నది. ఎంతైనా ఏమైనా ప్రచారం చేయగలరు. అక్రమ కేసులు పెట్టగలరు. ఉద్యమాలపై నిర్బంధాలను ఉపయోగించగలరు. రైతు ఉద్యమకారుల్లో కీలక కార్యకర్తల కదలికలను నియంత్రించడానికి 50 లక్షల రూపాయల బాండ్లను అడుగగలరు.

ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే ప్రతి సందర్భంలోనూ వారి చేతుల్లో దేశ ద్రోహులు అనే మాట ఆయుధంగా అలవోకగా వాడబడుతున్నది.

దేశంలో బలపడుతున్న కార్మిక, కర్షక మైత్రి

ఢిల్లీలో రైతాంగం చేస్తున్న పోరాటాన్ని విచ్ఛిన్నం చేయడానికి పాలకులు చేస్తున్న కుట్రలను వమ్ముచేస్తూ కార్మికుల, కర్షకుల మైత్రి బలపడిందని అంటున్నారు **బి.ఎస్.రాజు**

ఎవరికి వారే, ఎవరంతట వారే, వారి వారి సమస్యలపై విడివిడి సమూహాలుగానో, సమైఖ్యంగానో సమ్మెలుచేసే, ఉద్యమించే, దృశ్యాలు ఒకప్పుడు తరచూ కనిపిస్తుండేవి. ఆ దృశ్యాలు మెల్లగా సన్నగిల్లుతూ, అదృశ్యమౌతూ వచ్చాయి. ఆర్థిక సరళీకరణల నేపథ్యంలో గత నాలుగు దశాబ్దాలుగా జరిగిన పరిణామమిది. కార్మికోద్యమ క్షీణ దశకు ఈ నాలుగు దశాబ్దాలు తార్కాణంగా నిలుస్తాయి.

శతాబ్దాల గమనంలో శ్రామికులు ఎన్నో పోరాటాల్లో రక్త తర్పణతో, బలిదానాలతో సాధించుకున్న హక్కులను ఈ నాలుగు దశాబ్దాల్లో సామ్రాజ్యవాద పెట్టుబడి కబళించి వేసింది. కార్మికోద్యమాలను నిర్వీర్య పరిచి, కార్మికులను స్వయం రాజకీయ అధికార సాధనా పథం నుండి పక్కదారులు పట్టించి దెబ్బకొట్టడంలో పెట్టుబడి ఆరితేరింది. పెట్టుబడిదారీ వర్గం సాంకేతికంగా బలపడుతూ, ఉత్పత్తి వ్యవస్థకు సాంకేతికతను జోడిస్తూ నూతన శక్తిని సమకూర్చుకుంది. ఆ శక్తిని కార్మికులకు పోటీగా నిలబెట్టి, పెట్టుబడి మరింత బలపడి కార్మికులపై పైచేయి సాధించి రాజ్యమేలుతున్నది. అంతేగాక, ఇంకా, పెట్టుబడి తన మార్కెట్ దోపిడీ యాజమాన్య నైపుణ్యతను, విస్తరణ చాతుర్యాన్ని పెంపొందించుకుంది.

పెట్టుబడి సాంద్రత చెందుతూ, విస్తరిస్తూ ప్రపంచ మార్కెట్లపై గుత్తాధిపత్యాన్ని నెరపుతూ కార్మికోద్యమ నాయకత్వాలను కొనుగోలు సరుకుగా మార్చివేసి, తన అవసరాలకు అనుగుణంగా మలుచుకుంటూ వచ్చింది. అది తన వంతపాడే, అంటకాగే, రాజీపడే తొత్తు ముఠాలను తెలివిగా తయారు చేసుకుంటూ కార్మికులను కట్టడిచేస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే కాంట్రాక్టు కార్మిక విధానాన్ని ప్రపంచమంతా ప్రవేశపెట్టి సంఘటిత కార్మిక వ్యవస్థను నిర్వీర్యం చేసింది.

వ్యక్తిగా ఎదుగు. స్వశక్తిని పెంచుకో. సమిష్టికి దూరంగా ఉండు. నీ పనేదో నువ్వు చేసుకో. వచ్చేదేదో పుచ్చుకో. నిష్ఠతో పనిచేయ్. పనిలేదని పోరాడకు. తలవంచుకు వెళ్లిపో. అదే సరైన దారి అనే వర్గ నీతితో పెట్టుబడి కార్మికుని మెడవంచి, విడగొట్టి సంఘటితుడిని అసంఘటితునిగా, నిస్సహాయునిగా మార్చివేసింది.

ఎనిమిది గంటల పని పరిమితి, ఎనిమిది గంటల పనిదిన సాధనకు కార్మికులు ఎంతగా రక్తతర్పణ చేయవలసి వచ్చిందో మేడే చరిత్ర తెలియచేస్తుంది. ఇప్పుడు మేడే అంటే పప్పు బెల్లాల పంపకం. ఓ ఊక దంపుడు సందడి. ఇటు రాజ్యం, అటు రాజీ కార్మిక వర్గం 'ఐ లవ్ యు', 'యు లవ్ మీ' అని కౌగలించుకుని కన్నుగీటుకునే ప్రేమ వేడుక. కార్మిక వర్గ రాజ్యాధికార సాధనకు, సంఘటిత శక్తికి ప్రతీకగా, ప్రేరణగా 'మేడే' మిగల్లేదు. మిగలకుండా ఆవిరై పోయింది.

ఇటువంటి సందిగ్ధ సన్నాట సందర్భంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక విధానాలకు వ్యతిరేకంగా, నవంబర్ 26న కేంద్ర కార్మిక యూనియన్లు దేశవ్యాపిత సమ్మె చేపట్టాయి. ఈ సమ్మెలో 25 కోట్లకు పైగా కార్మికులు పాల్గొన్నారని ఈ సమ్మె నిర్వహించిన కేంద్రకార్మిక యూనియన్ల ఐక్యవేదిక ప్రకటించింది. బిజెపి అనుబంధ భారతీయ మజ్దూర్ సంఘ్ మినహా అన్ని కార్మిక సంఘాలు ఈ సమ్మెలో

విద్యార్థులు ఉద్యమిస్తే అదేమాట, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు ఎవరు ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించినా వారిని దేశ ద్రోహులుగా చిత్రీకరిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్‌లో దళిత అమ్మాయిని గ్యాంగ్ రేప్ చేసిన సందర్భంలో వచ్చిన నిరసనల వెనుక విదేశీ హస్తం ఉందని అన్నారు.

అసలు దేశద్రోహులు ఎవరు? అశేష ప్రజానీక ప్రయోజనాలకు భిన్నంగా, కొద్దిమంది బడా కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలు చేస్తూ విధానపర చర్యలు తీసుకుంటున్న వారిని దేశద్రోహులు అనకుండా ఉండగలమా. ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం, ఉపాధి లేమిలకు వ్యతిరేకంగా దేశ సంపదలో అందరికీ సమాన వాటాను ఇవ్వకుండా చేస్తున్న పాలనా విధానాలను పాటిస్తున్న వారు కాదా అసలు విద్రోహులు. సంపన్న వర్గాలకు ఊడిగం చేస్తూ దేశ, విదేశీ కార్పొరేట్ల సేవలో తరించిపోతున్న వారు కాదా దేశ ద్రోహులు.

వ్యవసాయ చట్టాలను ఆమోదించిన వెంటనే బిజెపి ప్రభుత్వం మరో దుశ్చర్యకు పాల్పడింది. కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను పార్లమెంట్ ఆమోదించింది. మరో వైపు రైతులు వ్యతిరేకిస్తున్నా విద్యుత్ సంస్కరణల బిల్లును సిద్ధంగా ఉంచుకున్నది. బహిరంగంగానే, బాహాటంగానే బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులు కార్పొరేట్లకు వత్తాసు పలుకుతున్నాయి. ఓవైపు సనాతన ధర్మం అంటూ హిందూ మతం పేరుతో మత విద్వేషాలు రెచ్చగొడుతూ, పెంచి పోషిస్తూ మరోవైపు ప్రపంచ మార్కెట్ శక్తులకు, అంతర్జాతీయ కార్పొరేట్లకు దాసోహమంటూ దేశ ప్రజల బతుకులను దుర్భరం చేస్తున్నారు. ఈ శక్తులను తిప్పికొట్టడం తప్ప మరో మార్గం లేని అనివార్యమైన పరిస్థితి ఏర్పడింది.

(రచయిత ఉపాధ్యాయులు)

వీ

భాగస్వాములయ్యాయి. అఖిల భారత రైతు సమన్వయ సమితి సమ్మెకు మద్దతు ప్రకటించింది. కేంద్రం తెచ్చిన నూతన వ్యవసాయ, కార్మిక చట్టాలకు; పాలక పార్టీ అనుసరిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు, ప్రైవేటీకరణ నీతికి, నిరుద్యోగాన్ని పెంచే ప్రజావ్యతిరేక ఆర్థిక సరళీకరణ దూకుడుకు వ్యతిరేకంగా కోట్లాది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. నిజానికి ఈ సమ్మె ద్వారా కార్మిక సంఘాలు ప్రభుత్వం ముందుంచిన డిమాండ్లు అతి సాధారణమైనవి. కార్మికుల బతుకు తెరువుకు, ప్రజా సంస్థల కాపుదలకు సంబంధించినవి. అవేమిటో చూడండి:

1. రైతు వ్యతిరేక చట్టాలు, కార్మిక వ్యతిరేక కోడ్‌లను ఉపసంహరించుకోవాలి.
2. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలి.
3. అందరికి పెన్షన్, ఎన్‌పిఎస్ రద్దు, పాత పెన్షన్ పథకం పునరుద్ధరణ చేపట్టాలి.
4. ఆదాయపు పన్ను చెల్లింపు వర్తించని కుటుంబాలకు నెలకు 7500 రూపాయల నగదు బదిలీ చేయాలి.
5. నిరుపేదలకు నెలకు ఒక్కొక్కరికి 10 కిలోల ఉచిత రేషన్ ఇవ్వాలి.
6. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఏడాదిలో 200 రోజులకు పెంచాలి.

ఇంచు మించు ఇవే డిమాండ్లతో 2016 నుండి సాలీనా సార్వత్రిక సమ్మెలు జరుగుతూనే ఉన్నాయి. పాలక ప్రభుత్వం వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ సమ్మెల ఫలితాలు ఇప్పటివరకు ఏమీ కానరాలేదు. పోనీ కనీసం, ఈ సమ్మెలు ప్రభుత్వాలను ఏమైనా ఒత్తిడికి గురిచేసినవా అంటే అదీ అగుపించదు. ఒకవేళ ఈ సమ్మెల వల్ల ఫలితాలేమైనా ఒనగూరి ఉంటే, పైన ఉదహరించిన డిమాండ్లు పదే పదే కనిపించేవి కావు. కొన్నైనా పరిష్కారమయ్యేవి. కొత్త డిమాండ్లు ముందుకొచ్చేవి. కానీ అవే డిమాండ్లు అపరిష్కృతంగా ఉండి పోయాయి కాబట్టే, అవే పదే పదే మరో సార్వత్రిక సమ్మెకు 'క్యారీ ఫార్వర్డ్' ఔతున్నాయి.

ఈ 'క్యారీ ఫార్వర్డ్' సాచివేత విధానం 'సార్వత్రిక సమ్మె' అనే పదునైన కార్మికుల చేతి ఆయుధాన్ని ఓ మొండి కత్తిగా మార్చి వేస్తున్నది. సాలీనా జరిపే ఓ క్రతువులా, ఓ వేడుకోళ్ల అమ్మవారి జాతరలా, ఓ జండాల జూలూస్ పండగలా, ఈ సార్వత్రిక సమ్మెలు జరపుతున్నారు గాని వీటిలో సారం కానరాదు. వీటి నుండి కార్మికులకు దక్కుతున్న ఫలాలు ఏమీ కనిపించవు. పోనీ ఈ సమ్మెవల్ల కార్మికవర్గ స్పృహ, కార్మికులు నిర్వర్తించవలసిన పురోగామి పాత్ర పట్ల కార్మికుల అవగాహన, పోరాట పటిమ పెరుగుతున్నదా అంటే, అదీ ఎక్కడా కనిపించదు.

దేశానికి స్వతంత్రం వచ్చి 73 ఏళ్లు దాటింది. ఇప్పుడు, ఇన్ని దశాబ్దాల తర్వాత కూడా, కోట్లాది కార్మికులు, తమ ఈ కనీస కోర్కెలు నెరవేర్చమని ప్రభుత్వాలను తిరిగి తిరిగి అభ్యర్థిస్తూ సమ్మెలకు దిగుతున్నారంటే, కార్మిక వర్గం ఎంత దుస్థితిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఇటువంటి దుస్థితి ఈ దేశ కార్మికవర్గానికి ఎందుకు దాపురించింది?

భారతదేశ రాజకీయాలను మలుపుతిప్పి, రాజ్య వ్యవస్థను కైవసం చేసుకోవాల్సిన కార్మిక వర్గం ఇంత హీన స్థితికి ఎలా నెట్టబడింది? పెట్టుబడి భావజాలంతో, దాని శక్తితో పోరాడి, ఎదిగి, నూతన వ్యవస్థ నిర్మాణం చేయవలసిన పురోగామి వర్గమే పెట్టుబడి ముందు, జాతీయవాద ఫాసిజం ముందు, మతవాదం ముందు ముకుళిత హస్తాలతో, దేబిరింపులతో దీనంగా నిలబడి ఉందంటే ..ఈ దుస్థితికి కారణమేమిటి ? కార్మిక వర్గ అగ్రగామి శక్తులు తామెక్కడ దారితప్పాయో, కార్మిక శక్తిని ఇలా ఎలా నిర్వీర్య పరిచాయో, మార్గ నిర్దేశం చేయలేక పోయాయో ఆలోచించుకోవాలి.

కార్మికుల స్థితి ఇలా ఉండగా, భారతదేశ వ్యవసాయ రైతాంగపు స్థితి ఏమిటి? కార్మికుల సార్వత్రిక సమ్మె వెన్నంటే నవంబర్ ఆఖరి వారం నుండి కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన మూడు సాగు చట్టాలను రద్దు చెయ్యాలని ఉత్తర భారత రైతాంగం ఆందోళనకు దిగారు. దక్షిణ భారత రైతాంగం స్తబ్దుగానే ఉండిపోయింది. ఈ చీకటి చట్టాల చేదు వారిని అంతగా తాకినట్టు లేదు. స్వతంత్రానంతర భారతంలో కనీవినీ ఎరుగని రీతిలో, గత 25 రోజులుగా కోట్లాది రైతాంగం తమకు హానికరమైన నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయమని సడక్ సమరం చేస్తున్నారు.

డిసెంబర్ 8న దేశవ్యాపిత బంద్ నిర్వహించారు. అప్పటి నుండి రహదారులపై మోహరించి ఆందోళన చేస్తున్నారు. కరోనా కారుమబ్బుల చీకటి చాటున, అహంకారంతో, కార్పొరేట్ల, అదీ ముఖ్యంగా 'ఆదానీ–అంబానీ' పాద దాసులుగా మారిపోయిన 'మోడీ–షా' ద్వయం పార్లమెంట్‌లో కుట్రపూరితంగా ఆమోదింప చేసుకున్న 3 వ్యవసాయ చట్టాల దుర్మార్గాన్ని మొదటిగా పంజాబ్ రైతులు, తదనంతరం మిగతా ఉత్తర భారత రైతాంగం పసిగట్టారు. డిజిటల్ అలల్లో, జోల పాటల్లో జోగుతున్న మధ్యతరగతి నాగరిక సమూహం తలకెక్కని ఈ జాతి ద్రోహం, దేశ ద్రోహం, భారత రైతాంగం మొత్తంగా కాకపోయినా, సగ భాగమైనా సవ్యంగానే అర్థం చేసుకుంది. అరకొరగానైనా, నామమాత్రంగా నైనా, కార్మిక వర్గం ఎంతో కొంతగా రైతాంగానికి వత్తాసు పలికింది. ఈ వత్తాసు ఏమాత్రం చాలదు. అయినప్పటికీ కాస్త ఊతంగానైనా, మైత్రి పూర్వకంగానైనా రైతు పక్షాన నిలబడింది. ఈ మైత్రి, ఈ సంఘీభావం అత్యంత అవసరమైనదీ, ఆశాజనకమైనదీ, హర్షించదగినదీ. లోపమల్లా మధ్యతరగతి బుద్ధిజీవులదీ, పెట్టుబడికి, మతతత్వానికి, జాతీయ వాదానికి, ఫాసిస్టు విధానాలకు అమ్ముడు పోయిన మీడియాదీ.

ఉదారవాద రాజ్యాంగం కల్పించిన కనీస హక్కులు, చట్టాలు కూడా హరించబడుతున్న ఈ కాలంలో సకల జనుల ఐక్యత, సంఘర్షణ, పోరాటం... ఇవే ప్రస్తుతానికి ప్రజలకున్న ఆయుధాలు. ఫాసిజాన్ని నిలువరించి ప్రజలు గెలవాలంటే, కనీసపు ప్రజాస్వామ్యాన్నయినా నిలబెట్టు కోవాలంటే ఇప్పుడు దేశంలో బలపడుతున్న కార్మిక కర్షక మైత్రిని, ఈ మైత్రికి దూరంగా ఉంటున్న ఇతర శక్తులు కూడా చేతులు కలిపి ఈ శక్తిని మరింత బలోపేతం చేయాల్సివుంది.

ఇప్పటికే వెనకబడ్డ కార్మిక వర్గ అగ్రగామి శక్తులు తమ బుర్రలకు పట్టిన బూజులు దులుపుకుని, దేశంలో ఇప్పుడు బలపడుతున్న కార్మిక కర్షక మైత్రిని సకల జనుల మైత్రిగా, సంఘటిత శక్తిగా పెంపొందించ డానికి దీక్ష వహించి కృషి చేయాలి. అపూర్వమైన రైతాంగ ఐక్యతను సాధించిన రైతాంగ ఉద్యమం నుండి గుణ పాఠాలు నేర్చుకుని ముందడుగు వేసే తరుణమిది అని గుర్తించాలి.

(రచయిత శ్రామికనేస్తం సంపాదకులు) వీ

విస్తరించవలసిన రైతు ఉద్యమం

***ఢిల్లీ సరిహద్దుల్లో సాగుతున్న రైతాంగ ఆందోళనను సన్నిహితంగా పరిశీలించిన నేపథ్యంలో ఆలోచించవలసిన అసలు విషయాల మీదికి దృష్టి మళ్లిస్తున్నారు* అరుణ**

అందరం ప్రస్తుతం రైతుకి మద్దతు ఇస్తున్న నేపథ్యంలో అసలు రైతులు అంటే ఎవరు అనేది ఓ సారి పరిశీలించవలసి ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశంలో 26.3 కోట్ల మంది ప్రజలు వ్యవసాయం వృత్తిగా ఉన్నారు. వీరిలో 11.8 కోట్ల మంది భూమి కలిగిన రైతులు అయితే 14.5 కోట్ల మంది వ్యవసాయ కూలీలు. ఇది కాకుండా ప్రతి ఏడు భూమి లేని వ్యవసాయ కార్మికుల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నది. పి. సాయినాథ్ ప్రకారం 2001 నుంచి 2011 మధ్యలో ఒక కోటి మంది రైతులు భూమిని కోల్పోయారు. ఇక భూమి కలిగిన రైతుల్లో 33 శాతం రైతుల దగ్గర ఒక హెక్టార్ కన్నా తక్కువగా అంటే కేవలం 0.4 హెక్టార్ల భూమి ఉంది. వీరంతా చిన్న రైతులు. వీరికి ప్రభుత్వం అందించే రుణాలు అందవు. వీరు పండించే పంటలు అమ్మి ఎంత సంపాధిస్తారో అంతకన్నా ఎక్కువగా వీరు తమ ఆకలి కోసం మార్కెట్ నుంచి తిండిగింజలు కొనుక్కునే కొనుగోలుదారులుగా జీవిస్తున్నారు. ఈ రైతు కుటుంబాల ఆదాయం 100 రూపాయలు అనుకుంటే అందులో 16 రూపాయలు వ్యవసాయం నుంచి వస్తూ వుంటే 83 రూపాయలు కూలి పని చేయడం ద్వారా సంపాదిస్తున్నారు. మరి ఈ కూలి పని చేస్తున్న వారు ఎక్కడ ఉన్నారు. వీరంతా మన లాగా రైతులకి మద్దతు పలుకుతున్నారా, లేదా అనేది రైతుల ఉద్యమానికి అండగా నిలిచే మనం చూడాలి. అప్పుడే ప్రస్తుత ఉద్యమాన్ని మనం ఎలా చూడాలి, మన మద్దతు ఎలా ఉండాలి అనే దానిపై అవగాహన వస్తుంది.

కూలి పనిచేసి సంపాదించే రైతులతో లేదా రైతు కుటుంబ సభ్యులతో మాట్లాడితే ప్రస్తుత ఉద్యమంలో ఉన్న "మిగులు–తద్వారా సమకూరుతున్న ఆస్తి" వ్యవహారం స్పష్టంగా కనిపిస్తుంది. ఉదాహరణకి ఢిల్లీలో రిక్షా లాగే ఓ రైతు బిడ్డ, గ్యాస్ సిలిండర్, అమెజాన్ డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్న రైతు బిడ్డలు చెప్పిన వివరాలు చూద్దాం.

ఇంటికి గ్యాస్ సిలిండర్ డెలివర్ చేయటానికి కిషన్ వచ్చాడు. ఇతను ఉత్తరప్రదేశ్ ఇటావాకి చెందిన ఓ రైతు కొడుకు. బలవంతంగా 17 ఏళ్ల కిషన్‌ని చాయ్ చర్చలోకి దింపితే ఇలా చెప్పాడు: "ఇంటికాడ చిన్నపొలం ఉంది. అమ్మానాన్న దానిలో పని చేస్తారు. నేను, అన్న పట్నంలో పని చేస్తాం. నాకు 10 వేలు జీతం ఇస్తారు. మీ బోటివాళ్లు టిప్ ఇస్తే ఇంకో ఐదు నుంచి ఆరు వందలు నెలకు సమకూరతాయి. మూడువేలు ఇంటి అద్దెకు, తిండికి ఖర్చు పెడతా. మిగతా ఇంటికి పంపుతా. నాన్నకి పొలం కోసం విత్తనాలు ఎరువులు కొనటానికి డబ్బు అవసరం. ధాన్యం, గోధుమ వలన మాకు లాభం అందడం లేదు అని ఈ మధ్య కూరలు పండిస్తున్నాం. అవి దలాల్ వచ్చి ట్రాక్టర్లో తీసుకుపోతాడు. తరవాత ఏ కూరలు వేస్తే మార్కెట్‌లో గిరాకీ ఉంటుందో కూడా అతనే చెబుతాడు. ఊరిలో అందరు వేసేది కాకుండా ఏమైనా భిన్నంగా పండిద్దాం అని మా నాన్న ప్రయత్నం చేస్తాడు. ఒక్కోసారి భిన్నం అయిన కూరలు పండించాలి అనుకోటం రిస్క్ అయిపోయి కుదేలు అవుతుంటాం. ఒకసారి కుదేలు కావడం అంటే ఐదేళ్ల పేదరికం మా నెత్తిన పడుతుంది. మేం స్వయంగా ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం, గోధుమలు తింటాం. అవి అందకపోయినా, సరిపోకపోయినా తిండి గింజలు మార్కెట్‌లో కొనుక్కుంటాం. నేను ఊరిలో ఉండి మా పొలంలో పండిన కూరలు చుట్టూ ఉన్న టౌన్‌కి తీసుకుపోయి అమ్మితే ఇక్కడ వచ్చే డబ్బే వస్తుంది. కాకపోతే నేను శర్మ కులం వాడిని. కూరలు అమ్ముకుంటే ఊరిలో హేళనకి గురి అవుతాను. నాకు గాని మా అన్నకు గాని పెళ్లికి పిల్లని కూడా ఇవ్వరు. మా పొలం, మా కులం మాకు ఇచ్చేది కష్టాలు మాత్రమే." ఈ కిషన్‌ను ఢిల్లీ సరిహద్దుల్లో జరుగుతున్న రైతు ఉద్యమం గురించి అడిగితే, "తెలీదు మేడం. మా నాన్న, మా ఊరి దలాల్ ఈ విషయాలు మాట్లాడుకుంటారు. నా పని కేవలం డబ్బు సంపాదించడం, ఇంటికి పంపడం వరకే" అన్నాడు.

మెట్రో స్టేషన్ దగ్గర రిక్షా లాగే కార్మికుడు ఆత్మారాం. ఆత్మారాం మాటలు ఇలా సాగాయి: "మీ ఢిల్లీలో నేను రిక్షా వాడిని. మా ఊరు గోరఖ్‌పూర్‌లో నేను రైతును. ఆరు నెలలు ఇక్కడ పనిచేసి విత్తనాలకు, ఎరువులకు కావలసిన పెట్టుబడి 20 నుంచి 30 వేలు సంపాదిస్తాను. నా భార్య ఇంటికాడ వ్యవసాయం చేస్తుంది. ఇద్దరు కూతుళ్లకి పెళ్లి చేశాను. ఇంకో కూతురు, చిన్న కొడుకు ఉన్నాడు. కూతురి పెళ్లి, కొడుకు చదువు కోసం ఈ రిక్షా లాక్కునే బతుకు. పట్నంలో పొలం కోసం పెట్టుబడి సంపాదించకపోతే వ్యవసాయం సాధ్యం కాదు. ఈ రిక్షా పల్లెలో సాధ్యం కాదు. అందుకే ఢిల్లీకి వచ్చాను. ఈ ఊరు నాది కాదు. ఇక్కడ డబ్బు నా పొలం పెట్టుబడికి కావాలి, అంతే." మరి ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల పోరాటం జరుగుతుంది తెలుసా అంటే, "మా ఊరిలో దలాల్ నా భార్యకి చెప్పాడు. ఒక రోజు అక్కడికి పొమ్మని నా భార్య అడిగింది. అయితే ఓ రోజు పోతే ఎలా కుదురుద్ది మేడం. అసలే కరోనా వలన బయటకి వచ్చే జనం తగ్గి ఆదాయం తగ్గింది. కుదరదు మేడం. అందుకే పోలేదు. పట్టించుకోలేదు."

పుస్తకాలు ఆర్డర్ చేస్తే డెలివరీ చేయడానికి అమెజాన్ అబ్బాయి సందీప్ వచ్చాడు. "తెల్లారి 5 గంటల నుండి పని మొదలు పెట్టా, దప్పికగా ఉంది నీళ్లు ఇస్తారా.. కరోనా కదా..నీళ్లు అడగటానికి కూడా

మొహమాట పడే పరిస్థితిలో ఉన్నా" అని చెబుతూ తన బతుకును ఇలా వివరించాడు: "మొత్తం వయసు వృథా మేడం. నాన్న అర చెక్క పొలంలో మట్టి అయిపోయాడు అని పట్నం వచ్చాను. అమ్మకి, నాన్నకి డబ్బు పంపితే వాళ్లు పొలం పని చేసుకునే పరిస్థితి. నేను పొద్దున్న మోటార్ సైకిల్ ఎక్కితే రాత్రి వరకు తిరుగుతా. చచ్చిపోతే నా ప్రాణానికి హాయి మేడం. కాపోతే పొలం పని తప్ప ఏం తెలియని నాన్న, అమ్మ ఎలా బతుకుతారు అని ఆలోచించి ఈ గుదిబండ బతుకు బతుకుతున్నా." అతనికి అసలు ఈ ప్రపంచంతోనే సంబంధం లేదు. ఢిల్లీలో రైతుల ఉద్యమం తెలుసా అంటే, "తెలీదు మేడం, లేట్ ఐతే పనిలో వెనకపడిపోతాను. పీస్ రేట్ కింద డబ్బులు వస్తాయి మేడం" అని బండికి ఓ కిక్ ఇచ్చి అరక్షణంలో మాయం అయిపోయాడు.

ఈ ముగ్గురూ ఒక ఎకరం లేదా అర ఎకరం పొలం కలిగిన రైతుల కుటుంబాలకు చెందిన వారు. వీరు మనలాగా 'నేను రైతులకు మద్దతు ఇస్తున్నా' అని ప్రకటించకపోయినా వాస్తవంగా రైతుకి మద్దతు ఇస్తున్నారు. వాస్తవంగా వీరు రైతు కష్టాలు తెలిసిన కార్మికులు. రైతు ధర్నాకి పోయే సమయం లేని రైతు కుటుంబీకులు.

ఎకరం కన్నా తక్కువ భూమి వున్నవారు. అసలు భూమిలేని వ్యవసాయ కూలీలు ప్రస్తుత ఉద్యమంలో ఉన్నారా అనేది పరిశీలిస్తే, భూమిలేని వ్యవసాయకూలీలు కనిపించడం లేదు. ఇక చిన్న రైతులు ఏమేరకు పాల్గొంటున్నారు అనేది చూడాలంటే దేశంలో అమలవుతున్న కనీస మద్దతు ధరను పరిశీలించాలి.

కనీస మద్దతు ధర భారతదేశంలో 1960లో ప్రవేశ పెట్టబడింది. ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ రెవల్యూషన్ అనే నినాదాన్ని ఎత్తుకుని, విత్తనాలు ఎరువులు అమ్ముకునే కంపెనీలు లాభార్జన కోసం వ్యవసాయ పరిశ్రమ అర్రులు చాస్తున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం కూడ గ్రీన్ రెవల్యూషన్ వల్ల మాత్రమే ప్రజలకి మేలు జరుగుతుంది అని నమ్మించిన కాలం అది. ఆ సమయానికి రైతులు సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారు. వారికి విత్తనం ఎరువు తయారు చేసుకోవడం వచ్చు. పలు పంటలు పండించడం వచ్చు. ఆ వ్యవసాయం మాన్పించి రైతులతో హైబ్రిడ్ విత్తనాలు, రసాయన ఎరువులు కొనిపించాలనే, గ్రీన్ రెవల్యూషన్ అనే అంతర్జాతీయ వ్యవసాయ పెట్టుబడి ఎజెండాను భారత్‌లో ప్రోత్సహించాలనే ఎజెండాను భారత ప్రభుత్వం చేపట్టింది. ఆ ఎజెండాలో ఓ ఎత్తుగడగా రైతులపైకి విసిరిన అస్త్రం కనీస మద్దతు ధర అనే బిస్కెట్. మన సేంద్రీయ వ్యవసాయం దిగుబడి తక్కువ వుంది, జనాభాకి ఆహారం సరిపోదు కనుక గ్రీన్ రెవల్యూషన్ కావాలని, దాని కోసం రైతులకి కనీస మద్దతు ధర ఇస్తామని ఆనాటి రాజ్యం ఎత్తుగడ. అలా ఆనాటి అంతర్జాతీయ వ్యవసాయ వ్యాపారవేత్తలు ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తే రైతులకి ఇచ్చే కనీస మద్దతు ధర పుట్టింది. దాని పుట్టుకలోనే రైతుకి లాభం చేకూర్చాలన్న లక్ష్యం లేదు. కనీస మద్దతు ధర వలన మిరకిల్ బియ్యం, మిరకిల్ గోధుమలు అంటూ హైబ్రిడ్ విత్తనాలు రైతుకి ఇవ్వటంతో విత్తనం తయారు చేసుకుని ప్రకృతితో సహజీవనం చేసే వ్యవసాయాన్ని వదులుకుని, ప్రకృతిని కొల్లగొట్టి లాభం పోగేసే వ్యవసాయ పరిశ్రమకి ఉపయోగపడే రైతు ఉనికిలోకి వచ్చాడు.

రైతులు పండించే పంటల్లో ఏ పంటకు "కనీస ధర" ఇచ్చి రైతుకి పారితోషికం చెల్లించాలి అనుకుంటే అదే కనీస మద్దతు ధర అయింది. దీనితో ఏ పంట వేయాలి అనే నిర్ణయం రైతుకి బదులు ప్రభుత్వం తీసుకునే పరిస్థితి ఉనికిలోకి వచ్చింది. ఒక నిర్దిష్ట పంటను సేకరించినప్పుడల్లా ప్రభుత్వ సంస్థలు చెల్లించే ధర రైతుకి అందటం, అదే రైతులకి అందే పారితోషికంగా మారటం జరగటంతోనే మన దేశంలో కాంట్రాక్టు ఫార్మింగ్ అమలులోకి వచ్చింది. కాకపోతే అది కార్పొరేట్ కంపెనీల తొత్తు ప్రభుత్వం చేతుల మీదుగా నడిచింది. అలా ప్రభుత్వం చేయించే కాంట్రాక్టు ఫార్మింగ్ ప్రకారం ప్రస్తుతం కేంద్రం 23 వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రతి ఏడు ప్రకటిస్తూ ఉంటుంది.

వీటిలో ఏడు తృణధాన్యాలు (వరి, గోధుమ, మొక్కజొన్న, జొన్న, సజ్జ, రాగి, బార్లీ), ఐదు పప్పు ధాన్యాలు (శనగ, కంది, మినుము, పెసర, ఎర్రకంది), ఏడు నూనె గింజలు (ఆవాలు, వేరుశనగ, సోయాబీన్, పొద్దుతిరుగుడు, నువ్వులు, కుసుమ, ఒలిసెలు), నాలుగు వాణిజ్య పంటలు (పత్తి, చెరకు, కొబ్బరి, ముడి జనపనార) ఉన్నాయి. ఈ పంటల మద్దతు ధర ప్రభుత్వం ప్రతి ఏడు ఖరీఫ్, రబీ సీజన్‌లలో కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ (సిఎసిపి) సిఫారసుల ప్రకారం నిర్ణయిస్తుంది. ఈ నిర్ణయంలో సిఎసిపి మూడు అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. మొదటిది (ఎ2 అంటారు) రైతు పంట పండించేందుకు పెట్టిన ఖర్చు. దీనికింద విత్తనాలు, ఎరువులు, క్రిమినాశక మందులు, పెట్రోల్ లేదా డీజిల్, కూలీలకు ఇచ్చిన జీతాలు, నీటి ఏర్పాటు కోసం చేసిన ఖర్చు వస్తాయి. రెండవది (ఎ2 ప్లస్ ఎఫ్ ఎల్) వాస్తవ ధర, లెక్కించిన విలువ. ఇందులో రైతు శరీర కష్టం, రైతు కుటుంబ కష్టం లెక్క కడతారు. ఇక మూడవది సి2. దీనికింద రెండవదానితో పాటుగా రైతు చెల్లించే సొంత భూమి శిస్తులు, కౌలు భూమి ఐతే దాని అద్దె, స్థిర ఆస్తుల లెక్క కట్టడం, వడ్డీ లెక్కలు పరిగణనలోకి వస్తాయి.

ఇలా లెక్క కట్టడాన్ని ఓ ఉదాహరణలో చూడాలి అంటే ఈ ఏడు గోధుమల కనీస మద్దతు ధర క్వింటాల్‌కి రు. 1975గా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం దృష్టిలో క్వింటాల్ గోధుమ పండించడానికి రైతుకయ్యే ఖర్చు (ఎ2 ప్లస్ ఎఫ్ ఎల్) రు. 960. అంటే రైతు ఖర్చు పోను రైతుకి రు. 1015 ఆదాయం సమకూర్చుతున్నామని ప్రభుత్వం భావిస్తున్నది. 1970 –71లో గోధుమ క్వింటాల్ రు. 76 ఉండగా ప్రస్తుతం రు. 1975. 1970 –71లో వరి ధాన్యం క్వింటాల్ 1970–71లో రు. 51 ఉండగా, 2020–21 లో రు. 1868. అయితే, దేశంలో రైతులు 118.43 మిలియన్ టన్నుల వరి ధాన్యం పండించగా, ప్రభుత్వం కొన్నది దానిలో కేవలం 43 శాతం మాత్రమే. గోధుమలను తీసుకుంటే 107.39 మిలియన్ టన్నులు పండగా ప్రభుత్వం కొన్నది కేవలం 36.24 శాతం మాత్రమే. ఇక పత్తి తీసుకుంటే 354.50 లక్షల బేళ్లు పండిస్తే ప్రభుత్వం కొన్నది కేవలం 29.51 శాతం మాత్రమే.

ప్రభుత్వం 23 వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇస్తామని ప్రకటించినప్పటికీ కొనుగోళ్లు ఐదు పంటలకు మించడం లేదు. 70 శాతం నుంచి 80 శాతం కనీస మద్దతు ధర అందే పంటలు కేవలం గోధుమ, వరి, జొన్న మాత్రమే. దీని వలన పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతున్నది అనేది కూడా స్పష్టం. పంటల్లో వైవిధ్యం లేక భూమి చచ్చుబడుతుంది. ఇంత లోపభూయిష్టం అయిన కనీస మద్దతు ధర రైతులు అందరికీ కూడ అందడం లేదు.

జాతీయ వ్యవసాయ కమిషన్ ప్రకారం ప్రతి 80 కిలోమీటర్లకి ఒక వ్యవసాయ మార్కెట్ (ఎపిఎంసి) ఉండాలి. కానీ దేశం మొత్తం మీద 436 కి.మీ. దూరంలో ఒక ఎపిఎంసి ఉంది. ఎకరం కన్నా తక్కువ పొలం ఉన్న రైతు అంత దూరం ప్రయాణం చేసి కనీస మద్దతు ధరకి అమ్ముకున్నా కూడా ప్రయోజనం ఉండదు. రవాణా ఖర్చుల వల్ల రైతుకి అందేది శూన్యం.

శాంతా కుమార్ కమిటీ నివేదిక ప్రకారం దేశ రైతులలో కేవలం 5.8 శాతం రైతులు మాత్రమే కనీస మద్దతు ధరకి తమ పంటను అమ్ముకోగలుగుతున్నారు. కనీస మద్దతు ధర ఎక్కడ విజయాన్ని చవి చూసింది అంటే పంజాబ్, హర్యానాలలో. ఇక్కడ ప్రతి 118 కి.మీ. దూరంలో ఒక వ్యవసాయ మార్కెట్ ఉంది. ఇక్కడి రైతులకి ఎంఎస్‌పి ప్రయోజనం అందుతున్నది. బీహార్ నుంచి బియ్యం, గోధుమలు అక్కడి దళారులు పంజాబ్‌కి తరలించుకు వచ్చి ఎంఎస్‌పికి అమ్మి ప్రయోజనం పొందుతున్నారు. ఈ సంపద సాధ్యం అవుతున్న ఈ రెండు రాష్ట్రాల మీద అంబానీ, అదానీలు అందుకే పడ్డారు. దాన్ని గుర్తించిన రైతులు అందుకే అంబానీ, అదానీలపై పోరాటానికి సిద్ధపడుతున్నారు.

మొత్తం పోరాటంలో ఓ మోస్తరు అధిక భూమి కలిగిన రైతు ప్రయోజనాలు, ఎకరం కన్నా తక్కువ భూమి ఉన్న రైతుల ప్రయోజనాలు భిన్నంగా ఉన్నాయి. ఇది ప్రభుత్వం పసిగట్టింది. అందుకే ప్రధాన మంత్రి నివాసానికి 40 కి.మీ. దూరంలో ఉన్న రైతులతో చర్చలు చేయకుండా, చితికిపోయిన రైతులు ఉన్న మధ్యప్రదేశ్, గుజరాత్ చిన్న రైతులతో మాట్లాడుతూ పంజాబ్ రైతుల పోరాటాన్ని దలాల్ పోరాటం అని పిలుస్తున్నారు.

ప్రధాని చెబుతున్న దలాల్ వ్యవస్థ నిజం ఏమిటో చూద్దాం. పంజాబ్ వ్యవసాయ యూనివర్సిటీ అధ్యాపకులు సుఖపాల్ సింగ్ 2014లో చేసిన అధ్యయనం ప్రకారం, హెచ్చు భూమి కలిగిన ధనిక రైతులు తక్కువ భూమి కలిగిన రైతులతో నాలుగు రకాల సంబంధాలు నెరపుతున్నారు. మొదటిది భూమిని కౌలుకి ఇవ్వడం. రెండవది పంట వేయడానికి చిన్న రైతుకి వడ్డీకి పెట్టుబడి సమకూర్చడం. ఆ డబ్బు కూడ వారు తమ జేబు నుంచి ఇవ్వరు. ప్రభుత్వ రుణం వారికి సులువుగా అందుతుంది. తక్కువ వడ్డీకి అది తీసుకుని అధిక వడ్డీకి చిన్న రైతులకి అప్పులు ఇస్తారు. మూడవది తమ దుకాణాల ద్వారా విత్తనాలు, ఎరువులు, అద్దెకు వ్యవసాయ పనిముట్లు సమకూర్చడం. నాల్గవది కనీస మద్దతు ధరకన్నా తక్కువ ధరకు చిన్నరైతుల నుంచి పంట కొని వ్యవసాయ మార్కెట్‌కు పంట తరలించి కనీస మద్దతు ధరకి అమ్ముకోవడం. ఈ పనిని మోడీ దలాల్ పని అని పిలిచి, దీనికి వ్యతిరేకంగా చిన్న రైతులను రెచ్చగొట్ట డానికి ప్రయత్నిస్తున్నాడు. ఇలా చిన్న రైతులకు మేలుగా కనిపించే పని మోడీ ఎందుకు చేస్తున్నారంటే, ధనిక రైతుల జేబుల్లోకి పోతున్న సంపదను అడ్డుకుని, అంబానీ అదానీల గల్లాపెట్టెకు మళ్లించడమే మోడీ లక్ష్యం.

మోడీ కుటిల యత్నానికి చిన్న రైతుల నుంచి సానుకూలత వస్తున్నట్టే కనబడుతున్నది. ప్రభుత్వం చిన్న రైతులతో ప్రత్యేక సమావేశాలు అనే మాట తెరపైకి తెచ్చింది. తద్వారా కార్పొరేట్ కంపెనీలకి అనుకూలంగా చిన్న రైతుల నుంచి మద్దతు కూడగట్టే పని మోడీ సర్కార్ చేస్తున్నది. ధనిక రైతులు నేరుగా భూమిలో పనిచేసే వారు కాదు, చిన్న రైతులతో పని చేయించుకునే వారు. వారు మిగులు వలన ఆస్తి పెంచుకుంటున్న రైతులు. ఈ విషయం ధర్నా స్థలంలో కూడ కనిపిస్తున్న మాట వాస్తవం. అంటే కార్పొరేట్ కంపెనీలకి మద్దతు కూడగట్టడానికి ప్రభుత్వం చిన్న రైతు ఒక చేయిని లాగుతూ ఉంటే, తనకు మద్దతుగా నిలబడమని చిన్నరైతు మరో చేయి పట్టుకుని ధనికరైతు లాగుతున్నాడు.

అంబానీ, అదానీల సంపద ఫోర్బ్స్ పత్రిక ఎలాగూ చెబుతుంది. కనుక దాన్ని వదిలేసి దళారులుగా అవతారం ఎత్తిన ధనిక రైతుల సంపద ఎంతో చూద్దాం. 2019 ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒక్క పంజాబ్ లో 28000 మంది దళారులు ఉన్నారు. వీరి ఎంఎస్‌పి ఆర్జిత సంపద, అంటే 2.5 శాతం కమిషన్ ద్వారా సంపాదించినది, సంవత్సరానికి రు. 2000 కోట్లు. అంటే సగటున ఒక్కో దళారీ సంపాదన రు. 71.42 లక్షలు.

ఈ సమయంలో మన ప్రజల మద్దతు ఎలా ఉండాలి, ఎవరికి ఉండాలి అనేది చాలా కీలకం. ఈ పరిస్థితి మొత్తంలో మనకి స్పష్టంగా అర్థం అవుతున్నది వ్యవసాయం చేయాలి అంటే ముందు రైతుకి పెట్టుబడి కావాలి. అది రైతుకి ప్రభుత్వం ఇవ్వాలి. ప్రభుత్వం ఇస్తున్నా అని చెబుతున్నది కాని దానిలో డొల్లతనం చూడాలంటే కార్పొరేట్ కంపెనీలకి అందే రుణంతో రైతులకి అందే రుణం పోల్చి చూడాలి. అంతే కాకుండా రైతులకి ఇస్తున్న రుణాల్లో ఉన్న లుకలుకలు కూడా చూడాలి. మన రైతులలో 60 శాతం కన్నా ఎక్కువ మంది రైతులకి ప్రభుత్వ రుణాలు అందే పరిస్థితి లేదని, 8 శాతం ధనిక రైతులకి ప్రభుత్వ రుణాలు పెద్దస్థాయిలో అందుతున్నాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. దీన్ని మరోలా చెప్పాలంటే ప్రభుత్వం రైతులకి వంద రూపాయలు రుణాలు ఇస్తే, అందులో 28 రూపాయలు మాత్రమే చిన్న రైతులకి అందే పరిస్థితి వుంది. 72 రూపాయలు ధనిక రైతులకే అందుతున్నాయి.

ఈ పరిస్థితిలో రైతు అంటే అన్నదాత అనే భావోద్వేగంలోకి పోయి కనీస మద్దతు ధర అడుగుతున్న ప్రస్తుత రైతు ఉద్యమం దగ్గర ఆగిపోవడం కాకుండా, ఆ ఉద్యమం ప్రదర్శిస్తున్న క్రియాశీల ప్రభుత్వ వ్యతిరేక, కార్పొరేట్ వ్యతిరేక వైఖరిని సమర్థిస్తూనే, అది ఇంకా విస్తరించవలసి ఉన్నదనీ, మరెన్నో రైతాంగ డిమాండ్లను, మరెన్నో రైతు సమూహాలను ఆ ఉద్యమంలో కలుపుకోవలసి ఉందనీ సూచించవలసి ఉంది. ఇది ప్రధానంగా "పెద్ద ఆస్తి చిన్న ఆస్తిని కబళించే పోరాటం" అని గమనించి. అసలు ఆస్తి అనేదే మనిషిని కబళించే అనకొండా అనే మౌలిక అవగాహన వంట పట్టించుకోవలసి ఉంది. ఆకలి తీర్చే ప్రాథమిక అవసరమైన ఆహారానికి డిమాండ్-సప్లై మార్కెట్ సూత్రం ఎలా వర్తిస్తుంది, ఎందుకు గోదాముల్లో తిండిగింజలు మురుగుతున్నా వ్యవసాయ కార్మికురాలు, కూలి పనిచేసే తల్లి బిడ్డ అయిన 11 ఏళ్ల జార్ఖండ్ బాలిక సంతోషి అన్నం...అన్నం..అన్నం... కావాలి అని అడుగుతూ ఆకలికి ఎందుకు చనిపోయింది అని అడగవలసి ఉంది. అన్నం పండించే వాళ్లు ఎవరు అనే మూల ప్రశ్నను ఈ రైతు ఉద్యమం మన ముందు స్పష్టంగా పెట్టింది. ఈ నగ్నసత్యం గుర్తిస్తే మన పోరాటం విస్తృతం చేయగలుగుతాం. అప్పుడే రైతు రూపంలో ఉన్న శ్రామికులకు ఉపయోగపడతాం. అన్నానికి డిమాండ్-సప్లై మార్కెట్ నియమం ఎందుకు అని రాజ్యాన్ని నిలదీయగలుగుతాం.

(రచయిత ఢిల్లీలో ఫ్రీలాన్స్ జర్నలిస్టు) వీ

రైతుల నినాదం - 'పోరాడుదాం, గెలుపు మనదే'

ఢిల్లీ ముట్టడి రైతు ఆందోళన ప్రారంభించిన ట్రాలీ టైమ్స్ పత్రిక మొదటి సంచికలో ఉద్యమం గురించి ఉత్తేజకరమైన వివరణ ఇస్తున్నారు **సుఖదర్శన్ నట్**

పంజాబ్‌లో సుదీర్ఘకాలం పోరాటం సలిపిన తర్వాత, మోడీ ప్రభుత్వపు మొండి వైఖరిని ప్రతిఘటించడానికి, మేం 26-27 నవంబర్ ఛలో ఢిల్లీ అనే పిలుపు ఇచ్చాం. మా ఈ కార్యాచరణ నినాదం ఉట్టి బెదిరింపు మాత్రమేనని మోడీ ప్రభుత్వం అనుకుంది. రైతుల సమస్యల పట్ల ఎటువంటి కనికరం లేని మోడీ మా ఛలో ఢిల్లీని అడ్డుకొమ్మని తన పార్టీకి చెందిన హర్యానా ముఖ్యమంత్రి ఖట్టర్‌ను ఆదేశించాడు. మేం పంజాబ్ - హర్యానా సరిహద్దుకు చేరి అక్కడ ఒక నెలో, రెండు నెలలో ఉండి, అలసిపోయి వెనక్కి మళ్లి ఇళ్లకు వెళ్లిపోతామని మోడీ అనుకున్నాడు. కాని వ్యవసాయ యంత్రాల మీద నైపుణ్యం సాధించిన ఉత్సాహవంతులైన మా యువతరం మోడీ - ఖట్టర్‌ల ప్రణాళికలను భగ్నం చేసేసింది. మా హర్యానా యువ సోదరులు ఈ పనిలో ముందు పీటాన ఉన్నారు. వాళ్లు నవంబర్ 25న అంబాలా, కర్నాల్, పానిపట్‌లలో పోలీసులు కల్పించిన బలమైన అడ్డంకులను అతి స్వల్ప కాలంలో ఛేదించి, ముర్తాల్ రహదారి మీద ముందుకుసాగి ఢిల్లీ తలుపు తట్టారు. దానితో ప్రేరణ పొందిన పంజాబ్ రైతు సంఘాల కార్యకర్తలు, యువకులు షంబు, ఖనౌరి, పెహోవా, రటియా, వగైరా అనేక చోట్ల చెక్ పాయింట్లను పడగొడుతూ ముందుకు సాగారు. ఈ దారిలో వారి మీద బాష్పవాయు ప్రయోగాలు జరిగాయి. గడ్డకట్టుకుపోయే చలిలో చన్నీళ్ల వాటర్ కానన్ ప్రయోగాలు జరిగాయి. టన్నుల కొద్దీ బరువున్న కాంక్రీట్ దిమ్మలను, బారికేడ్లను, కత్తులంత పదునుగా ఉన్న ముళ్ల కంచెలను వారి దారికి అడ్డుగా పెట్టారు. దారికి అడ్డుగా చెత్తకుప్పల గుట్టలు తయారు చేశారు. రహదారి మీద కందకాలు తవ్వారు. కాని రైతులు ఈ అవరోధాలన్నిటినీ అధిగమించి ముందుకే కదిలారు. రహదారులకు అడ్డుగా నిలిపిన ట్రక్కులనూ, షిప్పింగ్ కంటెయినర్లనూ దాటి ముందుకు సాగారు. చివరికి తమ హర్యానా సోదరులతో భుజం భుజం కలిపి నడిచి ఢిల్లీ సరిహద్దులకు చేరారు.

డజన్ల కొద్దీ పంజాబ్, హర్యానా రైతు సంఘాల జెండాలతో, బానర్లతో అలంకరించుకున్న అనంతమైన ట్రాక్టర్ల బిడారు, వాటి వెనుక సైనిక టాంకుల్లా కనిపించే టార్పాలిన్ కప్పిన ట్రాలీలు. ట్రాక్టర్ల మీద అమర్చిన లౌడ్ స్పీకర్ల నుంచి ప్రతిధ్వనిస్తున్న ప్రజలను ఉత్తేజపరిచే ఉద్యమ సందేశం నిండిన పాటల వెల్లువ. ఆహారంతో సహా నిత్యావసరాలన్నిటినీ నింపుకున్న ట్రాలీలు. ఈ మహా బిడారు ఢిల్లీని జయించడానికి తరలి వచ్చిన మహా శక్తిమంతమైన, ప్రణాళికాబద్ధమైన, సుశిక్షితమైన, క్రమశిక్షణాయుతమైన సైనిక దండయాత్రలా సాగింది.

పంజాబ్ - ఢిల్లీ ప్రధాన రహదారుల మీద ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలలో డజన్ల కొద్దీ మరణాలు సంభవిస్తాయి. కాని మా యువకులు తమ ట్రాక్టర్లను ఎంత క్రమశిక్షణతో, నైపుణ్యంతో నడిపారంటే, ఒక్కటంటే ఒక్క రోడ్డు ప్రమాదం కూడ జరగలేదు. అంటే తాము పొలాల్లో పాటలు పాడుతూ వ్యవసాయ యంత్రాలను ఉపయోగించడంలో మాత్రమే కాదు, ప్రభుత్వ వ్యతిరేక పోరాటంలో ప్రధాన రహదారుల మీద కూడ యంత్రాలనూ వాహనాలనూ అంతే నైపుణ్యంతో, సౌలభ్యంతో నడపగలమని రుజువు చేశారు. నవంబర్ 26-27ల్లో జరిగిన సాధారణ విప్లవ కార్యక్రమం అంతటిలోనూ ఒకే ఒక్క రైతు యోధుడు, మాన్సా జిల్లా, ఖిహలి చెలాన్ గ్రామానికి చెందిన ధన్నా సింగ్ మాత్రమే మరణించాడు. ఆ మరణం కూడ నిరసనకారుల వాహనాల వల్ల జరగలేదు, రహదారి మీద వాణిజ్య వాహనపు డ్రైవర్ పొరపాటు వల్ల జరిగింది.

నవంబర్ 26 నుంచి ఢిల్లీని పంజాబ్-హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్ము-కశ్మీర్‌లతో కలిపే ప్రధాన రహదారులు, కర్నాల్ ద్వారా వెళ్లేదీ, రోహ్టక్ ద్వారా వెళ్లేవీ కూడ మూసివేయబడ్డాయి. నాలుగైదు రోజుల తర్వాత ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రైతులు ఢిల్లీకి తూర్పు దిశన ఉన్న మరొక రెండు ప్రధాన రహదారులను మూసేశారు. ఇప్పుడు ప్రణాళిక ఏమంటే, డిసెంబర్ 14కల్లా పశ్చిమ దిశన జైపూర్ వైపు, దక్షిణ దిశన ఆగ్రా వైపు ఉన్న ప్రధాన రహదారులను కూడ దిగ్బంధించి, మోడీ ప్రభుత్వానికి ఊపిరి సలపకుండా చేయడం. ఒకవైపు ప్రచార సాధనాల ద్వారా అబద్ధ ప్రచారం కొనసాగిస్తూ, ఎంత ఒత్తిడి వచ్చినా బండరాతిలా కదలిక లేకుండా ఉన్న మోడీ ప్రభుత్వం మా రైతు ప్రతినిధుల ప్రధాన డిమాండ్లను వినడానికి నిరాకరిస్తున్నది. చర్చల ప్రక్రియ వైఫల్యాన్ని తన తప్పుడు ప్రచారానికి సాధనంగా వాడుకుంటూ, లాంఛనప్రాయమైన చర్చలకు రమ్మని రైతు ఆందోళనకారులకు మళ్లీ మళ్లీ ఆహ్వానాలు పంపుతున్నది.

ఈ ముట్టడిలో పాల్గొంటున్న యువకులు, పెద్దలు, పురుషులు, స్త్రీలు, చిన్నారి పిల్లలు అందరూ కూడ ఓపికగా, శాంతియుతంగా ఒకే ఒక్క కార్యక్రమానికి కట్టుబడి ఉన్నారు. అది 'ఘేరా డాలో, డేరా డాలో' (ఢిల్లీని దిగ్బంధిద్దాం, గుడారాలు వేసుకుందాం) సత్యాగ్రహం. హర్యానా, పంజాబ్, ఢిల్లీ, తదితర రాష్ట్రాలకు చెందిన రైతులు, మార్కెట్ మధ్యవర్తులు, దుకాణదారులు, వ్యాపారులు, సామాజిక, ధార్మిక సంస్థలు, సాధారణ ప్రజానీకం మా రైతు ఆందోళనకారులకు నమ్మశక్యం కాని, అంతులేని సహాయ సహకారాలు అందిస్తున్నారు. నిజాయితీ కలిగిన, పక్షపాతం లేని జాతీయ, అంతర్జాతీయ, పంజాబీ ప్రచార సాధనాలు నిరసన కార్యక్రమం గురించి ప్రేరణాత్మకమైన, కచ్చితమైన వాస్తవిక సమాచారాన్ని, ఫొటోలను యావత్ ప్రపంచానికీ అందజేస్తు న్నాయి. ఈ న్యాయబద్ధమైన, శాంతియుతమైన రైతు నిరసన ఒక్క మన దేశంలోనే కాక, సమస్త ప్రపంచంలోని ఎన్నో దేశాల ప్రజల మద్దతునూ, ప్రభుత్వాల మద్దతునూ కూడ పొందుతున్నది. మోడీ ప్రభుత్వం మీద

తెలంగాణ రైతు మాట

ఘనపురం (స్టే) మండలం అక్కపల్లి గూడెంలో రైతు యార కొమురయ్య

- (సేకరణ : అవినాశ్ భారత)

గత 12 రోజులుగా జరుగుతున్న రైతు శాంతియుత పోరాటాలకు ఎల్లెడల మద్దతు వస్తున్నది ఇది మంచి పరిణామం. ఎందుకంటే రాజ్యాంగ వ్యవస్థలన్నీ కుప్పకూలిన ఈ స్థితులలో కార్మిక, కర్షక పోరాటాలు ఒకే సారి జరగడం మంచిదే అయితే ఈ పోరాటాల పట్ల ప్రభుత్వాలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్న తీరు నుండి అర్థం చేసుకోవలసి ఉన్నది.

ఇక ఇప్పటి సందర్భానికి వస్తే రైతు ఉద్యమాలు మన దేశంలో చాలానే జరిగాయి. అది గాంధీ కాలం నుండి ఇప్పటి మోడీ కాలం దాకా అయితే అప్పుడు ఇంత విచ్చలవిడి తనం లేదు. తీన్ కథియా విధానానికి వ్యతిరేకంగా గాంధీ చేపట్టిన ఉద్యమానికి అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం అయిన కొంత సానుకూల దోరనితో వ్యవహరించిందేమో కానీ ఇప్పటి ప్రభుత్వం మాత్రం కలిస్తాన్ మిలిటెంట్‌లు అని రైతులపై లేని పోనీ ముద్ర వేస్తున్నది. ఇంతకీ వాళ్లు చేసిన తప్పేమిటి కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించమని అడగడమేనా, అయితే అది ఖచ్చితంగా ఆమోదయోగ్యమే. ఆరుగాలం కష్టించిన రైతన్నకు కనీస ఆదాయానికి చట్టం పూచి పడకపోతే ఎం లాభం. ఎందుకంటే రైతు ఏమి కోట్లు కొల్లగొట్టడం లేదు. తాను పండించిన పంటకు ధరను నిర్ణయించమని బరిగీసి అడుగుతున్నాడు.

స్వామినాథన్ కమిటీ సిఫారసులలో అతి ముఖ్యమైన సిఫారసు పెట్టిన పెట్టుబడి 50 శాతం పెంచి ఇవ్వమని చెప్పినాడు. అందులో కుటుంబ కష్టాన్ని కూడా లెక్కలోకి తీసుకొమ్మన్నాడు ఇంతకంటే మంచి సిఫారసు ఏమైనా ఉందా? ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఆ సిఫారసును అమలు చేయకుండా ఎందుకు కాలయాపన మళ్లీ ఇప్పుడు కమిటీల పేరుతో ఎందుకు కాలయాపన చేస్తున్నారు. కమిటీలు ఏర్పాటు చేయడమే కానీ సిఫారసుల అమలుపై శ్రద్ధ ఏది?

దీనికంతటికి ప్రధాన కారణం మన దేశాన్ని ప్రపంచ పెట్టుబడికి కేంద్రంగా మార్చడమే లేక కార్పొరేటీకరణ చేయడమే అది 1970 నుండి మొదలు అయ్యి 1990 నాటికి వేగం పుంజుకుని 2020 నాటికి హైస్పీడ్ రైల్ లా దుసుకుపోతున్నది. సరే వ్యవసాయ సంస్కరణ మంచిదే అనుకుందాం కాసేపు, మరి ఈ చట్టాల పైన ఎంతమంది రైతులకు అవగాహన కార్యక్రమాలు జరిగాయి? వీటి వల్ల కలిగే లాభ నష్టాలు ఎంతవరకు అనేది రైతుకు ఏమైనా వివరించారా అనే ప్రశ్నకు ప్రభుత్వం దగ్గర జవాబు లేదు. కొందరు సంస్కరణ అభిలాషులు చెప్పేదేమిటంటే ఎప్పుడు వరి, గోధుమేన ఇంకో పంట వద్దా అని మరి వేరే పంట వేయడానికి రైతుల సన్నద్ధత ఎంత అనేది తెలుసుకున్నారా? ఇప్పటికే 3 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాలు (రెండూ) అమలు చేసిన, చేస్తున్న చట్టాల మూలంగా చనిపోయారు. దేశంలో ప్రతి ఏడాది జరుగుతున్న ఆత్మహత్యలలో ఇది 11 శాతంకి సమానం అని గుర్తించారా?

ఇప్పుడు ప్రవేశపెట్టిన బిల్స్‌లో ఎక్కడైనా అమ్ముకోండి కనీస మద్దతు ధర ఇస్తాం అని ఎక్కడైనా ఉన్నదా. మోడీ ఏమో ఎక్కడైనా అమ్ముకోమంటారు, మరోవైపు శివరాజు సింగ్ చౌహాన్ ఏమో మా రాష్ట్ర సరిహద్దుల్లోకి రానివ్వం అని భీష్మిస్తారు. ఏమిటి దీని అర్థం?

ఈ నామ్ వ్యవస్థతో ఏమి అయిందో చూశాము. ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థ వల్ల ఫలితం శూన్యం. మనదేశంలో 86 శాతం మంది చిన్న కమతాలు ఉన్న రైతులు. వారు తమకు నమ్మకం అయిన వ్యాపారుల దగ్గర ఎరువులు, పురుగుల మందులు ఉద్దెరకు తెచ్చి తమకు పంట పండిన తరువాత ఆ పంటను అమ్మడం ద్వారా అప్పు తీరుస్తారని ఈ ప్రభుత్వానికి తెలియదా ? ఇలాంటి రైతులను వేరే రాష్ట్రాలలో అమ్ముకోవచ్చు, ఎంత కాలం అయిన నిలువ ఉంచుకోవచ్చు, అని ఎట్లా మభ్యపెడుతారు. కార్పొరేట్‌లు ఒకసారి పంటల కొనుగోలు లోకి వస్తే రైతు రైతు కూలీగా మారడం తప్ప ఏమీ ఉండదు. రైతు తన స్వతంత్రాన్ని కోల్పోతాడు అని గుర్తులేదా? అసలుదారును వదిలిపెట్టి వినియోగదారుని కోణంలోనే చట్టాలు చేయడం మూలంగా వచ్చిన చిక్కు ఇది. వీ

ఉపసంహరించుకోక తప్పని ఒత్తిడి పెరుగుతున్నది. కాని దానికి ఉన్న కార్పొరేట్ మిలాఖత్తుల వల్ల, ఫాసిస్టు భావజాలం వల్ల అది ఆ మూడు వ్యవసాయ చట్టాలనూ ఉపసంహరించుకోవడానికి సిద్ధపడడం లేదు.

అందుకు బదులుగా, మోడీ ప్రభుత్వం ఉద్యమం మీద దుష్ప్రచారం చేయడానికీ, చీలికలు తేవడానికీ తన తొత్తుల ద్వారా నీచమైన ప్రయత్నాలు చేస్తున్నది. ఈ నిరసన ఆందోళన హింసాయుతమైనదని చూపి, దాడి చేయడానికి కారణం దొరికించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. తమ మనుషులను నిరసనలోకి ప్రవేశపెట్టి వారి ద్వారా రెచ్చగొట్టే చర్యలు చేయిస్తున్నారు. రైతుల మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. అలా నిరసనకారుల మీద అమానుషమైన దాడి చేయడానికి కారణం వెతుకుతున్నారు. రైతు సోదరులారా, ఐక్యంగా ఉండండి. ఎటువంటి కవ్వింపు చర్యలకు స్పందించకండి. జాగ్రత్తగా ఉండండి. స్థానిక ప్రజలతో ప్రేమ, సహకార భావనలతో కలిసి మెలిసి ఉండండి. తుంటరి పనులు చేసేవారితో, ఇబ్బందులు తెచ్చిపెట్టేవారితో, పనికిరాని ప్రగల్భాలు పలికేవారితో, దువ్వడానికి, రెచ్చగొట్టడానికి ప్రయత్నించేవారితో, మనను చీలదీయడానికి ప్రయత్నించే నినాదాలతో, ఉపన్యాసాలతో జాగ్రత్తగా ఉండండి. మోడీ ప్రభుత్వాన్ని అలా ఉంచండి, అతి నిరంకుశమైన బ్రిటిష్ ప్రభుత్వమే మన ఐక్య, క్రమశిక్షణాయుత, శాంతియుత నిరసనను అడ్డుకోలేకపోయిందని మరిచిపోకండి.

ఇప్పటికి కూడ మోడీ ప్రభుత్వం మన శాంతినీ, ఓపికనూ, క్రమశిక్షణనూ పరీక్షిస్తున్నది. అందువల్ల మనం మన ఓరిమి ద్వారానే, జాగరూకత ద్వారానే ఆ కవ్వింపులకూ, చీలిక ప్రయత్నాలకూ ముగింపు పలుకుదాం. "పోరాడుదాం, గెలుపు మనదే" అనే మహత్తర నినాదానికి ఎల్లవేళలా నిబద్ధులై ఉండండి.

(రచయిత పంజాబ్ కిసాన్ యూనియన్ నాయకులు)

(తెలుగు: ఎన్ వేణుగోపాల్) వీ

వ్యవసాయం కార్పొరేటీకరణ - ద్రవ్య పెట్టుబడి

అభివృద్ధి పేరుతో పాలకులు రైతాంగం నుంచి భూములను లాక్కొని, వారిని నిర్వాసితుల్ని చేసి, కూలీలుగా మార్చుకునే అవకాశాన్ని కార్పొరేట్ శక్తులకు కల్పిస్తున్నారని అంటున్నారు **కొండూరి వీరయ్య**

పెట్టుబడి కేంద్రీకరణ తాజా దశ ద్రవ్య పెట్టుబడి దశగా నిర్వచిస్తున్నాము. ఈ ద్రవ్య పెట్టుబడి లెనిన్ 20వ శతాబ్దం ఆరంభంలో నిర్వచించినట్లు పారిశ్రామిక పెట్టుబడి, బ్యాంకింగ్ పెట్టుబడి విలీనం కావటం ద్వారా తయారైన ద్రవ్య పెట్టుబడి కాదు. నేడు మనం చూస్తున్న ద్రవ్య పెట్టుబడి పూర్తిగా భిన్నమైనది. నగదు చలామణి సరుకుల చలామణికి కావల్సిన కవాటాలు తెరిచి ఈ ద్వంద్వ చలామణిని నిర్దేశించి నియంత్రించడం ద్వారా రూపొందుతున్న ద్రవ్య పెట్టుబడి. నగదు-సరుకు-మరింత నగదు అన్న వలయం కాస్తా ప్రపంచీకృత ద్రవ్య పెట్టుబడి దశలో ఉత్పత్తితో సంబంధం లేని నగదు-మరింత నగదు వలయంగా మారి ప్రపంచాన్ని చుట్టి ఆక్రమిస్తోంది.

విధ్వంసం, కోట్లాది మందిని వారి జీవనోపాధి సాధనాల నుండి పెకలించి వేయటం పెట్టుబడిదారీ అభివృద్ధి మంత్రంలో అంతర్భాగమే. సంపన్న దేశాల్లో పెట్టుబడి సంచయం క్రమాన్ని సజీవంగా సజావుగా కొనసాగించుకోవడానికి వలసవాదం మొదలు సాంకేతిక అభివృద్ధి రూపంలో ఆధునిక వలసవాదం వరకూ పెట్టుబడిదారీ విధానం వేయని ఎత్తు లేదు. చేయని దాష్టీకం లేదు. ఆక్రమించని దేశం లేదు. వలస పాలన నాటి భారత దేశపు అనుభవాలే దీనికి ఉదాహరణ. తాజాగా కేంద్ర ప్రభుత్వం అటువంటి ఆధునిక కార్పొరేట్ వలసాధిపత్యానికి ఎర్రతివాచీ పరుస్తూ వ్యవసాయక చట్టాలు ఆమోదించింది. ఈ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం ఉద్యమిస్తోంది. అడ్డగోలు మోసానికి బరితెగించినా కోర్టు బోనెక్కాల్సిన పని లేదని ఈ ద్రవ్య పెట్టుబడిదారులకు మోడీ ప్రభుత్వం భరోసా ఇవ్వటమే కాక సదరు భరోసాకు చట్టబద్ధమైన గ్యారంటీ కూడా ఇచ్చింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన గ్యారంటీ ఇవ్వమంటున్న రైతాంగం గోడు చెవికెక్కించుకోలేనంతగా కేంద్ర ప్రభుత్వం చెవిటిదనం నటిస్తోంది. ఈ నేపథ్యంలో ద్రవ్య పెట్టుబడి వ్యవసాయ రంగంపై అందులోనూ వర్ధమాన దేశాల వ్యవసాయ రంగాన్ని కబ్జా చేసేందుకు ఎందుకు సిద్ధమవుతోందో తెలుసుకునేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసం.

ఉధృతమవుతున్న ప్రపంచీకరణ విధానాలు ఏ కొద్దిమందినో కోటీశ్వరులను చేస్తున్నా విశాల ప్రజానీకం నుండి జీవనోపాధి సాధనాలను ఊడబెరుకుతోంది. చిన్న చేపను పెద్ద చేప తింటుందన్న అటవీ న్యాయం (దీన్ని కూడా సామాజిక ఒడంబడిక సిద్ధాంతమనే అంటాడు థామస్ హాబ్స్) బాహాటంగా అంతర్జాతీయ వాణిజ్య విధానంగా అమలు జరుగుతోంది. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారీ వ్యవస్థలో తలెత్తే చక్రీయ సంక్షోభాల గురించి జరుగుతున్న పరిశోధనలు ఈ విధానాల భారానికి కుంగిపోయి సంక్షుభితమవుతున్న వ్యవసాయరంగం గురించి జరక్కపోవడం ఆశ్చర్యకరం. ప్రపంచ పెట్టుబడిదారీ చరిత్రలో చెప్పుకోదగ్గ స్థాయిలో పెట్టుబడిదారీ వ్యవస్థను కుదిపేసిన ప్రతి సంక్షోభానికీ ముందు వ్యవసాయ సంక్షోభం చోటుచేసుకుందన్న వాస్తవాన్ని తరచూ విస్మరిస్తుంటాము. మనందరమూ రెండు ప్రపంచ యుద్ధాల నడుమ పెట్టుబడిదారీ వ్యవస్థను కుదిపేసిన సంక్షోభం మహామాంద్యం గురించి మాత్రమే చర్చించుకుంటాము. అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యవసాయోత్పత్తుల పతనం 1924 నుండే మొదలైందన్న వాస్తవానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వము. మొదటి ప్రపంచ యుద్ధంలో శిధిలమై చితికిపోయిన యూరోపియన్ దేశాల అవసరాలు తీర్చటానికి భారతదేశం వంటి దేశాల్లో వ్యవసాయోత్పత్తి పెంచడానికి చర్యలు తీసుకున్నాయి వలస దేశాలు. యుద్ధ శిథిలాల నుండి యూరోపియన్ సామ్రాజ్యవాద దేశాలు కోలుకోవటం, ఆయా దేశాల్లో వ్యవసాయ రంగం పట్టాలెక్కడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యవసాయోత్పత్తులు కుప్పలు పడ్డాయి. దాంతో వ్యవసాయోత్పత్తులపై ఆధారపడ్డ దేశాలు విదేశీ వాణిజ్యం ద్వారా సంపాదించే ఆదాయం గణనీయంగా పడిపోయింది. ఈ కాలంలోనే బోస్టన్ టీ పార్టీ పేరుతో అమెరికాలో బోస్టన్ రేవుపట్టణంలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న టీ పొడిని సముద్రంలో పారపోసిన సంఘటన ప్రపంచ వాణిజ్య చరిత్రలో రికార్డులకెక్కింది.

ఈ అనుభవాల నుండి పాలకవర్గాలు పాఠాలు నేర్చుకోలేదు. 1980 దశకంలో అనేక వర్ధమాన దేశాలు తొలిసారి ఐఎంఎఫ్ నిర్దేశిత ఆర్థిక సంస్కరణలు అమలు జరపడం ప్రారంభించిన వెంటనే ఆయా దేశాల్లో వ్యవసాయోత్పత్తుల ధరలు గణనీయంగా పడిపోయాయి. దాంతో 1970 దశకంలో సంస్కరణలు ప్రారంభించిన చిలీ, అర్జెంటీనా, బ్రెజిల్, భారత్ వంటి దేశాలు నేటి వరకూ ఈ సంక్షోభం వడగ నీడను తప్పించుకోలేక పోతున్నాయి. అవే సంస్కరణలను దశల వారీగా దఫదఫాలుగా వేర్వేరు మోతాదుల్లో అమలు చేస్తూనే వచ్చాయి. నేడు భారతదేశంలో వ్యవసాయక చట్టాలను సమర్థించే వాళ్లు సైతం ఇదేదో బాగా ఆలస్యమైన సంస్కరణల క్రమం అని, ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం ధైర్యం చేసిందనీ వాదిస్తున్నారు. మరోవైపున పెట్టుబడిదారీ విధానం నిర్నిరోధంగా తన రథచక్రాలను కదిలిస్తూ ఉంటేనే ప్రపంచం అంతిమంగా దోపిడీదారులు, దోపిడీకి గురయ్యే వారు అన్న రెండు శిబిరాలుగా ఏర్పడుతుందని, తద్వారా అనేక దేశాల్లో విప్లవాలు చెలరేగడానికి అవకాశాలు మెండుగా ఉంటాయన్న యాంత్రిక భౌతికవాద సూత్రీకరణలు కూడా వినవస్తున్నాయి. మరో వాదన కూడా వినిపిస్తోంది. జీవనోపాధికి సేద్యం

సాగించే పరిస్థితులు వ్యవసాయంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం వేళ్లూనుకోవటానికి అవరోధంగా మారడంతో పాటు పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధికి కావల్సిన పెట్టుబడి సమీకరణకు అనేక ప్రత్యామ్నాయ మార్గాలు ముందుకు రావటంతో వర్ధమాన దేశాల్లో వ్యవసాయక సమస్య రాజకీయ ప్రాధాన్యత కోల్పోయిందన్నదే ఈ మూడో తరహా వాదన.

ఈ వాదనలు చేసే వాళ్లు దాదాపు దశాబ్దానికి పైగా కొనసాగుతున్న ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభానికీ, నేడు ద్రవ్య పెట్టుబడి మార్గదర్శకత్వంలో వర్ధమాన దేశాల్లో జరుగుతున్న వ్యవసాయ సంస్కరణలకు మధ్య ఉన్న సంబంధాన్ని విస్మరించే ప్రమాదం ఉంది. వర్ధమాన దేశాల రైతాంగం నేడు ద్రవ్య పెట్టుబడిదారీ శక్తుల నుండి పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. పెట్టుబడిదారీ వ్యవస్థ సాధారణ ప్రజల జీవనోపాధిని దెబ్బతీయడం, నిరుద్యోగ రిజర్వు సైన్యాన్ని పెంచుకోవడం, తద్వారా వేతన పెరుగుదలపై నియంత్రణ సాధించడం నిరంతరం జరుగుతూ ఉన్నదే. కానీ నేడు అదనంగా జీవనోపాధి కల్పించే సాధనాలను కూడా కబ్జా చేసేందుకు ద్రవ్య పెట్టుబడి ఉధృతంగా పావులు కదుపుతోంది. వర్ధమాన దేశాల్లో విశాల ప్రజానీకానికి జీవనోపాధి కల్పించే సాధనం భూమి. నేడు ద్రవ్య పెట్టుబడి శక్తులు ఈ భూమిపై కన్నేశాయి. విశాల ప్రజానీకానికి ఉపాధి కల్పిస్తున్న భూమిని కబ్జా చేయడానికి జరుగుతున్న వ్యవసాయరంగం కార్పొరేటీకరణ ప్రయత్నాలు, విద్యావంతులైన మెజారిటీకి ఉపాధి కల్పించే ప్రభుత్వరంగాన్ని (ప్రభుత్వ రంగంలోని పరిశ్రమలు కూడా ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి సాధనాలు సమకూర్చే మౌలిక వ్యవస్థలే) కారుచౌకగా అమ్మే ప్రైవేటీకరణ ప్రయత్నాలు వేర్వేరని భావించరాదు. రెండిటి లక్ష్యం ఒక్కటే. ఉత్పత్తి సాధనాలపై ద్రవ్యపెట్టుబడి ఆధిపత్యం ఖరారు చేయటమే.

సంపన్న దేశాల జీవన ప్రమాణాలు మరింత దిగజారకుండా చూడడం ఆయా దేశాల్లోని పాలకవర్గాల తక్షణ ప్రాధాన్యత కలిగిన రాజకీయ కర్తవ్యం. ఒబామా బెంగుళూరు కాదు బఫెల్లో నగరంలోనే పరిశ్రమలు పెట్టాలని పిలుపునిచ్చినా ట్రంప్ అమెరికా ఫస్ట్ అని నినాదమిచ్చినా లక్ష్యం ఈ ప్రయోజనాన్ని నెరవేర్చుకోవటమే. అయితే సంపన్న దేశాల్లో ప్రజల జీవన ప్రమాణాలు యథాతథ స్థితిలో కొనసాగాలంటే వర్ధమాన దేశాల వ్యవసాయ రంగం సంపన్న దేశాల జీవన ప్రమాణాలు పెంపొందించే పని ముట్టుగా మారాలి. చిన్న చిన్న కమతాల కారణంగా విదేశీ మార్కెట్‌లో పోటీని తట్టుకుని ఎగుమతులు చేయగలిన వ్యవసాయోత్పత్తులు సిద్ధం చేయలేక పోతున్నామని, దాంతో వ్యవసాయోత్పత్తుల అంతర్జాతీయ మార్కెట్‌లో మనలాంటి వర్ధమాన దేశాలు వెనకపట్టు పడుతున్నాయనీ, దీన్ని అధిగమించడానికి వ్యవసాయాన్ని కార్పొరేటీకరించడమే మార్గమని వాదించే వారి మాటల వెనక ఉన్న మర్మమిదే. కార్పొరేట్ వ్యవసాయం అంటే ఇప్పటి వరకు దేశీయంగా ప్రజల కడుపులు నింపిన వ్యవసాయం ఇకపై విదేశీ పెట్టుబడిదారుల లాభార్తి, సంపన్న దేశాల ప్రజల ఆహార అవసరాలు తీర్చేవిగా మార్చటమే. అంతర్జాతీయ వ్యవసాయోత్పత్తుల మార్కెట్‌లో మన దిగుబడులు అమ్మకానికి పెట్టి వచ్చే ఆదాయాన్ని రైతులకు నేరుగా జమ చేయటం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న వ్యవసాయక సంస్కరణల లక్ష్యం కాదు. దేశానికి ఆహారభద్రత కల్పించే లక్ష్యంతో సాగుతున్న వ్యవసాయాన్ని విదేశీ వ్యవసాయోత్పత్తుల మార్కెట్ అవసరాలు తీర్చే పంటలు పండించే పొలాలుగా మార్చటమే లక్ష్యం. రైతు ఎక్కడైనా పంట అమ్ముకోవచ్చన్న మాయా లేడిని చూపించే ప్రయత్నాలు. మాయా లేడి కోసం పరిగెత్తి రాముడంతటి వాడే కట్టుకున్న పెళ్లాన్ని పోగొట్టుకున్న రామాయణం మన కథే.

సమశీతోష్ణ దేశాల్లో పండే వైవిధ్యమైన పంటలే సంపన్న దేశాల ప్రజల జీవన ప్రమాణాలు నిలిపి ఉంచే సాధనాలు అన్న విషయాన్ని సామ్రాజ్యవాద దేశాలు ఏనాడో గుర్తించాయి. అందుకే ఆయా దేశాలకు కావల్సిన ఆహారోత్పత్తులు పండించేందుకు మన పంట పొలాలను ప్రయోగశాలలుగా మార్చడం మొదలు పెట్టాయి. భారతదేశంలో డెల్టా ప్రాంతం తక్కువ తేమతో ఏడాదికి రెండు పంటలు ఆహార ధాన్యాలు, మూడో పంట పప్పు ధాన్యాలు పండించగల ప్రాంతాలు. సంపన్న దేశాల్లో కృత్రిమ వంగడాలతో దిగుబడి పెంచవచ్చే తప్ప వైవిధ్యమైన పంటలు పండించలేరు. భారతదేశం లాంటి సమశీతోష్ణ మండలంలో పండించగల వైవిధ్యభరితమైన పంటలు యూరప్ దేశాలన్నింటినీ కలిపి చూసినా పండించలేవు. అమరావతి రాజధాని కోసం సేకరించిన 30 గ్రామాల్లోనే షుమారు 291 రకాల పంటలు పండించగల వైవిధ్యం మన వ్యవసాయానికి ఉంది. భారతదేశం నుండి రకరకాల రొయ్యలు, మత్స్య సంపద, న్యూజిలాండ్‌లో అమితంగా ఉత్పత్తి అవుతున్న పాలు, బ్రెజిల్‌లో సాగయ్యే పొగాకు వంటి అనేక వ్యవసాయోత్పత్తులు సంపన్న దేశాల్లో జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు ఎగుమతవుతున్న వైనాన్ని మనం చూస్తూనే ఉన్నాము. ఈ ఎగుమతుల ద్వారా ఆయా దేశాల్లోని ధనిక, పెట్టుబడిదారీ రైతాంగం లబ్ధి పొందుతున్న మాట వాస్తవమే. ఈ మాత్రం లబ్ధి కూడా ఆయా దేశాల ప్రాంతీయ పాలకవర్గాలకు దక్కకుండా తామే కాజేయడానికి ఏకంగా పునాదుల్లోనే జొరబడటానికి వీలుగా వివిధ దేశాల వ్యవసాయ రంగంలోకి ద్రవ్య పెట్టుబడి ప్రత్యక్షంగా ప్రవేశించేందుకు అర్రులు చాస్తోంది. నేడు మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయక చట్టాలు ద్రవ్య పెట్టుబడి ప్రవేశానికి ఉన్న అవరోధాలు తొలగించే చర్యలే తప్ప సంక్షోభంలో ఉన్న దేశీయ రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు తెచ్చిన చట్టాలు కావు. ఈ వాస్తవాన్ని మరుగున పెట్టడానికి అటు ప్రభుత్వం ఇటు ద్రవ్యపెట్టుబడి కనుసన్నల్లో నడుస్తున్న మీడియా చేయని ప్రయత్నం లేదు.

ఇప్పటి వరకూ అమెరికా, యూరప్ దేశాలకు చెందిన పారిశ్రామిక రంగంలోని బహుళజాతి కంపెనీలకు భారతదేశం ద్వారాలు తెరిచింది. తాజాగా ప్రతిపాదించిన వ్యవసాయక చట్టాల రూపంలో ఆయా దేశాల్లోని వ్యవసాయక వాణిజ్య రంగంలోని బహుళజాతి కంపెనీలు భారతదేశపు వ్యవసాయ రంగాన్ని ఆక్రమించుకునేందుకు సానుకూల పరిస్థితులు సృష్టించి పెడుతోంది. అమెరికా కంటే భారతదేశంలో వ్యవసాయోత్పత్తికి అనువైన భూమి తక్కువ. అయినా అమెరికాతో పోటీ పడి వ్యవసాయోత్పత్తుల దిగుబడి సాధించగలుగుతున్నాము. ప్రపంచ ఆహార సంస్థ లెక్కల ప్రకారం భారతదేశం వ్యవసాయోత్పత్తుల్లో తొలి పది స్థానాల్లో నిలిచింది. అంతేకాదు. అంతర్జాతీయ వ్యవసాయోత్పత్తుల వాణిజ్యంలో కూడా గణనీయమైన వాటా భారతీయ వ్యవసాయ రంగానికి ఉంది. పారిశ్రామిక సాంకేతిక రంగాల్లో లాభాలను తన గుప్పెట్లో

పెట్టుకోవటంలో విజయవంతమైన సంపన్న దేశాలు నేడు వ్యవసాయ రంగంలోని లాభాలు కూడా తమ గుప్పెట్లో పెట్టుకోవటానికి ప్రయత్నం చేస్తోంది. అలా జరగాలంటే భారతీయ రైతాంగం పండించే పంటలను అంతర్జాతీయ మార్కెట్‌లో కమిషన్ ఏజెంట్‌గా పాత్రను వదిలేసి నేరుగా పంట పండించే రంగంలోకి సంపన్న దేశాల ద్రవ్య పెట్టుబడి ప్రవేశించగలగాలి. మోడీ ప్రభుత్వం ఈ మూడు వ్యవసాయక చట్టాల ద్వారా ద్రవ్య పెట్టుబడికి అటువంటి అవకాశాలు కల్పించేందుకు సమాయత్తమైంది.

వర్ధమాన దేశాల్లో ప్రత్యేకించి భారతదేశంలో వ్యవసాయ రంగంలో ఉత్పాదకత తక్కువగా ఉందని, అందువల్లనే విదేశీ వ్యవసాయ ఉత్పత్తులతో అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీపడలేక పోతున్నామన్న మరో వాదన కూడా తరచూ వినిపిస్తోంది. నిజమే. సంపన్న దేశాల్లో సగటు వ్యవసాయ కార్మికుడి తలసరి ఉత్పాదకత ఎక్కువగానే ఉంటుంది. అంత మాత్రాన ఈ దిగుబడి యావత్తూ వ్యవసాయ కార్మికుడి రెక్కల కష్టం ద్వారానే సాధ్యమవుతుందని నిర్ధారణకు రావడం పొరపాటవుతుంది. ఆయా దేశాల్లో సజీవ శ్రమ చేసే వ్యవసాయ కార్మికుల స్థానంలో మృత శ్రమకు ప్రతిరూపాలైన యంత్రాలు పని చేస్తున్నాయి. ఆ స్థాయిలో వ్యవసాయం యాంత్రికీకరణకు అయ్యే ఖర్చుల వివరాలు వెల్లడించకుండా ఎకరాకు సగటు దిగుబడి సామర్ధ్యం మాత్రమే చర్చకు పెట్టడం వాస్తవాలను మసిబూసి మారేడు కాయ చేయటమే అవుతుంది. సంపన్న దేశాల్లో వ్యవసాయ రంగానికి ఇస్తున్న సబ్సిడీలో ప్రధాన భాగం వ్యవసాయ రంగానికి దక్కేది కాదు. వ్యవసాయ రంగంలో వినియోగించే యంత్రాలు, ఎరువులు, రసాయన పరిశ్రమలకు దక్కేదే. ఈ సబ్సిడీలన్నీ ఆయా దేశాల్లోని పారిశ్రామిక రంగానికి పరోక్షంగా అందుతున్నాయి కాబట్టే ప్రపంచ వాణిజ్య సంస్థ షరతులు కూడా ధిక్కరించి మరీ ఈ సబ్సిడీలు కొనసాగిస్తున్నాయి సంపన్న దేశాలు. అందువల్ల వర్ధమాన దేశాల వ్యవసాయరంగంలో సాధించే ఎకరా సగటు దిగుబడిని సంపన్న దేశాల సగటు ఎకరా దిగుబడితో పోల్చి చర్చించేముందు సంపన్న దేశాల్లో సగటు ఎకరా సేద్యానికి పెడుతున్న పెట్టుబడి మోతాదులు, అందులో ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ మోతాదులు గురించి కూడా చర్చకు పెట్టాలి.

విపరీతమైన సబ్సిడీలతో సాధించిన మిగులు దిగుబడిని వర్ధమాన దేశాల్లోకి కుమ్మరించడానికే వర్ధమాన దేశాల వ్యవసాయ మార్కెట్ల తలుపులు తెరవాలని ప్రపంచ వాణిజ్య సంస్థ ద్వారా వర్ధమాన దేశాలపై ఒత్తిడి తెస్తున్నారు. ఇందులో భాగమే వ్యవసాయోత్పత్తి, వాణిజ్యానికి కీలకమైన భూయాజమాన్యం, మార్కెట్ నిర్వహణ, నియంత్రణలను కూడా అదుపు చేయడం ద్వారా రెండందాల ప్రయోజనం సమకూర్చేందుకు వర్ధమాన దేశాల వ్యవసాయాన్ని కార్పొరేట్ కబ్జాకు అప్పగించటమే మెరుగైన మార్గమని ద్రవ్య పెట్టుబడి శక్తులు అంచనాకు వచ్చాయి. ముందే చెప్పుకున్నట్లు పంటల వైవిధ్యం, దిగుబడి సామర్ధ్యం, అంతర్జాతీయ వ్యవసాయోత్పత్తుల వాణిజ్యంలో వాటి ద్వారా సాధించగల ఆదాయం రీత్యా వర్ధమాన దేశాల వ్యవసాయ రంగంలో ప్రత్యక్ష జోక్యానికి అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వంపై తెస్తున్న ఒత్తిళ్లు నేటికి మోడీ రూపంలో ఫలించాయి. ఈ ఫలితమే వ్యవసాయక చట్టాల రూపంలో మనకు కనిపిస్తోంది.

ఈ చట్టాలను సమర్థించుకోవడానికి ప్రభుత్వం చేయని తప్పుడు ప్రచారం లేదు. సృష్టించని భ్రమలు లేవు. ఈ భ్రమలన్నింటికీ పునాది డేవిడ్ రికార్డో ప్రతిపాదించిన సాపేక్ష సానుకూలత సిద్ధాంతమే. డేవిడ్ రికార్డో రెండు దేశాలు, రెండు సరుకులు పై ఆధారపడి ఈ సూత్రాన్ని ప్రతిపాదించాడు. అయితే ఈ సాపేక్ష సానుకూలత సిద్ధాంతం ప్రధానంగా పారిశ్రామిక ఉత్పత్తులకు వర్తించేదే తప్ప వ్యవసాయోత్పత్తులకు వర్తించేది కాదు. ఎందుకంటే వ్యవసాయోత్పత్తులు పారిశ్రామికోత్పత్తులు ఒకటి కాదు. వ్యవసాయోత్పత్తులకు వాతావరణ పరిస్తితులు మౌలిక ప్రాతిపదిక.

వీటన్నింటికీ మూడు తప్పుడు భ్రమలు కారణం. మొదటిది భౌతిక వాస్తవాల గురించి భ్రమలు కల్పించడం. రెండోది లక్ష్యాలు, ఉద్దేశ్యాలకు పొంతన లేని వాగ్దాటితో భ్రమలు కల్పించే ప్రయత్నం చేయడం. ప్రత్యేక పరిస్థితులను సాధారణ సూత్రీకరణలతోనూ, సాధారణ పరిస్థితులను నిర్దిష్ట అనుభవాలతోనూ మేళవించి తప్పుడు అంచనాలు, నిర్ధారణలతో విషయాన్ని తప్పుదారి పట్టించటం మూడో తరహా భ్రమలకు కారణం. మోడీ సృష్టిస్తున్న మొదటి రెండు రకాల భ్రమల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. ఈ రెండు రకాల భ్రమల ప్రచారం చేయడం ద్వారా మోడీ రావణాసురుడు సృష్టించిన మాయా లేడిని మించిన మాయతో ఏడేళ్ల పాటు దేశం కళ్లు కప్పాడని రైతాంగం క్రమంగా గుర్తిస్తోంది. మూడో రకం భ్రమలు గురించే ఇక్కడ కాస్త వివరంగా ప్రస్తావించుకోవాల్సి ఉంది. అదే అంతర్జాతీయ వాణిజ్యంతో ప్రత్యక్షంగా పెనవేసుకునే అవకాశం దక్కించుకోవడం ద్వారా దేశీయంగా రైతాంగపు ఆదాయాలు గణనీయంగా పెరుగుతాయన్న వాదన. ప్రపంచీకరణ దశలో ప్రతి చిన్న వస్తువు, సరుకు ధరవరలు అంతర్జాతీయ వాణిజ్యంతో ముడి పడి ఉంటాయన్నది సార్వత్రిక సూత్రం. ఈ వాణిజ్యంలో అటు దిగుమతి చేసుకునే దేశమూ, ఎగుమతి చేసే దేశమూ ఏకకాలంలో లబ్ధిపొందుతాయన్నది నయాఉదారవాదం కల్పిస్తున్న భ్రమ. అందులోనూ వ్యవసాయక ఉత్పత్తుల విషయంలో ఈ భ్రమను మరోసారి ముందుకు తెస్తున్నాడు ప్రధాని మోడీ.

వ్యవసాయోత్పత్తుల అంతర్జాతీయ వాణిజ్యంలో ఎగుమతి చేసే దేశం తీవ్రంగా నష్టపోతుందన్నది వాణిజ్య చరిత్ర నిర్ద్వంద్వంగా నిరూపించిన అంశం. అంతర్జాతీయ ఎగుమతులతో కొద్దిమంది ఆర్జించే లాభాలు గ్యారంటీ చేయడం కోసం అడ్డు అదుపు లేకుండా వ్యవసాయోత్పత్తులు నిల్వ ఉంచుకోవటానికి ప్రభుత్వాలు అదనంగా ఉత్పత్తి అవుతున్న పత్తి మాంచెస్టర్‌కు ఎగుమతి అవుతున్న కాలంలోనే దేశంలో తొలిసారి వ్యవసాయం సంక్షోభం (నేటి ఆధునిక పరిభాషలో)లోకి కూరుకుపోవటం, వలస ప్రభుత్వం ఈ సంక్షోభ ప్రభావాన్ని నియంత్రించి తమ దేశానికి కావల్సిన వ్యవసాయక ఉత్పత్తుల ఎగమతి నిరాఘాటంగా సాగటం కోసం కొన్ని ఉపశమన చర్యలు చేపట్టడం, ఈ క్రమంలోనే దేశంలో ఆధునిక అర్థంలో భూస్వామ్య విధానం వేళ్లూనుకోవడం భారతీయ ఆర్థిక చరిత్రతో పరిచయం ఉన్న వారందరికీ గుర్తుండే పరిణామాలే. నేడు కేంద్ర ప్రభుత్వం కూడా అదే దారిలో పయనిస్తోంది.

భారతదేశం స్వాతంత్ర్యం సాధించడానికి ముందు యాభైఏళ్ల పాటు సాగిన ఇంగ్లాండ్ ఆర్థిక రాజకీయ అవసరాల కోసం మన దేశం నుండి సాగించిన ఎగుమతులు కారణంగా భారత ఆర్థిక వ్యవస్థ సామాజిక జీవితం ఏ విధంగా ప్రభావితం అయ్యిందో గుర్తు చేసుకోవడం అవసరం.

1900 నాటికి భారతదేశంలో ఏటా 200 కిలోల తలసరి ఆహారధాన్యాల ఉత్పత్తి లభ్యత ఉండేవి. ఇంగ్లాండ్ పారిశ్రామిక, రాజకీయ ఆర్థిక అవసరాల కోసం మన వ్యవసాయ రంగాన్ని మార్చుకోవటం ప్రారంభించాక 1946 నాటికి తలసరి ఆహార ధాన్యాల ఉత్పత్తి, లభ్యత 136 కిలోలకు పడిపోయింది. దీంతో వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోవటమే కాక దేశీయంగా తిండిగింజల లభ్యత ప్రమాదకర స్థాయికి పడిపోయింది. వీటన్నింటి పర్యవసానమే బెంగాల్ క్షామం. తెలుగు రాష్ట్రాల్లో సైతం ఆ సమయంలో ఇచ్ఛాపురం నుండి తడ వరకు ఆకలి యాత్రలు జరిగాయి. మార్కెట్ విధానం సృష్టించిన కరువు కోరల్లో దాదాపు 30 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ అనుభవాలు దృష్టిలో పెట్టుకున్న స్వతంత్ర భారత పాలకులు 1990 వరకు ఆహారోత్పత్తుల్లో స్వయంపోషకత్వం కోసం అనేక చర్యలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతంలో ఆధునిక పెట్టుబడిదారీ రైతాంగం ఓ కీలకమైన శక్తిగా ఎదగడానికి పునాదులు వేసిన హరిత విప్లవం కూడా ఈ అవసరం నేపథ్యంలో ముందుకొచ్చిన విధానమే. దాంతో తిరిగి 1990 నాటికి భారతదేశంలో తలసరి సగటు ఆహార ధాన్యాల లభ్యత ఏడాదికి 184 కిలోలకు పెరిగింది. గత మూడు దశాబ్దాలుగా అనుసరిస్తున్న ఆర్థిక సంస్కరణలు, విదేశీ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మారుతున్న వ్యవసాయం తీరుతెన్నుల కారణంగా ఒక్క బియ్యం తలసరి లభ్యత 2014లో ఏడాదికి 72.3 కిలోలు ఉంటే 2018 నాటికి 69 కిలోలకు పడిపోయింది. కేంద్ర ప్రభుత్వం 2015-2016 సంవత్సరానికి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే ప్రకారమే 1991లో 510 గ్రాములుగా ఉన్న దినసరి తలసరి ఆహారధాన్యాల లభ్యత 2014 నాటికి 491 గ్రాములకు తగ్గిపోయింది. ఇదంతా దేశంలో కనీస మద్దతు ధర ఉనికిలో ఉండీ, వ్యవసాయ మార్కెట్ యార్డులు పని చేస్తూ ఎఫ్‌సిఐ ఆహారధాన్యాలు సేకరిస్తున్న సమయంలోనే జరిగిన మార్పు. నేడు మోడీ ప్రభుత్వం ఈ మూడింటినీ రద్దు చేసి ఏకంగా రైతును తిరిగి పూర్తి స్థాయిలో మార్కెట్ కోరల్లోకి నెట్టేస్తోంది.

విదేశీ వాణిజ్యం ద్వారానే లాభాలార్జించదల్చుకున్న ద్రవ్య పెట్టుబడి కాంట్రాక్టు వ్యవసాయం ద్వారా వ్యవసాయోత్పత్తిలోకి ఎందుకు ప్రవేశించాలనుకుంటుంది అన్న ప్రశ్న తలెత్తటం సహజం. హిందూ పురాణాల ప్రకారం ఈ చరాచర జగత్తును పుట్టించి పెంచి పోషించి నాశనం చేసే దేవుళ్లు ముగ్గురు. త్రిమూర్తులు. అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ప్రయోజనాలు సృష్టించి, వాటిని సార్వత్రికం చేసే క్రమంలో మిగిలిన దేశాలను బికారులుగా మార్చేది కూడా త్రిమూర్తులే. ప్రపంచ బ్యాంకు-ప్రపంచ వాణిజ్య సంస్థ-అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థల త్రిమూర్తులు. ఈ త్రిమూర్తులు సృష్టించిన అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ ప్రపంచ స్థాయిలోనూ నూతన శ్రమ విభజనకు తెరతీసింది. పారిశ్రామిక రంగంలో, వస్తూత్పత్తి రంగంలో ఈ నూతన తరహా శ్రమ విభజన మనం చూస్తూనే ఉన్నాము. తాజాగా ఇప్పుడు ఈ నూతన శ్రమ విభజనను వ్యవసాయ రంగానికి విస్తరింపచేయబూను కుంటున్నాయి.

ఈ ప్రయత్నంలోనే సంపన్న దేశాల జీవన ప్రమాణాలు, ఆహారపు అలవాట్లు యథాతథంగా కాపాడటానికి కావల్సిన వ్యవసాయోత్పత్తులు చేసే క్షేత్రాలుగా వర్ధమాన దేశాల పంట పొలాలను మార్చడం ఈ నూతన శ్రమ విభజనకు పునాది. గెర్కిన్‌లు, శీతాకాలంలో పండే స్ట్రాబెరీ పళ్లు వంటివి సంపన్న దేశాల ఆహారపు అలవాట్లకు తగ్గ పంటలు పండించడానికి ఇటువంటి కార్పొరేట్ సంస్థలు కాంట్రాక్టు సేద్యానికి సిద్ధపడుతున్నాయి. రైతుకు ప్రయోజనం అనే నినాదం మాటున మొత్తంగా దేశీయ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చెందిన దేశాల వ్యవసాయక అసవరాలు తీర్చేందుకు పావులుగా మార్చేందుకే ఈ కాంట్రాక్టు సేద్యం చట్టం అక్కరకొస్తుంది. వ్యవసాయోత్పత్తుల ఎగుమతి ద్వారా ప్రయోజనం అన్న మాయా లేడిని వెంటాడాలనుకునే వాళ్లు గత రెండు మూడేళ్లల్లో భారతదేశం నుండి ఎగుమతైన వ్యవసాయోత్పత్తులపై అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్‌లు విధించిన వివిధ ఆంక్షలు, అంతర్జాతీయ వాణజ్య సంస్థ ముసుగులో సృష్టించిన అవరోధాలు గుర్తు చేసుకోవాలి. కాంట్రాక్టు సేద్యంలో భూసారం, నీటి వనరుల వినియోగం, విద్యుత్ వినియోగం వంటి వాటి గురించిన ప్రస్తావన లేకపోవటం గమనించాలి. ఈ మూడు దీర్ఘకాలంలో వ్యవసాయ రంగాన్ని కూసాల్తో సహా కుంగదీసే అంశాలు. ఈ ఎగుమతి మార్కెట్‌కు సరఫరా చేసేది భారతదేశం ఒక్కటే కాదు. సమశీతోష్ణ మండలంలో ఉన్న అనేక వర్ధమాన దేశాలు ఇదే తరహా వ్యవసాయక సంస్కరణలను అమలు చేస్తున్నాయి. కార్పొట్ కాంట్రాక్టు సేద్యానికి తలుపులు తెరుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మన దేశం నుండి వచ్చే వ్యవసాయోత్పత్తి ఎగుమతులు, వాటి కోసం కుదుర్చుకున్న ఒప్పందాలు అన్నీ యథాతథంగా అమలు జరుగుతాయని ఆశించడం అత్యాశే అవుతుంది. ఐక్యరాజ్యసమితి పర్యావరణ ఒప్పందం, ప్రపంచ వాణిజ్య సంస్థ, ప్రపంచ ఆహార సంస్థ, యునెస్కో, ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటి వాటి ఒప్పందాలను ఎడం కాలితో తన్నేసి పక్కకు పోగలిగిన సంపన్న దేశాలు మన లాంటి దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలకు విలువనిస్తాయని ఆశించడం ఏ మేరకు సమంజసమో మనమే తేల్చుకోవాలి.

(రచయిత పాత్రికేయులు) వీ

మత వేదన వాస్తవ వేదనకు వ్యక్తీకరణే. అదే సమయంలో అది వాస్తవ వేదనపట్ల నిరసన కూడా. మతం అణచబడ్డ జీవి నిట్టూర్పు. హృదయంలేని ప్రపంచపు హృదయం. ఉత్సాహంలేని పరిస్థితుల ఉత్సాహం. అది ప్రజలకు మత్తుమందు. ప్రజల భ్రమాజనిత ఆనందంగా ఉన్న మతాన్ని రద్దుచేయడమంటే ప్రజల వాస్తవమైన ఆనందాన్ని ఆకాంక్షించడమే. ప్రస్తుత స్థితిపట్ల భ్రమల్ని వదిలేయమని కోరడమంటే, భ్రమలు అవసరమయ్యే పరిస్థితుల్ని వదిలెయ్యమని కోరడమే. అందుకే మతం మీద విమర్శ ఏ కన్నీటి ప్రవాహాల వెలుగు మతమో, ఆ కన్నీటి ప్రవాహాల మీద విమర్శకు బీజరూపమే.

- కార్ల్ మార్క్స్

వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రికి లేఖ

తేదీ: 17, డిసెంబర్, 2020

శ్రీ నరేంద్ర సింగ్ తోమర్
గౌరవ మంత్రివర్యులు, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ
భారత ప్రభుత్వం

అయ్యా,

విషయం: ఇటీవల చేసిన సాగు చట్టాలపై ఆర్థిక శాస్త్రవేత్తల ముఖ్యమైన అభ్యంతరాలు, వాటి కారణంగా ఈ చట్టాలను రద్దు చేయడం దేశవ్యాప్తంగా, ప్రత్యేకించి దేశ రాజధాని చుట్టూ అంతకు ముందు కనీవినీ ఎరగని రీతిలో రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో వ్యవసాయ విధి విధాన (పాలసీ) అంశాలపై దీర్ఘ కాలంగా పని చేస్తున్న ఆర్థిక శాస్త్రవేత్తలుగా మీకు ఈ ఉత్తరం రాస్తున్నాం. ఇటీవల చేసిన సాగు చట్టాలు దేశ సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనకరంగా లేవు. వీటిపై అనేక రైతు సంఘాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తపరిచాయి. కాబట్టి ఈ చట్టాలను భారత ప్రభుత్వం రద్దు చేయాలని కోరుతున్నాం.

లక్షలాది సన్నకారు రైతుల ప్రయోజనం కోసం వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థలో మార్పులు, మెరుగుదలలు అవసరం అని మేం నమ్ముతున్నాం. అయితే ఈ చట్టాల ద్వారా చేపట్టిన సంస్కరణలు ఇందుకు దోహదం చెయ్యవు. నియంత్రిత మార్కెట్లు రైతుల ప్రయోజనాలను నెరవేర్చడం లేదని, ఎక్కడ కావాలంటే అక్కడ అమ్ముకునే స్వేచ్ఛ రైతులకు లేదని పేర్కొంటూ రైతులకు గిట్టుబాటు ధరలు లభించకపోవడానికి కారణాలపై తప్పుడు అంచనాల ఆధారంగా ఈ చట్టాలను చేశారు. ప్రభుత్వం చేసిన ఈ మూడు చట్టాలు భారతదేశ చిన్న రైతులకు మౌలికంగా హాని చేస్తాయనడానికి ముఖ్యమైన అయిదు కారణాలను ఇక్కడ పేర్కొంటున్నాం.

1. రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను తక్కువగా అంచనా వేయడం: వ్యవసాయ మార్కెట్ల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను నిర్వీర్యం చేసేలా కేంద్ర చట్టాలను చేయడం కేంద్ర – రాష్ట్రాల అధికార సమతౌల్యం దృష్ట్యా, రైతుల ప్రయోజనాల దృష్ట్యా కూడా సరైన పంథా కాదు. రాష్ట్ర ప్రభుత్వాల యంత్రాంగం గ్రామ స్థాయి వరకు రైతులకు అందుబాటులో ఉంటుంది, వాళ్లకి జవాబుదారీగా ఉంటుంది. కాబట్టి 'వ్యాపార ప్రాంతాలను' ఏర్పాటు చేసి సరుకుల అమ్మకం, వాణిజ్యాలను కేంద్ర ప్రభుత్వ చట్టాల పరిధిలోకి తీసుకుని రావడం కంటే మార్కెట్లను రాష్ట్రాలు నియంత్రించడమే సరైనదిగా ఉంటుంది. ప్రైవేట్ యార్డులు, ఈ–ట్రేడింగ్, ఎలక్ట్రానిక్ చెల్లింపులు, ఈ–నామ్ వంటి వాటికి అనుమతిని ఇస్తూ అవన్నీ రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణలో పనిచేసేలా 2019 జులై నాటికి 20కి పైగా రాష్ట్రాలు తమ తమ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ (ఎపిఎంసి) చట్టాలను సవరించాయని వ్యవసాయ మంత్రిత్వ శాఖ పేర్కొంది. కొత్త విధానానికి సంబంధించి ఇలాంటి ఏ సంస్కరణలైనా విజయవంతం కావాలంటే రైతులు, వ్యాపారస్తులు, కమీషన్ ఏజెంట్లు వంటి అందరి భాగస్వాముల సమ్మతి కావాలి. కేంద్ర స్థాయిలో విస్తృత పరిధిలో చట్టాలను సవరించడం ద్వారా కంటే స్థానిక వాస్తవాలకు మరింత సన్నిహితంగా, మరింత బాగా స్పందించగల రాష్ట్ర ప్రభుత్వమే ఈ ప్రక్రియలను నిర్వహించగలదు.

2. రెండు మార్కెట్లు, రెండు భిన్నమైన నియమాలు: రెండు వేరువేరు చట్టాలు, మార్కెట్ రుసుములు, నియమావళులతో వ్యవసాయ మార్కెట్ యార్డులలో నియంత్రిత మార్కెట్ల పక్కనే 'వ్యాపార ప్రాంతాలలో' అనియంత్రిత మార్కెట్లను ఏర్పాటు చెయ్యడం అన్నది ముఖ్యమైన సమస్య. ఈ కారణంగా వ్యాపారస్తులు ఇప్పటికే నియంత్రిత మార్కెట్ల నుంచి అనియంత్రిత స్థలాలలోకి వెళుతున్నారు. వ్యవసాయ మార్కెట్లలో వ్యాపారస్తులు కుమ్మక్కయి మార్కెట్‌ను తమకు అనుకూలంగా మలుచుకుంటూ ఉంటే ఇవే సమస్యలు అనియంత్రిత మార్కెట్ స్థలాలలో కూడా కొనసాగవచ్చు. వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లలో ఇటువంటి సమస్యలను నివారించడానికి, పరిష్కరించడానికి కొన్ని విధానాలు ఉన్నాయి, కొత్త సాగు చట్టాలలో ఇటువంటివేమీ లేవు. ధరలలోనే కాకుండా తూకం, గ్రేడింగ్, తేమ శాతం లెక్కకట్టడం వంటి ఇతర పద్ధతులలో కూడా రైతులు దోపిడీకి గురౌతున్నారు. మార్కెట్ యార్డులు లేకపోతే ధరలు, ఇతర అంశాలలో తమకి న్యాయం జరగడం కష్టమని రైతులు భావిస్తున్నారు. వ్యవస్థీకృత మార్కెట్లు అందుబాటులో లేని మారుమూల, గిరిజన ప్రాంతాలలో ఇటువంటి దోపిడీ చాలా ఎక్కువగా ఉంటుందని రైతుల అనుభవాలు చెబుతున్నాయి.

3. విచ్ఛిన్నమైన మార్కెట్లు, గుత్తాధిపత్యాలు, ధర నిర్ణయించడంలో సమస్యలు: కొత్త సాగు చట్టాలు రాకముందు నుంచే అధిక శాతం వ్యవసాయ ఉత్పత్తులను నియంత్రిత మార్కెట్ యార్డులలో కాకుండా బయటే అమ్ముతున్నారు. అయితే, రోజువారీ వేలం పాటల ద్వారా మార్కెట్ యార్డులు ధరలకు ఒక సంకేతాన్ని, ఎంత ధర పొందవచ్చో రైతులకు ఆధారపడదగిన సూచికను ఇస్తాయి. ఇదే లేకపోతే చిన్న చిన్న మార్కెట్లు స్థానిక గుత్తాధిపత్యానికి దారితీయవచ్చు. బీహార్‌లో 2006లో మార్కెట్ కమిటీల చట్టాన్ని రద్దు చేసిన తరవాత కొనుగోలుదారులను ఎంపిక చేసుకునే అవకాశాలు, బేరమాడే శక్తి తగ్గడం వల్ల ఇతర రాష్ట్రాలలో కంటే రైతులు చాలా తక్కువ ధరలు పొందుతున్నారని అనుభవాలు తెలియ చేస్తున్నాయి.

4. ఒప్పంద (కాంట్రాక్ట్) వ్యవసాయంలో అసమాన భాగస్వాములు: ఒప్పంద వ్యవసాయ చట్టంలో రైతుల ప్రయోజనాలకు తగినంత రక్షణ ఇవ్వడానికి భాగస్వామ్య పక్షాలైన చిన్న రైతులు, కంపెనీల మధ్య తీవ్ర అసమానతలను సరిగా పరిగణనలోకి తీసుకోలేదు. ప్రస్తుతం ఒప్పంద వ్యవసాయం చాలా వరకు ఎటువంటి రాతపూర్వక అంగీకారాలు లేకుండానే జరుగుతోంది. కంపెనీలకు ఎటువంటి బాధ్యత లేకుండా

చెయ్యడానికి నిర్వాహకులు లేదా అగ్రిగేటర్ల ద్వారా దీనిని చేస్తున్నారు. ఇదే పరిస్థితి ఇక ముందు కూడా కొనసాగవచ్చు. దీనిని ఎదుర్కోడానికి చట్టంలో ఎటువంటి అంశాలు లేవు. భూమి కౌలు ఏర్పాట్లను సరళీకరించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల నేపథ్యంలో వ్యవసాయ సేవల ఒప్పందాలలోని అంశాలు పెద్ద ఎత్తున కార్పొరేట్ వ్యవసాయానికి దారి తీస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒప్పంద వ్యవసాయ ఏర్పాట్లు చేసుకోవడం రైతుల ఇష్టం మీదనే ఆధారపడి ఉంటుంది. కానీ, గిట్టుబాటు ధరలు లభించకపోవడం వల్ల వ్యవసాయంలో నెలకొన్న తీవ్ర సంక్షోభం నుంచి తమను తాము కాపాడుకోడానికి రైతులకు మరోదారి లేకపోవచ్చు. రైతుల ప్రయోజనాలను కాపాడే విధానాలు లేని నేపథ్యంలో ఒప్పంద వ్యవసాయం రైతులకు మేలు చేయడం లేదని అనుభవాలు చెబుతున్నాయి.

5. వ్యవసాయ - వాణిజ్యాల ఆధిపత్యంపై ఆందోళనలు: రైతులు, వ్యాపారస్తులు, మార్కెటింగ్ ఏజెంట్ల మధ్య ఉన్న ప్రస్తుత సంబంధాలు, ఎంత నిల్వ చేయవచ్చు, ఎంత ప్రాసెసింగ్ చేయవచ్చు, ఎంత మార్కెటింగ్ చేయవచ్చు అన్న వాటిల్లో నియంత్రణలు, లైసెన్సింగ్ వంటి బంధనాల నుంచి వ్యవసాయ - వాణిజ్య సంస్థలను ఈ మూడు సాగు చట్టాలు విముక్తం చేస్తాయన్నది అర్థం చేసుకోవాలి. దీనివల్ల అమెరికా, యూరప్ దేశాలలో లాగా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌పై, విలువ ఆధారిత ఉత్పత్తులపై కొన్ని పెద్ద పెద్ద కంపెనీలు పట్టు సాధిస్తాయని ఆందోళన తలెత్తుతుంది. ఆ దేశాలలో 'విస్తరించు లేకపోతే నిష్క్రమించు' అన్న పరిస్థితులలో అనేక చిన్న రైతులు, చిన్న వ్యాపారస్తులు, స్థానిక వ్యవసాయ - వాణిజ్యాలకు చోటు లేకుండా పోయింది. అలా కాకుండా మెరుగైన ధర సాధించుకునే శక్తి, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి వాటిల్లో మౌలిక సదుపాయాల ద్వారా రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పిఓల) భాగస్వామ్యం విస్తరించడానికి అనుకూలమైన వ్యవస్థ భారతీయ రైతులకు కావాలి. రైతుల ఆదాయాలు పెంచడానికి ఇవి దోహదం చేస్తాయి. ప్రభుత్వం మొదట చేపట్టిన విధానాలు ఆ దిశలో ఉన్నాయని అనిపించింది. అయితే ప్రస్తుత సాగు చట్టాలు ఇందుకు వ్యతిరేక దిశలో ఉన్నాయి. మౌలిక సదుపాయాలు నిర్మించుకోవడంలో, మార్కెట్‌లో బేరమాడగల శక్తిని పెంచుకోవడంలో రైతులకు అండగా నిలబడే పాత్ర నుంచి ప్రభుత్వం తప్పుకుంటోంది. ఎటువంటి నియంత్రణలు, పరిమితులు లేకుండా ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్‌లలో ఎంతైనా పెట్టుబడులు పెట్టి, విలువ ఆధారిత ఉత్పత్తులపై వ్యవసాయ - వాణిజ్య కంపెనీలు తమ పట్టును బిగుంచుకోడానికి ఈ చట్టాలు అవకాశం కల్పిస్తున్నాయి.

ఈ మౌలిక సమస్యల దృష్ట్యా రైతులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించడానికి సాగు చట్టాలలోని కొన్ని అంశాలను సవరిస్తే సరిపోదని మేం నమ్ముతున్నాం. ఉదాహరణకు, రాష్ట్రాల పరిధిలో లేకుండా అనియంత్రిత 'వాణిజ్య ప్రాంతాలను' ఏర్పాటు చేయడమే రైతుల ప్రయోజనాలకు హాని కలిగించే పక్షంలో చట్టంలోని కొన్ని అంశాలను మార్చడం వల్ల దానిని సరిదిద్దినట్టు కాదు. ముఖ్యమైన, అసలైన సమస్యలను రైతులు లేవనెత్తుతుండగా వాళ్లను ఇతరులు తప్పుదోవ పట్టిస్తున్నారన్న అభిప్రాయాన్ని ప్రచారం చెయ్యడం సరికాదని మేం బలంగా నమ్ముతున్నాం. ప్రస్తుత ప్రతిష్టంభన ఎవరికీ ప్రయోజనకరం కాదు. రైతుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని ఈ చిక్కుముడిని విప్పడానికి ముందు అడుగు వేయడం ప్రభుత్వ బాధ్యత.

కాబట్టి, ఈ సాగు చట్టాలను రద్దు చేయాలని, రైతులకు, ఆర్థిక వ్యవస్థకి నిజమైన సుస్థిర, సమాన ప్రయోజనాలకు ఏ విధానాలు దోహదం చేస్తాయో తెలుసుకోడానికి రైతు సంఘాలు, ఇతర పాత్రదారులతో విస్తృత చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఇది అత్యంత ప్రజాస్వామికమైన పని.

ఆచార్య డి. నరసింహారెడ్డి, భవదీయ, అర్థశాస్త్ర ఆచార్యులు (రిటైర్డ్), హైదరాబాదు విశ్వవిద్యాలయం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ మాజీ ఆచార్యులు (3-33/33, ఎల్.వి. రెడ్డి కాలని, లింగంపల్లి, హైదరాబాదు 500019)

ఆచార్య కమల్ నయన్‌కాబ్రా, అర్థశాస్త్ర ఆచార్యులు (రిటైర్డ్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కొత్త ఢిల్లీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ మాజీ ఆచార్యులు

ఆచార్య కె.ఎన్. హరిలాల్, తిరువనంతపురం సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఆచార్యులు (సెలవలో), కేరళ రాష్ట్ర ప్రణాళిక సంఘ సభ్యులు

ఆచార్య రాజిందర్ చౌదరి, మాజీ ఆచార్యులు, అర్థశాస్త్ర శాఖ, ఎం.డి. విశ్వవిద్యాలయం, రోహ్‌తక్, హరియాన.

ఆచార్య సురిందర్ కుమార్, వరిష్ఠ ఆచార్యులు, సి.ఆర్.ఆర్.ఐ.డి., చండీగఢ్, అర్థశాస్త్ర మాజీ ఆచార్యులు, ఎం.డి. విశ్వవిద్యాలయం, రోహ్‌తక్.

ఆచార్య అరుణ్ కుమార్, మాల్కం ఎస్. ఆదిశేషయ్య చైర్ ఆచార్యులు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, కొత్త ఢిల్లీ.

ఆచార్య రంజిత్ సింగ్ ఘుమన్, ప్రొఫెసర్ ఆఫ్ ఎమినెన్స్ (అర్థశాస్త్రం), జి.ఎన్.డి.యుయ, అమ్రిత్‌సర్, అర్థశాస్త్ర ఆచార్యులు, సి.ఆర్.ఆర్.ఐ.డి., చండీగఢ్.

ఆచార్య ఆర్. రమణకుమార్, నాబార్డ్ చైర్ ఆచార్యులు, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ స్టడీస్, ముంబయి.

ఆచార్య వికాస్ రావల్, అర్థశాస్త్ర అసోసియేట్ ఆచార్యులు, సి.ఇ.ఎస్.పి., జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, కొత్త ఢిల్లీ

ఆచార్య హిమాన్షు, అర్థశాస్త్ర అసోసియేట్ ఆచార్యులు, సి.ఇ.ఎస్.పి., జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, కొత్త ఢిల్లీ. వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు. - సం.*

వ్యవసాయ చట్టాల ఉద్దేశిత, అనుద్దేశిత పరిణామాలు

***కార్పొరేట్ ప్రయోజనాలను ఉద్దేశించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ రంగ చట్టాలు ప్రజా ప్రతిఘటన వంటి అనుద్దేశిత పరిణామాలకు దారి తీశాయని విశ్లేషిస్తున్నారు* అమిత్ భాదురి**

ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో నిలదొక్కుకోవడానికి, దేశం కంపెనీ పాలన కిందికి రావడానికి, అవకాశం కల్పించిన ప్లాసీ యుద్ధంలో భారతదేశం నిజంగా యుద్ధంలో ఓడిపోలేదు. ఒక సైనికాధికారి చేసిన ద్రోహం వల్ల ఓడిపోయింది. ఇటువంటి సందర్భానికే సరిగ్గా సరిపోయిన ఆఫ్రికన్ సామెత ఒకటి ఉంది. “ఒక సింహం నాయకత్వంలోని గొర్రెల మంద కూడ, ఒక గొర్రె నాయకత్వంలోని సింహాల మందను ఓడించగలదు” అని ఆ సామెత చెపుతుంది. ఈ సామెత వెనుక ఉన్న సత్యం విశాలమైనది, అది కేవలం జంతువుల యుద్ధరంగానికి మాత్రమే సంబంధించినది కాదు. అది ఎన్నో ఆధునిక ప్రభుత్వాలకూ, ప్రజాస్వామిక నాయకులకూ కూడ వర్తిస్తుంది. ఒక తప్పుడు నాయకుడు, ఒక విషపూరితమైన భావజాలం, ఒక మూర్ఖపు అత్యాశ, తాము మహత్తరమైనవారమనే తప్పుడు భావన అల్లకల్లోలం సృష్టిస్తాయి. అతి తక్కువ కాలంలోనే అనూహ్యమైన విధ్వంసానికి కారణమవుతాయి. ఆ తర్వాత ఆ దేశం ఆ నష్టం నుంచి బైట పడడానికి చాల చాల కాలం పడుతుంది. అసలు ఒక్కోసారి బైట పడకపోవచ్చు కూడ.

అందుకు చరిత్రలో లెక్కలేనన్ని ఉదాహరణలున్నాయి. హిట్లర్, ముస్సోలినీలు మరీ మరిచిపోయేంత సుదూరమైన వారేమీ కారు. స్టాలిన్ పాలన వైచిత్రి ఏమంటే, నాజీలను ఎర్ర సైన్యం ఓడించింది గాని అదే సమయంలో స్టాలిన్ చేపట్టిన క్షాళన కార్యక్రమం తూర్పు యూరప్ లోని స్వతంత్ర కమ్యూనిస్టు పార్టీలను బలహీన పరిచి, అవి ఎన్నటికీ తేరుకోలేని స్థితి కల్పించింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ప్రోత్సహించిన విషపూరిత విధానాలను ఔదల దాల్చిన మార్కెట్ ఫండమెంటలిస్ట్ పాలకుల వల్ల అర్జెంటీనా అనే అపార సహజ వనరుల దేశం ప్రపంచమంతా బిచ్చమెత్తుకోవలసిన స్థితికి నెట్టబడిందని చూపడానికి ఎన్నో ఆధారాలున్నాయి. ఏ దేశంలోనైనా వంచన, విషపూరిత భావజాలమూ కలిసిన విధానాలు అమలైతే ఆ దేశంలో భయానక విధ్వంసం అనివార్యమవుతుంది. ప్రతికూల వృద్ధి రేటు, కనీవినీ ఎరగని మాంద్యం, విపరీతమైన నిరుద్యోగం, వాటితో కలిసి పైపైకి ఎగబాకుతున్న స్టాక్ మార్కెట్ ఒక పక్కనా, గోవధ నిషేధం, ఒక నాయకుడి చారిత్రక ప్రాముఖ్యతను చాటడానికి రాజధానిలో ఒక కేంద్ర భవన సముదాయాన్ని నిర్మించడం మరొకపక్కనా ఆ రానున్న భయానక విధ్వంసపు భవిష్యవాణిని పలుకుతున్నాయి. అయితే ఈ బ్రహ్మరాక్షసి మన తలుపు ముందు నిలిచి ఉన్నదనే వాస్తవాన్ని మనకు ఈ దేశపు రైతులు ఈ దేశ ముఖచిత్రాన్ని ఒక అద్దంలో చూపినప్పుడు మాత్రమే తెలిసి మేలుకొన్నాం.

మీరు ఇప్పటికే మీ తెలివినంతా ప్రధానస్రవంతి ప్రచారసాధనాల నిపుణుల చర్చలకూ, చిత్రాలకూ తాకట్టు పెట్టి ఉండనట్టయితే, ఇంగ్లిష్ పిల్లల పాటలో లాగ, అద్దమా అద్దమా గోడమీద అద్దమా, అన్నిటి వెనుకా ఉన్నదేమిటో చెప్పుమా అని పాడతారు. అప్పుడిక ఆ అద్దం అధికారంలో ఉన్న రాజకీయపక్షానికి చెందిన ఇద్దరు అత్యంత శక్తిమంతులైన రాజకీయ నాయకులను (ఇద్దరూ గుజరాత్ కు చెందినవారే) చూపెట్టదు. అది కేవలం ఇద్దరు అత్యంత సంపన్నులైన ఇద్దరు వ్యాపారవేత్తల (ఆ ఇద్దరూ కూడ గుజరాత్ కు చెందినవారే!) ముఖాలను మాత్రమే చూపెడుతుంది. ఆ ఇద్దరి పేర్లు చెప్పినందుకు మీకేమీ బహుమతి దక్కదు. ఎందుకంటే ఆ ఇద్దరూ ప్రస్తుత దేశాధినేత గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజులనుంచీ అతనికి ఆశ్రితులుగా చిరకాలంగా ఉన్నవారే.

అయితే ఇది కేవలం ‘ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం’ కథ మాత్రమే కాదు. మరణశయ్య మీద ఉన్న పార్లమెంటులో ఇటీవల హడావిడిగా అమలులోకి వచ్చిన మూడు వ్యవసాయరంగ చట్టాలు ఇప్పటికే అమలులో ఉన్న ధోరణికి మినహాయింపులేమీ కావు. ఇటువంటి చర్యలనే ఈ ప్రభుత్వం పదే పదే చేసింది గాని గత చర్యలు ఎంత వేగంగా జరిగిపోయాయంటే వాటిమీద స్పందించడానికి ప్రజలకు వ్యవధి చిక్కలేదు. ఈ ధోరణి పెద్దనోట్ల రద్దు అనే గెరిల్లా పద్ధతి దాడితో మొదలయింది. ఆ తర్వాత సన్నకారు, చిన్నకారు వ్యాపారాలను బలహీన పరచడానికీ, మన సమాఖ్య ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో రాష్ట్రాల పాత్రను బలహీనం చేయడానికీ వ్యూహాత్మకంగానే తప్పుడు పద్ధతిలో అమలు చేసిన వస్తు, సేవల పన్ను రూపంలో జరిగింది. దాని తర్వాత వలస శ్రామికుల జీవితాలనూ జీవనోపాధులనూ దుర్మార్గంగా కూలదోసిన అత్యంత కఠినమైన లాక్ డౌన్ ను నాలుగు గంటల వ్యవధి ఇచ్చి ప్రకటించడం జరిగింది.

ఈ చర్యలతో అసంతృప్తి, ఇబ్బందులు, అశాంతి కలిగాయి, కాని ప్రజా ప్రతిస్పందన ఆగ్రహం స్థాయికి ఎదగలేదు. ప్రభుత్వం నిజంగానే నల్లధనానికి వ్యతిరేకంగా పోరాడుతున్నదనే భ్రమ (పదిహేను లక్షల రూపాయల వాగ్దానం సంగతి కూడ కాదు), ముంచుకొస్తున్న మహావిపత్తును ఎదుర్కోవడానికి వీరోచిత పద్ధతిలో లాక్ డౌన్ ప్రకటించారనే ఆశ ప్రజలలో ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని, పరపతిని కలిగించాయి. ఆ తర్వాతనే మహావిపత్తు ముసుగు కింద పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు మౌలిక సారాంశాన్నే లోలోపలి నుంచి తొలిచివేసే ప్రక్రియల ఎలా జరుగుతున్నదో మనందరికీ అర్థం కావడం మొదలయింది. కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల కార్మిక చట్టాల పరంపరను ఎటువంటి ముందస్తు సూచనా చర్చా లేకుండా ఆమోదించారు. ఇప్పుడిక ప్రభుత్వం మూడు వ్యవసాయ రంగ చట్టాలను

ప్రవేశపెట్టే పకడ్బందీ వ్యూహానికి తెరలేపింది. మహావిపత్తు నేపథ్యంలో పార్లమెంటు లోపల గాని, బైట గాని ఈ చట్టాలకు పెద్ద ఎత్తున ప్రతిఘటన రాదని ప్రభుత్వం భావించింది. ఇప్పటికే ప్రతికూల వృద్ధితో ఆర్థిక వ్యవస్థ కుదేలయి ఉన్నది, అతి దారుణమైన నిరుద్యోగం వ్యాపిస్తున్నది. దేశం మొత్తమే ప్రాణవాయువు కోసం కొట్టుకులాడుతున్నది.

క్లుప్తంగా చెప్పాలంటే, ఈ మూడు చట్టాలూ మండీ వ్యవస్థనూ, వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధరల వ్యవస్థనూ ధ్వంసం చేయదలచాయి. ప్రధానస్రవంతి ప్రచార సాధనాలలో తక్కువ ప్రాధాన్యత పొందుతున్న సాధారణ ఆసక్తికర అంశమేమంటే, వివాదాలను పరిష్కరించే సందర్భంలో మామూలు చట్టబద్ధ ప్రక్రియను పూర్తిగా తొలగించి, ప్రభుత్వానికి ఏకపక్ష అధికారం ఇవ్వడం ఈ చట్టాల లక్ష్యంగా ఉంది. అంటే అది వివాద పరిష్కార అధికారాన్ని పూర్తిగా అధికార యంత్రాంగం చేతులకు బదిలీ చేస్తుంది. న్యాయవ్యవస్థ పాత్రను రద్దు చేస్తుంది. అంటే నేరస్తుడనే ఆరోపణ ఎదుర్కొంటున్న వ్యక్తే, నేరపు స్వభావం మీద తీర్పు చెప్పే స్థానంలో కూచుంటాడు. న్యాయశాస్త్ర మౌలిక నియమమైన తీర్పరి తటస్థంగా ఉండాలనే సాధారణ సూత్రానికి ఇది ఉల్లంఘన. ఇంత అన్యాయమైన చట్టాన్ని మన ప్రజాస్వామిక పార్లమెంటు హడావిడిగా ఆమోదించింది. అది కేవలం రైతుల హక్కులను కాలరాసిన చర్య మాత్రమే కాదు, భారత పౌరులందరి హక్కులకూ ప్రమాదకరమైన చర్య.

ఈ చర్యకు వ్యతిరేకంగా రైతులు తిరుగుబాటు ప్రకటించారు. వారు తమ హక్కులు పరిరక్షించుకోవడానికే లేచి నిలిచారు. కాని అది మొత్తంగా భారత పౌరుల విశాలమైన రాజ్యాంగ బద్ధ హక్కుల పరిరక్షణతో మిళితమై ఉంది. నిరాశలో, పేదరికంలో కూరుకుపోయిన ఉన్న అత్యధిక సంఖ్యాకులైన భారత ప్రజానీకానికి తమ ముక్కుగుద్ది చెపుతున్న అతి తీవ్రమైన ప్రమాదం గురించి హఠాత్తుగా తెలిసివచ్చింది. భారత వ్యవసాయరంగపు కార్పొరేటీకరణ అనేది, మొత్తంగా భారత ప్రజాస్వామ్యపు కార్పొరేటీకరణకు, మన రాజ్యాంగబద్ధ హక్కుల కార్పొరేటీకరణకు తొలి మెట్టు మాత్రమే.

వ్యవస్థా సమర్థకులైన అర్థశాస్త్రవేత్తలకు జ్ఞానవంతులనీ, నిపుణులనీ పెద్ద పేరు లేదు గాని, అసంబద్ధమైన అర్ధసత్యాలు చెప్పడంలో, మాయచేసే ప్రత్యేక పదజాలంలో మాట్లాడడంలో మాత్రం పేరు పొందినవారు. అమెరికన్ అర్థశాస్త్రవేత్త మిల్టన్ ఫ్రీడ్ మన్ ద్వారా సుప్రసిద్ధమైన ఇటువంటి అర్థవేత్తల వాదనల గీటురాయి ఒకటి ఉంది. అదేమంటే స్వేచ్ఛాయుతమైన ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛా మార్కెట్ అవసరం అనేది. మరి ప్రస్తుత వ్యవసాయ రంగ చట్టాలు ఒక ప్రశ్నను లేవనెత్తుతున్నాయి: పని చేసేవారూ, దాని మీద తీర్పు చెప్పేవారూ ఒకరే అయితే దాన్ని ప్రజాస్వామ్యం అనవచ్చునా? స్వేచ్ఛా ప్రజాస్వామ్యానికి ఈ కొత్త నిర్వచనం తయారయిందా? ధర గురించి బేరసారాలలో అంబానీ, అదానీ వంటి వారితో ఒక చిన్న, మధ్యతరగతి రైతు పోటీ పడవలసిన మార్కెట్ లో ఎంత స్వేచ్ఛ ఉన్నదనుకోవచ్చు? మార్కెట్ లో కొనుగోలుదారులూ, అమ్మకందారులూ ధరను అంగీకరించేవాళ్లుగా ఉండకపోతే ధరల యంత్రాంగం పని చెయ్యదు అనేది ప్రామాణిక అర్థశాస్త్ర సిద్ధాంతాలలో అతి నిగూఢంగా దాచిన రహస్యం. దాని అర్థమేమంటే మార్కెట్ లో ఏ ఒక్కరికీ ధరలను నిర్ణయించే అధికారం ఉండగూడదు అని. అందువల్లనే సాధారణ సమతా స్థితి అనే శక్తిమంతమైన సిద్ధాంతం ఇరువైపులా ఎటువంటి ఆసక్తీ లేని, నిరపేక్షమైన, బైటి వ్యక్తిగా ఉండే 'వేలందారు' ను సృష్టించింది. వోల్టేర్ ప్రతిపాదించిన భగవంతుడి లాగ, ఈ వేలందారు మార్కెట్ ఆమోదిత ధరలను చేరడానికి అనువుగా ధరలను రూపొందిస్తాడు, సవరిస్తాడు. కనీస మద్దతు ధర అనే భావనలో ఎన్ని పరిమితులూ, అవినీతులూ ఉన్నప్పటికీ అది ఈ 'వేలందారు' భావన నిర్ణయించే ధరకు అతి సమీపమైనది. దాన్ని చట్టబద్ధం చేయాలని రైతులు కోరుతున్నారు. కాని ప్రభుత్వం ఆ పని చేయడానికి సిద్ధంగా లేదు. ఎందుకంటే ప్రస్తుతం ఉన్న చట్టాలను సవరించినా, సవరించకున్నా మండీ వ్యవస్థను పనికి రాకుండా చేసి, ధరల నిర్ణయాధికారాన్ని తొందరగానో ఆలస్యంగానో కార్పొరేట్ల చేతుల్లో పెట్టాలని ప్రభుత్వం కోరిక. ప్రధానస్రవంతి అర్థశాస్త్రవేత్తలు ప్రశంసిస్తున్న స్వేచ్ఛామార్కెట్ యంత్రాంగం అదే. ప్రధానస్రవంతి ప్రచారసాధనాలలో నిపుణులనబడేవాళ్లు చర్చిస్తున్నది అదే. బడా కార్పొరేషన్లు ఆర్థిక సహకారం అందిస్తున్నది దానికే. ఈ లోగా, అంబానీకి చెందిన రిలయన్స్ వ్యవసాయోత్పత్తుల చిల్లర వర్తకంలోకి అడుగు పెట్టింది. అంబానీకే చెందిన జియో కార్పొరేట్లు సాగించే ఆన్ లైన్ భారీ కొనుగోళ్లన్నిటినీ నియంత్రిస్తుంది. మరొక పక్క అదానీ వ్యవసాయ సరుకులను రవాణా చేయడానికీ, నిలువ చేయడానికీ తన కార్పొరేట్ రవాణా, గిడ్డంగుల సామ్రాజ్యాన్ని స్థాపిస్తున్నాడు, విస్తరిస్తున్నాడు. ప్రభుత్వం మాత్రం దేశంలో జియో నియంత్రణలో 5జి ద్వారా రూపొందుతున్న డిజిటల్ పెట్టుబడిదారీ విధానపు భవిష్యత్తును గురించి కలలు కంటున్నది. ఈ పరిస్థితి నుంచి ఉపశమనం లేదా, మరే ప్రత్యామ్నాయ మార్గమూ సాధ్యం కాదా?

మనందరమూ నిరాశలో కూరుకుపోయి ఎంత తప్పు చేశామో రైతులు చూపుతున్నారు. పరిస్థితులు మారుతుంటాయి కాని తమకు ఉండే అన్ని సాధారణ బలహీనతలతోటే సాధారణ ప్రజానీకం ఏకమైనప్పుడు, కనీసం ఆ ఒక్క సమస్యపై అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు ఏకమయ్యేలా ఒత్తిడి తెచ్చినప్పుడు పరిస్థితులు కొద్దిమంది గజదొంగలూ, వారి బంట్లూ కోరుకున్నట్టుగా మారవు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలకేదో స్పష్టమైన పేదల అనుకూల అభివృద్ధి మార్గం గురించి ఆలోచన ఉన్నదనో, యంత్రాల సహాయంతో నడిచే కార్పొరేట్ వ్యవసాయమే బంగారు భవిష్యత్తు అనే భ్రమ తొలగిపోయిందనో కాదు. కేవలం రైతుల కచ్చితమైన ప్రతిఘటన ఆ రాజకీయ పార్టీలకు తప్పని పరిస్థితులు కల్పించాయి. ఇప్పుడిక మనం ధైర్యంగా ఈ ఆందోళనతో మమేకం కావలసి ఉంది. "మనుషులు చరిత్ర సృష్టిస్తారు. అయితే తాము తయారు చేసుకున్న పరిస్థితుల్లో కాదు" అనే మాటలోని వివేకాన్ని గుర్తు తెచ్చుకోవలసి ఉంది. ఇప్పుడు పరిస్థితులు తయారై ఉన్నాయి. ఆఫ్రికన్ సామెతలో చెప్పిన ప్రకారం ఒక సింహం గొర్రెల మందకు నాయకత్వం వహించి ఇంతకాలమూ ఎదురులేని శత్రువుగా కనిపించిన ప్రత్యర్థిని ఓడిస్తుందా అనేదే ప్రశ్న.

(అనువాదకుడి వివరణ: ఈ వ్యాసంలో స్టాలిన్ ప్రస్తావన అనవసరంగా, అనుచితంగా ఉన్నదనీ, ప్రజా శక్తులను గొర్రెల మందగా పోల్చడం సరికాదనీ గుర్తిస్తూనే, ఇతర విషయాల ప్రాధాన్యత వల్ల ఈ వ్యాసం అనువదించాను)

(రచయిత అంతర్జాతీయంగా సుప్రసిద్ధుడైన మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్త) వీ

ఈనాటికి మీ కల సాకారమవుతుంది సారూ!

ప్రస్తుతం దేశంలో జరుగుతున్న రైతు ఉద్యమాల సందర్భంగా రైతాంగ సమస్యల గురించి ఎంతో తపన పడి, విశ్లేషణలతో వారి కష్టాలను ఎత్తిచూపిన వి. హనుమంతరావు గారిని గుర్తు చేసుకుంటున్నారు **విద్యాభూషణ్**

ప్రముఖ పాత్రికేయులు కీ.శే. వి. హనుమంతరావు గారితో నా పరిచయం సరిగ్గా ప్రపంచీకరణ మనదేశంలో అడుగిడిన నాటి నుంచే మొదలైంది. నా 'జర్నలిజం' ప్రవృత్తి కూడా ఈ 'ఆవకాయ' తోనే అన్నప్రాసలా జరిగింది. నాటి నుంచి మా పరిచయం ఓ అనుబంధంలా కడవరకూ సాగింది. నాటి నా అనుభంలో సార్ కల అత్యంత ప్రీతిపదమైన సబ్జెక్టు 'వ్యవసాయం'. ప్రతీరోజు ఏదో ఓ పత్రికకు వ్యవసాయ సాధక బాధకాల మీద ఓ విశ్లేషణ తప్పనిసరి.

ప్రపంచీకరణ ప్రాభవం పెరుగుతూ వచ్చిన నాటికి రైతు ఆత్మహత్యలు ఉనికిలోకి వచ్చాయి. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు పాలకుల ప్రాభవంతో వీర విహంగం చేసిన ఫలితంగా, రుణభారం పెరిగి రైతు ఆత్మహత్యలకు పాల్పడిన నాడు, ఆ వార్తను చదివి, కళ్లు మూసుకుని తీవ్ర క్షోభకు గురైన క్షణాలు ఇంకా నా కనుల ముందు సాక్షాత్కరిస్తూనే ఉన్నాయి. అది దిన-దిన ప్రవర్ధమానమైన వేళ, 'పురుగు మందులే పెరుగన్నమాయెనా?' వంటి కథనాలు రాసి, ఈ పాలకులను 'రైతన్న' నిలదీసే రోజు వస్తుందంటావా? అని బేలగా నన్నడిగిన రోజులూ ఉన్నాయి. అందుకే... మా సార్‌కు మొన్నటి 'భారత్ బంద్' సందర్భాన్ని నివేదించాలనుకుంటున్నాను. ఎందుకంటే? నేడాయన అందనంత దూరాలకు వెళ్లిపోయారు కనుక.

అయితే... సార్, ఈనాటి ఈ ఆందోళన మీరు పనిచేసిన రైతుకూలీ సంఘం వల్లనో, లేకుంటే నేను పనిచేసిన రైతుకూలీ సంఘం వల్లనో సాధ్యం కాలేదు. రైతు అనుభవాల నుంచే ఈ ఆందోళన మొలకెత్తింది. ఆ పై వాస్తవాలను గమనించిన తిండి తింటున్న ప్రతీ ఒక్కరి మద్దతునూ కూడగట్టుకుంది.

సార్, దేశంలోని రాష్ట్రాలన్నింటిలో రైతాంగ కుటుంబాల నెలవారీ సగటు ఆదాయాల సూచికను పరిశీలిస్తే ఈ విధంగా ఉన్నాయి. పంజాబ్ రాష్ట్రంలో రు. 18,059, రాజస్థాన్‌లో రు. 7,350, హర్యానాలో రు. 14,434, గుజరాత్‌లో రు. 7,926, యుపిలో రు. 4,701. ఆ క్రమంలో ఏపిలో రు. 5,979, తెలంగాణలో రు. 6,311 గానూ నమోదైనాయి. ఇది సిట్యుయేషన్ ఎసెస్‌మెంట్ సర్వే ఆఫ్ అగ్రికల్చరల్ హౌస్ హోల్డ్స్ నివేదిక ప్రకారం. ఇంతకీ చెప్పొచ్చేదేంటంటే? దేశంలోకెల్లా కాస్తా అధిక ఆదాయం ఉన్న రైతాంగం నుంచే ఈ ఆందోళనకు అంకురార్పణ జరిగింది. వారే కాస్తా చైతన్యాన్ని రంగరించుకుని ప్రభుత్వం చేపట్టనున్న, చేపట్టిన నూతన వ్యవసాయ చట్టాలను అధ్యయనం చేయగలిగి, 'రైతు'ను కార్పొరేట్ శక్తుల ముందు కుదువపెట్టి, వెట్టి బానిసలుగా నిలువపెట్టనున్నారని గుర్తెరిగింది. కఠోరమైన చలి గాలులకు సైతం వెరవక, భయంకర పోలీసు దాడులకు ఎదురొడ్డి దేశ రాజధానిని దిగ్బంధం చేయగలిగారు. ఇందుకు రేపటి ఆహార భద్రతకు పెను ముప్పు వాటిల్లనుందని తెలుసుకున్న, అన్నం తింటున్న వారంతా చరిత్రలో కనీవినీ ఎరుగని తీరున తమ-తమ సంఘీభావాన్ని వ్యక్తం చేయగలిగారు.

ఈ సంఘీభావం ఒక్క మనదేశంలోనే కాదు సారు. అంతర్జాతీయంగా కూడా.. లండన్‌లో వేలకొలది కార్లు గంటల పాటు నిలిపివేసి తమ నిరసన ద్వారా సంఘీభావాన్ని తెలిపారు. ఆ దేశ హై కమిషనర్‌ను దిగ్బంధం చేశారు. అమెరికా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలోనూ ర్యాలీలను నిర్వహించారని పత్రికల్లో చూశాం. ఈ ర్యాలీలను అడ్డుకోవాలని సిగ్గులేని భారత ప్రభుత్వాలు ఆయా హై కమిషనర్లను ఆదేశించినా ఫలితం లేకపోయింది. దీంతో రైతన్న కన్నెర్ర చేస్తే ఏం జరగనుందో దళారీ పాలకులకు కనువిప్పు కలిగింది. అందుకే దఫ-దఫాలుగా రైతన్నలను మసిపూసి మారేడుకాయ చేసిన రీతిన బుజ్జగించే పలు ప్రయత్నాలను ధీదరిస్తూ 'ఆయా నల్ల చట్టాలను రద్దు చేస్తావా? చేయవా?' అనే ఒకే ఒక్క డిమాండుతో నిలవేయడం జరుగుతా ఉంది. ఇంతకీ, ఇంతటి ప్రభావిత కారకాలైన ఆ చట్టాలేంటో చూద్దాం!

ఇంతవరకూ అమల్లో ఉన్నాయంటున్న ప్రభుత్వపర కొనుగోళ్లు అమల్లో ఉన్నాయా? ఉన్నాయి.. కానీ కాగితాల మేరమే. రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన మార్కెటింగ్ యార్డులు ఉన్నా అనేక అవకతవకలతో, అవినీతి ధోరణులతో మురిగిపోయి ఉన్నాయి. కళ్లున్న కబోదుల మాదిరిగా ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయి. ప్రభుత్వాలు ప్రకటించిన కనీస మద్దతు ధరలు అమలు కావడం లేదు. కావు సరికదా, సదరు మార్కెట్ యార్డులు కాలక్రమంగా మూతపడుతున్నాయి. పైన పేర్కొన్న చర్యలన్నీ ఇతోధికంగా పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో రైతన్నల అనుభవంలోకి వచ్చాయి. ఈ రాష్ట్రంలో కూడా. ఈ చర్యలన్నీ 'ప్రవేటీకరణ'ను సానుకూల పర్చేందుకేనని రుఢి అవుతుంది. అయ్యింది కూడా అనుభవం రిత్యా.

రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే అధికారంలో ఉన్న ప్రతి పార్టీ ఎలుగెత్తి అరిచింది. సమస్కల పరిష్కారానికే నియమించిన, అనేకానేక కమిటీలు ప్రతిపాదించిన సూచనలన్నీ 'స్వచ్ఛ భారత్' పరమైనాయి. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు, నకిలీ పరుగు మందులు రైతన్నల ఉసురు తీసేందుకే దోహదపడ్డాయి కానీ, సేద్య సంస్కరణలకు ఉపయోగపడలేవు. పైగా ఆయా కంపెనీలు కోట్లకు పడగలెత్తి దళారీల జేబులు నింపాయి. ఫాం హౌస్‌లను విస్తరింపచేశాయి. ఇదంతా నేపథ్యం.. (గతం నుంచి ఉనికిలో ఉన్నవే..)

మరి ఈ హిందుత్వ ప్రభుత్వం చేపట్టిన నూతన చట్టాలేంటి? వీటిల్లో ప్రప్రథమంగా 'ఒన్ మార్కెట్ - ఒన్ నేషన్' ఒకే దేశం - ఒకే మార్కెట్ అన్న ట్యాగ్‌లైన్‌తో స్వేచ్ఛాయుత మార్కెట్ చట్టం మొదటిది. దీని ప్రకారం రైతు తన ఉత్పత్తిని దేశంలో ఎక్కడైనా, ఎంతకైనా అమ్ముకోవచ్చు. ఏ వ్యాపారైనా, ఎంతటి వ్యాపారైనా రైతు ఉత్పత్తిని కొనుగోలు చేయవచ్చు. చూడడానికి బాగానే ఉంటుంది, ఉంది కూడా. కానీ ఆచరణలో జరిగేదేంటంటే, కార్పొరేట్ వ్యాపారి ప్రాంతాల వారీగా ఆక్టోపస్‌లా ఆక్రమించేస్తాడు. ప్రభుత్వాలు కంటితుడుపుగా ప్రకటించిన కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పి) ప్రేక్షక పాత్ర వహిస్తాయి. వ్యయాన్ని తగ్గించే మిష

మీద మార్కెట్ యార్డులు మాయమైపోతాయి. ఇతోధికంగా వాడ వాడలా ప్రైవేట్ మార్కెటింగ్ సంస్థలు వెలుస్తాయి. అవే మార్కెట్‌ను నిర్దేశిస్తాయి. ఫలితంగా రైతన్న మరింత దోపిడీకి గురవడం తథ్యం.

ఇక రెండోది ఒప్పంద వ్యవసాయ చట్టం. నిర్దేశిత కాలానికి ప్రైవేట్ వ్యాపారులు రైతులతో ఏఏ కాలాల్లో ఏఏ పంటలు పండించాలో నిర్ణయిస్తారన్న మాట. నేడు తెలంగాణలో ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్దేశించినట్లు రైతులంతా పత్తినే పండించాలి. అలాగే వరి సేద్యంలో దొడ్డు వడ్ల స్థానే సన్న వడ్ల సేద్యం చేయాలి. లేకుంటే రైతుబంధు వంటి సంక్షేమ పథకాలు 'బంద్' అంటారు. మరి ఈనాడు తెలంగాణ రైతన్నలు ఎదుర్కొంటున్న కష్ట కాలాన్నే దేశవ్యాప్త రైతన్నలూ ఎదుర్కోవల్సి వస్తుంది. వ్యాపార గిరాకీని బట్టి, వ్యాపారులు పంటలు పండించాలని నిర్దేశిస్తారు. అక్కడితో ఆగకుండా ఏఏ ఎరువులు – ఏఏ విత్తనాలు, పురుగు మందులు వాడాలో వారే నిర్ణయిస్తారు. ఎందుకంటే వారంతా వ్యాపార సకుటుంబ బంధు మిత్రులు కదా! ఫలితంగా సన్నకారు రైతన్నలు ఈ భారాల్ని మోయలేక, ఒప్పందాల నుంచి బయటపడలేక చేతులెత్తేసి, సేద్యానికి 'మంగళం' పాడేసి, ఉన్న కడకు చేసిన అప్పు మేరకు వదిలేసుకుని మొన్న మనం చూసిన వలస కార్మికుల్లా ఊరు విడిచిపోవాల్సి వస్తుంది. లేదా కార్పొరేట్ వెట్టి జీతగాడిగా జీవనాన్ని తన సొంత పొలంలోనే నెరపాల్సి వస్తుంది.

దీనికి తార్కాణంగా నిన్నటి గుజరాత్ – పంజాబ్ రాష్ట్రాల్లో ఆలుగడ్డల సేద్యం విషయంలో పేటెంట్ హక్కు పేరిట రైతు నోట్లో మన్నుకొట్టడం చూశాం. ఈ ప్రక్రియ ఈనాటిదే కాదు, నాటి ఈస్ట్ ఇండియా కంపెనీ నీలిమందు సేద్యంలో కూడా అమలు చేసి చూపింది. దాన్ని నేటి పాలకులు అనుసరించ యత్నిస్తున్నారు. ఫలితంగా తిండిగింజలు కరువై, ఆహార భద్రత పెను ప్రమాదంగా ముంచుకొచ్చి 'బెంగాల్ కరవు' పరిస్థితులు నాడు అనుభవంలోకి వచ్చాయి. నేడు మళ్లీ పునరావృతం అవనున్నాయి.

ఇక మూడోది నిత్యావసర వస్తువుల సవరణ చట్టం. రైతన్నలు తమ ఉత్పత్తులను ఓ పరిమితి మేరకే నిలువచేసుకోవాలి. ఇప్పుడా పరిస్థితిని ఎత్తివేసి ఎంత స్థాయిలోనైనా నిలువచేసుకొని, మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చని. వినడానికి బాగానే ఉంది. రైతు శ్రేయస్సును కాంక్షించే ఈ చట్టం తీసుకొచ్చినట్లు అనిపిస్తుంది. కానీ, ఆచరణలో ఇది అసాధ్యం. ఎలా అంటే? పరిమితిని దాటిన ఉత్పత్తిని నిలువచేసుకునే శక్తి, వనరులు మన సన్నకారు రైతాంగానికి ఉందా? ఉన్నాయా? నిలువచేసే సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా? లేకుంటే ప్రభుత్వం ఏర్పాటు చేయగలదా, చేస్తుందా? ఏ శక్తి – వనరులు లేక సేద్యానికై చేసిన రుణ భారాన్ని వదిలించుకునేందుకు, రుణమాఫీ వంటి అబద్ధాలకు నీళ్లొదిలి అయిన కాడికి అమ్ముకునే పరిస్థితి నేటి మన రైతన్నది.

ఇవన్నీ కంటితుడుపు శుష్క వాగ్దానాలే! కనుక రైతన్నల శ్రేయస్సు కొరకేనని చెపుతున్న ఈ నల్ల చట్టాలను రూపొందించే క్రమంలో ఎవ్వరితోనూ, ఏ రైతు సంఘాలనూ సంప్రదించకుండా, కార్పొరేట్ శక్తుల అభీష్టం మేరకే, కనీసం ప్రజాస్వామ్యయుతంగా పార్లమెంట్‌లో నైనా చర్చించకుండా, 'ఆర్డినెన్స్' రూపంలో తీసుకొచ్చి 'రబ్బరు స్టాంపు' ఆమోదంను పొందగలిగారు. మరీ చట్టాల ద్వారా ఒనగూరేదేంటి?

'పెట్టుబడి' తన ఉనికి కోసం, ప్రాభవం కోసం కృత్రిమ కొరతను సృష్టిస్తుంది. నేడు జరుగుతున్నదీ అదే. ఆహార నిల్వలు శక్తి మించి పెరిగి పందికొక్కుల పాలవుతున్నాయని వింటున్నాం. సామాన్యుడు మాత్రం పెరుగుతున్న ధరలతో సతమతమౌతున్నాడు. ఆహార అవసరాలు, ప్రజావసరాలను కార్పొరేట్లు పట్టించుకోకుండా (పట్టించుకుంటే పెట్టుబడి దారులెలా అవుతారు?) విదేశాలకు ఎగుమతి చేసేందుకు కృషి చేస్తారు. 'ఆహార భద్రత'కు తూట్లుపడే ప్రమాదం పొంచి ఉంటుంది. అందుకే తిండితినే ప్రతీ ఒక్కరి సమస్యే అయింది నేడు. అందుకే నేడు ఇంతటి మద్దతు ఈ ఆందోళనకి. పాలకుల ప్రజాధరణ వ్యక్తిగతం. అందుకు అది సుస్థిరతకు హామీనివ్వదు. పాలకులు ఎవరైనా నూతన చట్టాలను తీసుకొచ్చే ముందు వాటి ఆవశ్యకతను, వాటి ద్వారా ప్రజానీకానికి ఒనగూరు ప్రయోజనాల గురించి విస్తృతంగా ప్రచారం చేసి జనామోదాన్ని పొందడం ఆవశ్యకం. అదెప్పుడు సాధ్యమౌవుతుంది? ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రజాహితంగా చట్టాలను రూపొందించినప్పుడే. కానీ ఏ కార్పొరేట్ శక్తులకో అమ్ముడు పోయి, వారు విదిల్చే ఎంగిలి మెతుకులకు అర్రులు చాస్తే మాత్రం సాధ్యం కాదు. మరి నేటి నల్ల చట్టాల పట్ల రైతన్నలు ఆవేదన చెందుతున్నారు ఎందుకు? అన్నది భేషజాలకు పోకుండా చర్చించాల్సి ఉంది. అది అనివార్యం కూడా! నిరంకుశ ప్రభుత్వాల పట్ల వ్యతిరేకత సామాన్యుడి నుంచే వస్తే, దానికి తిరుగుండదు. ఆచరణలో దీన్ని 'చరిత్ర' పలుమార్లు రుజువు చేసిన దాఖలాలున్నాయి.

దేశానికి వెన్నెముకగా నిలిచిన రైతన్నను – ఆయన జీవన గమనాన్ని పునరాలోకనం చేసినప్పుడు రైతు దుక్కిదున్నిన నాటి నుంచి కష్టకాలమే! పెట్టుబడికై యాతన, 'సంక్షేమం' సాధారణ రైతు వరకూ రాదు. ప్రైవేట్ రుణమే దిక్కు. పలు ఈసడింపులతో, మొక్క నాటితే నకిలీ విత్తనాలతో భవితవ్యం ముడిపడి ఉంటుంది. నకిలీ ఎరువులతో అదృష్టాన్ని పరీక్షించుకుని సేద్యాన్ని చేపడితే, ప్రకృతి వైపరిత్యాల ముసుగులో పాలకుల తప్పిదాలకు తలొంచాల్సి వస్తుంది. అదృష్టం బాగుండి పంట చేతికొస్తే అమ్మకం ఓ యాతన. మార్కెట్ యార్డుల, దళారీల ముందు తలొంచాలి. పంటల బీమాలు సోదిలోకి రావు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతులు దులిపేసుకుంటున్నాయి. నష్టపరిహారాలు – హామీలు చేష్టలుడిగి చూడడం మినహా ఏం చేయలేవు. చేస్తేగీస్తే ఒక్క వెక్కిరింపు తప్ప!

ఇది సారూ! అభివృద్ధి పేరిట 'ప్రపంచీకరణ' మార్పుల ప్రేయం, కార్పొరేట్ శక్తులను జాతీయంగా, అంతర్జాతీయంగా ముప్పై ఏళ్లుగా పెంచి పోషించడం జరిగింది. సహజ న్యాయ సూత్రరీత్యా ఒకరి అభివృద్ధి మరొకరి వినాశనంతోనే ముడిపడి ఉంటుంది కదా! అందుకే అంతర్జాతీయ ఆర్థిక సంస్థల అభివృద్ధితో ఇతోధికంగా నష్టపోయినవారు రైతన్నలే. వ్యవసాయక దేశంగా, అనూహ్య వనరులతో – జల సంపదతో విలసిల్లి 'అన్నపూర్ణ'గా, ఓ 'రత్నగర్భ'గా వినుతికెక్కిన భారతదేశం అంగాంగ తాకట్టులకు నెలవవుతుంది. పలు దేశాలు మనపై పెత్తనానికి పోటీ పడుతున్నాయి. అంతర్జాతీయ ఖ్యాతికోసం మన పాలకులు వారి ప్రాభవానికై నల్ల సాగు చట్టాలను ప్రజాస్వామ్యం ముసుగుతో, ఆర్డినెన్సుల ద్వారా ప్రజల నెత్తిన రుద్ద యత్నిస్తున్నారు. వాటిపై, వారి 'నియంతృత్వ ధోరణి'పై నేడు సామాన్య రైతు కన్నెర్ర చేశాడు.

అందుకే ఈ నల్ల చట్టాలను రద్దు చేసేంతవరకూ విశ్రమించేది లేదని తెగేసి చెపుతున్నాడు. ఎన్ని రాతపూర్వక హామీలకైనా తల వంచేది లేదంటున్నాడు. ఎంఎస్‌పి, ప్రైవేట్ మార్కెట్లను, ప్రైవేట్ వ్యాపారులను రిజిస్ట్రేషన్ చేస్తామన్నా ససేమిరా అంటున్నాడు – ఎన్నాళ్లయినా తమ ఆందోళనను కొనసాగిస్తానని తెగేసి చెప్తున్నాడు. సకల ప్రగతిశీల శక్తులు తమ మద్దతును ప్రకటిస్తున్నారు. అంతటితో ఆగకుండా రేపటి ఏ ప్రైవేటీకరణనైనా ఇదే ధోరణితో వ్యతిరేకిస్తామంటున్నారు. అందుకే ఇదో మార్గదర్శకంగా నిలిచే ఆందోళన. మీరుంటే ఎంత బాగుండేది సారూ!

(డిసెంబర్ 13న కీ.శే. వి. హనుమంతరావు గారి 4వ వర్ధంతి సందర్భంగా)

(రచయిత పాత్రికేయులు)

తెలంగాణ ఎన్నికలు - ప్రజాస్వామ్యం ఎక్కడ?

ఎన్నికల్లో ప్రజల సమస్యలను కేంద్రం చేయకుండా పాలకులు ప్రలోభాలకు, భావోద్వేగాలకు గురిచేసి ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నారని అంటున్నారు **వంగాల సంపత్ రెడ్డి**

దుబ్బాక, జిహెచ్ఎంసి ఎన్నికలు ముగిసి ఫలితాలు కూడా వచ్చాయి. దుబ్బాకలో పాలకవర్గ అంచనాలను, ఎన్నికల విశ్లేషకుల అంచనాలను తలకిందులు చేస్తూ బిజెపి విజయం సాధించింది. తనకు ఎదురేలేదనుకున్న పాలకవర్గ పార్టీకి (టిఆర్ఎస్) ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ మూడవ స్థానానికి దిగజారి తెలంగాణలో తన అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసుకున్నది. జిహెచ్ఎంసి ఫలితాల్లో పాలకవర్గ పార్టీ అధిక స్థానాల్లో గెలిచినా మేయర్ పదవిని చేజిక్కించుకోవడానికి మరొకరి సహాయం కావల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో హైదరాబాద్‌లో రాజకీయాలు ఎలా మారబోతున్నాయో! ఎంఐఎం తన స్థానాలను నిలబెట్టుకుంది. అయితే మూడవ స్థానంలోకి దిగజారింది. అనూహ్యంగా బిజెపి ఊహించిన దానికన్నా ఎక్కువ స్థానాలు గెలిచి రెండవ స్థానంలోకి వచ్చింది.

దుబ్బాక, జిహెచ్ఎంసి ఎన్నికల ఫలితాలు తెలంగాణ పౌర సమాజానికి, రాబోయే సంక్షోభానికి ప్రమాద ఘంటికలుగా ప్రజాస్వామిక వాదులు భావిస్తున్నారు. ఈ పరిస్థితికి కారణం ఎవరు? ఈ పరిస్థితి తలెత్తడానికి ఉన్న పరిస్థితులు ఏంటి?

'రైతులకు మేలు చేస్తున్నాం. వృద్ధులకు పెన్షన్స్ ఇస్తున్నాం. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టిస్తున్నాం. ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో దేశంలోనే ముందున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ సస్యశ్యామలం చేస్తున్నామ'ని ఎన్ని మాటలు చెప్పినా తెలంగాణ పాలకవర్గ పార్టీని (టిఆర్ఎస్) ప్రజలు ఎందుకు ఆదరించలేదు అనే ఒక మౌలిక ప్రశ్న మన ముందుకు వస్తుంది.

నిజానికి తెలంగాణ ప్రభుత్వం తన ప్రజాస్వామిక లక్షణాలను 2014లోనే కోల్పోయింది. రకరకాల వ్యూహాలతో తెలంగాణ సమాజాన్ని గందరగోళంలో ఉండేటట్లు చేసింది. ఆ గందరగోళంలో తెలంగాణ పాలకవర్గ స్వభావాన్ని ప్రజలు సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారు.

తెలంగాణలో 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు తెలంగాణ సమాజం ఎంత వైవిధ్యంగా ఆలోచిస్తుందో తెలిపే ఎన్నికలు. తెలంగాణ సమాజ ప్రజాస్వామిక లక్షణాన్ని ఎలుగెత్తిన ఎన్నికలు. తెలంగాణలో వివిధ వర్గాలకు చెందిన ప్రజల ఆకాంక్షలను వెలిబుచ్చే విధంగా భిన్న రాజకీయ పార్టీల ప్రతినిధులను శాసన సభకు పంపిస్తే వాళ్లందరినీ మార్కెట్లో కూరగాయల్లాగా కొనేసి ఆలోచనలను, ఆకాంక్షలను వ్యక్తం చేయలేని, భిన్న ఆలోచనలకు తావులేని ఒక వాతావరణాన్ని సృష్టించింది తెలంగాణ పాలక వర్గం. అధికార వర్గం తప్ప మరొక వర్గం లేదు అని ప్రచారం చేయడంలో సఫలమయ్యారు. గేదె ఎక్కడున్నా సరే నా దొడ్లోనే పాలు ఇవ్వాలనే సామెతను బలంగా నమ్మి నయానో భయానో ప్రతిపక్షాలను, ప్రశ్నించే వారిని లేకుండా చేసుకున్నారు. ఒక విధంగా చెప్పాలంటే రాజకీయ శూన్యతకు దారితీసే మార్గాలకు పాదులు వేసింది.

ఆ క్రమంలోనే తమ నిరసనలను తెలుపడానికి ప్రజలకు అనుమతి ఇవ్వకపోవడం, హాలు మీటింగులకు కూడా ఎక్కడా లేని విధంగా అనుమతులు తీసుకోవాలని అనడం, ప్రజలు తమ ఆగ్రహాన్ని వ్యక్తపరచడానికి ధర్నాలకు దిగితే ధర్నాలకు అనుమతులు ఇవ్వకపోవడం, ధర్నాచౌక్‌లను రద్దుచేయడం, ప్రశ్నించే గొంతులను నులిమి వేయడం, నిరసన ప్రదర్శన చేస్తారని అనుమానం వస్తే చాలు ముందస్తు దిగ్బంధనాలు చేసి అరెస్టు చేయడం ద్వారా మాట్లాడలేని వాతావరణాన్ని సృష్టించింది.

తెలంగాణ పాలకవర్గం మొదటి నుండి కూడా ప్రజాస్వామిక వాతావరణాన్ని కలుషితం చేసింది. కలుషితం చేసిన వాతావరణంలో భిన్న ఆలోచనలను, తెలంగాణ కోసం నడిచిన శక్తులను నిర్లక్ష్యం చేసింది. తెలంగాణ కోసం నడిచిన శక్తుల్లో ప్రజల కోసం నిజాయితీగా పనిచేసే వారున్నారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని తపించిన వారున్నారు. అధికారాన్ని తృణప్రాయమని భావించే వారున్నారు. వారందరిని తెలంగాణ పాలక వర్గం నిర్లక్ష్యం చేసింది.

తమ సమస్యలను పరిష్కరించాలనే క్రమంలో ఆర్‌టిసి ఉద్యోగులు సమ్మె చేస్తే పాలక వర్గం ఆ ఉద్యోగుల పట్ల ఎలా వ్యవహరించిందో తెలంగాణ సమాజం గమనించింది. అంతేకాదు తెలంగాణ పౌర సమాజం ఆర్‌టిసి ఉద్యోగులకు సంఘీభావంగా నిలబడ్డది. నిజానికి ఆర్‌టిసి ఉద్యోగులు తెలంగాణ పాలక వర్గ స్వభావాన్ని బట్టబయలు చేసి నగ్నంగా నడిబజారులో నిలబెట్టారు. తెలంగాణ పాలక వర్గం వ్యవహరించిన తీరును గమనించిన వారికి భవిష్యత్తులో తెలంగాణ ఎలా ఉండబోతుందో అర్థం అయింది.

ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం చేస్తున్నటువంటి దుష్ప్రచారం, ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి నిజానికి ఒక ప్రజాస్వామిక ప్రభుత్వం వ్యవహరించవలసిన పద్ధతిలో లేదు.

విలువలతో కూడిన రాజకీయాల కన్నా అధికారం కోసం విలువలను వదిలివేసి చేస్తున్న వ్యూహాలు, ఎత్తుగడలు రాజకీయమై చలామణి అవుతున్న వేళ పాలక వర్గం ఎలాంటి ప్రజాస్వామ్యాన్ని నిర్మించాలనుకున్నదో కదా!

తెలంగాణలో ఏర్పడ్డ పార్లమెంటరీ రాజకీయ శూన్యతను పూరించడానికి హిందూత్వ ఎజెండా కలిగిన బిజెపి కార్పొరేట్ శక్తులతో కలిసి ముందుకు వచ్చింది. ఈ క్రమంలోనే జిహెచ్ఎంసి ఎన్నికలను, ఫలితాలను చూడాలి.

బిజెపి తన ఎన్నికల ప్రచారంలో స్థానిక సమస్యల కంటే రోహింగ్యాల సమస్యను, కశ్మీర్ సమస్యను, 370 ఆర్టికల్ రద్దును, గో హత్యను

తదితర అంశాలకు ప్రాధాన్యత ఇచ్చింది. ఒక విధంగా చెప్పాలంటే ప్రజల సున్నిత భావోద్వేగ అంశాలను ముందుకు తెచ్చింది. ఇలాంటి సమయంలో హైదరాబాద్ చుట్టూ కమ్ముకుంటున్న ఫాసిస్టు మేఘాలను చూసి లబోదిబోమని అరుస్తున్నది తెలంగాణ పాలక వర్గం. అంతేకాదు ఎవ్వరూ ఎందుకు మాట్లాడరని ప్రశ్నిస్తున్నది. నేరం అంతా ప్రజలదనీ, మేధావులదనీ ఆరోపిస్తున్నది. ప్రజాస్వామిక వాతావరణాన్ని నాశనం చేసిన తెలంగాణ పాలకవర్గం తాను తీసుకున్న గోతిలో తానే పడింది. ఇప్పుడు ఎన్ని మాట్లాడితే ఏమిటి చెరువులో నీళ్లు చెరువెనుకాల పడినాక?

ఉద్యోగులు, యువత, నిరుద్యోగులు, వివిధ వర్గాలు ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నాయనే వాదన చాలా కాలం నుండి వినిపిస్తూ ఉంది. అయినా వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం, పైగా కావాలనే నిర్లక్ష్యం వహించడం కూడా టిఆర్ఎస్ ఓడిపోవడానికి ఒక కారణం. ఆస్తుల నమోదు కోసం కొత్తగా ధరణి వెబ్‌సైట్ తీసుకురావడం, ఆ పేరుతో నెలల తరబడి రిజిస్ట్రేషన్ నిలిపివేయడంపై క్షేత్ర స్థాయిలో ప్రజల ఆలోచనలు ఏ విధంగా ఉన్నాయో తెలుసుకోవడానికి తాజా ఎన్నికల ఫలితాలు ఒక ఉదాహరణ.

ఒకపక్క సన్న వడ్లను సాగు చేయాలని రైతులకు చెప్పి కొనుగోలు చేపట్టకపోవడం, రైతుబంధు నిధులు సకాలంలో బ్యాంకు ఖాతాల్లో జమ చేయకపోవడం కూడా పాలక వర్గ పార్టీ ఓటమికి కారణం. హైదరాబాద్ నగరంలో, వరంగల్ లాంటి నగరాల్లో భారీ వర్షాల వల్ల వచ్చిన వరదల వల్ల మౌలిక వసతులు దెబ్బతినడం ఆలస్యం కావడం కూడా ఒక కారణం. వీటన్నిటి వల్ల ప్రభుత్వ ఇమేజ్ దెబ్బతిన్నది.

మొదటి నుంచి పాలక వర్గ పార్టీకి పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే పట్టు ఎక్కువ అంటారు. పైగా రైతు సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువగా అమలు చేసిందని ప్రచారం చేసుకుంది. అయినా గ్రామీణ ప్రాంతాలు గల దుబ్బాకలో టిఆర్ఎస్ ఓడిపోయింది. దీనికి అక్కడున్న ప్రత్యేక పరిస్థితులేమిటో అధ్యయనం చేయాలి.

ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత ఒక కారణం కాగా, పార్టీలో అంతర్గతంగా నెలకొన్న అసంతృప్తిని సకాలంలో గుర్తించి తగ్గించ లేకపోవడం కూడా మరొక కారణంగా ఎన్నికల విశ్లేషకులు చేస్తున్న విశ్లేషణ. నిజానికి తెలంగాణ పాలకవర్గం ప్రైవేట్ సంస్థలు చేసిన సర్వేల మీద ఆధారపడడమే కాకుండా, తమ చేతుల్లో ఉన్న పోలీస్ నిఘా విభాగం ఇచ్చే నివేదికపై కూడా ఆధారపడి క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతున్నదో పట్టించుకోకపోవడం వల్ల తెలంగాణ పాలకవర్గ పార్టీ (టిఆర్ఎస్) ఓడిపోయింది.

చాలా సహజంగా లభించే మంచి నీటిని ఉచితంగా ఇస్తామని చెప్పడం అంటే నీరు ఎలా సరుకుగా మారిందో హైదరాబాద్ ఎన్నికలు నిరూపించాయి. ఎలక్షన్లకు ముందుగా ఇంటి పన్ను రద్దు చేస్తున్నామని చెప్పడం ద్వారా ప్రజలను తాత్కాలికంగా ప్రలోభపెట్టే ప్రయత్నం చేసింది పాలక వర్గం. అయినా తాము అనుకున్న ఫలితాలను పొందలేకపోయింది. పేద వాళ్ల జీవితాలను బాగు చేయకుండా కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ పరచడం కూడా మరొక కారణం కావచ్చు.

ఒక విధంగా చెప్పాలంటే అధికారం కోసం ఒకే రకమైన రెండు శక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ప్రజలు అనివార్యంగా ఎవరినో ఒకరిని ఎన్నుకోవాల్సిన పరిస్థితి ఈ ఎన్నికలలో జరిగింది. ప్రజలకు ప్రత్యామ్నాయం లేని స్థితిలోనే ఈ ఎలక్షన్‌లు జరిగాయి. నిజంగా ప్రత్యామ్నాయంగా ముందుకొస్తే రేపు భవిష్యత్తు ఎలా ఉంటుందో?

(రచయిత అధ్యాపకులు) వీ

ఆదిలాబాద్ జిల్లా ఆదివాసుల దుస్థితి

***అభివృద్ధి పేరుతో పాలకులు ఆదివాసులను అడవి నుండి బయటికి పంపి అక్కడి వనరులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే కుట్రను కొమురం భీం స్ఫూర్తితో అడ్డుకోవాలని అంటున్నారు* చక్రవర్తుల శ్రీమన్**

జల్, జంగల్, జమీన్ కోసం నిజాం సైన్యాన్ని ఎదిరించి, ధిక్కార స్వరం వినిపించి, పోరాడి అమరుడైన కొమురం భీం వారసులుగా ఉన్న ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీల అస్థిత్వం నేడు ప్రశ్నార్థకంగా మారింది. ఆదివాసీలు జీవచ్ఛవాలుగా బతకాల్సి వస్తుంది. నిత్యం ఏదో ఒక సమస్యతో ఆదివాసీల మనుగడ ఈ జిల్లాలో ప్రశ్నార్థకమైంది.

ఆదివాసీ ప్రాంతాలైన డొర్లి, కైరిగూడ, అబ్బాపూర్ లాంటి ప్రాంతాలలో ఓపెన్‌కాస్ట్‌లు వచ్చి నిర్వాసితుల్ని చేశాయి. కొత్తగా ఆసిఫాబాద్ జిల్లాలోని 'మోవాడ్' ప్రాంతంలో ఓపెన్‌కాస్ట్ ఏర్పాటుకు సన్నాహాలు మొదలైనవి. ఏజెన్సీ మండలాలైన కాసిపేట, మందమర్రిలో కెకె-2 ఓపెన్‌కాస్ట్‌ను బలవంతంగా తీసికువచ్చారు. ఏజెన్సీలో ప్రజాభిప్రాయ సేకరణ, 1/70, పెసా, 5వ, 6వ షెడ్యూల్స్‌ను తుంగలో తొక్కి యథేచ్ఛగా పరిశ్రమలు, ఓపెన్‌కాస్ట్‌లు ఏర్పాటు చేస్తూ, ఆదివాసీలను నిత్యం నిర్వాసితులను చేస్తున్నారు. ప్రశ్నించిన వాళ్లపై వందలాది కేసులు మోపి, కోర్టుల చుట్టూ తిరిగేటట్లు చేస్తున్నారు. చట్టాల ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతున్నది.

కవ్వాల టైగర్ జోన్ పేరిట ఐదు మండలాలలోని నలభై గ్రామాల ప్రజలను నిర్వాసితులను చేస్తున్నారు. ఈ నలభై గ్రామాల అటవీ భూమిలో క్వార్జ్, క్రిస్టల్, ఐరన్ ఓర్ లాంటి సహజ వనరులు ఉన్నాయి. ఈ వనరులను రాబోయే రోజుల్లో బహుళజాతి కంపెనీలకు అంటగట్టడానికే టైగర్ జోన్‌లు ఏర్పాటు చేశారు. కోట్లాది రూపాయలు కాంట్రాక్టర్స్‌కి, రాజకీయ నాయకులకు ముడుపుల రూపంలో అందుతున్నాయి. వాస్తవానికి టైగర్ జోన్ ఏర్పాటులో భాగంగా అక్కడికి వెళ్లిన ప్రజా సంఘాలకు ఆదివాసీలు ఇచ్చిన సమాధానం ఏమిటంటే, 'పులులతోనే మా సహవాసం, ఇంకా పులుల పేరుతో మమ్మల్ని, మా సంస్కృతిని దెబ్బతీస్తూ మైదాన ప్రాంతాలకు తరమడాన్ని వ్యతిరేకిస్తున్నా'మన్నారు. అయినా బలవంతాన గ్రామాలను ఖాళీ చేయించారు. ప్రభుత్వానికి పులులపై ఉన్న ప్రేమ ఆదివాసీలపై లేదని అంటున్నారు.

నిర్మల్ జిల్లాలోని కుంటాల హైడల్ ప్రాజెక్టు వల్ల నేరడిగొండ మండలంలోని ఆదివాసీ ప్రజలు నిర్వాసితులు కాబోతున్నారు. అంబేద్కర్ సుజల ప్రాజెక్టు పేరుతో ఏర్పడ్డ ప్రాణహిత చేవెళ్ల కింద ఉన్న కొద్దిపాటి భూమి కోల్పోయిన వాళ్లు ఆదివాసీలే. ఇప్పుడు ఆ ప్రాజెక్టు పూర్తికాక, ఉన్న కొద్దిపాటి భూమి పోయి రెంటికి చెడిన రేవడిలా ఆదివాసీల స్థితి ఉంది.

ఇంకొక వైపు ప్రతి సంవత్సరం జిల్లాలో ఏజెన్సీ మరణాల శాతం ఎక్కువ. మెజారిటీ ఆదివాసీ గ్రామాలలో మంచినీటి సౌకర్యం లేకుండా పోయింది. మిషన్ భగీరథ ఇంకా పూర్తి కాలేదు. ఏజెన్సీలో కలుషిత నీరు తాగి డయేరియా, విష జ్వరాలతో పాటు, ఈ మధ్య కాలంలో 'కరోనా' రోగంతో చాలా మంది ఆదివాసీలు ఆసుపత్రుల దాకా వెళ్లకుండానే ప్రాణాలిడిచారు. శవాలను భుజాలపైన వెసుకొని శవ సంస్కారం జరపడం, పిల్లలు, వృద్ధులు, మహిళలు, ముఖ్యంగా గర్భిణీ స్త్రీల మరణాలు కలచివేస్తున్నాయి. ఆదివాసీల చావు చెప్పలేనంత హీనంగా తయారయింది. గర్భిణీ స్త్రీలకు రోడ్డు సౌకర్యం లేక, నదులు, కాలువలు దాటుతూ ఆసుపత్రులకు వెళ్లడానికి నానా తంటాలుపడి చేరినా సరైన వైద్యులతో పాటు, మెరుగైన వైద్యం అందక చనిపోతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర ముఖ్యమంత్రి కొమురం భీం వర్ధంతికి వచ్చి 'ఇక నుంచి ఏజెన్సీలో ఆదివాసీలు వైద్యం అందని మరణాలు ఉండవని, రక్తహీనతతో చావరని' చెప్పి ఆరు సంవత్సరాలు గడుస్తున్నా 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా జిల్లా ఏజెన్సీ వైద్యం వెక్కిరిస్తుంది. మరింత ఎక్కువగా ఆదివాసీలు చస్తున్నారే తప్ప, మరణాలు ఆగడం లేవు. ఏజెన్సీలో వైద్యుల కొరత, ఇతర స్టాఫ్, నర్సులు, ల్యాబ్ టెక్నిషియన్స్ లేక, సరైన పడకలు, మందులు లేక అత్యంత దుర్భరంగా ఏజెన్సీలో వైద్యం ఉంది.

జిల్లాలో ఆదివాసీలకు విద్య, ఉపాధి కరువైంది. హెమన్ డార్ఫ్, రిపోర్టు, రాంజీగోండు, కొమురం భీం, ఇంద్రవెల్లి పోరాటాల వల్ల ఐటిడిఎలు ఏర్పడ్డా ఇంతవరకు ఆదివాసీలకు ఒరిగింది ఏమీలేదు. ఒకే సామాజిక వర్గానికి ప్రయోజనాలు, విద్య, వైద్యం అందిందే తప్ప మెజారిటీగా ఈ ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీలకు విద్య పరంగా, ఉపాధి పరంగా ఎలాంటి లాభం చేకూరలేదు. పైగా ఆదివాసీ విద్యార్థుల సీట్లు ఇతర సామాజిక వర్గాలకు కేటాయించడం, తద్వారా ఆదివాసీ విద్యార్థులు ఉన్నత విద్యకు నోచుకోకుండా పోతున్నారు. ఊట్నూరు డివిజన్‌లో గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు చేస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాట ఇచ్చి తప్పింది.

జిఒ నెం. 27 ఆదివాసీల పాలిట శాపంగా మారింది. ఒకవైపు ఆదివాసీల జిల్లా అంటూనే ఆదివాసీల అస్థిత్వం ప్రశ్నార్థకమైంది. రాంజీగోండు, కొమురం భీం, ఇంద్రవెల్లి పోరాటాలు ఆదివాసీల ఉనికిని ఉన్నత స్థితిలోకి తీసుకెళ్లినా, నేడు ఆదివాసీలను అడుక్కునే వాళ్లుగా, మద్యానికి బానిస చేసి, ఆదివాసీ ప్రాంత ప్రజల సంస్కృతిని దెబ్బ తీస్తున్నారు.

ఆదివాసీ ప్రతినిధులుగా ఎంఎల్ఏ, ఎంపిలు ఉన్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. అన్ని ప్రాజెక్టుల కింద నిర్వాసితులు

ఆంధ్రప్రదేశ్ రాజధాని సమస్య పరిష్కారం ఏమిటి?

అమరావతే రాజధానిగా ఉండాలని స్థానిక రైతులు, ప్రతిపక్ష పార్టీలు సంవత్సర కాలంగా ఉద్యమిస్తున్నా, సమస్యను పరిష్కరించకుండా ప్రభుత్వం వారిని పోలీసులతో అణచివేస్తోందంటున్నారు **చిమ్మె. జాన్ బర్నబాస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయిన తర్వాత 13 జిల్లాలతో కూడిన నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 'అమరావతి' రాజధానిగా ఉండాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించారు. అటు శ్రీకాకుళం జిల్లా నుంచి అనంతపురం జిల్లాలకు మధ్యలో ఉంటుందనే భావనతో గుంటూరు – విజయవాడలకు మధ్యలో ఉండే ప్రాంతాన్ని 'సిఆర్‌డిఏ' (క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటి) గా నామకరణం చేసి 29 గ్రామాల రైతుల నుంచి దాదాపు 33 వేల ఎకరాల భూమిని 'భూ సంస్కరణ' పేరు మీద సేకరించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిఆర్‌డిఏను రద్దుచేసి మూడు రాజధానుల పేరు మీద 'అమరావతి' రాజధానిని నిర్వీర్యం చేశారు.

ఇప్పుడు భూమి ఇచ్చిన రైతులు తమ భూమిని కోల్పోయి, రోడ్డెక్కి సంవత్సరం నుండి వివిధ గ్రామాలలో ధర్నా శిబిరాలను ఏర్పాటు చేసుకొని, అమరావతి రాజధానిని కొనసాగించాలని ఉద్యమిస్తున్నప్పటికీ ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు. లేకపోగా రైతులను 'పెయిడ్ ఆర్టిస్టు'లంటూ అనవసరంగా వారిపై అభాండాలు మోపుతూ వారి న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించకుండా, వారికి అనుకూలమైన ప్రజలతో పోటీ శిబిరాలు ఏర్పాటు చేయించి అమరావతి రైతు ఉద్యమాన్ని నీరుగార్చ ప్రయత్నిస్తున్నారు. ఇది శోచనీయం, రైతులను అగౌరవపరచడం, అవమానించడం, వారి పోరాటాన్ని అవహేళన చేయడం ఈ ప్రభుత్వానికి మంచిది కాదు. అంతేకాకుండా 2–5 ఎకరాల లోపు రైతులు ఎక్కువ మంది ఈ సంవత్సర కాలంలో గుండెపోటుతోనూ, దిగులుతోనూ, అనారోగ్యంతోనూ దాదాపు 100 మంది రైతులు ఈ సమస్య పరిష్కారం అవుతుందో కాదో అనే దిగులుతో తీవ్రంగా కలత చెంది చనిపోయారు. మరి వారి ప్రాణాలు ఎవరు తిరిగి ఇవ్వగలరు? వారి కుటుంబాలను ఎవరు పోషిస్తారు? ఈ ప్రభుత్వం భూములిచ్చిన రైతుల పట్ల ఇంత అమానవీయంగా ప్రవర్తించడం విచారకరం. కేవలం చంద్రబాబునాయుడు మీద కక్ష తీర్చుకునే నెపంతో రైతులను బలిపశువులను చేయడం రాజ్యాంగ ప్రమానాలనూ, విలువలనూ అగౌరవపరచడం అవుతుంది. 29 గ్రామాల రైతులు నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తమ భూములను 'రాజధాని' ఏర్పాటు చేయడం కోసం ఇచ్చారు తప్ప, తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం, తెలుగుదేశం పార్టీ ప్రయోజనాల కోసం ఇవ్వలేదు. అంతేకాకుండా ఇచ్చిన వారంతా తమ ప్రాంతంలో రాజధాని ఏర్పడుతుందనే సంతోషంతో, తమ పిల్లల భవిష్యత్తు బాగుంటుందనే దూరదృష్టితో ఇచ్చిన వారే తప్ప, చంద్రబాబునాయుడు మాటలు నమ్మి ఇచ్చినవారు చాలా తక్కువ మంది మాత్రమే.

సంవత్సరం నుంచీ రైతులు ఉద్యమిస్తున్నప్పటికీ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ స్వయంగా వచ్చి పాల్గొని ఉద్దండరాయునిపాలెం గ్రామంలో

ఆదివాసులే. దేశానికి మూలవాసి ఆదివాసీ అంటూనే, వాళ్లకు సరైన న్యాయం అందడం లేదు. విధ్వంసకర అభివృద్ధిని ఎవరూ కోరుకోవడం లేదు. ఈ మధ్యనే ఎల్‌ఆర్ఎస్, సాదా బైనామాల పేరుతో ఏజెన్సీలో ఆదివాసేతరులకు పట్టాలిచ్చే ప్రయత్నం ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుంది. అక్టోబర్‌లో కాసిపేట మండలం ఆదివాసీలు ఎల్‌ఆర్ఎస్, సాదా బైనామాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రతిఘటించారు. ఏజెన్సీలో అన్ని జిఓలను ప్రభుత్వం యథేచ్ఛగా నీరుకారుస్తూ, వాళ్ల మనుగడకే ముప్పు వాటిల్లేటట్లు చేస్తున్నది.

పోడు భూముల కోసం జిల్లాలో నిత్యం పోరాటాలు చేస్తున్నప్పటికీ, భూమిపై హక్కు ఆదివాసీలకు లేకుండా పోయింది. సిర్పూర్, ఊట్నూర్, ఆసిఫాబాద్ డివిజన్‌లలో నిత్యం ఎక్కడో ఒకచోట పోడు భూముల పోరు కొనసాగుతూనే ఉన్నది. ప్రభుత్వం ప్రతి ఏటా 'దర్బార్'లు నిర్వహిస్తూనే ఆదివాసీల చట్టాలను అమలు కాకుండా చూస్తుంది. 1/70, పెసా, 5వ, 6వ షెడ్యూల్ల ఉల్లంఘన జరుగుతుంది. జోడేఘాట్ నుండి ట్యాంక్‌బండ్ మీదికెక్కిన కొమురం భీం పండుగను ప్రభుత్వం గుర్తించింది కాని, ఆదివాసీల మౌలికమైన విద్య, వైద్యం, ఉపాధి అందించలేకుండా పోయింది. పైగా కొమురం భీం పోరాటం తర్వాత 39 సంవత్సరాలుగా ఇంద్రవెల్లిలో ఆదివాసి అమరుల కోసం ఏప్రిల్ 20 కర్ఫ్యూ నీడలోనే ఉంటుంది. కనీసం నివాళులు అర్పించడానికి కూడా అవకాశం ఇవ్వడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో కన్నా తెలంగాణ నిత్య నిర్బంధం నీడలో ఆదివాసీలు నివాళులు అర్పించుకోలేని దుస్థితి దాపురించింది. ఏప్రిల్ 20 అంటే ఎందుకు ఈ ప్రభుత్వం భయపడుతుందో అర్థం కావడం లేదని ఆదివాసీలు అడుగుతున్నారు. మా స్వయం పాలన, మా హక్కుల కోసం నిలబడతాం అంటున్నారు. మా బతుకులతో ఆడుకుంటున్న ప్రభుత్వానికి మళ్లీ తుడుం మోగించాల్సిన అవసరముందని ఆదివాసీలు కొమురం భీం స్ఫూర్తితో పోరాడుతాం అంటున్నారు.

(రచయిత ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్త) వీ

శంకుస్థాపన చేశారు. ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్థామని హామీ ఇచ్చారు. తిరుపతి ఎన్నికల బహిరంగ సభలో అప్పటి కేంద్ర మంత్రి, ఇప్పుడు ఉప రాష్ట్రపతిగా ఉన్న వెంకయ్యానాయుడు సమక్షంలో ప్రజలకు ఎన్నికల హామీగా అమరావతిని నిర్మిస్థామని హామీనిచ్చారు. మరి రైతులు చనిపోతూ ఉంటే కూడా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రజలకిచ్చిన హామీపై ఏమి సమాధానం చెబుతుంది? ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించలేని స్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉన్నదా? లేదా ఇరువురూ కలిసి నాటకం ఆడుతున్నారా? ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎన్నిక కావలసిన 4 రాజ్యసభ సభ్యులలో ఒకటి (బిజెపి) తమ పార్టీ తరపున ముఖేశ్ అంబానీ సహచరుడైన పరిమళ్ నత్వానీకి కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఇప్పించుకోలేదా? కాబట్టే కేంద్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటున్నదని ప్రజలు అనుకోవాలా? నిజంగా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని రాజధాని ప్రాంత రైతులపై జరుగుతున్న ఈ దమనకాండను, పోలీసుల చట్ట వ్యతిరేక చర్యలను కేంద్ర ప్రభుత్వం ఆపలేదా? ఆపలేనంత స్థితిలో బిజెపి పార్టీ రాష్ట్ర శాఖ ఉన్నదా? అనే అనుమానం కలుగుతున్నది.

ఇటీవల దళిత రైతుల పైననే ఎస్‌సి, ఎస్‌టి (పిఒఎ) యాక్ట్ 1989 ప్రయోగించిన ఘనులు మంగళగిరి పోలీసులు. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ దామోదర్ గౌతమ్ సవాంగ్ కార్యాలయం కూతవేటు దూరంలో ఉండే పోలీసులకు చట్టం గురించి అవగాహన లేదంటే శోచనీయం. ఇది కావాలనే పోలీసులు తమను ఎవరూ ఏమీ చేసుకోలేరనే దురహంకారంతో చేసిన చర్య తప్ప మరొకటి కాదు. విచారించాల్సిన విషయం ఏమంటే, శాసన సభ్యులు కానీ, పార్లమెంట్ సభ్యులు కానీ (అధికార పార్టీ వారు) ఇంతవరకూ ఆ రైతుల శిబిరాలను సందర్శించి, రైతుల సమస్యలను పట్టించుకోకపోవడం. అంతే కాకుండా, మొత్తం గ్రామాలను 'పోలీస్ మయం' చేసి పోలీసుల దౌర్జన్యాన్ని, పోలీసుల రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు నిలయాలుగా ఆ గ్రామాలను మర్చివేశారు. కేవలం ఒకే కులం వారు ధర్నాలో పాల్గొంటున్నారంటూ దుష్ప్రచారం చేస్తూ, అసలు 1-2 శాతం ఉన్న కమ్మ కులస్తులకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్నారు. అయినప్పటికీ ఎంతో సహనంతో, ఐక్యతతో రాజధాని ప్రాంత రైతులు ధైర్యంగా పోలీస్ దమనకాండను ఎదుర్కొంటున్నారు. ఇంతవరకూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంత సుదీర్ఘ కాలం జరిగిన శాంతియుత ప్రజా పోరాటం స్వాతంత్ర్యానంతరం లేదు. ఇది ప్రజల ఓర్పుకూ, గుండె నిబ్బరానికీ నిదర్శనం, ప్రతీక. అధికార పార్టీ లేదా వారికి వత్తాసు పలిలే అధికారులు, పోలీసులు ఇప్పటికైనా తమ అభిప్రాయాలను మార్చుకోవాలి. ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలి. రైతులు, మహిళలు, పిల్లలు, విద్యావంతులు ఏ కారణంతో, ఏ లక్ష్యంతో తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారో పోలీసు అధికారులు గ్రహించడం లేదు. అక్రమ కేసులు బనాయిస్తున్నారు.

ఈ ఉద్యమంలో కొత్త విషయం ఏమంటే ఎన్నడూ బయటకు రాని మహిళలు రోడ్డుపై బైఠాయించారు. తమ ఉద్యమ శిబిరాలలోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు, పోరాడుతున్నారు, అరెస్టవుతున్నారు, పోలీసుల లాఠీ దెబ్బలు తింటున్నారు, పోలీస్ స్టేషన్‌లో అక్రమ కేసులకు గురవుతున్నారు. కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని కొనాసగించాలనేది వారి ప్రతిన. ఇప్పటికే అక్కడ రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టులు పనిచేస్తున్నాయి. మరికొన్ని రాష్ట్ర కార్యాలయాలు రాజధాని ప్రాంతానికి దగ్గరలోనే ఉన్నాయి. గత 5 సంవత్సరాల నుంచీ ఇదే ప్రాంతం నుంచి అన్ని కార్యకలాపాలు జరిగాయి. కాబట్టి దానినే కొనసాగించాలనేది వారి కోరిక. దీనిని ఇష్టపడని వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వారిని మానసికంగా హింసిస్తూ, పోలీసుల ద్వారా దౌర్జన్యానికి పాల్పడుతూ, అక్రమ కేసులు బనాయిస్తూ యువకులపై, రైతులపై, రైతు కూలీలపై ఈ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నది. ఈ యువకులు గతంలో ఏ ప్రభుత్వ హాయంలోనూ కేసులు ఎదుర్కొన్నవారు కాదు. పైగా ప్రభుత్వం అంటే ఇంత రాక్షసత్వంతో ఉంటుందా? అనేది వారు ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నారు.

నిజంగా రాజధాని ప్రాంత రైతులు శాంతియుతంగా ఉద్యమం చేస్తున్నారు కాబట్టి రాష్ట్రం ప్రశాంతంగా ఉంది. వారే హింసకు పాల్పడే పరిస్థితి వస్తే ఈ ప్రభుత్వం దానిని అదుపు చేయగలదా? రైతులను ఇప్పటికీ కూడా ఈ రాష్ట్ర మంత్రులు 'రియల్ ఎస్టేట్' వ్యాపారస్థులతో పోల్చుతున్నారు. రాజధాని ప్రాంతంలో ఇన్‌సైడ్ ట్రేడింగ్ 'అంతర్లీన వ్యాపారం' జరిగిందంటూ ఈ ప్రభుత్వం, గత చంద్రబాబునాయుడు ప్రభుత్వంపై నెపం వేస్తుంది. నిజంగా అదే జరిగుంటే ఈ 18 మాసాల నుంచీ ఈ ప్రభుత్వం ఎందుకు చర్యలకు ఉపక్రమించలేదు? ఈ ప్రభుత్వం రాజధాని ప్రాంత రైతులకు సమాధానాలు చెప్పలేక కుంటి సాకులు వెతుకుతున్నది. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం పనిచేయాలి కానీ, ప్రజలను శాంతి కాముకులుగా ఉండకుండా వారిని 'హింసా ప్రవృత్తి'కి దిగేటట్లు ఈ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉద్యమించడం, తమ సమస్యల పరిష్కారం కోసం వివిధ రూపాలలో పోరాడడం ప్రజల ప్రాథమిక హక్కు. ఇది భారత రాజ్యాంగం ఈ భారత ప్రజలకు కల్పించిన హక్కు. దీనిని ఎవరూ కాదనడానికి వీలులేదు. రాష్ట్ర ప్రభుత్వానికీ, వారికి కొమ్ము కాస్తున్న పోలీసు యంత్రాంగానికీ ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసే అధికారం, హక్కు లేదు. ఇది రాజ్యాంగ ఉల్లంఘన అవుతుంది. ఈ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎన్నోసార్లు తమ తీర్పుల ద్వారా ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించినప్పటికీ, మార్పు రాలేదు. మార్పు రాకపోగా, హైకోర్టు జడ్జీల పైననే అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతూ, దుర్భాషలాడడం విచారకరం.

ఇంత పోలీస్ నిర్బంధంలో కూడా రాజధాని ప్రాంత రైతులు పోలీసులతో మర్యాదగానే ప్రవర్తిస్తున్నారు. పోలీసులే రైతులను, యువకులను, మహిళలను అరెస్ట్ చేసే సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించడం లేదు. ప్రజలపై దౌర్జన్యానికి పాల్పడిన పోలీసు అధికారులపై రాష్ట్ర డిజిపి ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదు. పోలీసులు రాజధాని గ్రామాల్లోకి ఇష్టమొచ్చినట్లు ప్రవేశిస్తూ, ప్రజలపై నిఘా పెట్టి, లాఠీలు ప్రయోగిస్తూ, వారు ఎప్పుడనుకుంటే అప్పుడు (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్) సెక్షన్ 144ను ప్రయోగిస్తూ, 5 మంది కన్నా ఎక్కువ మంది గుమిగూడద్దంటూ ప్రజలను చెల్లా చెదురు చేస్తూ పోలీస్ స్టేషన్‌లకు తరలిస్తున్నారు. చిన్న చిన్న గ్రామాలను కూడా వందల మంది పోలీసులతో నింపేస్తున్నారు. మహిళలపై పురుష పోలీసులను ప్రయోగిస్తున్నారు. మొత్తం రాజధాని ప్రాంత రైతు ఉద్యమ శిబిరాలన్నింటినీ యుద్ధ వాతావరణం తలపించే విధంగా పోలీస్ వ్యవస్థ

కార్పొరేటు కౌగిలిలో బ్యాంకులు

***ప్రభుత్వ బ్యాంకులకు వేల కోట్ల రుణం ఎగ్గొట్టిన కార్పొరేట్ సంస్థలు ఇప్పుడు ప్రైవేట్ బ్యాంకులు పెట్టుకునే అవకాశాన్ని గురించి రిజర్వు బ్యాంకు కమిటీ ఆలోచిస్తుందని అంటున్నారు* కేశవ్**

వేలకోట్ల రుణాలను విచక్షణారహితంగా తీసేసుకుని, చెల్లించకుండా పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్ని బలహీనం చేసేసిన కార్పొరేటు వర్గం చింతించవలసిన అవసరమే లేకుండా, ఏకంగా వీరే బ్యాంకుల్ని దుకాణాలుగా తెరచి ప్రజాధనంతో ఆటలాడుకునే వింత సరళీకరణలకు శ్రీకారం చుట్టే దిశలో భారత రిజర్వు బ్యాంకుకు సంబంధించిన ఒక అంతర్గత కమిటీ అభిప్రాయపడుతుండడం ఆశ్చర్యంగానూ, బాధాకరంగానూ ఉంది. ఆశ్చర్యం ఎందుకంటే, ఇప్పటికే వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతు పోరాటాల విషమ పరిస్థితిలో ఆర్థికరంగాన్ని మరింత అతలాకుతలంగా మార్చెయ్యబోయే కార్పొరేటు బ్యాంకు బాంబులు సిద్ధమవుతున్నందుకు! పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు బలహీనం కావడానికి కార్పొరేటర్ల మొండి బాకీలు ముఖ్యమైన కారణం. పంజాబ్ నేషనల్ బ్యాంకుకి నీరవ్ మోదీ లాంటి కార్పొరేట్లు ఎలా బురిడీ కొట్టారో చూశాం. అంతకు ముందు విజయ్ మాల్యాలు, ఇంకా వార్తా పత్రికల మొదటి పేజీకి ఎక్కని అసంఖ్యాకమైన కార్పొరేట్లు వందల, వేల కోట్లు రుణాలుగా తీసేసుకుని ప్రజల డబ్బుతోనూ, బ్యాంకు ఉద్యోగులతోనూ, తమపై బాణం సంధించలేని చట్టాలతోనూ ఎలా ఆడుకున్నారో మనం చూశాం. ఒక సాధారణ మనిషి ఇంటి మీద తీసుకున్న రుణం చెల్లించకపోతే, వడ్డీలూ, ఫైనూ, చెక్‌బౌన్స్ కేసులూ, చివరికి ఇల్లే జప్తు కావడం బ్యాంకులు చాలా సునాయాసంగా చేస్తాయి. మరి, ఇదే విషయం కార్పొరేట్ల విషయానికి వచ్చేటప్పుడు, వందల, వేల కోట్ల రూపాయల ప్రజాధనం ఉన్నప్పుడు ఇవే చట్టాలు ఎంతవరకు వీరిపై ప్రయోగిస్తున్నారో మనకు తెలుసు. పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల పరిస్థితి ఇలా ఉంటే, ప్రైవేటు బ్యాంకుల పరిస్థితి ఇంతకన్నా ఉన్నతంగా లేదని గత ఎస్ బ్యాంకు అనుభవాలూ, ఇటీవల లక్ష్మీవిలాస్ బ్యాంకు అనుభవాలూ, డిపాజిటర్ల ఆందోళన, అస్థిరత మనం ఇప్పటికే చూశాం. సామాజిక నిబద్ధతను ఏ కోణంలోనూ చూపించని ప్రైవేటు బ్యాంకులు దేశాభివృద్ధికి పనికిరావడం మాట అటుంచి ఆయా కార్పొరేటు, ధనిక వర్గాలకు పల్లకీలనూ, లాభాల సంచులనూ అందించాయి. రైతులకూ, నిరుద్యోగులకూ, బడుగు వర్గాలకూ రుణాలను ఇవ్వడంలో వెనుక ఉన్నాయి. ఆర్థిక సంపదను ధనికుల మధ్యనే కేంద్రీకరించుకున్నాయి. అందుకనే, బ్యాంకుల్ని 1969లో అప్పటి ప్రభుత్వం జాతీయం చెయ్యాల్సి వచ్చింది. ఆనాడున్న ఆర్థిక అస్థిరతలకు బ్యాంకుల జాతీయకరణ అవసరమైన పరిష్కారంగా నిలిచింది. సమాజ ప్రగతికి పనికిరాని ప్రైవేటు బ్యాంకులు కార్పొరేటు, ధనిక వర్గానికి మాత్రమే ప్రయోజనం అందిస్తోన్న ప్రైవేటు బ్యాంకుల జాతీయకరణ ఆనాడు చారిత్రక అవసరంగా మారింది. ఆనాడైనా, ఈనాడైనా నడిచేది పెట్టుబడిదారీ విధానమే అయినప్పటికీ, కొన్నయినా సంక్షేమ పథకాలు నడపడానికి, సాధారణ ప్రజల ముఖద్వారం దగ్గరకు బ్యాంకుల్ని తీసుకుపోవడానికి బ్యాంకుల జాతీయకరణ అవసరమైంది. బ్యాంకుల జాతీయకరణ ఫలితంగా బ్యాంకింగ్ సెక్టార్‌లో కొన్ని వేల మందికి ఉద్యోగావకాశాలు దొరికాయి. బ్యాంకులనేవి ఫైవ్‌స్టార్ హోటళ్లలాగ ధనికుల కోసమే అనే ఆలోచన మారి పేదలూ, మధ్యతరగతి ప్రజలు కూడా బ్యాంకు సేవల్ని అందుకునే అవకాశం దొరికింది. చాలా తక్కువ డిపాజిట్‌తో అక్కౌంట్లు లేదా జీరో బ్యాలెన్స్ అక్కౌంట్లు పెరిగి అటు బ్యాంకుల ఆర్థిక పరిస్థితి మెరుగయింది. ఇటు, ఆయా రుణాలు సాధారణ ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు అంది సామాజిక పరిస్థితి కూడా కొంతవరకు మెరుగయింది. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు వ్యాపార ప్రయోజనాలతో పాటు సామాజిక ప్రయోజనాలను కూడా ఆయా వర్గాలకు అందించాయి. ప్రభుత్వ సంక్షేమ విధానాలకు

పనిచేస్తున్నది. ఏ రాజ్యాంగ సూత్రాల ఆధారంగా ఈ ప్రజలపై పోలీసులు ఇంత అమానవీయంగా ప్రవర్తిస్తున్నారో అర్థం కావడం లేదు. కేవలం అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు వారు ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని అనుకోవలసి వస్తుంది. రేపు ఇంకో పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ వారు చెప్పినట్లు ప్రవర్తిస్తారు ఈ పోలీసులు. అనగా ఈ పోలీసు అధికారులకు చట్టానికన్నా, రాజ్యాంగానికన్నా అధికారంలో ఉన్నర పార్టీ నాయకులను తృప్తి పరచడమే తమ లక్ష్యంగా భావిస్తున్నారు.

ఇటువంటి పరిస్థితులలో ప్రజలు మౌనంగా ఉంటారనుకోవడం, ప్రజలకు కూడా కొన్ని లక్ష్యాలు, కర్తవ్యాలు ఉంటాయనేది పోలీస్ అధికారులు గ్రహించాలి. ఉద్యమం శృతిమించక ముందే ఈ ప్రభుత్వం మేల్కొనడం మంచిది. లేనిచో ఈ రాష్ట్రంలో 'రాజ్యాంగ సంక్షోభం' దిశగా ఈ రాష్ట్ర ప్రభుత్వం పయనిస్తున్నదని అనిపిస్తుంది. రాజధాని ప్రాంత రైతులకు తిరిగి తమ భూమిని ఇవ్వలేని పరిస్థితి లేదా వారికి 2013 చట్టం ప్రకారం ఆర్థిక పరిహారం ఇవ్వలేని పరిస్థితి ఈ రాష్ట్ర ప్రభుత్వానిది. కాబట్టి ఇప్పటికైనా వాస్తవాన్ని గ్రహించి, ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులతో చర్చలు జరిపి వారి సమస్యను పరిష్కరిస్తే మంచిది. లేనిచో సమస్యను నాన్చివేసే ధోరణితో ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరిస్తే సమస్య మరింత జటిలంగా మారి తన ప్రభుత్వమే పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదు. ప్రజలతో చర్చించడం, వారి సమస్యలను పరిష్కరించడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పాలకులు చేయవలసిన కనీస బాధ్యత. దీనిని ఈ ముఖ్యమంత్రి త్వరలోనే గ్రహిస్తారని ఆశిద్దాం!!

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

కూడా ఇవి పనికొచ్చాయని చెప్పొచ్చు. అయితే, ప్రస్తుతం ఆర్‌బిఐ అంతర్గత కమిటీ ప్రతిపాదనలు మన బ్యాంకుల్ని, దేశ ఆర్థిక పరిస్థితినీ మరళా జాతీయకరణకు ముందున్న పరిస్థితికి తీసుకుపోయే లక్షణాలతో ఉన్నాయి. ఎంతో శ్రమించి, ఎన్నో ఉద్యమాల ద్వారా సంపాదించుకున్న ఈ బ్యాంకులూ, ఆయా సంబంధిత హక్కులూ ఒక్కొక్కటి రెక్కలు తెంపుకొని మరలా ముందున్న అస్తవ్యస్తతలోకి మరలే పరిస్థితి ఉంది. దీనికే స్వేచ్ఛా వాణిజ్యం అని ముద్దు పేరు.

బ్యాంకింగ్ రంగంలో ప్రయివేటు యాజమాన్య మార్గదర్శకాలు, కార్పొరేటు వ్యవస్థను సమీక్షించేందుకు 2020 జూన్ 12న ఆర్‌బిఐ ఒక అంతర్గత వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రతిపాదనలను పబ్లిగ్గా సలహాల కోసం ఉంచారు. అయితే, వీరి ప్రతిపాదనలు మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థనే తారుమారు చేసేవిగా ఉన్నాయి. యిప్పటివరకూ, బడా కార్పొరేట్లు నేరుగా బ్యాంకింగ్ వ్యవహారాల్ని స్వయంగా నిర్వహించుకునే పరిస్థితి లేదు. అప్పుడప్పుడూ ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నా, వాటిని సాగనిచ్చే పరిస్థితి ఆర్‌బిఐలో ఉండేది కాదని తెలుస్తోంది. 2013 నుండి ఈ ప్రయత్నాలు ఊపందుకున్నా అవి ఆచరణ రూపంలోకి రావడంలో వ్యతిరేకత ఉండేది. అంతర్గత వర్కింగ్ కమిటీ ప్రతిపాదనల నేపథ్యంలో ఇప్పుడు అమల్లో ఉన్న బ్యాంకింగ్ నియంత్రణ చట్టం (1949)ను సవరణ చేయడం ద్వారా బడా కార్పొరేట్లు, పారిశ్రామిక సంస్థలు సొంతంగా బ్యాంకుల్ని ఏర్పాటు చేసుకునేందుకు వీలవుతుంది. అంతేకాదు. దాంతోపాటు, 50 వేల కోట్లు, అంతకుపైగా ఉన్న కార్పొరేటు సంస్థల, పెద్ద బ్యాంకింగేతర ఆర్థిక కంపెనీలకు దశాబ్దకాలం ట్రాక్ రికార్డు బాగా ఉంటే, అవి ఈ నూతన ప్రతిపాదనల ప్రకారం, బ్యాంకులుగా రూపాంతరం చెందే అవకాశం ఉంది. అంటే, బడా కార్పొరేట్లు ఇకనుండి బ్యాంకుల్ని ఛాయ్ దుకాణాల్లా ఏర్పాటు చేసుకోవచ్చు. అందులోని డిపాజిట్లను తమ వ్యాపార ప్రయోజనాలకు వినియోగించుకోవచ్చు. బ్యాంకింగేతర (ఎన్‌బిఎఫ్‌సి) సంస్థలు కూడా బ్యాంకులుగా రూపాంతరం చెందవచ్చు. ప్రైవేటు బ్యాంకులు పూర్తిగా ఆక్రమించి, ఏవో పుంజెడు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులున్న పరిస్థితి భవిష్యత్తులో ఉంటుందన్న మాట. ఈ పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు కూడా ఈ బడా కార్పొరేటు బ్యాంకుల గారడీల మధ్య 'జియో ఉచిత సేవల ఆటల్లో బిఎస్‌ఎన్‌ఎల్' కొట్టుకుపోయినట్టు విలవిల్లాడే పరిస్థితి ఉంటుంది. ఆర్థిక సరళీకరణల దిశగా బ్యాంకింగ్ వ్యవస్థలు మరలడం అంటే అర్థం ఇదే. ఏ వర్గం ప్రయోజనం పొందుతుందో, ఏ వర్గం మరింత పతనానికి చేరుతుందో అర్థం కావడం పెద్ద కష్టమేమీ కాదు.

ఈ ప్రతిపాదనలను ఎవరో వామపక్ష మేధావులో, 'మోడీ'కి గిట్టని రాజకీయ నాయకులో మొదట వ్యతిరేకించలేదు. రిజర్వు బ్యాంకులో అత్యంత ఉన్నత పదవుల్లో పనిచేసి, పెట్టుబడిదారీ ప్రభుత్వం పాలసీలను కొనసాగించే మేధావులే వ్యతిరేకిస్తున్నారు. బడా కార్పొరేటు వర్గాలకు బ్యాంకింగ్ లైసెన్సులు ఇవ్వడం ప్రమాదకరమని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్, మాజీ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య అంటున్నారు. ఆ వర్గాలు బ్యాంకింగ్‌లోకి వస్తే రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేస్తాయనీ, ఇది దేశానికి మంచిది కాదనీ అంటున్నారు. బ్యాంకులు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులుగా ఉండడం వేరు. బ్యాంకులు కార్పొరేట్ల ఛాయ్ దుకాణాల్లా ఉండడం వేరు. రెంటికీ చాలా తేడా ఉంది. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు రిజర్వు బ్యాంకు నిర్వహణలో ఉన్నప్పటికీ, నీరవ్ మోదీలూ, మేహుల్ చోక్సీలూ, విజయ్ మాల్యాలు, అసంఖ్యాకమైన కార్పొరేట్లు మొండి బాకీల బ్యాంకులుగా వీటిని ఎలా మార్చేశారో చూశాం. ఇప్పుడు బ్యాంకులే కార్పొరేట్ల నిర్వహణలోకి మళ్లితే, పరిస్థితి ఇంకెంత అస్తవ్యస్తంగా ఉంటుందో చెప్పలేం. కార్పొరేట్లు వ్యాపారంలో ప్రజల ఆశలతో, ప్రజల బలహీనతలతో ఎలా ఆడుకుంటారో మనం 'జియో' ఉచిత ఇంటర్నెట్ సిమ్‌ల వ్యూహాన్ని చూశాం. బిఎస్‌ఎన్‌ఎల్ లాంటి పబ్లిక్ సంస్థలూ, ఓడా ఫోన్, ఐడియా లాంటి కార్పొరేట్ సంస్థలు కూడా ఎలా ఇబ్బందులకు గురయ్యాయో చూశాం. మరి, బ్యాంకుల సరళీకరణలను మరింత ముందుకు నడిపితే, డిపాజిట్ల కోసం కార్పొరేటు బ్యాంకులు ప్రజల బలహీనతలతో ఆడుకోరని గ్యారంటీ ఏమిటి? పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు డిపాజిట్ల మీద ఇచ్చే వడ్డీకి రెండు రెట్లు ఇస్తామని ఒక చిన్న వ్యూహం పన్నితే పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లోని డిపాజిట్లన్నీ బయటకొస్తాయి. వీరి హుండీలోకి వెళ్లిపోతాయి. ఈ ప్రక్రియని రిజర్వు బ్యాంకు నియంత్రించ గలదా? ఇలా బలహీనమైన పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్ని దూ ఆర్ డై అనే స్థితికి తెచ్చి వీరే కొనెయ్యగలరు కదా! ఇలా జరిగితే, దేశంలో పబ్లిక్ సెక్టార్ బ్యాంకులే ఉండని పరిస్థితి. 1969కి ముందున్న పరిస్థితికి ఎంతో కాలం పట్టదు, దీనికి తోడు ప్రభుత్వం ఎంచుకున్న పాలసీ. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఎంచుకున్న 2.10 లక్షల కోట్ల రూపాయల ఉపసంహరణలో 90 వేల కోట్లు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులకు సంబంధించి నవే. ఒకవైపు మొండి బాకీలు పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్ని బలహీనం చేస్తే, మరోవైపు పెట్టుబడుల ఉపసంహరణ మరింత బలహీనం చేస్తాయి. దీనికితోడు ఆర్‌బిఐ ప్రతిపాదనలు చట్టరూపం దాల్చితే, అవి కార్పొరేట్లకు బలం చేకూర్చి, పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్ని ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ బలహీనం చేస్తాయి. ఫలితంగా ఒక కార్పొరేటు బ్యాంకు ఒక్కో పబ్లిక్ సెక్టారు బ్యాంకుని కారుచౌకగా కొనెయ్యడానికి ముందుకొస్తాయి. బిఎస్‌ఎన్‌ఎల్‌ని జియో మెల్లమెల్లగా వెనక్కి తోసేసినట్టు!

బడా వ్యాపార సంస్థలకూ, బ్యాంకులకూ మధ్య అనైతికమైన పొత్తును విచ్ఛిన్నం చెయ్యడమే 1969 బ్యాంకుల జాతీయకరణ ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. బ్యాంకుల జాతీయకరణ చెయ్యాల్సి వచ్చిందీ అంటేనే జాతీయకరణకు ముందు బ్యాంకుల పరిస్థితి సరిగ్గా లేదని అర్థం. కార్పొరేట్లు తమ ఆర్థిక ప్రయోజనాల కోసం బ్యాంకుల్ని ప్రభావితం చేసే పరిస్థితుల్ని అప్పటి ప్రజలు చూశారు. ప్రభుత్వాలు చూశాయి. ప్రైవేటు కార్పొరేటు బ్యాంకులు బలహీన వర్గాలకు రుణాలను ఇవ్వడంలో వెనుక ఉంటాయని గత బ్యాంకు అనుభవాలు చెప్పాయి. లాభాలే వీరి ప్రథమ లక్ష్యం. పైపెచ్చు, కొన్ని బ్యాంకులు ప్రత్యేక కార్పొరేటు వర్గానికే ఎక్కువగా రుణాలను అందించే పరిస్థితి ఉండేది. యునైటెడ్ కమర్షియల్ బ్యాంకు బిర్లా సంస్థలకు అనుకూలంగా వ్యవహరించింది. ఓరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్ థాపర్ కంపెనీలకు అనుకూలంగా పనిచేసింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టాటా సంస్థలకు అనుకూలంగా పనిచేసింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు, యూనివర్సల్ బ్యాంకు ఆఫ్ ఇండియా షాహూ, జైన్ గ్రూపు ఆధీనంలో ఉండేవి. జాతీయకరణకు ముందు పరిస్థితి ఇది. బడుగు వర్గాల కోసం, శ్రామికుల కోసం, సంక్షేమ పథకాల కోసం, రైతుల కోసం ముందుకొచ్చి రుణాలిచ్చి ప్రోత్సహించే పరిస్థితి లేదు. బలహీన వర్గాల కోసం బ్యాంకులు ముందుకొచ్చిన పరిస్థితి

ఏదైనా ఉందీ అంటే అది జాతీయకరణ తర్వాతనే. అదీనూ, పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు మాత్రమే ఇలా బలహీనవర్గాల కోసం ముందుకొచ్చాయి. బ్యాంకులు లేని సుదూర తీరాల్లో కూడా బ్యాంకు బ్రాంచీలు వెలిశాయి.

ఇలా అత్యంత పటిష్టమైన పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు 1969 నుంచి సమర్థవంతంగా పనిచేశాయి. అయితే, కార్పొరేట్ల మొండి బాకీలు ఒక వైపూ, ప్రభుత్వాల తప్పుడు విధానాలు మరోవైపు పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్ని బలహీనం చేశాయి. బ్యాంకుల విలీనాలు తాత్కాలిక పరిష్కారంగా ముందుకు నడిచింది. పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల సంఖ్య తగ్గింది. ఇవి అందివ్వగలిగే ఉద్యోగాల సంఖ్య తగ్గింది. డిజిటల్ ఫ్లాట్‌ఫాం అంటూ ఇందులో కూడా పరోక్షంగా కార్పొరేట్ల ప్రాబల్యం పెరిగింది. బ్యాంకుల్లోకి ప్రైవేటు లైఫ్ ఇన్సూరెన్స్ ప్రవేశించి, విపరీతమైన కమిషన్‌ల అత్యాశ బ్యాంకు బాబులకు చూపించి బ్యాంకు ప్రధాన కార్యాలకే అడ్డు తగిలింది. బ్యాంకుల్లోకి ప్రత్యక్షంగా ఇన్సూరెన్స్ ప్రవేశించి వేలకోట్ల వ్యాపారం నడుస్తోంది. మరోవైపు విభిన్నమైన యాప్లనీ, డిజిటల్ టెక్నాలజీ అనే కార్పొరేటు కంపెనీల చొరవ ఈ బ్యాంకుల్లో పెరిగింది. వేలకోట్ల రుణాలు రాజకీయ ప్రాబల్యంతో బడా కార్పొరేట్ల పాకెట్లోకి చేరడం, అవి తిరిగి రాకపోయినా ఎలాంటి చర్యలు లేకపోవడం బ్యాంకుల్ని బలహీనం చేశాయి.

కె.వి. కామత్ కమిటీ ప్రకారం 37.72 లక్షల కోట్ల రూపాయల రుణం ఆపదలో ఉంది. రిజర్వు బ్యాంకు నియంత్రణలో ఉన్నప్పటికీ, ప్రజాస్వామ్య విధానాలు నడుస్తున్నప్పటికీ, పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు బలహీనం అయ్యాయి. బ్యాంకుల బోర్డు నియామకాల్లో ఆర్థిక మంత్రిత్వశాఖ చొరవ కావొచ్చు. రిజర్వు బ్యాంకుల్లోని ఇటీవల గవర్నర్ నియామకాల్లో కేంద్ర ప్రభుత్వం చొరవ కావొచ్చు. గత నోట్ల రద్దు విషాదకర పరిస్థితుల నియంత్రణలో కూడా రిజర్వు బ్యాంకు బలహీనమైన పాత్ర కావొచ్చు. మొండి బాకీలు కావొచ్చు. మొత్తంగా చూస్తే, ఆర్‌బిఐ పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్ని బలహీనం చేసే ప్రజా వ్యతిరేక వ్యవస్థ చుట్టూ కూరుకుపోయింది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం 1990ల నుండి ఎంచుకున్న ప్రజావ్యతిరేక నయా ఉదారవాద, స్వేచ్ఛా వాణిజ్యం, ఆర్థిక సరళీకరణల ప్రపంచీకరణల కొత్త వెల్లువ. పెట్టుబడిదారీ వ్యవస్థ విజృంబిస్తే పెట్టుబడికి ప్రాంతీయ భేదాలు లేకుండా ప్రపంచమంతా విస్తరిస్తుంది. తమ లాభాల సంచుల్ని మూటగట్టుతుంది. భారతదేశాన్ని కూడా అలాగే నమ్మించారు. ప్రపంచమంతా ఒక గ్లోబల్ విలేజ్ అయిపోతుందనీ, మనం ప్రపంచంతో చేతులు కలపాలనీ, పాత చట్టాలు కొత్త తరానికి పనికి రావనీ మాయమాటలతో అంతవరకూ కొనసాగుతున్న సంక్షేమ విధానాలను ఒక్కొక్కటీ కొల్లగొడుతూ వచ్చారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థను పూర్తిస్థాయి పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థగా మార్చే ప్రక్రియ కొనసాగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా, బిజెపి అయినా వీరు కొనసాగించింది స్వేచ్ఛా వాణిజ్యమే.

బ్యాంకుల్లో సంస్కరణలను కూడా, ఇదే నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో పబ్లిక్ సెక్టార్‌లో పనిచేస్తున్న పరిశ్రమలను ఒక్కొక్కటి బలహీనం చేశారు. చివరికి మూతపడడమో, ప్రైవేటుమయం కావడమో జరిగింది. ఇందులో నష్టంతో నడిచిన పరిశ్రమలతోపాటు లాభాలతో సమర్థవంతంగా నడిచే పరిశ్రమలు కూడా ఉన్నాయి. పెట్టుబడి ఉపసంహరణ నెపంతో కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ సెక్టార్‌లో పెట్టుబడులు ఉపసంహరించుకోవడం, మార్కెట్ మంత్రాలతో వీటిని ఒంటరి చెయ్యడం జరిగింది. ఇటీవల అత్యంత సమర్థవంతంగా నడుస్తోన్న ఇండియన్ రైల్వేలో కూడా ఈ నయా ఉదారవాద విధానాలు ప్రవేశించాయి. ప్రైవేటు వర్గాలకి రైళ్లను నడిపే స్వేచ్ఛను ఇస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను కూడా ఇలానే బలహీనం చేస్తున్నారు. ప్రైవేటు ఫైవ్ స్టార్ స్థాయి ఆసుపత్రులు ఆరోగ్యరంగంలో వ్యాపారం చెయ్యడానికొచ్చి కోవిడ్ నియంత్రణలో ఎలా విచక్షణారహితంగా ప్రవర్తించాయో మధ్యతరగతిని విపరీతమైన బిల్లులతో ఎలా విభ్రమం కలిగించాయో ప్రజలు చూశారు. ఇక అత్యంత సమర్థవంతంగా నడుస్తోన్న లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ కూడా ఈ ప్రపంచీకరణ వేటుకి గురి కాబోతోంది. ప్రభుత్వం పాత్ర నేడు సామాజిక రంగాల అభివృద్ధి కాదు. కార్పొరేట్లు హాయిగా, ఏ అడ్డూ అదుపు లేకుండా వ్యాపారం చేసుకోవడానికి వీలుగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో మీద నేలను సారవంతం చెయ్యడమే. అందుకు వ్యతిరేకంగా కార్మికులకు హక్కులను అందిస్తూ కార్మిక చట్టాలు ఉంటే, వాటిని కూడా కడిగి వడబోసి కార్పొరేట్లకు అనుగుణంగా మార్చెయ్యడమే. కార్మికులు ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కూడా మెల్లమెల్లగా తృంచి వెయ్యడమే. ఇదంతా కూడా ప్రపంచీకరణ లక్ష్యమే. ఇటీవల వ్యవసాయంలోని చట్టాల మార్పు కూడా ఇందులోని అంతర్భాగమే. నిత్యావసర ఆహార దినుసులు లభించక ఆకలి కడుపులతో కరువులను చూసిన ప్రజానీకం చేసిన ఉద్యమాల ఫలితంగా నిత్యావసర ఆహార దినుసుల చట్టం వచ్చింది. ఫలితంగా ప్రజలకు నిత్యావసర ఆహార పదార్థాలు నిరాటంకంగా ప్రజలకు అందుతూ వస్తున్నాయి. ఇందులో కూడా ప్రపంచీకరణ గాలులు ప్రవేశించాయి. వ్యవసాయాన్ని బడా పరిశ్రమగా మార్చేసిన బడా కార్పొరేట్లకు భారతదేశ వ్యవసాయరంగం కావాలి– జేబులు నింపుకోవడానికి. అందుకే కాంట్రాక్ట్ ఫార్మింగ్ పేరుతో ముందుకొస్తున్నాయి. ఈ దేశంలో ఏ ఆహార దినుసులు పండాలో, ఏవి పండకూడదో ఇక నుంచి వారే నిర్ణయిస్తారు. పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్ని బలహీనం చెయ్యడంలోనూ, మొండి బాకీలు పెరగడంలోనూ, ప్రైవేటు బ్యాంకులు పెరిగే వాతావరణం కల్పించడంలోనూ, చివరికి కార్పొరేట్లు ఛాయ్ దుకాణాల్లా బ్యాంకుల్ని తెరిచి బ్యాంకింగ్ రంగాన్నే ప్రభావితం చెయ్యబోవడంలోనూ ప్రపంచీకరణ, స్వేచ్ఛా వాణిజ్యం బీజాలనే మనం చూస్తున్నాం. భవిష్యత్తులో ఇదే కార్పొరేట్ల కౌగిలిలోకి పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు పోయి, అసలు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులే దేశంలో ఉండని మార్కెటీకరణ ఎంతో దూరం లేదు.

ఒక ప్రధానిని కల్ట్ ఫిగర్‌గా మార్చి దేశంలోని మెజారిటీ యువత పూజించేలా చేస్తూ భజనచేసే యువతరాన్ని పెంచి పోషించే విధానం వెనుక, దేశ ప్రజలను మత విశ్వాసాల చిచ్చులో పెట్టి మత విద్వేషాలు రగిలిస్తున్న విధానాల వెనుక, మొత్తం ప్రజాస్వామ్య మూలస్తంభాలైన రిజర్వు బ్యాంకు, ప్రజాస్వామ్యాన్ని కాపాడే సంస్థలు ఒక్కొక్కటి బలహీనం అయిపోతున్న ఆర్థిక పరిస్థితి వెనుక పొంచి ఉన్న స్వేచ్ఛా వాణిజ్యం ప్రమాదకరమైన ప్రజావ్యతిరేక విధానాలను అర్థం చేసుకోకపోతే వెయ్యేళ్ల వెనుక బానిసత్వంలోకి మనల్ని మనం తీసుకుపోవడమే.

(రచయిత అధ్యాపకులు, పగిలిన పాదాల నెత్తురులో (ప్రపంచీకరణ వ్యాసాలు) పుస్తక రచయిత) వీ

ఆర్‌సిఇపిలో భారత్ అవకాశాలు - సవాళ్లు

పాలకులు దేశ ప్రజల ప్రయోజనాలను కేంద్రంగా చేసుకొని విదేశీ సంస్థలతో ఒప్పందాల్లోకి వెళ్లాలి తప్ప, ప్రపంచీకరణ శక్తులు విధించే షరతులకు తలొగ్గరాదని అంటున్నారు డా. ఎ. పున్నయ్య

ఆర్థికవృద్ధి, ప్రాంతీయ స్థిరత్వాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా 1967లో బ్యాంకాక్ తీర్మానం ద్వారా ఆగ్నేయాసియా దేశాల అసోసియేషన్ (ఆసియాన్) ఏర్పడింది. ఈ అసోసియేషన్‌లోని పది సభ్య దేశాలు (సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం, మలేసియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, లావోస్, బ్రూనై, కంబోడియా) అప్పటికే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో (ఎఫ్‌టిఎ) చేతులు కలిపిన మరో ఆరు భాగస్వామ్య దేశాలు (భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్) కలిసి ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం పేర (రీజినల్ కాంప్రెహెన్సివ్ ఎకనమిక్ పార్ట్‌నర్‌షిప్) ఆర్‌సిఇపిగా ఏర్పడ్డాయి. 2011 నవంబర్‌లో జరిగిన 19వ ఆసియాన్ సమావేశంలో మొట్టమొదటిసారి ఆర్‌సిఇపి ప్రతిపాదిత ఒప్పందం ప్రవేశపెట్టబడింది. దీనిపై 2012 నవంబర్‌లో కంబోడియాలో జరిగిన 21వ ఆసియాన్ శిఖరాగ్ర సమావేశంలో ప్రగతిపూర్వక దిశగా చర్చలు బలపడ్డాయి. అది మొదలు అగ్రరాజ్యమైన అమెరికా ప్రాబల్యాన్ని తగ్గించేందుకు ఎనిమిది సంవత్సరాలుగా ఈ దేశాల మధ్య అనేక సార్లు సంప్రదింపులు జరిగాయి. కాగా ఆసియాలోనే చైనా తర్వాత పెద్ద ఆర్థిక వ్యవస్థ ఉన్న భారతదేశం గత ఏడాది కొన్ని సమస్యలు, సందేహాలున్నాయని చర్చల నుంచి వైదొలిగింది. చివరికి భారత్ భాగస్వామ్యం లేకుండానే 2020 నవంబర్ 15న బ్యాంకాక్‌లో ఆసియా – పసిఫిక్ ప్రాంతంలోని పదిహేను దేశాల ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (ఆర్‌సిఇపి) అధికారికంగా ఉనికిలోకి వచ్చింది. నిజానికిది రెండు సంవత్సరాల వ్యవధిలో ఆయా దేశాల చట్ట సభలు ఆమోదం తెలిపితేనే పూర్తి స్థాయిలో ఈ ఒప్పందం అమల్లోకి రానుంది.

వర్తమాన కాలంలో ఆర్‌సిఇపి ప్రపంచంలోనే అతిపెద్ద వాణిజ్య ఒప్పందం. ఈ ప్రాంతాల మధ్య వాణిజ్యానికి అడ్డంకులుగా ఉన్న సుంకాలు, ఇతర ఆంక్షలను పరస్పరం తగ్గించుకోవడం ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశం. ఈ ఒప్పందం ప్రధానంగా భాగస్వామ్య దేశాలలో వాణిజ్య వివాదాలను పరిష్కరిస్తుంది. సభ్య దేశాల మధ్య ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వేగంగా సృష్టిస్తుంది. వస్తువులు, సేవల వ్యాపారం, పెట్టుబడి, మేధో సంపత్తి, ఇ–కామర్స్, చిన్న, మధ్యతరహా సంస్థలు, ఆర్థిక సహకారంతో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడమే ఆర్‌సిఇపి ధ్యేయం. దీనివలన ఒప్పంద దేశాల మధ్య వస్తు ఉత్పత్తులు, సేవలు సులభంగా అందుబాటులో ఉంటాయి. నేడు ప్రపంచ జనాభాలో దాదాపు 30 శాతం ఈ సభ్య దేశాల్లో ఉంటున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోనూ వీరికి దాదాపు 30 శాతం భాగస్వామ్యం ఉంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ చైనా, మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ జపాన్ కూడా ఈ ఒప్పందంలో భాగమయ్యాయి. కావున నేడు యురోపియన్ యూనియన్ కన్నా పెద్ద వాణిజ్య కూటమి ఇదే ప్రపంచ వాణిజ్య సంస్థతో నిమిత్తం లేకుండా దేశాలు ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకుంటున్నాయి.

పెరిగిన వినియోగం రీత్యా ప్రాంతీయ వాణిజ్య ఒప్పందాల చరిత్రలో గతంలో ఎన్నడూ జరగని విధంగా 2.2 బిలియన్ మంది వినియోగదారులకు ఈ ఆర్‌సిఇపి ప్రాధాన్యతనిస్తోంది. ఈ ఒప్పందంలో భాగస్వామ్య దేశంగా లేని అగ్రరాజ్యమైన అమెరికా ఈ ఒప్పందం కుదరకుండా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేసింది. పశ్చిమ పసిఫిక్ ప్రాంతంలో చైనాను చక్రబంధంలో బిగించాలని చూసిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగానికి ఇది పెద్ద సవాలు అయింది. అమెరికాకు అగ్రతాంబూలం అన్న వైఖరిని అనుసరిస్తున్న ఆసియా దేశాల్లో తలెత్తిన బయాలు, అనుమానాల కారణంగా కూడా ఆర్‌సిఇపి ఉనికిలోకి రావడానికి దోహదం చేసింది. కాగా ఈ పరిస్థితుల్లో ఒప్పందంపై సంతకాలు జరగడంతో బహుపాక్షికత స్వేచ్ఛా వాణిజ్యం గెలుపునకు సంకేతమని, ఇది ఆసియా దేశాల చారిత్రక విజయమని చైనా అభివర్ణించింది.

ట్రాన్స్ పసిఫిక్ పార్ట్‌నర్‌షిప్ (టిపిపి) వాణిజ్య ఒప్పందం:

అమెరికా అధ్యక్షులు బరాక్ ఒబామా 2012కు ముందే ఈ ప్రాంత ప్రాముఖ్యతను గుర్తించి ట్రాన్స్ పసిఫిక్ పార్ట్‌నర్‌షిప్ (టిపిపి) అనే వాణిజ్య ఒప్పందాన్ని ఆసియా పసిఫిక్ దేశాలతో కుదుర్చుకున్నాడు. ఉద్దేశ పూర్వకంగా అగ్రరాజ్యమైన అమెరికా చైనాను మాత్రం దూరంపెట్టి దాని పొరుగు దేశాల్లో కొన్నింటిని టిపిపి చేర్చుకున్నది. దాంతో టిపిపిని చైనా వ్యతిరేక బృందంగా అప్పుడు చూశారు. ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఈ ఒప్పందానికి చాలా ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన తర్వాత 2017లో అధ్యక్ష పదవి చేపట్టిన డోనాల్డ్ ట్రంప్ ఈ ప్రాంతంలో తన ఆధిపత్యం కోసం రక్షణ, సైనిక రంగంలో తోడ్పాటుకై క్వాడ్‌ను ఏర్పరచుకున్నాడు. అనంతరం తనకు ఉపయోగకరంగా లేదని ఈ టిపిపి) ఒప్పందం నుంచి అమెరికా నిష్క్రమించింది. ఇది అమెరికా ఆధిపత్య స్వరూపానికి నిదర్శనంగా అర్థం చేసుకోవాలి. ఆ తర్వాత జపాన్ అభ్యర్థన మేరకు అమెరికా లేకుండానే మిగతా సభ్య దేశాలు ఈ ఒప్పందంలో కొనసాగాయి. 2018లో మిగిలిన దేశాలు ఈ ఒప్పందాన్ని కాంప్రెహెన్సివ్ ప్రోగ్రెస్ ట్రాన్స్ పసిఫిక్ పార్ట్‌నర్‌షిప్ (సిపి–టిపిపి)గా రూపొందించుకున్నాయి.

అమెరికా టిపిపి ఒప్పందం నుండి వెనక్కుపోయిన తరువాత తన రాజకీయ ఎత్తుగడలో భాగంగా ఇండో–పసిఫిక్ వ్యూహం పేరుతో చైనాకు వ్యతిరేకంగా సరికొత్త సమీకరణకు పూనుకుంది. ఇలా ఆసియా పసిఫిక్, ఇండో ఆసియా పసిఫిక్ ప్రాంతాల్లో రెండు పెద్ద వాణిజ్య కూటములు ఏర్పడ్డాయి. కానీ, కరోనా మహమ్మారి సృష్టించిన ఉత్పాతం వల్ల అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ భారీగా దెబ్బతింది. వాణిజ్య సంబంధాలు తెగిపోయినాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక పునరుజ్జీవనానికి ఆటంక పరిస్థితులను కలిసి ఎదుర్కొనేందుకు ఆసియాన్ దేశాలు, మరో ఐదు దేశాలు ఆర్‌సిఇపి ఒప్పందంపై తక్షణం సంతకం చేయాలన్న నిర్ణయానికి వచ్చాయి.

చైనాకు వ్యతిరేకంగా రక్షణ, సైనిక రంగంలో తోడ్పాటుకై అమెరికా ప్రోద్బలంతో ఇండియాతో కలిసి క్వాడ్‌గా ఏర్పడిన జపాన్, ఆస్ట్రేలియాలు తమ దేశ వాణిజ్య ప్రయోజనాలే ముఖ్యమని ఆర్‌సిఇపిలో చైనాతో చేతులు కలపడం ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం. చైనాకు వ్యతిరేకంగా అవతరిస్తున్న చతుష్టయ కూటమిలో ఉన్న జపాన్, ఆస్ట్రేలియాలు ఆర్‌సిఇపి భాగస్వాములు. దక్షిణ కొరియాతో సహా రాజకీయ అంశాలలో అవి అమెరికాకు మద్దతు ఇస్తూనే ఆర్థిక రంగంలో చైనాతో సంబంధాలతో మరింత ముందుకు పోవాలనే నిర్ణయించాయంటే దేశాలకు ఆర్థిక అంశాలే ప్రధాన చోదకశక్తిగా ఉన్నాయన్నది స్పష్టం. మన దేశానికి కూడా సరిహద్దుల విషయంలో పాకిస్తాన్‌కు అండదండలందిస్తున్న చైనాపై మనకు తీవ్ర అభ్యంతరాలున్నాయి. అయితే అమెరికాకు అనుకూలంగా ఆర్‌సెప్ ఒప్పందం నుంచి తప్పుకోవడానికి అదే ప్రధాన కారణమని చెప్పడం అతిశయోక్తి అవుతుంది.

ఆర్‌సిఇపి ఒప్పందం వల్ల అసలు ప్రయోజనాలు ఏమిటి?

ఎనిమిది సంవత్సరాల సుదీర్ఘ చర్చల ఫలితంగా 15 దేశాల మధ్య జరిగిన ఈ వాణిజ్య ఒప్పందానికి 220 కోట్ల మంది (ప్రజల ప్రపంచ జనాభాలో 47.7 శాతం) మద్దతు, ప్రపంచ జిడిపిలో ఈ ప్రాంతాల వాటా 30 శాతం (26 లక్షల 20 వేల కోట్ల డాలర్ల) ఆయువు పట్టుగా ఉంది. ప్రపంచ వాణిజ్యంలో 29.1 శాతం కాగా, పెట్టుబడులలో 32.5 శాతం వాటాను ఈ దేశాలు కలిగి ఉన్నాయి. ఇక దేశాల వారీగా చూస్తే కలిగే ప్రయోజనాలు కూడా ఉన్నాయి. జిడిపి పెరుగుదల పసిఫిక్ ప్రాంతంలో 2.1 శాతం, ప్రపంచంలో 1.4 శాతం, చైనాకు 0.55 శాతం, దక్షిణ కొరియాకు 0.41 శాతం నుంచి 0.62 శాతం, జపాన్‌కు 0.1 శాతం చొప్పున పెరుగుదల ఉంటుందని ఆర్థిక విశ్లేషకుల అంచనా. చైనా వ్యవసాయ ఉత్పత్తులపై జపాన్ 56 శాతం, దక్షిణ కొరియా ఉత్పత్తులపై 49 శాతం, ఇతర దేశాల ఉత్పత్తులపై 61 శాతం పన్నులు తగ్గనున్నాయి.

ఈ ఒప్పందం అమలుతో కొన్ని వస్తువుల విషయంలో వెంటనే పన్నులు తగ్గినా, మొత్తంగా ఒప్పందంలో అంగీకరించిన మేర తగ్గుదలకు పది సంవత్సరాలు పడుతుంది. ఈ కాలంలో ప్రాంతీయ సరఫరా వ్యవస్థ స్థిరపడుతుంది. ఆయా దేశాలకు కలిగే ఆర్థిక ప్రయోజనాలు ప్రపంచ భౌగోళిక, రాజకీయాల్లో కూడా ప్రభావం చూపుతాయి. ఈ ఒప్పందంతో పాటు చైనా, జపాన్, దక్షిణ కొరియాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం గురించి కూడా చర్చలు జరుగుతున్నాయి. ఈ దిశగా మూడు దేశాలు పన్నులను తగ్గించేందుకు పూనుకోవచ్చు.

సోషల్ సామ్రాజ్యవాద దేశమైన చైనా, సామ్రాజ్యవాద దేశమైన అమెరికా మధ్య జరుగుతున్న వాణిజ్య పోరు కారణంగా తలెత్తిన నష్టాలు ఈ ఒప్పందం కారణంగా చైనా, జపాన్, దక్షిణ కొరియాలకు 150 నుంచి 200 బిలియన్ డాలర్ల మేరకు తగ్గవచ్చని అంచనా. ఈ ఒప్పందంతో చైనాకు ఎగుమతి అవుతున్న జపాన్ పారిశ్రామిక ఎగుమతులలో 86 శాతం, దక్షిణ కొరియా నుంచి ఎగుమతి అవుతున్న వాటిలో 92 శాతంపై పన్నులు రద్దవుతాయి. జపాన్ ఆటో విడిభాగాల తయారీ పరిశ్రమ ప్రధానంగా లబ్ది పొందుతుంది. ఆస్ట్రేలియా కూడా ఇదే అంచనాతో ఒప్పందానికి సిద్ధపడింది. చైనాతో కొనసాగుతున్న వాణిజ్య సంబంధాల వలన ఇప్పటికే జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా దేశాలూ మిగులులో ఉన్నాయి.

ఆర్‌సిఇపి నుండి భారత్ ఎందుకు వైదొలిగింది?

వాణిజ్య రంగంలో కొన్ని దేశాలు మిగులు దేశాలుగా కనిపిస్తున్నప్పటికీ ప్రపంచ దేశాలలో అతిపెద్ద వాణిజ్య మార్కెట్‌గా ఎదగాలనుకున్న భారత్ ఆర్‌సిఇపి నుండి అకస్మాత్తుగా వైదొలగడం పలు అనుమానాలకు తెరలేపింది. నిజానికి భారతదేశం ఈ ఒప్పందంపై ఆదినుంచీ జరిగిన చర్చల్లో ఇతర దేశాలతో పాటు కీలకంగా పాల్గొంది. తొలుత ఆనాడు అధికారంలో కొనసాగిన యుపిఏ ప్రభుత్వం దీనిపై ఎంతో ఆసక్తి కనబరిచింది. అనంతరం 2014లో ఏర్పడ్డ ఎన్‌డిఏ ప్రభుత్వం కూడా అంతే పదునుగా చర్చల్లో పాలుపంచుకుంది. ఐరోపా మాదిరిగా ఆసియాన్ ఆర్థిక సమాజ స్వప్నం సత్వరం సాకారం కావాలంటూ 2015లో కౌలాలంపూర్ వేదిక నుంచి ఆర్‌సిఇపి చర్చల్లో ఉత్సాహాన్ని పెంచింది కూడా ప్రధాని మోదీయే.

తొలి నుంచి ఈ ఒప్పంద చర్చలలో ముందున్న భారత్ నేడు మాట మార్చింది. ఆర్‌సిఇపి మార్గదర్శక సూత్రాలకు, స్థాపిత స్ఫూర్తికి పూర్తిగా మన్నన దక్కలేదని భారత్ వాదిస్తుంది. కనుక ఈ ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్లు గతేడాది నవంబర్‌లో బ్యాంకాక్ వేదిక నుంచి భారత ప్రధాని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే భారత్ కోరుకుంటే ఎప్పుడైనా చేరవచ్చని, నిబంధనలను కూడా సడలిస్తామంటూ భాగస్వామ్య దేశాలు తలుపులు తెరిచే ఉంచాయి. ఇప్పుడు భారతదేశం అధికారికంగా తెగతెంపులు చేసుకోవాల్సి ఉంది. అంటే ఈ ఒప్పందంలో ఇక కొనసాగబోమని ఆర్‌సిఇపికి రాతపూర్వక ప్రతిని సమర్పించాల్సి ఉంది.

అదే జరిగితే భారత్‌ను ఒప్పించడానికి మిగతా సభ్య దేశాలు ప్రయత్నించే వీలుందని ఆర్‌సిఇపి మినిస్టర్స్ అఫ్ డిక్లరేషన్స్‌లో పేర్కొంది. కాగా ఆర్‌సిఇపి నుంచి భారతదేశం వైదొలగడానికి చైనాతో గాల్వాన్ వాలి సరిహద్దు వివాదం ఘర్షణ స్థాయికి చేరడంతో పాటుగా భారత పారిశ్రామిక, వ్యవసాయ రంగాల నుంచి వెల్లడైన తీవ్ర వ్యతిరేకత అని సాకు చూపిస్తున్నారు. నిజానికి ప్రారంభ సంవత్సరం నుండి చైనా చౌక ఉత్పత్తులు దేశంలోకి వస్తాయన్న ఉద్దేశంతో దేశీయంగా చిన్న మధ్యస్థ ఉత్పత్తిదారులు, వర్తకులు, రైతులు, వృత్తి నిపుణులు, పలు పరిశ్రమల వర్గాలు, మిలియన్ల మంది శ్రామికులు, వినియోగదారులు తమ విస్తృత నిరసనల ద్వారా హెచ్చరిస్తూనే ఉన్నారు. ఆ వ్యతిరేకత గురించి ప్రారంభం నుంచీ చర్చలలో ఉన్న భారతదేశ ప్రతినిధులకు తెలియనిదేమీ కాదు. అయినా వాటిని కనీసంగానైనా గుర్తించకుండానే ఆరు సంవత్సరాల

పాటు కీలకంగా ముందుకు పోయింది. భారతదేశం 2019లో వెనక్కు తగ్గడానికి ప్రధాన కారణం సోషల్ సామ్రాజ్యవాద దేశమైన చైనా, సామ్రాజ్యవాద దేశమైన అమెరికా మధ్య పెరుగుతున్న విభేదాలే కారణం. కరోనా వైరస్ నేపథ్యంలో అమెరికా, హౌస్టన్‌లోని చైనా కాన్సులేట్‌ను మూసివేసి వాణిజ్య పరమైన చర్యలు చేపట్టింది. ఆధునిక టెక్నాలజీ, మానవ హక్కులు, రక్షణ రంగంలో ఇరు దేశాల మధ్య నువ్వా, నేనా అనే ధోరణి కారణంగా దాదాపుగా యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే సమయంలో అమెరికా వ్యూహాత్మకంగా దశాబ్దాలుగా భారత్‌తో ఉన్న చైనా సరిహద్దు వివాదాన్ని అడ్డం పెట్టుకొని భారతదేశాన్ని చైనాపై ఉసికొలిపింది. ఉద్దేశ పూర్వకంగా భారతదేశం చైనాతో కలిసి చేసుకునే ప్రతి ఒప్పందాన్ని అమెరికా చాల తెలివిగా కుదరకుండా చేసింది. నేడు అమెరికా నిర్ణయానికి అనుకూలంగా పరోక్షంగా భారతదేశం తన ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెట్టుటకు ముందుకొచ్చింది. దీనికి చక్కటి ఉదాహరణ ఇరాన్ చమురు కొనుగోలు ఒప్పందం రద్దు. భారతదేశానికి ఇరాన్‌తో ఎలాంటి విబేధాలు లేకపోయిన కేవలం అమెరికా ఒత్తిడి మేరకు ఇరాన్ నుండి చమురు కొనుగోలు నిలిపివేసుకుంది.

ఆశ్చర్యకరంగా నేడు దేశాలు తమ ఆర్థిక ప్రయోజనాల కోసం వాణిజ్య ఒప్పందాలను శత్రు దేశాలతో సైతం కుదుర్చుకుంటుంటే దురదృష్టవశాత్తు పాలకులు అమెరికాతో మెప్పు పొందుటకు దేశ ఆర్థిక ప్రయోజనాలను తాకట్టు పెట్టడం భారతదేశానికి నష్టదాయకమే అవుతుంది. భారతదేశం ఆర్‌సిఇపిలో ప్రధాన పాత్ర వహిస్తున్న చైనా భిన్న వైఖరి వల్ల ఈ ఒప్పందంలో చేరలేదని బాహ్యంగా ప్రకటించింది. నిజానికి ఈ ఒప్పందంలో భాగస్వామిగా చేరితే అమెరికాతో పెంచుకున్న అనుబంధం సడలిపోతుందన్న భయం భారత ప్రభుత్వానికి ఉంది అనడంలో సందేహించనవసరం లేదు. మొత్తం మీద అమెరికా, చైనా మధ్య ఈ పదునైన అంతర్ - సామ్రాజ్యవాద వైరుధ్యం నేపథ్యంలో చైనాతో సరిహద్దు వివాదం విస్ఫోటనం సాకుగా చూపి మోడీ ఆర్‌సిఇపి నుండి తప్పుకోవడం అమెరికా అడుగులకు మడుగులొత్తడం తప్ప మరొకటి కాదు.

ఆర్‌సిఇపి ఒప్పందంపై అమెరికా అవకాశవాద ఎత్తుగడ

ఆర్‌సిఇపి ఒప్పందం కుదిరినంత మాత్రాన అంతా అయిపోయినట్లు భావించరాదు. గతంలో వాణిజ్య ఒప్పందాల చరిత్రను, అనుభవాలను పరిశీలిస్తే ఆర్‌సిఇపి ఒప్పందాన్ని దెబ్బతీసేందుకు అమెరికా ప్రయత్నించే అవకాశాలు ఉన్నాయి. అంతర్జాతీయ ఆర్థిక విశ్లేషకులు ఈ ఒప్పందం బహుపక్ష వాదానికి చారిత్రక విజయమని, ఇది ప్రాంతీయ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు పెద్ద సహాయకారి అవుతుందని భావిస్తున్నారు. కానీ అమెరికా నూతన అధ్యక్షుడు జో బైడెన్ ఆర్‌సిఇపి ఒప్పందాన్ని అతిగా చూపి చైనా ముప్పు పేరుతో టిపిపిని మరోసారి ముందుకు తెచ్చినా ఆశ్చర్యం లేదు. అయితే ఇది అంత తేలికగా వెంటనే జరిగేది కాదు. సిపిటిపిపిలో చేరి దాన్ని ఆర్‌సిఇపికి వ్యతిరేకంగా తయారు చేసేందుకు పూనుకునే అవకాశాలు కూడా లేకపోలేవు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు - అనుభవాలు

2006 తర్వాత ద్వైపాక్షిక వాణజ్య ఒప్పందాలపై భారత్ సంతకాలు చేయడం ప్రారంభించింది. భారత్ మొదటిసారి శ్రీలంకతో 2000లో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకుంది. ఆ తర్వాత మలేసియా, సింగపూర్, దక్షిణ కొరియాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు చేసుకుంది. ప్రభుత్వాలు అధికారికంగా విడుదల చేసిన గణాంకాలు గమనిస్తే, ఈ ఒప్పందాల వల్ల భారత వాణిజ్యలోటు తగ్గడానికి బదులు పెరిగినట్లు నీతి ఆయోగ్ నివేదికను ప్రచురించింది. ఈ నివేదికలో భారత్ దిగుమతులు పెరిగి, ఎగుమతులు తగ్గాయని చెప్పారు. ఒప్పందం మేరకు పది శాతం సుంకాలు తగ్గించినప్పుడల్లా ఒకటిన్నర శాతం మేర దిగుమతులు పెరిగి దేశీయంగా ఖనిజ పరిశ్రమ దారుణంగా దెబ్బతినిపోయింది. ఇప్పటికే ఆసియాన్ దేశాలు, శ్రీలంక నుంచి నల్ల మిరియాలు, యాలకులు వియత్నాం, ఇండొనేసియాల నుంచి చౌక రబ్బరు, ఫిలిప్పీన్, ఇండొనేసియాల నుంచి కొబ్బరి చెక్క వంటివి విస్తృతంగా వచ్చిపడుతుండడంతో దేశీయంగా రైతులు దిగాలు పడుతున్నారు. ఆర్‌సిఇపి అమలులోకి వస్తే ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల నుంచి పోటెత్తే పాడి ఉత్పాదనల తాకిడి రైతాంగాన్ని నిలువునా ముంచేసే ప్రమాదం ఉందనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. చైనా, జపాన్‌లు ఆర్‌సిఇపిలో ప్రధాన భాగస్వామ్యం ఉండడంతో పట్టు, ఉద్యాన, పూదోటల రైతాంగ ప్రయోజనాలూ దారుణంగా కొల్లగొట్ట బడుతాయని, దొడ్డిదారిన చొరబడే చైనా ఉత్పత్తులతో చిన్న పరిశ్రమలు చితికిపోతాయన్న భయాందోళనల్ని తోసిపుచ్చే వీల్లేదు.

దేశీయ తయారీ పరిశ్రమల్లో ఒకటైన లోహ పరిశ్రమపై ఫారిన్ ట్రేడ్ అగ్రిమెంట్ (అంటే ఎఫ్‌టిఎ) వల్ల తీవ్ర ప్రభావం పడింది. ఒక నివేదిక ప్రకారం లోహాలపై ఎఫ్‌టిఎ టారిఫ్‌లో 10 శాతం తగ్గించడం వల్ల దాని దిగుమతులు 1.4 శాతం పెరిగాయి. గతంలో భారతదేశం చేసుకున్న వాణిజ్య ఒప్పందాలను లోతుగా పరిశీలించినపుడు ఇంతవరకు వాణిజ్యం గణనీయంగా పెరగలేదని 2020 ఆర్థిక సర్వే తెలియచేస్తుంది. ప్రస్తుతం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని భారతదేశం తక్కువగా 5-25 శాతం మధ్యలోనే ఉపయోగించుకున్నదని ఆసియా అభివృద్ధి బ్యాంకు తన వార్షిక నివేదికలో విశ్లేషించింది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో భాగస్వామ్య దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు పెరుగుతున్నాయి గాని, భారత ఎగుమతులు పెరగడం లేదు. కూటమిలో ఎగుమతి చేసే దేశాలు పొందే ప్రయోజనాలు దిగుమతి చేసుకునే దేశాలు పొందలేవు. భారతదేశం నేటికీ దిగుమతి దేశంగా ఉండడం విచారకరం, ఆర్థిక వ్యవస్థకు నష్టదాయకం కూడా. ఎగుమతులు పెరగకపోవడానికి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక, మార్కెట్ విధానాలే కారణం. మన ఉత్పత్తులు పెరగాలని కోరుకుంటున్న మన పాలకులు అందుకు తగిన విధానాలు రూపొందించాలి.

ప్రపంచంలో చైనా తరువాత భారతదేశ జనాభా అధికంగా ఉంటుంది. భౌగోళికంగా భారతదేశ మార్కెట్ విశాలమైంది కూడా. అయితే భారత్ అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. తయారీ రంగంలోని అధిక సామర్థ్యమే భారతదేశ వాణిజ్య రంగానికి ఆధారం. అయినప్పటికీ ప్రపంచ తయారీ రంగంలో భారతదేశ వాటా కేవలం 2 శాతమే. ఈ వాటా 1 శాతం పెరిగినా దేశంలో 50 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు వస్తాయి. ఈ నేపథ్యంలో ఆర్‌సిఇపి భారతదేశానికి ఎంతో కీలకం. స్వేచ్ఛాయుత వాణిజ్య విధానంలో డిజైనింగ్, నైపుణ్యం, సరఫరా సామర్థ్యాలను సద్వినియోగం చేసుకుని భారతదేశం వాణిజ్య పరిధిని పెంచుకోవాలి. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం వల్ల లాభించే

అవకాశాలను భారతదేశం అందిపుచ్చుకో గలగాలి. మరోవైపు భారతదేశంలో తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేసి, ఆర్‌సిఇపి దేశాలకు ఎగుమతులు పెంచగలగాలి. ఇదంతా జరగాలంటే ఆర్‌సిఇపి మినిస్టర్స్ ఆఫ్ డిక్లరేషన్ ప్రకారం రెండు సంవత్సరాలలోపు ఆర్‌సిఇపిలో భాగస్వామ్యం కావాలి. ముందు చైనాతో పాటు మనం కూడా ఆర్‌సిఇపి పై ఒక అంగీకారానికి రావాలి.

ఆర్‌సిఇపి పై భారత్ పునస్సమీక్ష అవసరం

ఏ దేశ ప్రభుత్వాలైనా తమవైన స్వంత నమూనాతో దేశాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకోవాలి. కానీ మరొక దేశం మీద పూర్తిగా ఆధారపడి అంచనాలు రూపొందించుకోవడం మంచిది కాదనేది చారిత్రిక సత్యం. పరస్పర ప్రయోజనదాయకం కావాల్సిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ధృతరాష్ట్ర కౌగిలిలా మారి కొన్ని దేశాల ప్రగతి కాంక్షల్ని ఎలా చిన్నాభిన్నం చేస్తాయో భారత్‌కు తెలియనిది కాదు. మౌలికంగా ఆర్‌సిఇపి ఒప్పందం తయారీ రంగ పరిశ్రమలున్న దేశాలకు, ఎగుమతులు చేయగల దేశాలకు ఉత్తమమైంది. దిగుమతులపై ఆధారపడే దేశాలకు ప్రాణసంకటమైనది. సరుకుల్ని ఉత్పత్తి చేసే దేశాలు సులభంగా వాటిని సభ్య దేశాల మార్కెట్లకు తరలిస్తాయి. అవే సరుకులు తమ దేశంలో ఉత్పత్తవుతున్నా ఒప్పందంలోని నియమాల ప్రకారం భాగస్వామ్య దేశాలు దిగుమతి చేసుకోక తప్పదు.

చైనాలో ఉన్న అధిక జనాభాతో పాటు కార్మిక చట్టాలు, అక్కడుండే పని పరిస్థితులవల్ల వేరే దేశాలతో పోలిస్తే అది చవగ్గా సరుకుల్ని ఉత్పత్తి చేసి ఎగుమతి చేయగలుతుంది. సహజంగా ఈ ఒప్పందం ప్రకారం భాగస్వామ్య దేశాలు తక్కువ ధరలతో మార్కెట్లను ముంచెత్తినప్పుడు జనం వాటికోసమే ఎగబడతారు. స్థానికంగా ఉత్పత్తయ్యే సరుకంతా అమ్ముడుకాక పరిశ్రమలు భారీగా నష్టాలు చవిచూడాల్సి రావొచ్చు. ఉదాహరణకు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల పాల ఉత్పత్తులు భారతదేశంతో పోలిస్తే బాగా చవక. ఆర్‌సిఇపి ఒప్పందం కింద అవి భారత మార్కెట్లకొస్తే భారత ఉత్పత్తులవైపు ఎవరూ కన్నెత్తి చూడరు. పర్యవసానంగా వేలాది పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం విదేశీ పాల ఉత్పత్తులపై భారతదేశం 35 శాతం సుంకం విధిస్తోంది. ఆర్‌సిఇపిలో చేరితే అది అసాధ్యం. సుంకాలు నిర్దిష్ట పరిమితిని దాటకూడదు. ప్రాణావసరమైన ఔషధ ఉత్పత్తులపై ఆర్‌సిఇపి ఒప్పందం కింద కనీసం ఇరవైయ్యేళ్ల పాటు పేటెంట్ ఉంటుంది. అదే ఔషధాన్ని అంతకన్నా చవగ్గా ఉత్పత్తి చేయగల సామర్థ్యం మన పరిశ్రమలకున్నా ఆ పని చేయడానికి పేటెంట్ హక్కులు అడ్డుపడతాయి. కనుక రోగులు మార్కెట్లో లభ్యమయ్యే ఖరీదైన విదేశీ ఔషధాలపైనే విధిగా ఆధారపడాలి. ఈ ప్రాంతంపై చైనా ఆధిపత్యం పెరగడం, డాలర్ స్థానాన్ని యువాన్ ఆక్రమించే ప్రయత్నంలో ఉండడం, పశ్చిమ దేశాల ఆర్థిక వ్యవస్థలు బలహీనంగా ఉండడం సైనిక, రక్షణ రంగంలో మిత్రులైన అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాల ఆర్థిక ప్రయోజనాలే ముఖ్యంగా వ్యవహరించడం లాంటి అంశాలను భారత ప్రభుత్వం లోతుగా విశ్లేషించుకోవాలి.

ముగింపు

విశాల ప్రపంచంలో ప్రకృతిలో దొరికే ముడి పదార్థాల లభ్యత ఆధారంగా ఉత్పత్తి జరుగుతుంది. భౌగోళిక కారణాలవలన అన్ని ప్రాంతాల్లో అన్ని వస్తువులు ఉత్పత్తి కావు. సహజ వనరుల లభ్యత వాతావరణ పరిస్థితుల వలన ఉత్పత్తిలో, ఉత్పత్తి వ్యయంలో ప్రాంతాల మధ్య వ్యత్యాసం ఉంటుంది. ఒక ప్రాంతంలో కొన్ని వస్తువులు మాత్రమే ఉత్పత్తి అవుతాయి. ఏ దేశం కూడా తమకు అవసరమైన అన్ని వస్తు, సేవలను తగినంతగా ఉత్పత్తి చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉండకపోవచ్చు. ఒక ప్రాంత ఉత్పత్తి వ్యయాలు వేరొక ప్రాంత వ్యయాల కంటే తక్కువగా ఉంటాయి. కొన్ని ప్రాంతాల నైపుణ్యత వలన కొన్ని పరిశ్రమలు ప్రత్యేకీకరణ కలిగి ఉంటాయి. ఉత్పత్తి, సప్లై డిమాండ్ మూలంగా కొరత లేదా మిగులు ఏర్పడుతాయి. దానితో పాటుగా వినియోగదారుల వైవిధ్యభరితమైన అభిరుచుల వలన శతాబ్దాలుగా దేశాల మధ్య వస్తు మార్పిడి అనివార్యమైంది. ఇలా దేశ సరిహద్దులు దాటి వర్తకం జరగడానికి అనేక కారణాలున్నాయి. ఇందుకు దేశాల మధ్య వర్తక విధానాలు ఏర్పరచుకొని, కొరతగా ఉన్న వస్తువులను దిగుమతి చేసుకొని మిగులుగా ఉండే వస్తువులను ఎగుమతి చేయడానికి అంగీకరిస్తాయి. ఈ ఎగుమతి – దిగుమతులతో కాలక్రమంలో ఇది అంతర్జాతీయ వాణిజ్యంగ పరిణమించింది. ఆధునిక వ్యాపార ప్రపంచానికి విదేశీ వాణిజ్యం వెన్నెముకగా మారింది. ఆర్థికవేత్తలు ప్రతిపాదించినట్లు అంతర్జాతీయ వ్యాపారంలో దేశాల మధ్య వస్తు ఉత్పత్తిలో నిరపేక్ష ప్రయోజనం, తులనాత్మక ప్రయోజనం రెండూ ఉంటాయి. అందువల్ల దేశాల మధ్య స్నేహపూర్వకంగా జరిగే వాణిజ్య ఒప్పందాలను గంపగుత్తగా వ్యతిరేకించాల్సిన అవసరం లేదు.

గతంలో సభ్య దేశాలన్నిటికీ లాభం చేకూర్చే లక్ష్యం విదేశీ వాణిజ్యం రూపొందింది. అట్లా ముందుకు పోయిన ఒప్పందాలపై ఎవరికీ అభ్యంతరం ఉండకూడదు. నేడు సామ్రాజ్యవాద విస్తరణ కోసం ఆచరణలో ఒక దేశానికి ప్రయోజనం కలిగేలా, ఆ దేశానిదే పైచేయి అయ్యేలా ఉన్నప్పుడే సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆర్‌సిఇపి దేశాలను ప్రధానంగా చైనా, ఆ తర్వాత జపాన్, దక్షిణ కొరియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా శాసించగలుగుతాయి. ఆ విషయంలో తగిన రక్షణలకు హామీ ఇవ్వడానికి ముందుకొస్తే ఈ ఒప్పందంలో చేరడానికి రెండు సంవత్సరాల కాలముంది. సంపదలో, ఉత్పత్తిలో దేశాల మధ్య అసమానతలు తీవ్ర స్థాయిలో ఉన్న పరిస్థితుల్లో ఇలాంటి ఒప్పందాలు సహజంగా కొన్ని దేశాలకే ప్రయోజనం కలిగిస్తాయి. అన్ని దేశాల సమస్యలనూ, ఆందోళనలనూ పరిగణనలోకి తీసుకుంటే, తగిన మినహాయింపులిస్తే ఇదే కాదు ఏ వాణిజ్య ఒప్పందానికైనా అభ్యంతరాలుండరాదు. ద్వైపాక్షిక సంబంధాలతో పొరుగు దేశాలతో కూడా సన్నిహిత సంబంధాలు ఉండడం అనేది దేశానికి శ్రేయస్కరం.

పక్కనున్న దేశాలను వదిలి కేవలం రక్షణాత్మక ఒప్పందాల పేరుతో అమెరికాతో అంటకాగడం భారత్‌కు వాణిజ్యపరంగా మంచిది కాదు. భారత్ అనుసరించే వాణిజ్య విధానం స్వతంత్ర నిర్ణయం నిజాయితీతో కూడుకున్నదై ఉండాలి. అగ్ర రాజ్యానికి దాసోహం అనే మనస్తత్వం విడిచి పెట్టాలి. కూటమి అనివార్యమైతే చైనాతో ఆర్‌సిఇపిలో కొనసాగడమే ప్రయోజనంగా ఉంటుంది. చైనా, అమెరికాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధంలో దేశ ప్రయోజనాలు తాకట్టు పెట్టకుండా, అవసరమైతే దేశ ప్రయోజనాలకు అనుగుణంగా కలిసివచ్చే దేశాలతో మరో వాణిజ్య కూటమి ఏర్పాటు గురించి భారతదేశం

మోడీ పాలనలో కుదేలైన ఆర్థిక వ్యవస్థ

గత ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో అమలు చేసిన సంస్కరణల వేగాన్ని మోడీ ప్రభుత్వం పెంచడంతో భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడిందని అంటున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

ఆరేళ్ల మోడీ పాలనలో ఆర్థిక వ్యవస్థ కుదేలయింది. సామాన్య వినియోగదారులకు, వివిధ రంగాలకు, కార్మికులకు, యువతకు దెబ్బమీద దెబ్బ తగులుతూనే ఉంది. అయినా, 2030 నాటికి చైనా తర్వాత స్థానంలో భారతదేశమే రెండో బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగనుంది అని బిజెపి నేతలు చెప్పుకుంటున్నారు. నిజానికి చేదు వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. మనదేశ ఆర్థిక వ్యవస్థ వరుసగా రెండు త్రైమాసికాలు క్షీణ రేటును నమోదుచేసింది. ఈ పరిస్థితిని మాంద్యంగా పరిగణిస్తారు. జూన్, సెప్టెంబర్ త్రైమాసికాల్లో భారత్ వరుస క్షీణ రేటును నమోదుచేసిన నేపథ్యంలో దేశం సాంకేతికంగా మాంద్యంలోకి జారిపోయినట్లే భావించాల్సి ఉంటుంది. మొదటి ఆరు నెలల కాలంలో భారత్ ఆర్థిక వ్యవస్థ 15.7 శాతం క్షీణతను నమోదు చేసుకుంది. గత ఏడాది ఇదే కాలంలో 4.8 శాతం వృద్ధిరేటు నమోదయ్యింది.

మన జిడిపి పెరుగుదల రేటు అంచనాల కన్నా తగ్గిపోతోంది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో జిడిపి వృద్ధిరేటు 8 శాతం ఉండగా 2019-20 ఆర్థిక సంవత్సరానికి జిడిపి వృద్ధిరేటు 4.2 శాతానికి తగ్గింది. ఆరేళ్ల కాలంలో ఏకంగా ఉద్యోగాలు తరిగిపోయాయి. 2014-15లో నిరుద్యోగం 6 శాతం ఉండగా 2019-20లో 8.5 శాతానికి చేరింది. పన్నుల వసూళ్ల లక్ష్యాలు చేరుకోలేకపోతున్నాయి. బ్యాంకుల పారు బకాయిలు గత ఐదేళ్లలో రెండు లక్షల కోట్ల నుండి పది లక్షల కోట్ల రూపాయలకు పెరిగిపోయాయి. పోర్టుఫోలియో పెట్టుబడులు దేశంలోకి వచ్చే వేగం తగ్గడమే గాక ఇతర దేశాలకు తరలిపోయే వేగం పెరిగింది. 2014-15లో ప్రభుత్వ వ్యయం 14 శాతం ఉండగా 2019-20 సంవత్సరానికి 12 శాతానికి దిగజారింది. మన ఎగుమతులు 9 శాతం క్షీణించాయి. వ్యాపార ద్రవ్యోల్బణం 7.61 శాతం, ఆహార ద్రవ్యోల్బణం 11.7 శాతం పెరిగింది. బ్యాంకు రుణాలను ఎగ్గొట్టిన ఆర్థిక నేరగాళ్లు శిక్షలను తప్పించుకోడానికి విదేశాలకు పారిపోవడం పెరిగింది. విదేశాంగ మంత్రి పార్లమెంట్‌కు ఇచ్చిన సమాచారం మేరకు విజయ్‌మాల్యా, నీరవ్‌మోడీ, మెహుల్ చోక్సీ వంటివారు 31 మంది విదేశాలకు పారిపోయారు. మోడీ కార్పొరేట్లకు రద్దుచేసిన బ్యాంకు మొండి బాకీలు రు. 5,16,139 కోట్లు.

కొవిడ్‌కు ముందే పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి హడావిడిగా అమలు చేయడం వల్ల దెబ్బతిన్న ఆర్థికరంగం కరోనా వ్యాధి, దేశవ్యాప్త లాక్‌డౌన్ తర్వాత మరింత కుదేలై సామాన్య జన జీవితాలు ఛిద్రమైన విషయం సర్వ విధితమే. గత జూలై-సెప్టెంబర్ త్రైమాసికపు జిడిపి అంచనాలను చూసి ప్రభుత్వ అధికార ప్రతినిధులు ఎందుకింత సంబరపడుతున్నారో అర్థం కాదు. 2019-20 సంవత్సరంలో జూలై-సెప్టెంబర్ జిడిపితో పోల్చితే ఈ సంవత్సరం అదే కాలంలో జిడిపి మైనస్ 7.5 శాతం వృద్ధిరేటు నమోదయింది. దీనికి ముందు మూడు నెలల కాలానికి గాను మైనస్ 23.9 వృద్ధిరేటు నమోదు చేసింది. అక్కడి నుండి కోలుకుంటున్న తీరు ముందు ఊహించిన దానికన్నా బాగుందని ప్రభుత్వ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే కాస్త లోతుల్లోకి చూస్తే ఈ కోలుకోవడం అనేది నమ్మదగినదిగా లేదు. అంతేగాక ఇది పేదరికాన్ని, నిరుద్యోగాన్ని మరింత పెంచింది. అందుచేత ఇది నికరంగా నిలబడేది కాదు.

ప్రపంచంలో ఎక్కడా లేనంతగా భారత్‌లో కఠినమైన లాక్‌డౌన్ ఆంక్షలు అమలు చేయడం వల్ల ఉత్పత్తి చాలా ఎక్కువగా పడిపోయిందని పలువురు ఆర్థిక నిపుణులు తెలిపారు. కొందరు నిపుణులు ఉత్పత్తి పతనం 30 శాతం వరకు ఉంటుందని, ప్రభుత్వ గణాంకాలు

ఆలోచించాలి. ప్రస్తుత ప్రపంచ సంక్షోభ పరిస్థితిలో, దేశ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించాలి. భారతదేశం సామ్రాజ్యవాద విధానాలను సమర్థించే ప్రపంచీకరణ, కార్పొరేట్ విధానాల నుండి బయటకు రావాలి.

ఇప్పటికే ప్రపంచీకరణ విధానాలతో ఆసియా దేశాల అనుభవంలో ఎగుమతి ఆధారిత విధానాలతోనే వేగంగా వృద్ధి చెందాయి. ఇప్పుడు ఆర్‌సిఇపి ద్వారా పొరుగునే ఒక పెద్ద స్వేచ్ఛా వాణిజ్య కేంద్రం ఏర్పడింది. దేశీయ పారిశ్రామిక, వ్యవసాయ, వాణిజ్య రంగాల ఉత్పత్తి ఎగుమతిపై దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది. భారతదేశం సరిహద్దునున్న దేశాల మూలంగా రక్షణాత్మక చర్యలు తీసుకొంటున్న నేపథ్యంలో ప్రపంచ దేశాల నుండి ఆశించే పెట్టుబడులు రావాలనుకోవడం దురాశే అవుతుంది. భారతదేశం ప్రధానంగా స్వీయ పారిశ్రామిక, వ్యవసాయ రంగ రక్షణ చర్యలు తీసుకుంటూ స్థానిక పారిశ్రామికవేత్తలు, వ్యవసాయరంగ బలోపేతానికి ఈ వాణిజ్య రంగ ఒప్పందాలను ఉపయోగించుకోవాలి. కాని భారత పారిశ్రామిక రైతాంగ ప్రయోజనాలను ఫణంగా పెట్టడం మానుకోవాలి. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థల ఒత్తిడి మేరకు ప్రపంచీకరణ విధానాలకు తలొగ్గరాదు. భారతదేశ ఆర్థిక ప్రయోజనాలను అప్పనంగా పళ్లెంలో పెట్టి జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్లకు అప్పగించడం దేశ ఆర్థిక భవిష్యత్తుకు తీరని విఘాతం కలుగుతుందనడంలో సందేహం లేదు.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం) వీ

నమ్మదగినవిగా లేవంటున్నారు. జన జీవనాన్ని ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాలు పరిశీలించిన సామాజికవేత్తలు, ఆర్థికవేత్తలు జిడిపి క్షీణత... ప్రజల జీవితాలను, జీవనోపాధిని నాశనం చేసిందని, కోట్లాది మందిని ఆకలి సంక్షోభంలోకి నెట్టిందన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ఈ సంక్షోభం ఇకపై జీవనోపాధి సంక్షోభం కాదని, మనగడనే ప్రమాదంలోకి నెడుతుందని హెచ్చరిస్తున్నారు. ఇటువంటి దారుణ పరిస్థితుల నుంచి ఆర్థిక వ్యవస్థ కోలుకోవాలంటే మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వ పెట్టుబడులను పెంచాలని, దీని ద్వారా భారీ సంఖ్యలో ఉద్యోగాల కల్పన జరుగుతుందని, తద్వారా డిమాండ్ పెరిగి ఉత్పత్తి పుంజుకుంటుందని పలువురు సూచించినా మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మరోవైపు ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ పాత్ర అధ్యక్షతన జరిగిన ద్రవ్య పరపతి విధాన సమీక్ష అనంతరం దేశ చరిత్రలోనే తొలిసారి 'నౌక్యాస్ట్' పేరుతో విడుదల చేసిన నివేదిక దేశం అసాధారణ రీతిలో ఆర్థిక మాంద్యం దిశగా వెళ్తోందని ఆందోళన వ్యక్తం చేసింది.

ప్రధాని మోడీ మాత్రం మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే అయిదవ బలమైన ఆర్థిక వ్యవస్థగా ఉందని గొప్పగా చెబుతున్నాడు. మన దేశ జిడిపి జనం చేతుల్లోకి పోతే ప్రజల కొనుగోలు శక్తి పెరిగి జీవితాలు మెరుగుపడుతాయి. కార్పొరేట్ల చేతుల్లో కేంద్రీకృతమైతే అంకెల్లో గొప్పలు చెప్పుకోవడానికి మాత్రమే పనికి వస్తుంది. ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యుఇఎఫ్) ప్రపంచ సామాజిక చలనశీలత నివేదిక 2020 ఏం చెప్పింది? గణనీయమైన ఆర్థిక పురోగతి సాధించినప్పటికీ భారత్‌లో సామాజిక ఆర్థిక అసమానతలు తీవ్రమవుతున్నాయి. ఒక్క శాతం కుటుంబాల వద్ద 30 శాతం సంపద ఉంటే, 10 శాతం కుటుంబాల వద్ద 74 శాతం సంపద పోగుపడింది. 90 శాతం ప్రజలకు చేరుతుంది 26 శాతం మాత్రమే. జాతీయ గణాంక సంస్థ అంచనా ప్రకారం 2019-20లో తలసరి వార్షిక జాతీయ ఆదాయం రు.1,12,835 ఉంది. పేదలు దీన్ని చేరుకోవాలంటే ఏడు తరాలు పడుతుందని ప్రపంచ సామాజిక చలనశీలత నివేదిక-2020 ప్రకారం 82 దేశాల జాబితాలో మనది 7వ స్థానం. మోడీ ప్రభుత్వం చేపడుతున్న కార్పొరేట్ అనుకూల విధానాలు అంతరాలను మరింత పెంచే విధంగా ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థ పుంజుకునే అవకాశాలు కన్పించడం లేదు.

మన జిడిపి ఈ ఏడాది పదిశాతం పైగా తిరోగమనంలో ఉంటుందని రేటింగ్ సంస్థలు ప్రకటించాయి. వచ్చే ఐదేండ్ల వరకు సగటున 4.5 శాతానికి మించి వృద్ధిరేటు ఉండదని ఆక్స్‌ఫర్డ్ చెప్పింది. అయినా, కరోనా కాలంలో మన కంపెనీలు ఎలా లాభాలు పొందాయో తెలుసుకుంటే ఆశ్చర్యపోతాం. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి (సిఎంఐఇ) నివేదిక ప్రకారం సెప్టెంబర్ నెలతో ముగిసిన రెండవ త్రైమాస కాలంలో 1,897 కంపెనీలు రు. 1,33,200 కోట్ల రూపాయల మేరకు నికర లాభాలు ఆర్జించాయి. ఉద్దీపనల పేరుతో జనానికి ఏ మూలకూ చాలని బియ్యం, కందిపప్పు, కొంత నగదు తప్ప మరేమీ లేదు. ఉపాధి కల్పన, ఆర్థికవ్యవస్థ పునరుద్ధరణ వంటి అకర్షణీయమైన పేర్లతో ఉద్దీపనలన్నీ కార్పొరేటు సంస్థలకే ఇచ్చినందువల్లనే వాటికి ఆ లాభాలు వచ్చాయి. ప్రపంచంలో బిలియనీర్ల సంపద కరోనా కాలంలో 27.5 శాతం పెరిగితే, మన దేశంలో అది 35 శాతం ఉంది. అందుకే మన దేశంలో పెట్టుబడులు పెట్టడానికి విదేశీ కంపెనీల ఆసక్తి అని వేరే చెప్పనవసరం లేదు.

ప్రపంచంలో అసమానతలు ఎక్కువగా ఉన్న దేశాలలో మన దేశం రెండవ స్థానంలో ఉన్నది. ఈ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చేనాటికి పైనున్న ఒక శాతం మంది జిడిపిలో 49 శాతాన్ని స్వంతం చేసుకుంటున్నారు. అయితే, రెండున్నర సంవత్సరాల మోడీ పాలన తర్వాత ఆ మొత్తం 58.4 శాతానికి పెరిగింది. కోట్లాది మంది ఉపాధి లేక ఆకలితో అల్లాడుతుంటే అంబాని ఆస్తులు ఒక సంవత్సరంలోనే 73 శాతం పెరిగాయి. అలాగే ఆదాని సంపద 61 శాతం పెరిగింది. దేశంలోని పది మంది కుబేరుల సంపద 51756 కోట్ల డాలర్లకు పెరిగింది. అంటే రు.38 లక్షల కోట్లు. 10 శాతం సంపన్నుల దగ్గర 74 శాతం సంపద పోగుపడింది. దిగువ 50 శాతం మందికి జిడిపిలో 2.1 శాతం మాత్రమే దక్కుతున్నది. అంటే పెరుగుతున్న దేశ సంపద కొద్దిమంది శతకోటీశ్వరుల చేతుల్లోకి పోతున్నది. దేశ జనాభాలో సగం మందికి పైగా ఉన్న పేదలు మరింత దారిద్ర్యంలోకి కూరుకుపోతున్నారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించటం, వారిపై మరిన్ని భారాలను మోపడం జరుగుతోంది. మోడీ పాలన కాలంలో రు.17.5 లక్షల కోట్ల పరోక్ష పన్నులు పెరిగాయి. జాతీయవాదం, దేశభక్తి పేరుతో ప్రజల అసంతృప్తిని పక్కదారి పట్టించటం ద్వారా బిజెపి ప్రభుత్వం ఈ దోపిడీకి మార్గాన్ని సుగమం చేస్తున్నది.

కొవిడ్ వ్యాప్తి చెందిన ఏడాది కాలంలో దేశీయంగా ఏడుగురు కుబేరుల సంపద సుమారు రు. 4,73,000 కోట్లు (4 బిలియన్ డాలర్ల) మేర వృద్ధి చెందింది. సైరస్ పూనావాలా (సీరమ్ ఇన్‌స్టిట్యూట్), శివ్ నాడార్ (హెచ్‌సిఎల్ టెక్నాలజీస్), అజీమ్ ప్రేమ్‌జీ (విప్రో), రాధాకిషన్ దమానీ (డిమార్ట్), దిలీప్ సంఘ్వీ (సన్ ఫార్మా) సంపద విలువ గణనీయంగా వృద్ధి చెందింది. ప్రజాభీష్టాన్ని ప్రతిఫలించని నరేంద్ర మోడీ పాలనలో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తున్నా అభివృద్ధిలో దేశం దూసుకు పోతోందని ప్రచారం చేసుకోవడంలోనే పాలకుల డొల్లతనం ఉంది. విద్య, వైద్య రంగాల నుండి పూర్తిగా తప్పుకోవడానికి సిద్ధపడుతున్నది.

సంవత్సర కాలంలో కార్పొరేట్ల సంపద పెరుగుదల

సంస్థ	2019 చివర	2020లో	వృద్ధి రు.కోట్లు
గౌతమ్ అదానీ	83950	2,39,330	1,55,380
ముకేశ్ అంబానీ	4,31,531	5,64,819	1,33,288
సైరస్ పునావాలా	63,993	1,14,878	50,885
శివ్ నాడార్	1,15,688	1,62,008	46,320
అజీమ్ ప్రేమ్‌జీ	1,35,055	1,73,790	38,735
రాధాకిషన్ దమానీ	71,355	1,06,040	34,685
దిలీప్ సంఘ్వీ	54,935	71,357	16,422

తిరోగమనంలో పారిశ్రామిక రంగం

దేశంలో పారిశ్రామిక రంగం పాతాళానికి పరుగులు పెడుతోంది. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధిస్తామన్న పాలకుల గొప్పలు గాలి బుడగలయ్యాయి. ఇదంతా కరోనా వల్లే అని అనుకోవడానికి

లేదు. కరోనా కంటే ముందుగానే మన ఆర్థిక వ్యవస్థ అమాంతం కుంగిపోయింది. పారిశ్రామిక రంగం అయితే రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి పడిపోయింది. 2019 స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో పారిశ్రామిక రంగం వాటా కేవలం 27.5 శాతం మాత్రమే. పారిశ్రామిక, తయారీ రంగం వాటా గత ఐదేళ్లలో 250 బేసిస్ పాయింట్లకు దిగజారిపోయింది. 2014లో జిడిపిలో 30 శాతంగా ఉన్న పారిశ్రామిక రంగం వాటా గత మూడేళ్ల నుంచి 29.3 శాతానికి పరిమితమైంది. మేక్ ఇన్ ఇండియా ఆర్భాటపు నినాదాల మాటున మసకబారిపోతున్న పారిశ్రామిక రంగ దుస్థితికి ఈ గణాంకాలే నిదర్శనం. పాకిస్తాన్, నేపాల్, మయన్మార్ మినహాయిస్తే ఆసియాలో అత్యంత తక్కువ పారిశ్రామిక వృద్ధి నమోదు చేసిన దేశాల జాబితాలో భారత్ చేరిపోయింది. ఇంతటి దారుణ స్థితికి కారణం మోడీ సర్కార్ వినాశకర ఆర్థిక విధానాలే అన్నది సుస్పష్టం.

నరేంద్ర మోడీ ప్రధానిగా బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయటమనే ముసుగులో అమలు జరుపుతున్న సంస్కరణలు దేశాభివృద్ధికి, సార్వభౌమత్వానికి ప్రమాదకరంగా పరిణమించాయి. వాస్తవానికి 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం నాటి నుంచి ఆటుపోట్లను ఎదుర్కొంటున్న భారత పారిశ్రామిక రంగం గడిచిన మూడేళ్లలో అంటే 2016 నుంచి 2019 మధ్యకాలంలో శరవేగంగా పతనమైంది. ఐదేళ్లలో మొత్తం తగ్గుదలలో నాలుగింట మూడొంతులు ఈ మూడేళ్లలోనే పతనమవ్వడం మోడీ సర్కార్ విధానాల దుష్ఫలితమేనని తేటతెల్లమవుతోంది. చిన్న, మధ్య తరహా వ్యాపారులను, అసంఘటిత రంగాన్ని, సహకార రంగాన్ని నష్టాల పాల్జేసిన పెద్ద నోట్ల రద్దు, సరైన ప్రణాళిక లేకుండా తీసుకొచ్చిన వస్తు సేవల పన్ను(జిఎస్‌టి) విధానం ఆర్థిక వ్యవస్థను కుదిపి వేసింది. ఈ కాలంలోనే తయారీ రంగం, ఖనిజ తవ్వకాలు, నిర్మాణం, విద్యుదుత్పాదన కలుపుకొని పారిశ్రామిక ఉత్పాదకత కేవలం 17 శాతానికి పరిమితం కావడం నోట్ల రద్దు, జిఎస్‌టి విధానాల ఘోర వైఫల్యానికి నిదర్శనం. ఫలితంగా దేశ ఆర్థిక పరిస్థితి తిరోగమనం వైపు మళ్లింది.

ప్రభుత్వరంగ సంస్థలలో వాటాలను అమ్మడానికి, కొన్ని పరిశ్రమలలో వ్యూహాత్మక వాటాల అమ్మకం పేరుతో మెజారిటీ వాటాలను, తద్వారా ఆ పరిశ్రమలను ప్రైవేటు వారికి కట్టబెట్టడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థల దోపిడీపై ఉన్న ఆంక్షలను తొలగించడం కోసం తొందర పడుతున్నది. భూమితో సహా దేశంలోని వనరులన్నింటినీ కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోంది. ఇంతకు ముందు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించనప్పటికీ బడా పెట్టుబడిదారులకు బ్యాంకుల నుండి లక్షల కోట్ల రూపాయల రుణాలను ఇప్పిస్తున్నది. బడా పెట్టుబడిదారీ సంస్థలకు ప్రతి సంవత్సరం ఆరు లక్షల కోట్ల రూపాయలకు పైగా పన్ను రాయితీలను ఇస్తున్నది. ఈ విధమైన ప్రజా వ్యతిరేక, పెట్టుబడిదారీ అనుకూల విధానాలను అమలు చేయడం వలననే కార్పొరేట్ల ఆస్తులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సరళీకరణ విధానాల అమలులో భాగంగా ప్రజా వ్యతిరేక సంస్కరణలను వేగంగా అమలు చేయడం ద్వారా బడా పెట్టుబడిదారులు దేశ సంపదను కొల్లగొట్టడానికి ప్రభుత్వం మార్గాన్ని సుగమం చేస్తున్నది. రెండున్నర సంవత్సరాల కాలంలో టాటా, బిర్లా, అంబాని, బజాజ్‌ల సంపద విలువ లక్ష కోట్ల రూపాయల చొప్పున పెరిగింది. ఇతర బడా సంస్థల సంపద కూడా గణనీయంగా పెరిగింది.

గత మూడు సంవత్సరాలుగా స్థూల జాతీయోత్పత్తి(జిడిపి) కూడా దేశంలో నత్తనడక కంటే నెమ్మదించింది. మూడేళ్లలో డాలర్ ప్రమాణాల్లో మన దేశ జిడిపి 7.7 శాతం నామమాత్రపు వృద్ధి నమోదు కాగా, బంగ్లాదేశ్ 11 శాతం, చైనా 9.5 శాతం, వియత్నాం 9.3 శాతం నమోదు చేసి మెరుగయ్యాయి. దేశ పారిశ్రామిక, ఆర్థిక ప్రగతి అధోగతి పాలౌతోందన్న హెచ్చరికలను లెక్క చేయకుండా తానుబట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్న చందాన మోడీ సర్కార్ కార్పొరేట్ల సేవలో తరిస్తోంది. మనది వ్యవసాయక ప్రధాన దేశం అయినందున ఉద్యోగాలు, ఉపాధి దక్కాలంటే పారిశ్రామిక వృద్ధి తప్ప మరో మార్గం లేదు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో పారిశ్రామిక, తయారీ రంగ వృద్ధి దేశానికి అత్యవసరం. అత్యధిక మందికి ఉపాధి అవకాశాలు కల్పించే ఈ రంగాలు పుష్టిగా ఉంటేనే ప్రజల తలసరి ఆదాయం పెరిగి కొనుగోలు శక్తి ఒనగూరుతుంది. కొనుగోలు శక్తి పెరిగితేనే సరుకులకు డిమాండ్ పెరిగి పారిశ్రామిక, తయారీ రంగం పరుగులు పెడుతుంది.

చిన్న పరిశ్రమలకు శరాఘాతం

సమగ్ర, సుస్థిర అభివృద్ధి ప్రస్థానంలో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమ(ఎంఎస్‌ఎంఇ)ల ప్రాధాన్యం ఎనలేనిది. పెద్ద సంఖ్యలో వినియోగ, మూలధన వస్తుసేవలను అందించగలిగే సామర్థ్యం ఆ వ్యవస్థ ప్రత్యేకత. భారత్‌లో 6.3 కోట్ల ఎంఎస్‌ఎంఇలు, 12 కోట్ల మందికి ఉద్యోగావకాశాల్ని కల్పిస్తున్నాయి. ఎగుమతుల్లో 45 శాతం, ఉత్పత్తిలో 30 శాతం వాటా వీటిదే. ఈ రంగం ఎక్కువగా అసంఘటిత రూపంలోనే ఉంటోంది. మొత్తం 6.33 కోట్ల ఎంఎస్‌ఎంఇల్లో 99 శాతం సూక్ష్మ విభాగంలోకి వస్తాయి. ఇవి ఎక్కువగా ఏకవ్యక్తి వ్యాపారాలే. సాధారణంగా ఒక్కో సూక్ష్మ పరిశ్రమ సుమారు పది మందికి పని కల్పిస్తుంది. పెట్టుబడి మూలధనం ఆధారంగా నిర్వచించే కాలంచెల్లిన పద్ధతి వల్ల ఎంఎస్‌ఎంఇ కార్యకలాపాల నిర్వహణకు పరిమితులు ఏర్పడ్డాయి. మరోవైపు, వార్షికాదాయం ఆధారంగా మాత్రమే చేసే నిర్వచనం తయారీదారులకంటే, వ్యాపారులకే ఎక్కువ ప్రయోజనాలు కలిగిస్తుందనే అభ్యంతరాలున్నాయి. ఈ స్థితిని అధిగమించే చర్యలకు ప్రభుత్వం చొరవ తీసుకోవడం లేదు.

ఎంఎస్‌ఎంఇలు ఆర్థిక వ్యవస్థకు జీవనాడిగా అభివర్ణించవచ్చు. ముఖ్యంగా భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో వీటి ప్రాముఖ్యత ఎక్కువ. ఎందుకంటే, భారతదేశం మూలధన శక్తి కంటే ఎక్కువ శ్రామిక శక్తిని కల్గి ఉంది. చిన్న తరహా పరిశ్రమలు సాంకేతిక పరిజ్ఞానం కంటే శ్రామిక శక్తినే ఎక్కువగా వినియోగించుకుంటాయి. అందువల్ల ఇవి ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషిస్తాయి. ఆర్థిక, సామాజిక దృక్పథం నుంచి చూసినట్లయితే ఎంఎస్‌ఎంఇలు ఆర్థిక వ్యవస్థలో ఒక కీలకమైన రంగంగా పరిగణించబడుతాయి. వీటికి తగిన సాంకేతిక పరిజ్ఞానం, రుణ సదుపాయం అందించి ప్రోత్సహిస్తే అవి స్థాయిని పెంచుకుని భారత ఆర్థిక వ్యవస్థ స్వావలంబనకు, ఉపాధి

కల్పనకు ఎంతో తోడ్పాటు నందిస్తాయి. అందువల్ల ఎంఎస్ఎంఇలు పుష్టిగా నిలబడాలంటే జీతభత్యాలకు నిర్వహణ ఖర్చులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడం తప్పనిసరి, మారిన పరిస్థితుల్లో అప్పులివ్వడానికి ప్రైవేట్ బ్యాంకులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం వాటికి తగినంత ఆర్థిక సహకారం అందించడం లేదు.

దేశంలో మొత్తం 6.3 కోట్ల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయని గుర్తుంచుకుంటే, ప్రభుత్వ సహాయం సముద్రంలో కాకిరెట్టంత అని ఇట్టే అర్థమవుతుంది. స్వావలంబన, స్వయం పోషకత్వం సాధించడానికి ఇంత ప్రాధాన్యత గల చిన్న పరిశ్రమల ఉత్పత్తి రంగాన్ని ప్రభుత్వం గుర్తించ నిరాకరించడం శోచనీయం. ఆర్థిక సంక్షోభం, కరోనా కల్లోలం నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో కూడ ప్రభుత్వం ప్రకటించిన ఉద్దీపన 20.9 లక్షల కోట్లు కార్పొరేట్ల జేబులు నింపాయి తప్ప 50 శాతం శ్రామికులు పనిచేస్తున్న చిన్న పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోలేకపోయింది. కార్పొరేట్ పరిశ్రమలకు అందిస్తున్న తోడ్పాటు చిన్న పరిశ్రమలకు అందడం లేదు. దీంతో మోడీ ప్రభుత్వ విధానం ఉపాధి కల్పనకు, ప్రజల కొనుగోలు శక్తి పెంచేందుకు ఏమాత్రం ఉపయోగపడదని తేలిపోయింది. దీంతో ప్రభుత్వ వర్గ స్వభావం, మాటల్లోని డొల్లతనం మరోసారి రుజువవుతుంది.

పెరుగుతున్న నిరుద్యోగం

మోడీ 'మాటలు కోటలు దాటతాయి– చేతలు మాత్రం గడప కూడా దాటవు'. ఉపాధి కల్పన విషయంలోనూ ఇదే రుజువైంది. యేటా రెండు కోట్ల మందికి ఉపాధి కల్పిస్తామన్న ఎన్నికల హామీ అటుకెక్కింది. పనిచేసే సామర్థ్యం, వయస్సు ఉన్న యువశక్తి గణాంకాల్లో మనదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. ఇందులో నైపుణ్యాలు, సృజనాత్మకత, ప్రతిభ ఉన్న యువతకూ కొదవ లేదు. వారికి పని చూపించే సమర్థత మన ప్రభుత్వానికి లేకపోవడమే ఇక్కడ అసలు సమస్య. ఉపాధి, ఉద్యోగాల కల్పనలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం ఫలితంగానే నేడు దేశాన్ని నిరుద్యోగ భూతం ఆవరించింది. కరోనా వ్యాధి కారణంగా దేశవ్యాప్తంగా విధించిన లాక్‌డౌన్‌తో ప్రజలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోవడంతో పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం విలయ తాండవం చేస్తున్నది. దీంతో నిరుద్యోగరేటు నానాటికీ పెరుగుతూనే ఉంది.

దేశంలో ఆర్థికమాంద్యం లక్షణాలు తొంగిచూస్తున్నాయని సంవత్సరంన్నర క్రితమే కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ నివేదిక హెచ్చరించింది. గత ఏప్రిల్ నుండి ఉరుములేని పిడుగులా మానవాళిపై కరోనా వైరస్ విజృంభణ దరిమిలా దేశీయంగా ఉపాధి రంగం ఒక్కుదుటున పెద్ద కుదుపునకు లోనయింది. అసంఖ్యాక వలస కార్మికుల బతుకులు కుదేలయ్యాయి. కొన్ని కోట్ల మంది దారిద్ర్యరేఖ దిగువకు జారిపోయారు. ఏదో ఒక రూపేణా కొవిడ్ సంక్షోభం తాలూకు కష్టనష్టాలకు గురైన అపార జనావళి తేరుకుని సాధారణ స్థితికి చేరాలంటే ఉపాధి కల్పనే అజెండాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై చురుగ్గా ఖర్చు చేస్తే, వలస కార్మికుల సమస్య పరిష్కారమవుతుంది. గత బడ్జెట్‌లో మౌలిక ప్రాజెక్టుల నిమిత్తం రు.100 లక్షల కోట్లతో కూడిన భారి ప్రణాళికను మోడీ ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇప్పటికీ నిధులు సమకూర్చలేదు. గ్రామీణ పరిశ్రమలు, ముఖ్యంగా ఎంఎస్ఎంఇ (సూక్ష్మ చిన్న మధ్యతరహా సంస్థ)లు, స్వయం సహాయక బృందాలకు స్వల్ప వడ్డీరేటుపై ఉదారంగా రుణాలందించి– ఉపాధి కల్పనకు విశేష ప్రాధాన్యమివ్వాల్సి ఉంది. కానీ ప్రభుత్వం ఆ దిశలో చర్యలు తీసుకోవడం లేదు.

సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) సర్వేలో జాతీయ స్థాయి నిరుద్యోగిత రేటు 2019–2020 మార్చి నాటికి 8.8 శాతంగా నమోదైంది. ఏప్రిల్ చివరి నాటికి 40.3 శాతానికి పెరిగింది. ఇది 45 సంవత్సరాల గరిష్టంగా రికార్డ్ అయింది. జూలైలో ఇది 7.43 శాతం ఉండగా ఆగష్టు నాటికి 8.35 శాతానికి చేరింది. సెప్టెంబర్ చివరి నాటికి 8.45 శాతానికి చేరింది. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ సంస్థలలో ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేసేందుకు సిద్ధంగా లేదు. ఒకవైపు నిరుద్యోగం, మరోవైపు కరోనా జీవితాలను ఛిద్రం చేస్తోంది. అయినప్పటికీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు లేదు. నిరుద్యోగ సమస్యను గణనీయంగా తగ్గించలేకపోతే దేశవ్యాప్తంగా కల్లోల పరిస్థితులు ఏర్పడతాయన్న ఆర్థిక నిపుణుల, విశ్లేషకుల అభిప్రాయాలను సైతం ఈ ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. మోడీ ప్రభుత్వం గత ఆరేళ్ల కాలంలో తీసుకున్న వివిధ ప్రజా వ్యతిరేక విధానాల మూలంగా నిరుద్యోగం పెరిగింది. నూతనంగా ఉద్యోగాలు, ఉపాధి దొరకక పోగా ఉన్న ఉద్యోగాలు ఊడిపోయాయి.

ప్రభుత్వ రంగ సంస్థల విక్రయం

బిజెపి ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థలో స్వావలంబనకు కీలకంగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ఆశ్రిత పెట్టుబడిదారులకు దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి వాటిని నిర్వీర్యం చేసే పనిలో నిమగ్నమైంది. నిరంతరం అభివృద్ధి పథంలో సాగడం ద్వారా భారీగా నిధులను కూడబెట్టిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రత్యేకించి బ్లూచిప్ సంస్థలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. బ్లూచిప్ కంపెనీలు అంటే జాతీయంగా గుర్తింపు పొంది, ఆర్థికంగా స్థిరపడిన సంస్థలు. ఇటువంటి 100 కంపెనీలు స్టాక్ ఎక్చేంజీలో లిస్టు చేయబడినవి. ఈ కంపెనీలు అతి నాణ్యమైన వస్తువులను, సేవలను విక్రయిస్తాయి. ఇంత ప్రాధాన్యత పొందిన ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ల ప్రయోజనం కోసం మోడీ ప్రభుత్వం బలిపశువును చేస్తోంది. రక్షణ, బ్యాంకింగ్, బీమా, ఉక్కు, ఎరువులు, పెట్రోలియం వంటి వ్యూహాత్మక రంగాలలో ప్రభుత్వ రంగ యూనిట్లను ప్రైవేటీకరణ, వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా పూర్తిగా నిష్క్రమించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది.

ఆత్మ నిర్భర్ పేరుతో మేక్ ఇన్ ఇండియా వాగాడంబరాన్ని ప్రదర్శిస్తూనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పిఎస్‌యులను వ్యూహాత్మక అమ్మకం ద్వారా రు.1.2 లక్షల కోట్లు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థలలో వాటాను పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా మరో రు.90 వేల కోట్లు సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా గత బడ్జెట్‌లో ప్రకటించింది. దీనివల్ల మొత్తం రు.2.1 లక్షల కోట్లను సేకరించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. నీతి ఆయోగ్ మొదటి రౌండ్‌లో 48 పిఎస్‌యుల్లో పెట్టుబడుల ఉపసంహరణకు సిఫారసు చేసింది. అందులో

ఎయిర్ ఇండియా, ఎన్‌టిపిసి, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, భారత్ ఎర్త్ మూవర్స్ స్టీల్ ఆథారిటీ ఆఫ్ ఇండియా వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ చేసేందుకు ప్రతిపాదించింది. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు మోడీ సర్కార్ కృత నిశ్చయంతో ఉందని నీతి ఆయోగ్ చర్యలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను అమలు చేయడానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కింద ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. బిఇఎంఎల్, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, షిప్పింగ్ కార్పొరేషన్లను అమ్మడం ద్వారా ఒక నెలలో రు.45 వేల కోట్లకు పైగా లభించే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం ఆశిస్తోంది. ఎయిర్ ఇండియాలో పెట్టుబడుల ఉపసంహరణ చర్యలు ముందుకు సాగుతున్నాయి. డిసెంబర్ నాటికి ఈ ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్‌టిపిసి, కోల్ ఇండియా, ఎన్ఎండిసిలతో సహా అరడజనుకు పైగా పిఎస్‌యులను వాటాలు అమ్మకానికి కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. బైబ్యాక్ ఆఫర్ ద్వారా ప్రభుత్వం తన వాటాల్లో కొంత భాగాన్ని విక్రయిస్తుంది.

ముగింపు

దేశ ప్రగతిలో ప్రభుత్వ రంగ సంస్థలు ముఖ్య భూమిక పోషిస్తున్నాయి. ప్రధానంగా బీమా, బ్యాంకింగ్ రంగాలను జాతీయం చేసిన నాటి నుంచి మౌలిక రంగాలకు నిధుల లభ్యత, రుణాల మంజూరు, వ్యవసాయానికి రుణాలు, పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పడ్డాయి. ఫలితంగా ఉపాధి కల్పన జరిగి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడానికి దోహద పడ్డాయి. గతంలో ప్రైవేట్ ద్రవ్య సంస్థలను జాతీయం చేస్తే ఇవాళ మోడీ ప్రభుత్వం ద్రవ్య సంస్థలను, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడానికి పూనుకోవడం దారుణం. ప్రభుత్వ రంగ సంస్థలు దేశ ప్రజల ఆస్తులు. ఈ సంస్థలు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటివి. వీటిని ప్రైవేట్ పరం చేయడం అంటే ప్రజల ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు, ఆశ్రిత పెట్టుబడిదారులకు దోచిపెట్టడం తప్ప మరొకటి కాదు. అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేయాలనుకోవడం బంగారు గుడ్లు పెట్టే బాతుల పీక నులిమేయడమే. బొగ్గు, బాక్సైట్, ఇనుప ఖనిజం, గ్యాస్ వంటి ప్రకృతి వనరులను కూడ బడా పెట్టుబడిదారుల హస్తగతం చేస్తే ఆర్థిక స్వావలంబనకు అర్థం ఏముంటుంది?

దేశంలో అత్యధిక ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందించడంలో ప్రభుత్వాలు ఎందుకు విఫలమయ్యాయో ప్రజానీకం, మేధావులు నిశితంగా విశ్లేషించాలి. కేవలం ఒక్కశాతంగా ఉన్న బడా సంపన్నుల ప్రయోజనాలే ధ్యేయంగా ఆర్థిక విధానాల రూపకల్పన ఎందుకు జరుగుతోంది? అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఒత్తిళ్లకు తలొగ్గి, సరళీకరణను వేగవంతం చేసి ప్రభుత్వరంగాన్ని నిర్వీర్యం చేస్తే అది ప్రజలకు, ఆర్థిక వ్యవస్థకు ఆశనిపాతమే. దేశ సమగ్రాభివృద్ధికి, ఆర్థిక సుస్థిరతకు బలమైన ప్రభుత్వరంగమే ముఖ్యమైన సాధనం. మోడీ ప్రభుత్వ నినాదాలకు చేతలకు పొంతన లేదని ఆరేళ్ల పాలన రుజువు చేస్తోంది. "సబ్ కా సాత్ – సబ్ కా వికాస్" "ఆత్మ నిర్భర్ భారత్" వంటి నినాదాలు వట్టి భూటకమని తేలిపోయింది. ఆర్థిక వ్యవస్థ పుంజుకోవాలంటే ప్రత్యామ్నాయ, ప్రజానుకూల ఆర్థిక విధానాలు అమలు చేయాలి. ఉపాధి అవకాశాలతో పాటు కొనుగోలు శక్తి పెరిగితే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. మరోవైపు ఆరేళ్ల కాలం విద్య, వైద్యం, శిశు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి వ్యవసాయం, ఎస్‌సి, సంక్షేమ రంగాలకు బడ్జెట్ కేటాయింపులు క్రమంగా తగ్గాయి.

కరోనా కష్టకాలంలో ఉపాధిలేక ఆకలి పస్థులుంటున్న పేదలను ఆదుకోకుండా అపర కుబేరుల ప్రయోజనాలను పరిరక్షించడానికి ఆరాటపడడం మోడీ వర్గస్వభావానికి నిదర్శనం. కార్పొరేట్ పన్ను కోత రూపేణా కార్పొరేట్ కంపెనీలకు యేటా రు. 1,45,000 కోట్ల మేర ప్రయోజనాన్ని మోడీ ప్రభుత్వం సమకూర్చింది! మరి అంత మొత్తాన్ని పూర్తిగా కాకపోయినా సగమైనా పేదలకు ఆహార పంపిణీ, నగదు బదిలీ రూపేణా ఎందుకు అందివ్వలేదు? ఆయాచితంగా లభించిన ఆర్థిక సహాయంతో కార్పొరేట్ శక్తులు మరింత లబ్ధి పొందాయి. తమ నగదు నిల్వలను గణనీయంగా పెంచుకున్నారు కానీ, ఆ ధనాన్ని వారు పెట్టుబడిగా మదుపు చేయనేలేదు. కార్పొరేట్లకు తగ్గించిన కార్పొరేటు పన్ను మొత్తాన్ని పేదలకు ఇచ్చి ఉంటే ఆర్థిక వ్యవస్థకు నిస్సందేహంగా ఎంతో మేలు జరిగి ఉండేది. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం వారిని ఆకలిదప్పుల నుంచి కాపాడి ఉండేది. కరోనా విలయంలో మన పేదలు మూడు నెలల పాటు ఆకలితో నకనకలాడిపోయారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఉంటే పిల్లలకు ఆహారం, పాలు, మందులు, ఇతర నిత్యావసర సరుకులు, సేవలను కొనుగోలు చేసుకునేవారు. తత్ఫలితంగా మార్కెట్‌లో డిమాండ్ విశేషంగా పెరిగి ఉండేది. ఆర్థిక వ్యవస్థ లబ్ధి పొంది ఉండేది.

దేశంలో మూడు దశాబ్దాలుగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలను అనుసరించడం వల్లనే ఆర్థిక వ్యవస్థపై దుష్ప్రభావం పడడం మాత్రమే కాకుండా కార్మికులను, అసంఘటిత రంగ కార్మికులను, రైతు కూలీలను, రైతాంగాన్ని, చిల్లర ఉత్పత్తి దారులను ఎల్లప్పుడూ పీడింపులకు గురి చేసింది. ఈ పీడన అంతరించాలంటే రానున్న రోజులలో ఆర్థిక వ్యవస్థలో మౌలిక మార్పులు జరగవలసిన అవసరం ఉంది. ఉపాధి కల్పనతో ముడిపడే విధంగా పెట్టుబడులు పెట్టాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. ఈ రెండూ జరగాలంటే ప్రభుత్వ రంగ జోక్యం, ప్రభుత్వ జోక్యం పెరగాలి. ద్రవ్యలోటు నిబంధనలను పక్కనబెట్టి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను మలుపు తిప్పాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. కనీస వేతన స్థాయి పెరగాలి. భూ పంపకం జరగాలి. రైతులకు వ్యవసాయాన్ని గిట్టుబాటు అయ్యేలా చేయాలి. విద్య వైద్యం వంటి రంగాలలో ప్రభుత్వ పాత్ర పెరగాలి. అంటే కార్పొరేట్లను పక్కనబెట్టాలి. ఇదంతా జరగాలంటే ప్రపంచీకరణ ఆర్థిక విధానాలకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు రూపొందించడమే తక్షణ కర్తవ్యంగా భారత ప్రభుత్వం గుర్తించాలి. విధానాలు మార్చుకోడానికి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, కార్పొరేట్ల ద్రవ్య పెట్టుబడి నుండి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని సమర్థంగా ప్రతిఘటించి దేశం ముందుకు సాగవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం అందుకు సిద్ధపడకపోతే ఆర్థిక రాజకీయ సామాజిక వైరుధ్యాలు తీవ్రమై ప్రజా ఉద్యమాలు వెల్లువెత్తుతాయి.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

నూతన విద్యా విధానం చెప్పే సంస్కృతి

***నూతన విద్యా విధానం పేరుతో విద్యా రంగాన్ని తిరోగమనం వైపు మళ్లించే ప్రయత్నం జరుగుతోందనీ, మరో వైపు కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పే విధానాలు అమలు చేస్తున్నారనీ అంటున్నారు* కాత్యాయనీ విద్మహే**

2015లో భారతదేశం మరొక పదిహేనేళ్లవరకు సుస్థిర అభివృద్ధి దిశగా 2030 ఎజెండాను ప్రకటించింది. ఇంతకంటే శ్రేష్ఠమైన, మరింత స్థిర అభివృద్ధి భవితను అందరికీ వాగ్దానం చేస్తూ 2015లో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ రూపొందించిన ఎజెండాకు అనుగుణంగా భారతదేశం చేసిన ప్రకటన ఇది. సుస్థిర అభివృద్ధి సాధనకు నిర్దేశిత లక్ష్యాలు 17 ఉన్నాయి. వాటిలో నాలుగు చాలా కీలకమైనవి. అవి 1) పేదరికం లేకుండా పోవడం, 2) ఆకలి అనే మాటే లేకుండా పోవడం, 3) మంచి ఆరోగ్యం, 4) గుణాత్మక విద్య. ఈ నాలుగింటి మధ్య కార్యకారణ సంబంధం గమనించదగినది. పేదరికం ఆకలికి, అనారోగ్యానికి కారణమవుతుంది. అప్పుడిక గుణాత్మక విద్య గగన కుసుమమే అవుతుంది. పేదరికం పోతే ఆకలి సమస్య ఉండదు, అనారోగ్యమూ ఉండదు. అప్పుడు మాత్రమే గుణాత్మక విద్య అందరికీ అందుబాటులోకి వస్తుంది. సామాజికంగా, ఆర్థికంగా పై స్థాయికి ఎదగడాన్ని విద్య సాధ్యం చేస్తుంది. పేదరికం నుండి బయటపడడానికి ఇదే మార్గం దీనికి అనుగుణంగానే 2020 నూతన విద్యావిధానం జూలై 29న ప్రకటించింది. 2019 మార్చిలో కస్తూరి రంగరాజన్ చైర్‌పర్సన్‌గా ఉన్న కమిటీ జాతీయ విద్యావిధానం ముసాయిదాను ప్రవేశపెట్టడం, అందులోని అప్రజాస్వామిక, అభివృద్ధి నిరోధక ధోరణులను విమర్శకు పెడుతూ పెద్ద ఎత్తున చర్చ జరిగిన విషయం అందరికీ తెలిసిందే. అయితే అవేవీ పరిగణనలోకి తీసుకోకుండానే, పార్లమెంట్‌లో పెట్టకుండానే చర్చలేకుండానే మంత్రిమండలి ఆమోదంతో 'జాతీయ విద్యావిధానం 2020' ని ప్రకటించి కేంద్ర ప్రభుత్వం 'తాంబూలాలు ఇచ్చేశాను తన్నుకు చావండి' అంటున్నది.

2019 మార్చిలో ముసాయిదా వెలువడినది మొదలు 2020 జూలైలో నూతన విద్యావిధానం ప్రకటించే వరకు మధ్యగల పదహారు నెలల కాల వ్యవధిలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పాలకవర్గం ఎన్నాళ్లుగానో చేయాలనుకొంటున్నవి వరస పెట్టి చేసుకుపోయింది. ఆగస్టులో కశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తిని కాలరాసే 370 ఆర్టికల్ రద్దు చట్టం, నవంబర్‌లో అయోధ్యలో రామాలయ నిర్మాణానికి అనుకూల సుప్రీంకోర్టు తీర్పు, డిసెంబర్‌లో పౌరసత్వ సవరణ చట్టం తీసుకువచ్చిన విజయోత్సవపు దూకుడుకు కొనసాగింపు జాతీయ విద్యావిధానం-2020.

ఇది 65 పుటల విధాన ప్రకటన. ఇందులో నాలుగు భాగాలు ఉన్నాయి. మొదటి భాగంలో పాఠశాల విద్య గురించి, రెండవ భాగంలో ఉన్నత విద్య గురించి, మూడవ భాగంలో దృష్టి పెట్టవలసిన ఇతర కీలకాంశాల గురించి, నాల్గవ భాగంలో అమలు చేసే పద్ధతి గురించి ఉంది. ఈ నూతన విద్యావిధానం ప్రారంభంలోనే అందరికీ విద్య అందుబాటులోకి రావడం అనేది దేశాన్ని ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా అభివృద్ధి చేయడంలో కీలకమైనదిగా పేర్కొంది. అంతర్జాతీయంగా నాయకత్వ స్థాయి ఏయే అంశాలతో ముడిపడి లభిస్తుందో చెప్పిన వాటిలో ఆర్థిక అభివృద్ధి, సామాజిక న్యాయం, సమానత్వం, శాస్త్రీయ పురోగతి, జాతీయ సమైక్యతలతో పాటు సాంస్కృతిక పరిరక్షణ కూడా ఉంది. అక్కడి నుండి 65 పుటలు పూర్తయేటప్పటికి సంస్కృతి అనే మాట, దాని సారభూతమైన తాత్పర్యం అనేకమార్లు ప్రస్తావనకు వచ్చాయి. పాఠ్య ప్రణాళికలో సైన్స్‌కు, గణితానికి అదనంగా ప్రాథమిక కళలు, చేతివృత్తులు, ఆటలు, శారీరక దారుఢ్యం, భాష, సాహిత్యం మొదలైనవాటితో పాటు సంస్కృతి, విలువలు చేర్చాలని ఈ నూతన విద్యావిధానం పేర్కొన్నది. అందువల్ల నూతన విద్యావిధానం ప్రబోధించే, ప్రోత్సహించే సంస్కృతి స్వరూప స్వభావాలు ఏమిటో పరిశీలించడం అవసరం.

1

ఈ నూతన విద్యావిధానం 2020 'ప్రాచీనమూ శాశ్వతమూ అయిన భారతీయ జ్ఞానానికి సంబంధించిన సంపద్వంతమైన వారసత్వం వెలుగులో రూపొందించబడి'నట్లుగా చెప్పడమే దాని సంస్కృతి పునాదిని సూచిస్తుంది. జ్ఞానం దర్శనం, సత్యం భారతీయ తత్వశాస్త్రంలో ప్రధానం అని, భారతదేశపు విద్యాలక్ష్యం కేవలం లౌకిక జీవితానికి సంబంధించిన జ్ఞాన సముపార్జనం మాత్రమే కాదు, బడికి అవతల తనను తాను తెలుసుకోవడానికి తనను తాను విముక్తం చేసుకోవడానికి సంబంధించినది అని, ప్రపంచం మీద బలమైన ప్రభావాన్నిచూపిన ఘనమైన భారతీయ సంస్కృతీ వారసత్వాన్ని పరిరక్షించుకోవడం, పరిశోధించడం అభివృద్ధి చేయడం విద్య ద్వారానే సాధ్యం అని ఉపోద్ఘాతంలో పేర్కొన్న అంశాలను గమనిస్తే భారతీయ సంస్కృతి పునాదిగా ఈ విద్యావిధాన నిర్మాణం జరిగిందన్నది స్పష్టం. భారతదేశంలో విద్యకు భారతీయ సంస్కృతి ప్రాతిపదిక కావడం సహజమే కదా అనిపించవచ్చు. అయితే భారతదేశ సంస్కృతి అంతా ఏక ఖండంగా ఉందా? అన్నది ప్రశ్న.

భారత దేశపు సంస్కృతి మాత్రమే కాదు ...అసలు ఏ దేశ సంస్కృతి అయినా ప్రాచీనమైనదే. మనుషులు ప్రకృతిని అర్థం చేసుకొంటూ, ప్రకృతితో సంభాషణ చేస్తూ, సంఘర్షిస్తూ, ప్రకృతిని తమ జీవికకు వనరుగా గుర్తించి, మానవ శ్రమతో దానికి విలువను సమకూరుస్తూ

వచ్చిన క్రమంలో కొన్ని వేల, లక్షల సంవత్సరాల మీద రూపొందింది సంస్కృతి. ఆ మేరకు అది ప్రాచీనమే కానీ అది శాశ్వతం అనడం మాత్రం సత్యదూరం. సంస్కృతి భౌగోళిక స్థితిగతులను, పర్యావరణ ప్రత్యేకతలను, మారుతున్న ఉత్పత్తి విధానాలను, సామాజిక మానవ సంబంధాలను బట్టి నిత్యం మార్పుకు లోనవుతుంటుంది. ధర్మం, న్యాయం, దయ మొదలైన విలువల స్వభావంలోనూ దానిని బట్టి కొత్త రంగులు చేరుతుంటాయి. భిన్న ప్రాంతాల, భిన్న మానవ సమూహాల సంపర్కంలో సంస్కృతి వైవిధ్య భరితంగా భాసిస్తుంటుంది. అందువల్ల సంస్కృతి అంటే ఏ కాలపు, ఏ ప్రాంతపు ఏ ప్రత్యేక అనుభవాలు కలిగిన మానవ సమూహపు సంస్కృతి అని ప్రశ్నించుకోవలసి ఉంటుంది. అప్పుడు 'భారతీయ జ్ఞానానికి సంబంధించిన సంపద్వంతమైన వారసత్వం' అంటే అది ఏ కాలానిది? ఏ ప్రాంతానిది? ఏ భాషా భాషీయులది? ఏ ఆర్థిక, సామాజిక వర్గాలది అన్న సందేహాలు రాక మానవు. వాటికి సమాధానంగానే సంపద్వంతమైన సంస్కృతిలో భిన్నత్వం, బహుళత్వం ఉంటాయని, వాటిపట్ల గౌరవంతో ఈ విద్యావిధానం ఉంటుందని చెప్పక తప్పలేదు.

భారతదేశం వేల సంవత్సరాల కాలం మీద కళలు, సాహిత్యం, ఆచారాలు, సంప్రదాయాలు మొదలైన రూపాలలో అభివృద్ధి చెందిన అపారమైన సంస్కృతీ సంపదకు నిధి అని, భారతీయ సంస్కృతీ పరిరక్షణ, ప్రబోధం దేశ సమైక్యతకు, ఆర్థిక రంగానికే కాదు, వ్యక్తి వికాసానికి కూడా అవసరమేనని చెప్తూ విద్యలో దానికి అనితర ప్రాధాన్యతను పదేపదే పేర్కొన్నది ఈనూతన విద్యావిధానం. సుసంపన్నమైన, వైవిధ్యభరితమైన భారతీయ సంస్కృతిని ప్రత్యక్ష అనుభవం నుండి తెలుసుకోవడానికి విద్యార్థులను భిన్న ప్రాంతాల పర్యటనకు తీసుకువెళ్లాలని, అందుకు ఒక వంద పర్యాటక క్షేత్రాలను గుర్తించాలని చెప్పిన సందర్భంలోనూ 'ఏక్ భారత్ శ్రేష్ట భారత్' భావన ప్రస్తావనకు వచ్చింది. (22.12) అలాగే ఇందులో భాషల బోధన, అధ్యయనాల గురించి చెప్పే సందర్భంలో ప్రస్తావనకు వచ్చిన 'ఏక్ భారత్ శ్రేష్ట భారత్' భావన భిన్నత్వాలను, బహుళత్వాలను రద్దు చేసే ఆధిపత్య సంస్కృతీ ప్రతిధ్వని తప్ప మరొకటి కాదు.

భారతీయత (ఇండియన్ నెస్) అనే మాటను పదేపదే వాడడం, భారతీయత (ఇండియన్ నెస్) గర్వించదగిన అంశంగా, ఆలోచనలోనే కాదు, స్ఫూర్తిలో, మేధలో, బుద్ధిలో, చర్యలో, జ్ఞానాభివృద్ధిలో, నైపుణ్యాలను, విలువలను ఏర్పరచుకోవడంలో నిత్యం నిరంతరం వ్యక్తం కావలసిన అంశంగా చెప్పడం చిన్నాచితకా సమూహాల సంస్కృతిని మింగేసి, మెజారిటీ వర్గపు సంస్కృతిని ఉత్పన్నం చేసి ఏకజాతి విధానానికి దారితీసేదే. ప్రతి పాఠశాల విద్యార్థి 'ఏక్ భారత్ శ్రేష్ట భారత్' భావన దృష్ట్యా భారతీయ భాషలలో సరదాగా ఒక ప్రాజెక్ట్ చేయాలనీ అందువల్ల ప్రధాన భారతీయ భాషల ఉచ్చారణ, వర్ణమాల, లిపి, సాధారణ వ్యాకరణ నిర్మాణం, పదజాల సంస్కృత మూలాలు, వాటి పరస్పర సంబంధాలు, భేదాలు తెలుసుకోవడం సాధ్యం అవుతుందని, తద్వారా భాషకు ఉన్న శక్తి అర్థం అవుతుందని చెప్తూనే సంస్కృతం గురించి 'అదొక జ్ఞాన వ్యవస్థ' అని ప్రత్యేక పూనికతో చెప్పడం, సంస్కృతాన్ని పాఠశాల విద్యలో ఒక ఐచ్ఛిక విషయంగా ప్రవేశపెట్టడం ద్వారా ప్రధాన స్రవంతిలోకి తేవాలి అని చెప్పడం, సంస్కృత విద్యాలయాల ప్రస్తావన మొదలైనవన్నీ విద్య కాషాయీకరణ ప్రమాదాన్ని శంకింప చేసేవే.

విద్య పిల్లలకు ఏది చేయడం మంచిదో తెలియ చెప్పగలగాలి అని పేర్కొంటూ ఈ నూతన విద్యావిధానం ఆ సందర్భంలో ప్రాథమిక నైతిక తర్కం, సంప్రదాయ భారతీయ విలువలు, మానవ రాజ్యాంగ విలువలు విద్యార్థులలో అభివృద్ధి పరచాలని చెప్పింది. అవేమిటో పెద్ద జాబితా కూడా ఇచ్చింది. అవి–సేవ, అహింస, స్వచ్ఛత, సత్యం, నిష్కామకర్మ, శాంతి, త్యాగం, సహనం, భిన్నత్వం, బహుత్వం, సరైన ప్రవర్తన, సహాయం, పరోపకారం, మర్యాద, క్షమ, సానుభూతి, బాధ్యత, పెద్దలపట్ల, పర్యావరణం పట్ల గౌరవం, సమైక్యత, స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం, జండర్ సెన్సిటివిటీ మొదలైనవి. పంచతంత్ర కథలు, జాతక కథలు, హితోపదేశం వంటివి చదవడం వల్ల ఇవన్నీ తెలుస్తాయి అని కూడా చెప్పింది. ఇదంతా విలువల ప్రాతిపదికన విద్య అందించడం అన్న లక్ష్యానికి అనుగుణమైనవి. నీతి, విలువలు అనేవి నిరపేక్ష అంశాలేమీ కాదు. ఆ అవగాహన లేకపోతే నీతి, విలువలు అనేవి సామాజిక, ఆర్థిక నేపథ్యాలతో, అవసరాలతో, సంబంధంలేని వ్యక్తిగత అంశాలుగా తీర్పుకు గురవుతుంటాయి. అధికార వర్గ ప్రయోజనాలకు అనుకూలంగా నిర్వచనాలు మారిపోతుంటాయి. ప్రచారంలోకి వస్తాయి. విద్య కాషాయీకరణ గురించిన అనుమాన మూలం అదే.

ఈ నూతన విద్యావిధానం ఆరవ తరగతి నుండి అండర్ గ్రాడ్యుయేషన్ వరకు భారతీయ భాషా సాహిత్య కళా సాంస్కృతిక విషయాల అధ్యయనానికి విస్తృత ప్రాధాన్యతను ఇచ్చి చర్చించింది. సంస్కృతంతో పాటు పాళీ ప్రాకృత పర్షియన్ భాషలు, ప్రపంచ జ్ఞానం కోసం విదేశీ భాషలు కూడా విద్యార్థులకు అందుబాటులో ఉండాలని, ఆరవ తరగతి నుండి పన్నెండవ తరగతి లోపల రెండేళ్లు భాష నేర్చుకొనే అవకాశం ఉండాలని కూడా చెప్పింది. సంస్కృతిని సుసంపన్నం చేయడానికైనా జాతీయ సమైక్యతను పెంచడానికైనా భారతీయ యువతకు తమ దేశానికి చెందిన విశాల భాషా సంపద గురించి, సాహిత్యం గురించి తెలిసి ఉండాలన్న అభిప్రాయం కూడా ఇందులో వ్యక్తం అయింది. పాఠాల బోధనలో కళలకు, సంస్కృతికి సంబంధించిన దృక్కోణం ఉండాలని ఇది విద్యకు, సంస్కృతికి మధ్య బంధాన్ని దృఢతరం చేస్తుందని కూడా చెప్పడం జరిగింది. విద్యకు ఎటువంటి సంస్కృతితో బంధం దృఢతరం కానున్నది అన్నది ఇక్కడ కలిగే ఒక ప్రశ్న. సనాతనం, సంప్రదాయం వంటి మాటలు సంస్కృతికి విశేషణాలుగా సూచితమైన సందర్భాలు ఆ సంస్కృతి నేటి కాలపు ఆధునిక శాస్త్రీయ ప్రజాస్వామిక సంస్కృతి కాకుండా పోతుందేమోనన్న అనుమానాన్ని రేకెత్తించడం సహజం. ఆ క్రమంలోనే భాషల అధ్యయనాలకు, ప్రత్యేకించి సంస్కృత భాషా అధ్యయనానికి ప్రాధాన్యత ఇయ్యడం, పాఠశాల స్థాయిలోనే త్రిభాషా సూత్రం కింద సంస్కృతాన్ని తప్పనిసరి చేసి ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలన్న యోచన చేయడం (22.15) ప్రాచీన సాహిత్య అధ్యయన పరిశోధనల అవసరాన్ని నొక్కి చెప్పడం మొదలైనవి. వాటి వెనుక బ్రాహ్మణీయ చరిత్ర నిర్మాణ, ప్రచారాల రహస్య ఎజెండా దాగి ఉన్నదనుకోవడానికి వీలిస్తున్నాయి.

దేశీయ భాషా సాహిత్యాల ఉద్ధరణ పట్ల నిజమైన అభినివేశం ఉందనే

అనుకున్నా ఇది ప్రధానమైన లిఖిత భాషలకు చెందినదే కానీ, లిపిలేని అనేక తెగల భాషలు ఈ పరిధిలోకి రావు. ఆ రకంగా వేలకొద్ది అల్ప సంఖ్యాకుల భాషలు ఉపాంతీకరణకు గురవుతాయి. ఆయా భాషా భాషీయుల ఉన్నత విద్యకు, ఉద్యోగ పరికల్పనకు అవకాశాలు నిరాకరింపబడతాయి. పాఠశాల, కళాశాల స్థాయి విద్యా వ్యవస్థలో కొంచెం కొంచెంగా ప్రభుత్వ విధానాల వల్ల, విద్య ప్రవేటీకరణ వల్ల ఉపాంతీకరణకు గురైన ఆ లిఖిత భాషా సాహిత్యాల ఉద్ధరణకైనా ఈ నాటికి ఈ నూతన విద్యావిధానంలో ఇంత ప్రాధాన్యత లభించి నందుకు సంతోషించవలసిందే. కానీ, వీటిని వాస్తవీకరించ గలిగిన ప్రణాళిక గురించిన చిన్న సూచనయినా ఇందులో లేదు. దీనికి అను కూలంగా కోర్సుల రూపకల్పన ఎలా ఉంటుంది? పాఠ్య విషయాలు ఏముంటాయి? నిర్ణయాధికారం ఎవరిది? ఉద్యోగ పరికల్పనలో వీటికి ఉన్న ప్రమేయం ఏమిటి? మొదలైన ప్రశ్నలకు సమాధానం లేదు. భారతీయ భాషా జ్ఞానం వ్యక్తి ఉద్యోగార్హతలలో ఒకటిగా చేయాలన్నారు. అందువల్ల అదనంగా ఒరిగేది ఏమన్నా ఉన్నదా? భారతీయ భాషా జ్ఞానం అవసరం ఉన్న ఉద్యోగాలు పెరగకుండా అందువల్ల సమకూరే ప్రయోజనం ఉంటుందా?– అన్నీ ప్రశ్నలే.

బదులలో భాషా సాహిత్య బోధనకు ఉపాధ్యాయులను అధిక సంఖ్యలో రిక్రూట్ చేసుకోవడం జరుగుతుందని కూడా ఇందులో ఇంకొక మాట ఉంది. శాస్త్ర సాంకేతిక విషయాలు, గణితం మొదలైన మార్కెట్ డిమాండ్ గల అంశాలతో కూడిన కోర్సులకు ప్రాధాన్యతనిచ్చి, తద్వారా విద్యను లాభసాటి వ్యాపారంగా చేసుకొన్న ప్రైవేటు విద్యాలయాలు, కళాశాలలు భాషా సాహిత్య అధ్యాపకులను మూడు నెలలకో, నాలుగు నెలలకో కాంట్రాక్టు పద్ధతిన కుదుర్చుకొంటున్న సమయంలో, ఒక్కొక్కసారి ఆ కాంట్రాక్టు పద్ధతి ఏర్పాటు కూడా లేకుండా భాషా సాహిత్యాలలో అధికారిక అర్హతలేని ఎవరో ఒకరి చేత చెప్పించినట్లు చేసి పబ్బం గడుపుకొంటున్న సమయంలో ఆసమస్య ఉన్నదన్న స్పృహ అసలే లేకుండా భాషా సాహిత్య అధ్యయనాలకు, అధ్యయనం చేసినవాళ్లకు మంచికాలం వస్తున్నదన్నట్లు కల్పించిన ఒక మాయావరణం ఈ నూతన విద్యా విధానంలో కనబడుతుంది.

విద్యార్థులకు ఆసక్తి కలిగించి, చదివి ఆనందించగల పుస్తకాలను పాఠశాల లైబ్రరీల ద్వారా, ప్రజా గ్రంథాలయాల ద్వారా అందుబాటులో ఉండేట్లు చూడాలని, తద్వారా 'చదివే సంస్కృతి' ని దేశమంతా పెంచాలి అని చెప్పిన విషయం కూడా పబ్లిక్ లైబ్రరీ వ్యవస్థను ఇప్పటికే ధ్వంసం చేసిన విషయాన్ని పూర్తిగా విస్మరించినదే.

ఉన్నత విద్యను మరింతగా సంపూర్ణమూ, బహుజ్ఞాన విషయ సంభరితమూ చేయడం ఈ విద్యావిధానం లక్ష్యం. నలంద, తక్షశిల మొదలైన విశ్వవిద్యాలయాల కాలం నుండే ఉనికిలో ఉన్న సుదీర్ఘ సంప్రదాయ చరిత్ర కలిగిన అధ్యయన పద్ధతి ఇది అని, లెక్కలు, సైన్స్, వైద్యం, వృత్తి విద్యలు, వ్యక్తీకరణ నైపుణ్యాలతో సహా సంగీతం, నాట్యం మొదలైన అరవై నాలుగు కళల జ్ఞానాన్ని ఒకే జ్ఞానంలో భాగంగా బాణభట్టు కాదంబరి పేర్కొన్నది అని, ఈ సంప్రదాయాన్ని భారతీయ విద్యా విధానంలోకి తిరిగి తీసుకొని రావలసిన అవసరం ఉందని 21వ శతాబ్దానికి అది సరిగ్గా సరిపోతుందని పేర్కొనడం జరిగింది. (11.1)

సాహిత్యం చరిత్ర నిర్మాణంలో ఒక మూలవనరే అయినప్పటికీ, అది కల్పనా ప్రధానమైనది కనుక అందులో చెప్పినదానిని ఇతర భౌతిక చారిత్రక ఆధారాలతో సరిపోల్చి సత్య నిర్ధారణ చేయవలసి ఉంటుందని చరిత్రకారులు చెప్తారు. కానీ సాహిత్యాన్ని దానంతట అది చరిత్రగా పరిగణిస్తే ఆ మేరకు అది ఎంత వాస్తవమో, ఎంత కల్పనో తెలియకుండా పోతుంది. కాల్పనిక ఊహలు చరిత్రగా చలామణిలోకి వచ్చే ప్రమాదం ఉంది. తక్షశిల, నలంద మొదలైన విశ్వవిద్యాలయాల జ్ఞాన వారసత్వం అది ఎంత గొప్పదైనా రెండు వేల సంవత్సరాల కాలం మీద వచ్చిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలతో నిమిత్తం లేకుండా 21వ శతాబ్దికి కాలపు అవసరాల కోసం అదే నమూనాను తిరిగి తీసుకురావడం అంటే అది విద్యా వ్యవస్థలో హిందూ బ్రాహ్మణీయ సంస్కృతి పునరుద్ధరణకు దారితీసే ప్రమాదం లేకపోలేదు.

అదీగాక బహుముఖాలైన జ్ఞాన విషయాల పరస్పర సంబంధం గురించిన అవగాహన ప్రాచీన భారతానికే పరిమితమైనది కాదు. ప్రాచీన గ్రీకు నుండి ప్రపంచమంతటా ఇది ఉంది. జ్ఞానాన్వేషణ మొదటి దశలో ప్రాపంచిక అనుభవ విస్తరణ క్రమం అది. అరిస్టాటిల్ రాజ్యం నుంచి కళల వరకు రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, ఆదిభౌతిక శాస్త్రం, వృక్ష జంతు శాస్త్రాలు, మనస్తత్వ శాస్త్రం తర్కం, భాషా శాస్త్రం, సంగీతం, సౌందర్య శాస్త్రం మొదలైనవి అనేకం చర్చించిన విషయం తెలిసిందే. తరువాతి కాలాలలో అవి ప్రత్యేక శాస్త్రాలుగా అభివృద్ధి చెంది దూరం జరిగాయి. మళ్లీ మార్క్స్, ఏంగెల్స్ వచ్చాక వీటన్నిటి మధ్య ఉన్న ఆంతర గతితార్కిక సంబంధం చర్చలోకి వచ్చాయన్నది చరిత్ర.

ప్రపంచమంతటా 'లిబరల్ ఆర్ట్స్' ప్రాధాన్యతను గుర్తించడంలో పని చేస్తున్నది సాహిత్యం, కళలు, సంస్కృతిపై ప్రేమ అనుకుంటే అది పొరపాటు. వేగవంతమవుతున్న కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థలో ప్రతివ్యక్తి తన జీవితకాలంలో అయిదారు ఉద్యోగాలైనా మారాల్సి ఉంటుందట. అందువల్ల ప్రతిసారీ వాళ్లు తమను తాము నిరూపించుకొంటూ నిలబడడానికి ఇంజనీర్లుగా, సాంకేతిక నిపుణులుగా, ఆర్థికవేత్తలుగా, వైద్యులుగా వాళ్లకు ఉన్న విషయ పరిజ్ఞానం ఒక్కటే సరిపోదు. దానిని శక్తివంతంగా, తర్కబద్ధంగా, విమర్శనాత్మకంగా వ్యక్తీకరించడానికి, అమలు చేయడానికి, అభివృద్ధిలోకి రావడానికి కావలసిన ఒక సమగ్ర అవగాహనను, వ్యక్తిత్వాన్ని లిబరల్ ఆర్ట్స్ అధ్యయనం ఇస్తుందని కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థ చేస్తున్న ప్రచారం. అంటే సాహిత్యం, కళలు, సామాజిక శాస్త్రాలు ఇక ముందు కార్పొరేట్ వర్గ ప్రయోజనాలకు అనుబంధ విద్యలే తప్ప, స్వతంత్ర అస్తిత్వంతో ఉండవు. సాహిత్య సామాజిక శాస్త్రాల అధ్యయనమే అవసరం లేదని, విశ్వవిద్యాలయాలలో ఆయా విభాగాలు వాటంతట అవి కృశించి, నశించి పోవడానికి వాతావరణాన్ని సృష్టించిన వ్యాపార సంస్కృతికి కొమ్ము కాస్తున్న ప్రభుత్వాలే ఈనాడు విద్యారంగంలో కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణమైన అంతర్జాతీయ వైఖరులను అమలు చేయటానికే 'బహుళ కళా జ్ఞానం' అన్న భావన ముందుకు తెచ్చింది. ఈ విద్యావిధానం భారతీయ పునాదుల నుండి తవ్వితీసి పదును పెట్టడం పనిలో పనిగా జరిగిపోతూ దేశీయ అధికారవర్గ ప్రయోజనాలు నెరవేరడం అదనం.

గుణాత్మక విద్య ద్వారా ప్రపంచంలోనే అత్యున్నత జ్ఞానశక్తి (గ్లోబల్

నాలెడ్జ్ సూపర్ పవర్)గా దేశాన్ని అవతరింపచేయడం ఈ నూతన విద్యా విధానానికి అంతిమ గమ్యం. విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలు ప్రాతిపదికగా ప్రపంచ దేశాల మానవాభివృద్ధి సూచికలో అన్నిటా దిగువ స్థానాలతో సంతృప్తి పడిన దేశాన్ని అత్యున్నత జ్ఞానశక్తిగా అవతరింప చేయడం ఎలా సాధ్యమో ఎవరు చెప్పాలి? ఈ జ్ఞాన ఆధిక్యత దృష్టి దేశంలో జ్ఞాన వైవిధ్యాన్ని అణగదొక్కి ఒకే రకమైన జ్ఞానాన్ని సర్వోత్కృష్టమైనదిగా, శ్రేష్ఠమైనదిగా స్థాపించే ఫాసిస్ట్ సంస్కృతిని పరివ్యాప్తి చేసే ప్రమాదమే ముందు ఉన్నది.

2

సామాజిక న్యాయం, సమానత్వం సాధించడానికి ఉన్న ఏకైక గొప్ప సాధనం విద్య అని ఈ నూతన విద్యావిధానం 2020 పేర్కొంటున్నది. 2040 నాటికి సామాజిక, ఆర్థిక నేపథ్యాలతో సంబంధం లేకుండా అందరికీ అత్యున్నత గుణాత్మక విద్యకు సమాన అవకాశాలు సాధించడం గురించి వాగ్దానం కూడా చేసింది. కానీ జాగ్రత్తగా గమనిస్తే ఇవి శూన్య హస్తాలు చూపే శుష్క ప్రియాలు మాత్రమే అని సులభంగా అర్థం అవుతుంది.

పాఠశాల విద్యలో ప్రధాన సమస్య అర్ధాంతరంగా పిల్లలు చదువు మానేసి వెళ్లిపోవడం. 2017-18 సంవత్సరంలో జరిగిన హౌస్ హోల్డ్ సర్వే ప్రకారం ఆరేళ్ల వయసు నుండి పదహారు ఏళ్ల మధ్య వయసు పిల్లలు 3.22 కోట్ల మంది బడి బయట ఉన్నారని తేలింది. దానిని ప్రస్తావిస్తూ వాళ్లను సాధ్యమైనంత త్వరగా బడిలోకి తీసుకురావడం, ఇకముందు బడి ఎవరూ వదలకుండా చూడడం, 2030 నాటికి వంద శాతం పిల్లలు పాఠశాలలో చేరేట్లు చేయడం అవసరం అన్న గుర్తింపు నుండి పాఠశాల విద్యలో అర్ధాంతరంగా చదువులు ఆపేసే వారి సంఖ్యను గణనీయంగా తగ్గించడం, అన్ని స్థాయిలలో అందరికీ విద్యను అందుబాటులోకి తీసుకురావడం ఈ విద్యా విధానంలో ఒక ప్రధాన లక్ష్యంగా పేర్కొనబడింది. లక్ష్య సాధనకు ఉన్న రెండు మార్గాలలో ఒకటి భద్రతాయుతమైన, సమర్థవంతమైన మౌలిక సదుపాయాల పరికల్పన, సుశిక్షితులైన అధ్యాపకుల నియామకంతో పాటు రవాణా సౌకర్యం, వసతి సౌకర్యం మొదలైనవి కల్పించడం. అయితే రెండవది బడికి అవతల ఉన్న పిల్లలను సుశిక్షితులైన టీచర్లు సామాజిక కార్యకర్తల ద్వారా గుర్తించి, అవగాహన కల్పించి బడికి తీసుకురావడం. అసలు అంతంత మంది పిల్లలు బడి వదిలెయ్యడానికి మూలకారణమైన పేదరికం, అందువల్ల బాల్యంలోనే కుటుంబ అవసరాలకు ఆదాయం తేగల ఏదో ఒక పనిలో కుదరవలసి రావడం, తాగివచ్చే తండ్రుల వల్ల ఇంట్లో ఏర్పడే హింసాత్మక, సంఘర్షణాత్మక వాతావరణంలో మనసు చెదిరి చదవలేకపోవడం వంటి అంశాల ఉనికినే పట్టించుకోకుండా నిర్ధారించిన మార్గాలు ఈ రెండూ. మౌలిక నిర్మాణాలు సదుపాయాలు, గుణాత్మకతకు హామీ కీలకాంశం అయినప్పుడు విద్యార్థులు బడికి రావడంలో ఆసక్తిని కోల్పోరని చెప్పడంలో అదే కనబడుతుంది. అయితే ఈ మార్గాలలో చేయవలసిన పనికి ఉండే అవకాశం ఎంత? ఆచరణలో చిత్తశుద్ధి ఎంత? అన్నది మరొక అంశం.

ఇంతా చెప్పి అందరికీ ప్రత్యేకించి సామాజిక, ఆర్థిక అననుకూలతలలో ఉన్న సమూహాలకు చదువుకొనే అవకాశాలు కల్పించడానికి పాఠశాల విద్య బహుముఖ మార్గాలలో విశాలం కావలసి ఉంటుందని అంటూ అందుకు ఫార్మల్ , నాన్ ఫార్మల్ విద్యా విధానాలను సిఫారసు చేసింది ఈ నూతన విద్యావిధానం 2020. భౌతికంగా బడికి హాజరు కాలేని వాళ్ల కోసం ఓపెన్ స్కూల్స్, దూరవిద్య కోర్సులను కొనసాగించాలని చెప్పడాన్ని బట్టి అసమానతల కొనసాగింపే ఈ విద్యా విధానంలో మార్గదర్శక సూత్రం అన్నది స్పష్టం. బడికి వెళ్లలేనివాళ్లు అంటే పేదవర్గాల, పనిచేయక గడవని వర్గాల పిల్లలే. వాళ్లు దళిత, బహుజన, ఆదివాసీ పిల్లలే అయి ఉంటారు. ప్రత్యేకించి ఆడపిల్లలు అయి ఉంటారు. బడికి వెళ్లగలిగిన వాళ్లకు అందుబాటులోకి వచ్చే అవకాశాలతో పోలిస్తే జీవనపోరాటం మధ్య ఓపెన్ స్కూల్ ద్వారానో, దూరవిద్య ద్వారానో విద్యా పొందేవాళ్లకు అందివచ్చే అవకాశాలు తక్కువగానే ఉంటాయి. సమాన అవకాశాలు అన్న రాజ్యాంగ విలువ వాళ్ల విషయంలో నిరాకరణకు గురైనట్లే. బడులలో దళిత, ఆదివాసీ, బహుజన ఆడపిల్లల చేరికలో ఇప్పటికే ఉన్న గ్యాప్‌ను పూరించకపోగా మరింత పెంచటానికే ఇది ఉపయోగపడుతుంది. ఆ రకంగా అసమ సంస్కృతికి ఈ విద్యా విధానం రాస్తాను మరింత విశాలం చేసేదిగా ఉంది.

ఈ విద్యా విధానంలో కీలకమైన మార్గదర్శకాలలో ఒకటి సారళ్యం. (ఫ్లెక్సిబిలిటీ) కార్పొరేట్ ఆర్థిక సంస్కరణలను, మార్పులను ఆహ్వానించే మేధావివర్గపు ప్రతినిధిగా థామస్ ఫ్రైడ్ మాన్ అభివృద్ధి చేసిన భావన ప్రకారం త్వరత్వరగా మారుతున్న ఉద్యోగ పరికల్పనా రంగం స్వభావాన్ని బట్టి ఏదో ఒకటి నేర్చుకోవడం కాదు, నేర్చుకోవడం ఎట్లాగో జీవితాంతం నేర్చుకొంటూనే ఉండాలి. అందుకనే ఈ నూతన విద్యా విధానం ఏమి నేర్చుకోవాలో, ఏ జీవిత మార్గాన్ని ఎంచుకోవాలో ఎవరికి వాళ్లే నిర్ణయించుకొనే అవకాశం ఉండాలని, ఉంటుందని పేర్కొన్నది. ఈ ఎంపిక స్వేచ్ఛ విద్యార్థులను సాధికారులను చేస్తుందని ఈ విధానంలో చెప్పబడింది. ఉదారవాదం, సంస్కరణవాదం వంటి మాటలు తమ అసలుసారం కోల్పోయి, పెట్టుబడి సంస్కృతిలో ఎటువంటి కొత్త అర్థాలను మోస్తున్నాయో మనకందరికీ తెలిసిందే. ఇక్కడ సారళ్యం, స్వేచ్ఛ, సాధికారత అన్న మాటలు కూడా ఆ వరుసలోవే.

మాధ్యమిక పాఠశాల విద్య నుండే విద్యార్థులకు తమతమ అధ్యయన మార్గాలను, జీవిత విధానాలను తామే నిర్ణయించుకొనే అవకాశం ఇస్తుందట ఈ సారళ్యం. మాధ్యమిక విద్య అంటే ఆరు నుండి ఎనిమిదవ తరగతి వరకు. ఆ తరగతులలో ఉండే పిల్లలు పదకొండు నుండి పదమూడేళ్ల వయసు వాళ్లయి ఉంటారు. ఫిజికల్ ఎడ్యుకేషన్, కళలు-సంస్కృతి, వృత్తివిద్యా నైపుణ్యాలు మొదలైనవాటిలో దేనినో ఒకదానిని ఎంచుకొనే వివేకం కానీ, అవకాశం కానీ వాళ్లకు ఉంటాయా? శ్రామికులైన తల్లిదండ్రులు ఎదుర్కొనే అవసరాల ఒత్తిడి వాళ్ల ఎంపికను నియంత్రించేదిగా ఉండడమే తరచు జరిగేది. అటువంటప్పుడు వడ్రంగం, కమ్మరం, కుమ్మరం, ఎలక్ట్రిక్ మొదలైన వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ ఇప్పించడానికే తల్లిదండ్రుల మొగ్గు ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగ పరికల్పనతో పనిలేకుండా విద్యార్థులు స్వతంత్రంగా జీవికను ఏర్పరచుకొనే వీలు కల్పించే వృత్తి విద్యా కోర్సులు అసంఘటిత రంగాన్ని విస్తరింప చేస్తాయి. అదే సమయంలో విదేశీ పెట్టుబడులకు చౌకగా

నైపుణ్యం లేని లేదా కాస్త నైపుణ్యం గల చౌక శ్రామికులను అందుబాటులోకి తెచ్చే పని కూడా జరిగిపోతుంది. దానితో పాటు ఈ అసంఘటిత రంగ శ్రమ శక్తికి కేవలం ఏడు శాతంగా ఉండే ఉన్నత శ్రేణి ఉద్యోగ రంగానికి మధ్య అంతులేని వ్యత్యాసం కూడా విస్తరిస్తూనే ఉంటుంది. ఆ రకంగా చూసినప్పుడు సారంలో దీని పునాది అసమ సంస్కృతి అని, అస్తిత్వంలో ఉన్న నిచ్చెనమెట్ల వ్యవస్థను అది మళ్లీ మళ్లీ ఉత్పత్తి చేస్తూనే ఉంటుంది అని స్పష్టం అవుతుంది.

'సారళ్యం' మరోముఖం ప్రవేశ నిష్క్రమణల ఐచ్ఛికత. దీని ప్రకారం 10వ తరగతిలో బడి మాని వృత్తి విద్య కోర్సులలో చేరవచ్చు. తనకు ఇష్టమైన కోర్సులతో ఉన్న మూడు లేదా నాలుగేళ్ల డిగ్రీ కోర్సులలో చేరినవాళ్లు మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం, మూడవ సంవత్సరం – అలా ఎప్పుడైనా చదువు మానేసి వెళ్లిపోవడానికి ద్వారాలు ఉంటాయి. ఎప్పుడు నిష్క్రమించినా అప్పటివరకు పూర్తి చేసిన కోర్సులకు గాను సర్టిఫికెట్స్ ఇస్తారు. డ్రాప్ అవుట్ రేటును తగ్గించాలని ఒకచోట చెపుతూ జారిపోవడానికి అనేక ద్వారాలు ఉన్నాయని చెప్పడం ఒక వైరుధ్యం. మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం, మూడవ సంవత్సరం – అలా వాళ్లు నాలుగేళ్ల కోర్సులో మూడుసార్లు నిష్క్రమించడానికి ద్వారాలు ఉంటాయి (11.9). ఎవరు ఎప్పుడు నిష్క్రమిస్తారు? ఎవరు చివరివరకూ కొనసాగుతారు అన్నది ఆర్థిక, సామాజిక వెసులుబాట్ల సాపేక్షతలోనే జరుగుతుందని వేరే చెప్పనక్కరలేదు. సమానత్వం, సామాజిక న్యాయం సాధించడానికి ఏకైక మహత్తర సాధనం విద్య అని చెప్పిన ఈ నూతన విద్యావిధానం 2020 అసమానత్వం నుండి అసమానత్వానికి జరిగే సామాజిక గమనాన్ని కొత్త పదజాలంతో అలంకరిస్తుంది. అంతే.

'సారళ్యం'లో మరొక పార్శ్వం ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్. కాలేజీ, విశ్వవిద్యాలయం వంటి విద్యా సంస్థలతో ప్రత్యక్ష సంబంధం అవసరం లేకుండా అంతర్జాల సాంకేతికత ఆధారంగా చదువుకొనే అవకాశం కల్పించే దూర విద్య. సృజనాత్మక శక్తులను వికసింపచేసే విధంగా పాఠ్య ప్రణాళికలు పరీక్షా విధానాలు రూపొందించడంతో పాటు గుణాత్మక తరగతి గది నుండి అత్యంత విశాల సమగ్ర విద్యా సంస్థల వరకు జరగవలసిన నిర్మాణాల గురించి మాట్లాడే సందర్భంలో ఈ నూతన విద్యా విధానం సామాజిక, ఆర్థిక సౌలభ్యాలు లేని వర్గాల విద్యార్థుల గురించి కూడా ఆలోచించకపోలేదు. వాళ్లు ఉన్నత విద్యలోకి ప్రవేశించడానికి, విజయవంతంగా చదువులు పూర్తి చేసుకోవడానికి కాలేజీలు, విశ్వవిద్యాలయాలు ఉత్తమశ్రేణి సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి తోడ్పడాలని చెప్పింది. అయినా ఎక్కువ మందికి గుణాత్మక ఉన్నత విద్యను అందుబాటులోకి తెచ్చే సహజ మార్గం 'ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్' (12.5) అని పేర్కొనడం గమనిస్తే రాబోయే బహుళ జ్ఞాన కేంద్రాలుగా ఉండే విశాల విద్యా సంస్థలు ఎవరి కోసమో సులభంగానే అర్థం అవుతుంది.

అయితే ఈ లెర్నింగ్ అనేది ఇప్పటికే మార్కెట్ సరుకుగా స్థిరపడింది. 2015 జనవరిలో ప్రణాళికా సంఘాన్ని రద్దుచేస్తూ యూనియన్ క్యాబినెట్ చేసిన తీర్మానాన్ని అనుసరించి ప్రధానమంత్రి చైర్‌పర్సన్‌గా ఏర్పడిన సంస్థ. ది నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (ఎన్ఐటిఐ అయోగ్) దేశంలో జరగవలసిన మార్పుకు విద్య ఒక మాధ్యమం కనుక దానిని డిజిటల్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌గా మార్చడానికి 2017 నుండే భారత ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రయత్నాలు ప్రారంభించింది. అందుకు 'స్వయం దీక్ష' వంటి సాంకేతిక వేదికలను ఏర్పాటు చేసింది. విద్యను మార్కెట్ సరుకుగా మార్చడం అనే ప్రక్రియ దీనితో మరింత ఊపందుకున్నది. 2019 నివేదిక ప్రకారం 2018 నాటికి ఆన్‌లైన్ విద్యా వ్యాపారం 39 బిలియన్ రూపాయలలో ఉన్నదని, 2024 నాటికి అది 360 బిలియన్లకు చేరవచ్చని తెలుస్తున్నది. కోవిడ్ విపత్తు వలన ఆన్‌లైన్ పద్ధతే పాఠశాలలకు, కళాశాలలకు, విశ్వవిద్యాలయాలకు అనివార్యమైన పరిస్థితులలో ఈ వ్యాపారానికి ఆమోదం లభించినట్లయింది. నూతన విద్యావిధానం దానిని వ్యవస్థీకృతం చేయడానికి సంకల్పించింది. కోవిడ్ విపత్తు అలా ఉండగానే మద్యం షాపులను తెరవడానికి త్వరపడిన ప్రభుత్వాలు పాఠశాలలు, కళాశాలలు తెరవడం గురించి ఏమాత్రం ఆలోచించకపోవడం ఈ మార్కెట్ దృష్టివల్లనే కావాలి.

ఈ మార్కెట్‌లో ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, ఇరవై నాలుగు గంటల ఇంటర్నెట్ సౌకర్యం గల వినియోగదారులకు మాత్రమే విద్య అందుబాటులోకి వస్తుంది. కానీ దేశంలో ఎనిమిది శాతం మందికి మాత్రమే ఇవి అందుబాటులో ఉన్నాయి. అందులోనూ ఆడపిల్లల శాతం మరీ తక్కువ. అటువంటప్పుడు మిగిలిన అత్యధిక సంఖ్యాకులైన యువత, ప్రత్యేకించి ఆడపిల్లలు చదువుకు పరాయీకరింపబడడం తథ్యం. కోవిడ్ విపత్తులో పాఠశాల, కళాశాల విద్య స్తంభించి ఆన్‌లైన్‌లో విద్యాబోధన జరుగుతుంటే తమ పిల్లలకు మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి తలిదండ్రులకు పిల్లలకు స్మార్ట్ ఫోన్లు, ఐపాడ్‌లు, ల్యాప్‌టాప్‌లు, నిరంతర నెట్ సౌకర్యం సమకూర్చడం మోయరాని బరువు అవుతున్న సంగతి, కొత్త అవసరాలకు తగ్గట్టు అవి అందుబాటులోకి రానప్పుడు విద్యార్థులు నిరాశా, నిస్పృహలకు గురికావడం, ఆత్మహత్యలకు తలపడడం వర్తమానంలో మనం చూస్తున్నదే. ఈ పరిస్థితులలో సాంకేతికత వేదికగా విద్యను అందరికీ అందుబాటులోకి తేవచ్చు అని చెప్తున్న నూతన విద్యావిధానం నేతిబీరకాయలో నేతి సామెత చందంగానే ఉంటుందని వేరే చెప్పనక్కరలేదు. ఇది అస్తిత్వంలో ఉన్న సామాజిక, ఆర్థిక అసమానతలను ఏ స్థాయిలో పెంచుకుంటూ పోతుందో తలచుకొంటే భవిష్యత్తు చీకటి చిత్రపటమే.

3

విద్యా వ్యాపారీకరణను అదుపు చేయడం, అణచివేయడం, ఆపుచేయడం ఈ నూతన విద్యావిధానంలో కీలక ప్రాధాన్యాంశంగా ప్రత్యేకమైన ఉపశీర్షిక కింద చెప్పబడింది. (18.12) అయితే ఇది అసలు ఉద్దేశం అందుకు వ్యతిరేకమైనది. పాఠశాల విద్య నుండి ఉన్నత విద్య వరకు అన్ని దశలలోను విద్య ప్రైవేటీకరణను వేగవంతం చేసే ప్రక్రియ ప్రముఖంగా కనబడుతుంది. రేషనలైజేషన్ అఫ్ స్కూల్స్ ప్రక్రియలో ఇప్పటికే దేశమంతటా విద్యార్థులు తగిన సంఖ్యలో లేని బడులను నడపడం ఆర్థికంగా బరువు అన్న కారణంతో కొన్ని బడులను కలిపి ఒకటిగా చేయడం, కొన్నిటిని మూసివేయడం జరుగుతూనే ఉన్నది. అలా మూసివేయబడిన పాఠశాలలు ఒక్కొక్క రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉన్నాయి. దానికి తోడు స్కూల్ కాంప్లెక్స్‌ల ఏర్పాటును ముందుకు తెచ్చింది ఈ నూతన విద్యావిధానం. వనరుల వినియోగం లో

సామూహిక సంస్కృతిని పెంచడానికి, ముఖ్యంగా టీచర్ల నైపుణ్యాలను అన్ని పాఠశాలలకు వినియోగ పడేట్లు చేయడానికి అనేక పాఠశాలలతో ఒకే పెద్ద ఆవరణ అభివృద్ధి చేయడం ఉపయోగకరం అని పేర్కొన్నది. అధ్యాపకులు బడిలో రోజూ వేరు వేరు తరగతులకు వెళ్లి పాఠాలు చెప్పినట్టుగా ఇప్పుడిక ఒకే ఆవరణలో ఉన్న వేరు వేరు పాఠశాలలో పాఠాలు చెప్పాల్సి ఉంటుందన్న మాట. ఈ రకంగా 'టీచర్ షేరింగ్' అనే భావనను బలంగా ముందుకు తెచ్చింది. ఉపాధ్యాయులను వివిధ పాఠశాలలు తమ వాటాకు తగినట్లు వాడుకుంటారన్నమాట. ఇది అధ్యాపకుల మీద ఉమ్మడి యాజమాన్యపు బరువును పెంచడంతో పాటు వాళ్ల ఆత్మగౌరవ, వృత్తి గౌరవ తాకట్టులను కూడా కోరుతుంది. ఈ స్కూల్ కాంప్లెక్స్‌ల కోసం అధ్యాపకుల నియామకాన్ని హైరింగ్ అనే మాటతో పేర్కొనడం జరిగింది. ఆ మాటలోనే తాత్కాలికత అనే అర్థం ఉంది. ఉద్యోగ భద్రత సన్నగిల్లుతుంది. హైరింగ్ అన్నప్పుడు ఎప్పుడు పడితే అప్పుడు ఫైరింగ్ అవకాశాలు దానిని అంటిపెట్టుకొని ఉంటాయి. 'గురుబ్రహ్మ, గురుర్విష్ణు, గురుదేవో మహేశ్వర...' సంస్కృతిని సౌకర్యవంతంగా పక్కకు పెట్టిందన్నమాట ప్రాచీన సంస్కృతి గురించి ఎంతో మాట్లాడిన ఈ నూతన విద్యావిధానం.

ఒకవైపు ప్రభుత్వ విద్యా సంస్థలను వ్యవస్థను బలోపేతం చేసే విధంగా చర్యలు ఉంటాయని చెబుతుంది ఈ విద్యా విధానం. అదే సమయంలో స్కూల్ కాంప్లెక్స్‌లు, క్లస్టర్ల ఏర్పాటులోని ప్రయోజనాలను ఏకరువు పెడుతూ అది పాఠశాలల మధ్య సహకారాన్ని, సానుకూల సమ్మిళిత సహ ఉత్తేజాన్ని పెంపొందిస్తుందని చెప్తూ ఒక ప్రభుత్వ పాఠశాలకు, ఒక ప్రైవేట్ పాఠశాలకు మధ్య ఇటువంటి బంధాన్ని ఏర్పాటు చేయవచ్చని పరస్పరం వనరులను పంచుకోవడానికి, ప్రైవేట్ పాఠశాలల ఉత్తమ సంప్రదయాలను స్వీకరించడానికి ఉపయోగ పడుతుందని చెప్పడం పెద్ద వైరుధ్యంగా కనబడుతుంది. లాభాపేక్షగల తోడేలు వంటి విద్యా వ్యాపార వర్గానికి మేక పిల్ల వంటి సంక్షేమ రంగానికి చెందిన ప్రభుత్వ విద్యా సంస్థలకు మధ్య స్నేహం, సహకారం అంతిమంగా ప్రభుత్వ విద్యను బలహీనపరిచి, జబ్బుపరిచి చంపేసేది తప్ప మరొకటి కాదు. ప్రజా విద్యావ్యవస్థ ఒక శక్తివంతమైన ప్రజాస్వామ్య సమాజానికి పునాది అని చెపుతూనే, అదే సమయంలో ప్రైవేట్/దాతృత్వ పాఠశాల రంగాన్ని కూడా ప్రోత్సహించాలి అని చెప్పడం ఈ నూతన విద్యా విధాన స్వభావాన్ని స్పష్టం చేస్తుంది.

ఉన్నత విద్యలోనూ ఇదే ధోరణి. ఉన్నత విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారానికి ముక్కలు ముక్కలుగా దేశమంతటా విస్తరించిన ఉన్నత విద్యాసంస్థలను మల్టీ డిసిప్లినరీ అండర్ గ్రాడ్యుయేట్ కాలేజీలుగా, పెద్ద పెద్ద ఇంటర్ డిసిప్లినరీ విశ్వవిద్యాలయాలుగా, ఉన్నత విద్యా సంస్థల కేంద్రాలుగా పరివర్తింపచేయడం నూతన విద్యావిధానం-2020 ప్రధాన లక్ష్యం. విశ్వవిద్యాలయాలను పరిశోధనా ప్రధానమైనవి, బోధనా ప్రధానమైనవి అని రెండుగా వర్గీకరించింది. నైపుణ్య శిక్షణలు వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తూ డిగ్రీలు ఇచ్చే సంస్థలు మూడవరకం. పెద్ద మల్టీ డిసిప్లినరీ విశ్వవిద్యాలయాలు పరిశోధనా ప్రధానమైనవి కానీ, బోధనా ప్రధానమైనవి కానీ నలంద, తక్షశిలా, వల్లభి మొదలైన సంప్రదాయ భారతీయ విద్యా సంస్థల వారసత్వం నుండి అభివృద్ధి చేయవలసినవి అనికూడా పేర్కొన్నది. ప్రైవేట్ రంగంలో ఈ విధమైన సంస్థల అభివృద్ధి, దూర విద్య కోర్సులు, బహుళ నిష్క్రమణ ఎంపికలు మామూలే. ప్రపంచ ప్రమాణాలు సాధించటం లక్ష్యంగా మల్టీ డిసిప్లినరీ విద్య కోసం మోడల్ పబ్లిక్ విశ్వవిద్యాలయాల ఏర్పాటు ప్రస్తావన కూడా ఉంది. అయితే దానితో పాటు ప్రస్తావించబడిన అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించడం, దేశీయ విద్యార్థులు తమ డిగ్రీలో కొన్ని కోర్సులను విదేశాలలో పూర్తి చేసే ఒప్పందాలు, అధిక నాణ్యత గల విదేశీ సంస్థలతో విద్యార్థుల అధ్యాపకుల మార్పిడి, పరిశోధనా, బోధనా విషయాలలో సహకారం మొదలైన అంశాలు ప్రపంచ సంపన్నవర్గపు మల్టీ డిసిప్లినరీ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు రహదారి ఏర్పరుస్తున్నాయి. ప్రపంచ ప్రముఖ విశ్వవిద్యాలయాలను గుర్తించి వాటిలో ఉన్నవారు భారతదేశంలో పనిచేయడానికి చట్టబద్ధత కల్పించడం విదేశీ పెట్టుబడిని విద్యారంగంలోకి ఆహ్వానించడమే. విద్యను వ్యాపారంగా వ్యవస్థీకరించడమే.

అధ్యాపకులకు, సంస్థలకు సర్వస్వతంత్ర ప్రతిపత్తి కల్పించడం దానికి అనుబంధమే. స్వతంత్ర ప్రతిపత్తి అంటే ఆర్థిక స్వతంత్ర ప్రతిపత్తే. అర్థబలం ఉన్న వ్యక్తులు, శక్తులు, సంస్థలు తమ క్యాంపస్‌లను తాము నిర్మించుకొంటూ, నిర్వహించుకొంటూ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు పెట్టి విదేశాల నుండి అధ్యాపకులను పిలిపించుకొంటూ, ఆదాయం పెంచుకొంటూ పోతుంటే ప్రభుత్వం విద్యారంగం మీద పెట్టె వ్యయాన్ని తగ్గించుకొంటూ పోతుంది. ప్రైవేట్ యూనివర్సిటీలకు, విదేశీ విశ్వవిద్యాలయాలకు లభిస్తున్న అనుమతులు మనం చూస్తూనే ఉన్నాం. వాటిమీద ప్రభుత్వాలకు ఉండబోయే నియంత్రణ 'లైట్'గానే ఉంటుందని ఈ పాలసీ పేర్కొన్నది. బట్ టైట్ అనే మాటలను చేర్చిందనుకోండి. అవి కంటితుడుపు మాటలని ఎవరికి తెలియదు? వ్యక్తులు నడిపే సంస్థలకు నష్టదాయకం కాకుండా గరిష్ఠంగా వసూలు చేయదగిన ఫీజును నిర్దేశించడం జరుగుతుందని చెప్పడంలో ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థల సాధికారత గురించిన శ్రద్ధ గమనించవచ్చు. ఇప్పుడిక సాధికారత, స్వయం ప్రతిపత్తి సంస్కృతి (10.12) అంటే విద్యా వ్యాపారీకరణ క్రమాన్ని వేగవంతం చేయడమే. అందువల్ల ఇది విద్యారంగాన్ని పెట్టుబడి సంస్కృతికి, కార్పొరేట్ సంస్కృతికి లోబరచే విధానం. ఆ వ్యవస్థల ప్రయోజనాల కోసం పనిచేసే ఉద్యోగ వ్యవస్థను ఉత్పత్తి చేసే కేంద్రం. సామాజిక, ఆర్థిక, మానసిక, శారీరక సౌష్ఠవంలో తేడాలు ఎన్ని ఉన్నా, అందరికీ సమానంగా విద్య అని సూత్రప్రాయంగా అంగీకరించినా ఈ విద్యావిధానం అంతిమ గమ్యంలో అందరూ లేరు. గమనం ఆ దిశనే సూచిస్తున్నది. ఇది అసమానతలను మరింత తీవ్రతరం చేసే సామ్రాజ్యవాద సంస్కృతినే ప్రతిఫలిస్తున్నది. ఈ నూతన విద్యావిధానం 2020లో ప్రవేశ పెట్టిన 'స్పెషల్ ఎడ్యుకేషన్ జోన్' అనే మాట చటుక్కున ప్రత్యేక ఆర్థిక మండలుల చట్టాన్ని గుర్తుకు తెస్తుంది.

విద్యారంగాన్ని ఆశ్రయించి ఆర్థిక సంపదను రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సంపదగా మార్చడానికి జరుగుతున్న అంతర్జాతీయ కుట్రలో భాగంగా వచ్చిన ఈ నూతన విద్యావిధానం భారతీయమైనది అనుకుంటే పొరపాటే. ఆ పేరు మీద ప్రపంచ పెట్టుబడికి భారతీయ విద్యారంగాన్ని తాంబూలంలో పెట్టి అప్పజెప్పడమే జరిగేది. తస్మాత్ జాగ్రత్త.

(రచయిత సాహిత్య విమర్శకులు,
ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక నాయకురాలు) వీ

నేటి కాలం కార్పొరేట్లకు సువర్ణ అధ్యాయం

***వలసల ద్వారా, యుద్ధాల ద్వారా ప్రపంచ వనరులను కొల్లగొట్టే పద్ధతి మారి, దేశాల పాలకులే సామ్రాజ్యవాద శక్తులకు కట్టబెట్టే పద్ధతి వచ్చిందని అంటున్నారు* చుంచు శ్రీశైలం**

దేశంలో కార్పొరేట్ అనుకూల విధానాలు అమలవుతున్నాయి. ఇది గతానికి భిన్నమైనదేమి కాదు. కానీ ఆ విధానాలను చట్టబద్ధం చేయడంలో, వాటి అమలులో బరితెగింపు, రాజ్యాంగ విలువలను సమాధి చేయడంలో నిస్సిగ్గు ప్రవర్తనే భిన్నంగా కనిపిస్తుంది. పైగా తమ ప్రజా వ్యతిరేక విధానాలను, జాతి వనరులను దేశ విదేశ బహుళజాతి కంపెనీలకు దోచిపెడుతున్న కార్యాచరణను ప్రజలకు మేలు చేసేవిగా నమ్మించే ప్రయత్నాల్లో నిత్యం అబద్ధాలు వల్లె వేస్తున్నారు. ప్రస్తుత తమ పాలన 'దేశాభివృద్ధిలో సువర్ణధ్యాయం' అని తనకు తానే కితాబునిచ్చు కోవడమే కాకుండా, ప్రస్తుత ప్రజాస్వామ్యం యౌవన దశలో ఉందని కూడా దేశ ప్రధాని ఇటీవల వ్యాఖ్యానించడం ఆ అబద్ధాలలో భాగమే. అంటే పరిణతి చెందని బాల్యం కానీ, స్థిమితం ఉండని వృద్ధాప్యం కానీ కాకుండా పరిణతి, స్థిరత్వం కలిగిన యవ్వనంలా ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఉచ్ఛస్థితిలో ఉన్నదని ఆయన భావిస్తున్నారు. ప్రజాస్వామ్య యవ్వన దశ అంటే రాత్రికి రాత్రే చట్టాలు చేయడమా? లౌకిక విలువలను వదిలి మత విద్వేషాలు చిమ్మడమా? ఎన్నికల సంఘం, న్యాయ, విచారణ, దర్యాప్తు సంస్థల వంటి రాజ్యాంగ వ్యవస్థల నిర్వీర్యమా? లక్షల కోట్లు ఖర్చు చేసి ఓట్లు కొనుగోలు చేయడమా? ఎన్నికల విధానాన్ని అత్యంత ఖరీదైన ప్రహసనంగా మార్చడమా? ప్రలోభాలతో ఫిరాయింపులను ప్రోత్సహించి, ఎంఎల్ఏలను కొనుగోలు చేసి ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కూలదోయడమా? ఆలోచనాపరులను అంతమొందించడమా? బాధితులనే నేరస్తులుగా మార్చి శిక్షించడమా? ప్రతిపక్షం అనేదే లేకుండా చేసి, శాశ్వత అధికారం (రాజరికం) పొందగోరడమా? ఇలాంటి మరెన్నో ప్రశ్నలు ప్రజాస్వామిక వాదుల ఆలోచనల్లో ఉదయిస్తున్నాయి. ఈ ప్రశ్నలన్నింటికి ప్రధాని మోడీ సమాధానం చెప్పి తీరాలి. నిజానికి దోపిడీలో, అవినీతిలో, అణచివేతలో దేశంలో కొనసాగుతున్న సువర్ణధ్యాయం లేదా యవ్వన దశ నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు చేస్తున్న అసత్య ప్రచారాలు తప్ప ఇంకేం కాదు.

భారతదేశంలో 73 ఏళ్ల ప్రజాస్వామ్యాన్ని కుల స్వామ్యంగా, ధన స్వామ్యంగా, మతోన్మాద మూకల రక్షణ కవచంగా మార్చిన పాలకుల విధానాలను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజల వ్యతిరేకత సమీకృతం కాకుండా ఉండేందుకే ప్రజాస్వామ్య ముసుగును ఇంకా ధరిస్తున్నారు. నిజానికి ఇప్పుడు అనుసరిస్తున్నది మనువాదం వెలుగులో ఫాసిస్టు విధానాలు. ప్రజలే కేంద్రంగా ఉండాల్సిన ప్రజాస్వామ్యాన్ని నేడు పెట్టుబడి కేంద్రంగా మార్చి దీనినే పరిణతి దశ అని చెప్పడంలో అంతర్యాన్ని అర్థం చేసుకోవాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో వివిధ భాగాలలో ఒక భాగంగా మాత్రమే ఉండవలసిన ప్రభుత్వం సర్వోన్నతంగా మారిపోయింది. ప్రజల నుంచి పుట్టుకొచ్చిన ప్రభుత్వం ఆ ప్రజలను దూరంగా నెట్టి వారిని శత్రువులుగా, అభివృద్ధి నిరోధకులుగా భావిస్తుంది. ప్రజల హక్కులను రక్షిస్తూ, ప్రజాధనానికి కాపలాదారుగా ఉండి, ప్రజా సంక్షేమానికి ఖర్చు చేస్తూ, దేశ వనరులను న్యాయ, సమానత్వ సూత్రాల ప్రాతిపదికగా సమజాభివృద్ధికి ఉపయోగించడం ప్రజాస్వామిక ప్రభుత్వ విధి. ఆ విధికి పూర్తి విరుద్ధంగా పనిచేస్తుండడం మూలంగా ప్రజల చేత, ప్రజల యొక్క, ప్రజల కొరకు అన్న ప్రజాస్వామ్య నిర్వచనం ఈ దేశంలో పూర్తిగా హాస్యాస్పదంగా మారింది. ప్రజలే పాలకులుగా ఉండాల్సిన వ్యవస్థలో పాలకులు ప్రభువులుగా అవతరించి, ప్రజలను దాసులుగా మార్చారు. ప్రభుత్వాలు పెట్టుబడిదారుల కనుసన్నల్లో పనిచేయడం మాత్రమే కాదు పెట్టుబడి నిర్ణయించిన రాజకీయ పార్టీలు, నేతలే పాలకులుగా ఎన్నికవుతుండడం సర్వసాధారణంగా మారింది. ప్రత్యక్షంగా ఓటు వేసేది మాత్రమే ఓటరు. ఆ ఓటరును వివిధ మాధ్యమాలు (పెట్టుబడి, కట్టుకథలు కలగలిసి), డబ్బు ద్వారా ఓటరు ఆలోచనను, ఎంపికను ప్రభావితం చేసి పరోక్షంగా ఓటు వేస్తుంది పెట్టుబడే. అమెరికా గుత్త పెట్టుబడి సహకారం, స్వదేశీ బడా వ్యాపారవేత్తల మద్దతు లేకుండా, వారిని ప్రసన్నం చేసుకోకుండా ఏ రాజకీయ పార్టీ ఈ దేశంలో ప్రభుత్వాన్ని ఏర్పరచడం కానీ, ఏర్పరచినా అది పూర్తి కాలం కొనసాగే పరిస్థితులే లేని విధంగా మన ప్రజాస్వామ్యం బందీ అయిపోయింది. వ్యాపార దిగ్గజాలు నిర్దేశించిన నాయకులు పట్టాభిషిక్తులై, ప్రజలను అణిచివేతకు గురిచేస్తూ, ప్రజల పక్షాన నిలిచి దోపిడీని ప్రశ్నించే గొంతులను నొక్కేస్తూ, దేశ ద్రోహులుగా చిత్రీకరిస్తున్నారు. పెట్టుబడి చేతుల్లో కీలుబొమ్మలుగా మారిన ప్రభుత్వాలు దానికే దాసోహం అంటున్న స్థితిలో నేటి మన ప్రజాస్వామ్యం కొనసాగుతుంది. దేశ సహజ వనరులను, ప్రజా సంపదను, శ్రమను దోచిపెడుతున్నారు. పెట్టుబడి, ప్రభుత్వాలు పరస్పర ప్రయోజనాల కొరకు అత్యున్నతమైన ఐక్యతతో, అవగాహనతో కలిసి పనిచేస్తున్నాయి. ఏర్పాటులోనే కాకుండా, కొనసాగడానికి కూడా పెట్టుబడిదారుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉన్నప్పుడు ఆ ప్రభుత్వం వారి ప్రయోజనాలకు భిన్నంగా ఎలా పనిచేస్తుంది? ఈ వాస్తవాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నప్పుడు మన మేడి పండు ప్రజాస్వామ్యం 'పెట్టుబడి చేత, పెట్టుబడి యొక్క, పెట్టుబడి కొరకు' అనే నిర్వచనానికి సరిగ్గా సరిపోయేలా ఉంది. ఆ పెట్టుబడిని తృప్తిపరచడానికి తమ పౌరులనే దేశ ద్రోహులుగా ముద్రించి జైలు గోడల మధ్య ఏళ్ల తరబడి విచారణ ఖైదీలుగా బంధించేంత పరిణతి సాధించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమకు సంక్రమించిన నిరసన హక్కును వినియోగించుకొనే ప్రజల మీదే దాడులు చేసేందుకు కావాల్సినంత కండపుష్టి కలిగి యవ్వనంతో తొణికిసలాడుతుంది. మహిళలు, రైతులు, వృద్ధులు, పెన్షనర్లు

వికలాంగులు, పిల్లలు, రైతులు, ఉపాధ్యాయులు అనే తేడాల్లేకుండా అందరిపై సమానంగా నిర్బంధాలు, లాఠీ దెబ్బలు, బాష్పవాయు గోళాలు, వాటర్ కెనాన్‌లు ప్రయోగించేంత సమానత్వాన్ని సాధించింది. కేంద్ర వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీని దిగ్భంధించి తమ తెగువను ప్రదర్శిస్తున్న ఉత్తర భారత రైతులపై సాగిస్తున్న దౌర్జన్యం, దుష్ప్రచారం దీనికి తాజా నిదర్శనం. అంతకంటే సొంత భూభాగంలోని సాటి పౌరుల మీదే సర్జికల్ స్ట్రైక్ చేసేంత వరకు ఆలోచన చేయడం, అది ఎన్నికల వాగ్దానంగా కూడా ప్రకటించడం ప్రజాస్వామ్య వికాసంగా ప్రధాని భావిస్తుండవచ్చు.

ప్రజాస్వామ్యానికి పునాదుల వంటి కార్యనిర్వాహక, న్యాయ విభాగాలను పూర్తిగా ఆక్రమించి, శాసన వ్యవస్థ ఏకచత్రాధిపత్యం వహించడం కళ్ల ముందరి వాస్తవం. న్యాయస్థానాలు పూర్తిగా ప్రభుత్వాల చెప్పుచేతల్లో పనిచేస్తున్నట్లుగా ప్రజలు భావిస్తున్నారు. ప్రభుత్వ లేదా పార్టీ కార్యాలయాల్లో ముందుగానే రాయబడిన తీర్పులు న్యాయస్థానాల్లో చదవబడుతున్నాయన్న విమర్శ కూడా ఉంది. బెయిల్ మంజూరుకు సైతం హోం శాఖ అనుమతి ఉండాలనే స్థితికి న్యాయ వ్యవస్థను దిగజార్చారు. పదవీ విరమణ అనంతరం తమకు అనుకూలంగా పని చేసిన న్యాయమూర్తులకు రాజకీయ, ప్రభుత్వ పదవులు కట్టబెట్టడం న్యాయ వ్యవస్థ నిర్వీర్యానికి నిదర్శనం. అలాగే విచారణ, దర్యాప్తు సంస్థలను పూర్తిగా జేబు సంస్థలుగా మార్చి, రాజకీయ శత్రువుల పైకి ఎక్కుపెట్టే ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారు. స్వతంత్రంగా పని చేయాల్సిన ఎన్నికల కమిషన్ పనితీరులో జోక్యం చేసుకొని నిబంధనలను వారికి అనుకూలంగా మార్చి పనిచేయించు కుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల ప్రక్రియను అత్యంత ఖరీదైన స్థాయికి తీసుకెళ్లి, అధికార దుర్వినియోగం, విచ్చలవిడి రాజకీయ అవినీతికి పాల్పడుతూ కార్యనిర్వాహక వ్యవస్థనూ అవినీతి మయం చేశారు.

ఒకే దేశం – ఒకే పన్ను; ఒకే దేశం – ఒకే భాష; ఒకే దేశం – ఒకే మార్కెట్; ఒకే దేశం – ఒకే సిలబస్; ఒకే దేశం – ఒకే మతం; ఒకే దేశం – ఒకే జెండా; ఒకే దేశం – ఒకే సారి ఎన్నికలు; ఒకే దేశం – ఒకే వ్యవస్థ అనే అంశాన్ని ముందుకు తెచ్చి ప్రజల మధ్య విద్వేష బీజాలు నాటుతున్నారు.

దేశ సమాఖ్య లక్షణాలను, రాష్ట్రాల హక్కులను ఒక్కొక్కటిగా దెబ్బతీస్తూ, కేంద్రీకృత పాలనవైపు వేగంగా పరుగెడుతున్నారు. వీటన్నింటికి సజీవ సాక్ష్యాలుగా ఎన్నో సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. రాజ్యాంగ విలువలను కాలరాస్తూ, వ్యవస్థలను నిర్వీర్యపరుస్తూ శాశ్వత అధికార కాంక్షతో కొనసాగుతున్న ప్రస్తుత కాలం దేశ ప్రజాస్వామ్యంలో అధమ దశ అవుతుందే తప్ప అత్యున్నతం కానే కాదు.

అలాగే దేశాభివృద్ధిలో తమ పాలన సువర్ణధ్యాయం అని చెప్తూ, రాబోయే 18వ లోక్‌సభ కాలంలో కూడా కీలక నిర్ణయాలు కొనసాగుతాయని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని, రైతులను ఆకలిగొన్న సింహాల వంటి కార్పొరేట్లకు పూర్తిగా అప్పగించేలా రూపొందించిన రైతు వ్యతిరేక చట్టాలు ఎవరి జీవితాలకు సువర్ణధ్యాయం కానున్నాయి? ఎన్నో పోరాటాల ఫలితంగా కార్మికులు సాధించుకున్న 8 గంటల పని కాలాన్ని 12 గంటలకు పెంచుతూ, 100 మంది కార్మికులు గల పరిశ్రమలు మూసివేయాలంటే అనుమతి తప్పనిసరిగా ఉన్న నిబంధనను, 300 మంది కార్మికులు ఉంటేనే అనుమతి అవసరం అని, పనిచేసే చోట కనీస వసతులు కల్పించడం యాజమాన్యాల బాధ్యత కాదంటూ సవరించిన కార్మిక చట్టాలు ఏ వర్గాన్ని బంగారు మయం చేయనున్నాయి? బ్రిటిష్ కాలం నాటి మెకాలే గుమస్తా విద్యా విధానానికి నఖలు ప్రతిలాగా, ప్రస్తుత మార్కెట్ అవసరాలకు సరిపడే మానవ వనరులను సృష్టించడం, డిజిటలైజేషన్ లక్ష్యాలుగా, ప్రైవేటు, విదేశీ విద్యా సంస్థలకు అనుమతిస్తూ రూపొందించిన జాతీయ విద్యా విధానం ఏ సమాజాన్ని సువర్ణధ్యాయంగా మార్చనున్నది..? ఇది కుహనా జాతీయవాదం, నకిలీ దేశభక్తి కాక మరేంటి? పరిశ్రమల నిర్మాణానికి ముందే పొందాల్సిన అనుమతులు నిర్మాణ దశలో లేదా పూర్తైన తరువాత కూడా పొందేలాగా, చట్టాల ఉల్లంఘన జరుగుతుందని యాజమాన్యం లేదా ప్రభుత్వమే చెప్పాలి తప్ప ప్రజలు కాదంటూ దొంగ చేతికే తాళాలు ఇచ్చేలాగా పర్యావరణ పరిరక్షణ చట్టం –1986కు చేయదలిచిన సవరణల ద్వారా ఎవరి దోపిడీకి ఆటంకాలను తొలగించి దేశ వనరులను దోచిపెట్టనున్నారో స్పష్టంగా తెలుస్తుంది. కరువులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు, వ్యాపారుల దోపిడీల వల్ల అప్పుల పాలైన రైతులకు కనీస మద్దతు ధర కూడా కల్పించకుండా కోటాను కోట్లకు అధినేతలైన పారిశ్రామిక వేత్తలకు రాయితీలు ఇస్తూ, మొండి బకాయిల పేరుతో రుణాలు రద్దుపరుస్తూ, ఆర్థిక ప్యాకేజీల పేరుతో లక్షల కోట్ల రూపాయలు అందించి కార్పొరేట్లకు సువర్ణధ్యాయం లిఖిస్తూ, కడు పేదలకు కన్నీటి ధారలను మిగుల్చుతుంది.

వనరుల దోపిడీకి ప్రపంచ దేశాల భూభాగాలను వలసలుగా మార్చుకోవాల్సిన అవసరం తీరిపోయింది. అందుకోసం యుద్ధాలు చేయవలసిన కాలం చెల్లిపోయింది. ప్రస్తుత ప్రపంచం చూస్తున్న యుద్ధ మేఘాలన్నీ వర్షించని మబ్బులే. దేశాల రాజకీయ అవసరాల కోసం (ఎన్నికలు లేదా ప్రజల దృష్టి మరల్చడం) గర్జించినట్లు నటిస్తున్న ముందస్తు ఒప్పందాలు మాత్రమే. 90వ దశకం తర్వాత వలసవాదం, సామ్రాజ్యవాదాల స్థానంలోకి వచ్చిందే ప్రపంచీకరణ, కార్పొరేటీకరణ. వాటి అమలు సాఫీగా జరగడం కోసమే ప్రపంచ ప్రజల మధ్య సరిహద్దు గోడలను, గొడవలను పటిష్టపరుస్తూ, కార్పొరేట్ల మధ్య ఐక్యతను సాగిస్తున్నారు. యుద్ధాలు చేసి బలవంతపు ఆక్రమణల ద్వారా దోచుకునే రోజుల నుంచి పాలకులే సగౌరవంగా ఆహ్వానించి దోచిపెట్టే విధానమే నయా సామ్రాజ్యవాదం, సంస్కరణల వాదం. అత్యంత ఎక్కువ సహజ వనరులతో, అతి పెద్ద మార్కెట్టుగా ఉన్న భారతదేశం ప్రపంచ పెట్టుబడికి దోపిడీ కేంద్రంగా మారితే, ఆ పెట్టుబడికి దాని దోపిడీకి కాపలాదారులుగా వ్యవహరిస్తూ ఈ దేశ పాలకులు సువర్ణధ్యాయాన్ని నమోదు చేస్తున్నారు.

అందులో భాగంగానే బీమా, రైల్వే, ప్రజా రవాణా వంటి అన్ని ప్రజా రంగాలను పూర్తిగా ప్రైవేటీకరించి, కార్పొరేట్ రెక్కలు తొడిగి సామాన్యులకు అందనంత ఎత్తులో నిలబెడుతున్నారు. వాస్తవంలో ఇది పిడికెడు మంది కార్పొరేట్ శక్తులకు, ప్రభుత్వ పెద్దలకే సువర్ణధ్యాయం తప్ప ప్రజలకు ఎంతమాత్రం కాదు. ప్రజా కోణంలో ఇది దోపిడీ, పీడన, అణచివేతల్లో అత్యున్నత దశ. దీనినే సువర్ణమైన అధ్యాయమని పాలకులు భావిస్తే, ప్రజలు పోరాటాల ద్వారా సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టడానికి ఎంతోకాలం పట్టదు. అప్పుడు మార్క్స్ చెప్పినట్లు ప్రజాస్వామ్యమే సామ్యవాదానికి రహదారి కాగలదు.

(రచయిత ఉపాధ్యాయులు,
టిపిటిఎఫ్ జిల్లా కౌన్సిలర్, మహబూబాబాద్)

ప్రేమలనూ పెళ్ళిళ్లనూ శాసిస్తున్న రాజ్యం

రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛను లవ్ జిహాద్ పేరుతో హరించే విధంగా పాలకులు చట్టాలు చేస్తున్నారని అంటున్నారు **సతీష్ బైరెడ్డి**

చరిత్రలో జీహాద్‌ల గురించి చదివాం. వాటికి సంబంధించిన అవగాహన చరిత్రను అధ్యయనం చేసిన వారికి బాగానే ఉంటుంది. వర్తమాన చరిత్రలో 'లవ్ జీహాద్' పేరుతో కొత్తగా ఒకటి భారతదేశంలో మాత్రమే ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇది మత ప్రమేయంతో కూడినదైనప్పటికీ మెజారిటీ మతానికి తమకుతామే ప్రతినిధులమని చెప్పుకుంటున్న సంఘ్‌పరివార్ దీనిని బలంగా ముందుకు తెచ్చింది.

దేశంలో పలు రాష్ట్రాల్లో ప్రత్యేకించి కేరళ, కర్నాటక, ఉత్తర ప్రదేశ్‌లలో ముస్లిం యువకులు దేశ, విదేశాల నుండి వచ్చిన డబ్బుతో జీన్స్, టీషర్ట్స్, ఆకర్షణీయ వస్త్రాలు, అద్దాలు లాంటివి ధరించి, అమాయకమైన హిందూ మహిళలను ఆకర్షించి, మతం మార్పించి వివాహం చేసుకుంటున్నారని, తద్వారా ముస్లిం జనాభాను పెంచుకుంటున్నారని బిజెపి, సంఘ్‌పరివార్ గత పదేళ్లుగా పనిగట్టుగొని దీనినే లవ్ జీహాద్‌గా ప్రచారం చేస్తున్నది. దశాబ్దాలుగా ఇవే శక్తులు ముస్లింలు బహు భార్యత్వం ద్వారా అడ్డూ అదుపు లేకుండా పిల్లల్ని కంటున్నారని, జనాభా నియంత్రణ బాధ్యతలను నిర్వర్తించడం లేదని, వారిని జనాభా పెరుగుదలకి కారకులనేలా నిందిస్తూ వచ్చారు. మరి జనాభా పెంచుకోవడానికి పనిగట్టుకొని హిందూ స్త్రీలనే పెళ్లి చేసుకోవాల్సిన అవసరం ఏమి ఉన్నదో ఈ సంఘాల వారు చెప్పడం లేదు. ఇలా ఒక కార్యక్రమం పెద్ద ఎత్తున కుట్రపూరితంగా కొనసాగుతున్నదని, దీనిని సాగనిస్తే హిందూ మత ఉనికికే ప్రమాదమనేంతగా ప్రచారాన్ని చేస్తున్నారు. నేటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ఈ మొత్తం ప్రచారంలో ప్రథమ స్థానంలో ఉన్నాడు. అధికారంలోకి వచ్చాక అడ్డేముంటుంది. కరోనా కల్లోలంలోనే మరో ముఖ్యమైన సమస్య అంటూ ప్రజలకు ఏమీ లేనట్టు 'చట్ట వ్యతిరేక మతాంతీకరణ నిషేధ చట్టం 2020' ఆర్డినెన్స్‌ను తీసుకవచ్చి గవర్నర్ చేత హడావిడిగా ఆమోదింప చేసుకుంది.

ఈ చట్టం ముస్లింలను లక్ష్యంగా చేసుకొని తీసుకవచ్చినట్టు ప్రత్యక్షంగా ఎక్కడా కనిపించదు. పెళ్లి పేరుతో మతం మార్చుకోవడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా పేర్కొంటున్నది. ఇప్పటికే ఉన్న చట్టాలలో బలప్రయోగంతో కాని, మోసపూరిత చర్యలతో కాని మతాంతీకరణ చెల్లుబాటు కాదనే అంశం చాలా స్పష్టంగా ఉన్నది. ఈ కొత్త చట్టంలో జోడించబడిన అతి ప్రధానమైన అంశం పెళ్లి పేరుతో మతాంతీకరణ జరగడాన్ని నేరపూరితమైన చర్యగా పరిగణించి రద్దుపరచడమే.

ఆకర్షించడం ద్వారా యువతికి మతమార్పిడి జరిగితే ఒక సంవత్సరం నుండి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, కనీసంగా రు. 15 వేల జరిమానా. ఆ యువతి మైనర్ అయినా, షెడ్యూల్ కులాల తెగలకు చెందిన వారైనా ఈ శిక్ష మూడు నుండి పది సంవత్సరాల వరకు ఉంటుంది. రు. 25 వేల జరినామా విధించబడుతుంది. ఒకవేళ అటువంటి మత మార్పిడి మూకుమ్మడిగా జరిగితే మూడు నుండి పది సంవత్సరాల జైలు శిక్ష, కనీసంగా రు. 50 వేల జరినామా ఉంటుందని చట్టంలో పేర్కొన్నారు. వివాహం ద్వారా మత మార్పిడే లక్ష్యమైన ఎడల ఆ వివాహాన్ని రద్దుచేసే అధికారాన్ని కూడా ప్రభుత్వానికి ఈ చట్టం ఇస్తున్నది. యువతీ మతం మార్చుకోదలచుకుంటే స్వచ్ఛందంగా మతం మారుతున్నానని జిల్లా మెజిస్ట్రేట్‌కు రెండు నెలల ముందు సమాచారం ఇవ్వాలని చట్టం చెపుతున్నది. మత మార్పిడి కోసమే వివాహం అని రుజువైన పక్షంలో ఒకటి నుండి పది సంవత్సరాలు శిక్ష పడేలా ఈ చట్టాన్ని రూపొందించారు. ఉత్తరప్రదేశ్ లా కమిషన్ సూచించినట్టుగా వివాహ అవసరం కోసం మాత్రమే మతం మార్చుకోవడాన్ని చెల్లనిదిగా ప్రకటించడమే కాకుండా, అటువంటి పెళ్లి కూడా రద్దయిపోతుందని స్పష్టంగా పేర్కొన్నది. బలవంతంగానో, మోస పూరితంగానో లేదా ప్రలోభాలకు గురిచేసో మత మార్పిడి చేయడాన్ని ఇప్పటికే ఉన్న చట్టాలు అడ్డుకుంటున్నాయి. అలా చేయడం వల్ల సమాజంలో ఉండే సామరస్యపూరితమైన వాతావరణం దెబ్బతింటుందని, అవాంఛనీయ పరిణామాలకు దారితీస్తుందని వాదించడంలో సంబంద్ధత ఉంది. రెండు వేర్వేరు విశ్వాసాలు కలిగిన వక్తుల మధ్య ప్రేమలు చిగురించడం, జీవితకాలం కలిసి ఉండాలని నిర్ణయించుకోవడం ఆయా వ్యక్తుల వక్తిగతమైన, ప్రాథమిక హక్కులో భాగమవుతుంది. ఇప్పటికే ఈ చట్టం ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో పదుల సంఖ్యలో అరెస్టులు చేసి జైళ్లలోకి పంపించివేస్తున్నారు. జరిగిన ఈ అరెస్టులన్నీ ముస్లిం యువకులవే కావడం యాధృచ్చికం కాదు. ఒక ప్రత్యేక మతాన్ని లక్ష్యంగా చేసుకొని ప్రచారం చేయడం, చట్టాన్ని రూపొందించడం, అత్యంత ప్రాధాన్యతాంశంగా గుర్తించడం సంఘ్‌పరివార్ ఎజెండాలో భాగంగా జరుగుతున్నదే. భిన్నమైన అస్థిత్వాలను గుర్తించ నిరాకరించడమే కాకుండా వాటిని 'ఏకం' చేయాలనేది సంఘ్‌పరివార్ లక్ష్యం. ఈ లక్ష్యంలో భాగంగానే మెజారిటీ మత ఛాందసత్వాన్ని రెచ్చగొట్టడానికి ఇలాంటి అబద్ధపు ప్రచారాలు, అనవసరమైన చట్టాలు.

భారత రాజ్యాంగంలో 25వ అధికరణం పౌరులంతా సమానులేనని పేర్కొంటూ కుల, మత, భాష, ప్రాంత, లింగ వివక్ష లేకుండా ప్రభుత్వం చూడాలని నిర్దేశిస్తున్నది. యువతీ, యువకులు తమకిష్టమైన వ్యక్తిని ప్రేమించడానికి, పెళ్లి చేసుకోవడానికి పైన పేర్కొన్నవేవీ అడ్డంకులు కాకూడదు. అలా వివాహం చేసుకోవడానికి కుటుంబ, మతపరమైన ఆచారాలను పాటించడం కూడా వారి హక్కులో అంతర్భాగమే. ఈ మొత్తం వ్యవహారంలో మత విశ్వాసాలను మార్చుకోవడం (ఆమె కోసం

అతడైనా, అతని కోసం ఆమైనా), మార్చుకోవాల్సి రావడం కూడా వారి ప్రాథమిక హక్కులో భాగంగానే చూడాలి. ఇలా జరిగే క్రమంలో మతమార్పిడి ప్రక్రియ బలవంతంగానో, బ్లాక్ మెయిల్‌గానో జరిగితే ఇప్పటికే ఉన్న చట్టాలలో బాధితుల ఫిర్యాదుతో వ్యవహరించే వెలుసుబాటు ఉన్నది. అయితే యోగి చట్టం వ్యక్తుల సమ్మతితో జరిగే విశ్వాసాల మార్పు అంశాన్ని కూడా నేరపూరితమైన చర్యగా ప్రకటించడమే అత్యంత ప్రమాదకరమైనది. ఇది పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమైనదే కాకుండా, సహజ హక్కుల ఉల్లంఘన కిందికే వస్తుంది.

గోప్యత (ప్రైవసీ) పౌరుని ప్రాథమిక హక్కులో అంతర్భాగమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి ఉన్నది. 2018లో షిఫిన్ జహాన్ – హదియా కేసులోనూ కూడా పెళ్లిని సాకుగా ఉపయోగించి మత మార్పిడిని అడ్డుకోవడం రాజ్యాంగ వ్యతిరేక చర్యగానే పరిగణించాలని తీర్పునిచ్చింది. ఆధునిక కాలంలో చైతన్యవంతమైన యువత కుల, మత పట్టింపులు లేకుండా తమకిష్టమైన వారితో కలిసి జీవించడాన్ని కోరుకుంటున్నారు. ఈ అవసరాన్ని అనివార్యతగా గుర్తించిన గత ప్రభుత్వాలే 1954 ప్రత్యేక వివాహ చట్టాన్ని తీసుకవచ్చాయి. ఈ చట్టమే మతాంతర వివాహాలకు అనుమతిని, భద్రతను కల్పిస్తున్నది. అయినా పెళ్లి చేసుకోవాలనుకున్న యువతీ, యువకులు తమ మత విశ్వాసాలను బయటికి చెప్పుకోవాల్సిన అవసరం లేదనే స్వేచ్ఛను కూడా కలిగి ఉంటారు.

యోగి ప్రభుత్వం తీసుకవచ్చిన ఆర్డినెన్స్ ఈ ప్రత్యేక వివాహ చట్ట ప్రగతిశీల స్ఫూర్తిని ధ్వంసం చేసేలా ఉన్నది. మారుతున్న శాస్త్ర, సాంకేతిక కాలానికి అనుగుణంగా ఆధునికంగా మరింత ప్రగతిదాయకంగా ఆలోచించాల్సిన, ప్రజలను ఆ మార్గంలో నడిపించాల్సిన ప్రభుత్వాలే వారిని మధ్య యుగాల్లోకి నెట్టివేసే చట్టాలను ప్రజల మీద బలవంతంగా రుద్దుతున్నాయి.

ప్రభుత్వాలు ఎలాగూ ప్రగతిశీలంగా, శాస్త్రీయంగా వ్యవహరించక పోయినా ప్రజలకుండే ఆ హక్కును తుంచివేయడం దుర్మార్గమైనది. ఇవాళ ఈ చట్టాల రూపంలో మానవ సంబంధాల్లోకి, సున్నితమైన ప్రేమ, పెళ్లి అంశాల్లోకి కూడా రాజ్యం చొచ్చుకవస్తున్నది. సహజ పరిణామాలను, ఆహ్వానించదగిన, సమాజానికి అవసరమైన పరివర్తనను ప్రోత్సహించాల్సింది పోయి, నేరమయ చర్యలుగా ప్రభుత్వాలు ప్రకటించడం అంటే అది నిరంకుశత్వానికి పరాకాష్ట. ఇప్పటికే పౌరుల అన్ని రకాల హక్కులను, స్వేచ్ఛలను కాలరాస్తున్న రాజ్యం ఇవాళ అత్యంత వ్యక్తిగత అంశాల్లోకి కూడా చొచ్చుకవచ్చి వారి అస్థిత్వాన్నే ప్రశ్నార్థకం చేస్తున్నది. చరిత్రలో హిట్లర్ కాలంలో యూధులకు, ఇతర మతస్థులకు ప్రేమలు పెళ్లిల్లు నిషేధించి యూధుల పట్ల విపరీత ద్వేషభావాన్ని పెంచినట్టుగానే సంఘ్‌పరివార్ శక్తులు ఈ చట్టం ద్వారా ముస్లింలపై మెజార్టీ మతోన్మాదాన్ని మరింత రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నాయి.

లవ్ జీహాద్ లాంటి అబద్ధపు ప్రచారాల కంటే ముందునుండే సంఘ్ పరివార్ సాంస్కృతిక పోలీసింగ్‌ను దేశమంతటా చేస్తూ వస్తున్నది. 'వాలంటైన్స్ డే' లాంటి 'విదేశీ' వేడుకలు జరపుకోరాదని, వాటిని నిషేధించాలని పార్కుల పైన, హోటల్స్ పైన చాలా కాలంగా భౌతిక దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నది. పార్కుల్లో కనిపించిన యువతీ, యువకులను తీవ్రంగా బెదిరించడం, బలవంతపు పెళ్లిల్లు జరిపించిన చరిత్ర కూడా వీళ్లదే. దేశీయ సహజ వనరులను విదేశీయులకు ధారాదత్తం చేసినపుడు, దేశ మార్కెట్‌ని గంపగుత్తగా కార్పొరేట్లకు అప్పగించినపుడు ఏదీ తప్పుగా అనిపించలేదు గాని, వ్యక్తులు ప్రత్యేకించి యువతీ, యువకుల స్వేచ్ఛాయుత నిర్ణయాల దగ్గరకు వచ్చేసరికి 'స్వదేశీ' గుర్తుకువస్తది. మత ముప్పు కూడా గుర్తుకు వస్తున్నది. 'లవ్ జీహాద్' నిషేధం పేరుతో వచ్చిన ఈ చట్టం రాజ్యాంగ మౌలిక సూత్రమైన లౌకిక భావనకు విరుద్ధమైనది.

కులం, మతం వంటి కృత్రిమ గోడల్ని కూల్చడానికి, ప్రజల మధ్య ఐక్యత సాధించడానికి కొత్త తరాన్ని వాటికి ఆవలగా ఆలోచించేలా చేయాల్సిన ప్రభుత్వాలే వాటికే బద్దులు కమ్మని చెప్పడం వెనుకబాటు తనమే. వ్యక్తులు నిర్మించుకునే మానవ సంబంధాలను ఈ రూపంలో అడ్డుకోవాలనుకోవడం మూర్ఖత్వమే. ఇప్పటికే దేశంలో అనేక చోట్ల యువతీ, యువకుల స్వేచ్ఛాయుతమైన నిర్ణయాలకు ప్రత్యేకించి ప్రేమ పెళ్లిల్ల విషయంలో కులం, మతం, కుటుంబ పరువు, గోత్రం పేరుతో అనాగరిక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.

అభివృద్ధి చెందిన రాష్ట్రంగా చెప్పబడుతున్న హర్యానా లాంటి రాష్ట్రంలో 'ఖాపు' పంచాయితీల పేరుతో యువతపై ప్రధానంగా యువతులపై వివరీతమైన హింస అమలవుతున్నది. ఈ నేపథ్యంలోనే ఇట్లాంటి చట్టాలు అమల్లోకి రావడమంటే అటువంటి అనాగరికమైన శక్తులకు మరింత ఊపునివ్వడమే తప్ప మరోటి కాదు. అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక సంబంధమైన, ఆర్థిక ఎదుగుల కోసం చేసే ప్రయత్నాలు మాత్రమే కాదు. మనుషులకు అడ్డుగోడలుగా నిలుస్తున్న అన్ని సాంఘీక కృత్రిక నిర్మాణాలను కూల్చి వేయడం కూడా. ఒకవైపు అత్యంత ఆధునిక శాస్త్ర, సాంకేతికతను అందిపుచ్చుకొమ్మని చెప్పే పాలకులే సామాజిక సంబంధాల్లో పురోగామి భావనలను అడ్డుకునేలా ఆటవిక చట్టాలను తీసుకవస్తున్నారు. వ్యక్తుల జీవితాలను, వారి వ్యక్తిగత అంశాలను ఆసాంతం రాజ్యం తన గుప్పిట్లో పెట్టుకోవాలనుకోవడం నియంతృత్వం. అసలే ప్రజాస్వామిక విలువలు, స్వేచ్ఛలు లుప్తమవుతున్న కాలంలో ఎవడి బతుకును వాడిని కూడా బతకనిచ్చే పరిస్థితి లేకుండా చేస్తున్నారు. ఏమి తినాలి, ఎటువంటి వస్త్రాలు ధరించాలి, ఏ విషయాలు మాట్లాడాలి, ఎటువంటి పరిభాష వాడాలి, ఎలాంటి శరీర కదలికలు ఉండాలో కూడా రాజ్యమే నిర్ధేశించే చీకటి స్థితిలోకి నెట్టబడుతున్నాం.

మతం రాజ్య సింహాసనం మీద తిష్ట వేసి చలనశీలత లేని సనాతన ధర్మమే రాజ్యమేలుతున్న కాలంలో నిలువనీటి గుంటలా సమాజం మారిపోనుంది. మెజారిటీ మత పెత్తనం మైనారిటీల పట్ల విద్వేషాన్ని, అసహనాన్ని పెంచి సామరస్యాన్ని చంపివేస్తున్నది. అన్ని రంగాలను శాసిస్తున్న ఈ ఉన్మాద పాలన వ్యక్తుల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను, అన్ని ప్రజాస్వామిక సూత్రాలను పాతరేస్తున్నది. అడ్డూ అదుపు లేకుండా అక్రమ అరెస్టులకు, నిర్బంధాలకు తెగబడుతున్నది. ప్రశ్నించడాన్ని మహా నేరంగా పరిగణిస్తున్నది. నిరసన తెలిపే హక్కు, భిన్నాభిప్రాయ వ్యక్తీకరణ స్వేచ్ఛలను వినియోగించుకున్నందుకే మనుషులు జైలు పాలవుతున్నారు. అబద్ధాలను ఆడంబరంగా ప్రచారం చేస్తూ నిజం చెప్పే గొంతుల్ని నిలువునా చీల్చేస్తున్నారు. ప్రజల జీవన్మరణ సమస్యలేవి ప్రాధామ్యాలుగా నిలువడం లేదు. మనోభావాల పేరుతో ఉద్వేగాలను రెచ్చగొట్టి, విద్వేషాలను రాజేసి 'అఖండ హిందూ రాజ్యం' కోసం పరుగులు పెడుతున్నారు. దాని కోసం ప్రేమలను, పెళ్లిళ్లను కూడా శాషిస్తున్నారు. ప్రతిఘటించకపోతే ప్రతి ఒక్కరం బాధితులుగా నిలబడే ప్రమాదం మరెంతో దూరంలో లేదు.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

బుద్ధిజీవులను బందిఖానాలో బలిచేస్తారా?

విచారణ, బెయిల్ లేకుండా ప్రజా మేధావులను జైళ్లలోనే ఏళ్ల తరబడి నిర్బంధించిన పాలకుల ఉద్దేశం వారి ప్రాణాలు హరించడమే అని అంటున్నారు **నారాయణ రావు**

చరిత్రలోనే కాదు వర్తమానంలోనూ ప్రభుత్వాలు ఉద్యమాలను, ఆందోళనలను నేరాలుగా, శాంతిభద్రతల సమస్యగానే భావిస్తున్నాయి. సాయుధ బలగాలతో, పోలీసులతో, అక్రమ కేసులతో అణిచివేయ గలమని అనుకుంటున్నాయి. నాయకులను, కార్యకర్తలను భౌతికంగా నిర్మూలించడం ద్వారా కూడా ఉద్యమాలను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నాయి. అంతేకాకుండా ఉద్యమాల లక్ష్యాలను, ఉద్దేశాలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నాయి. నాయకులను దొంగలని, వేర్పాటు వాదులని, తీవ్రవాదులని మీడియాను ఉపయోగించుకుని పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేస్తున్నాయి. ప్రచారం ద్వారానే ప్రభావితం అయ్యే మధ్యతరగతి ప్రజానీకం ఎక్కువ కాబట్టి పోలీసులు, ప్రభుత్వాలు చెప్పేది నిజం అని అనుకుంటారు. వివిధ దశల్లో హక్కుల పట్ల నిబద్ధతతో, వారి పరిరక్షణ కోసం రాజీ లేకుండా పోరాటం చేసే హక్కుల నేతలను తీవ్రవాదులని ముద్రవేసి హత్యలు చేసిన సంఘటనలు మన అనుభవంలో చాలా ఉన్నాయి. నేడు అక్రమ కేసుల్లో సుదీర్ఘకాలం బెయిల్ రాకుండా నిర్బంధించి జైళ్లోనే బలితీసుకునే స్థితికి ప్రభుత్వాలు దిగజారిపోతున్నాయి. వరవరరావు, ఫాదర్ స్టాన్ స్వామిల పరిస్థితే ఇది.

సమాజంలో హింసకు, అలజడికి, చివరికి దొంగతనాలకు కూడా సామాజిక కారణాలు ఉంటాయి. ఆ కారణాల గురించి ఆలోచించే మేధావులు వాళ్లు. ఆ కారణాలను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని స్పష్టం చేస్తూనే ఉన్నారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల సారాంశం అదే. ఆ బాధ్యత గురించి, ప్రభుత్వ బాధ్యతారాహిత్యం గురించి ఆలోచించే బుద్ధిజీవులు వాళ్లు. నేరాలను నివారించడానికి న్యాయసంబంధంగా విచారించడానికి చట్టాలు కొన్ని ప్రమాణాలను నిర్దేశించాయి. వాటి అమలు గురించి, ఆందోళన చేసే హక్కుల సంఘాల నేతలు వీళ్లు. ఉద్యమాలు ప్రభుత్వ వైఫల్యాల నుండే పుడతాయి. దీని వెనక సామాజిక, ఆర్థిక కారణాలు ఉంటాయి. ఆ సామాజిక కారణాలను పరిశీలించి పరిష్కరించాలనడం ఉద్యమాలను వెనకేసుకురావడంగా భావించకూడదు.

బుద్ధి జీవులను నిర్బంధించడం, అక్రమ కేసులు నమోదు చేయడం సహజంగా మారిన స్థితిలో మన ప్రజాస్వామ్య విలువలు వెలవెల బోతున్నాయి. రాజకీయ పార్టీలపై ఉన్న అవిశ్వాసానికి తోడుగా న్యాయవ్యవస్థ పనితీరుతో 80 ఏళ్ల వరవరరావు, 84 ఏళ్ల ఫాదర్ స్టాన్ స్వామిల జీవించే హక్కు పూర్తిగా ప్రమాదంలో పడింది. వరవరరావు అన్నట్లు 'మౌనం ఒక యుద్ధనేరం' గానే అన్యాయంపై బుద్ధిజీవుల మౌనం కూడా నేరంగానే పరిగణించే స్థితి ఏర్పడింది. సగటు మనిషి జీవించలేని సామాజిక స్థితిలో గొంతెత్తి ప్రశ్నించే హక్కుల మేధావుల అక్రమ నిర్బంధం వారి ప్రాణాలను బలిపెట్టే స్థితికి నెడుతున్నది. ఒక రకంగా రాజ్య అన్యాయ, అక్రమ తీర్పుల్లో మన మౌనం ఒక భాగంగా మారుతున్నదేమో ఒకసారి ఆలోచించాల్సి ఉంది. మన మౌనం నేరానికి అంగీకారంగా ఉండకూడదు. పీడిత పక్షానికి గొంతులుగా ఉన్న వారి మేధస్సును వారి ప్రాణాలను కాపాడుకోవడానికి మనం మన మద్దతును తెలియజేయాల్సిన అవసరం ఉంది.

వరవరరావు తన రచన భవిష్యత్ చిత్రపటాన్ని నిషేధించినా, ఉద్యమించడంతోనే ప్రజలకు మంచి భవిష్యత్ ఉంటుందని నడుస్తున్న ఉద్యమాలపై విశ్వాసం ఉంచినవారు వరవరరావు. అధికారంలోకి రాగానే రాజ్యాంగంపై ప్రమాణం చేసినవారు ప్రజలను మోసం చేయవచ్చుగాక, ప్రజా ఉద్యమ ప్రతీకలుగా ఉన్నవాళ్లు, ప్రజల కోసం జీవితం అర్పిస్తున్నవాళ్లు, నిఘా నీడతో అగుపించనంత దూరాన మసలుతున్నప్పటికి ఉద్యమాలు ప్రజలనెపుడూ మోసం చేయలేవు అనేది అతని ప్రగాఢ విశ్వాసం. ఆ విశ్వాసమే అతన్ని నేటికి బతికించ గలుగుతుంది. సమస్యల్లోంచే ఉద్యమాలు పుడతాయి. ఆ ఉద్యమాల్లోంచే నేతలు పుడతారు. వాళ్లే ప్రజల జీవనాడిగా ఉంటారని అనేక సభల్లో, అనేక సంఘటిత ఉద్యమాల్లో తన సంఘీభావాన్ని ప్రకటించారు విరసం కవి వరవరరావు. ప్రజా సమస్యలను ఎజెండాల్లోకి తీసుకుని ఉద్యమం కొనసాగించడం ఎంత ప్రజాతంత్ర అంశమో ఉద్యమ సంఘీభావ సాహిత్యాన్ని సృష్టించడం అంతే బాధ్యతగల పనిగా తాను గుర్తించాడు. ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించకుండా, రాజకీయపార్టీలు తమ స్వార్థం కోసం కృత్రిమ సమస్యలను సృష్టించి ప్రజల మధ్య వైషమ్యాలు రేపుతున్న తరుణంలో పాలకుల విచార దృష్టిని నిశితంగా పరిశీలించాలని వినమ్రంగా కోరినవాడు. ప్రజల్ని, కులం, మతం, ప్రాంతీయతల పేరు మీద విడగొట్టి ప్రజలకున్న పౌర ప్రజాస్వామిక హక్కులను అణచివేస్తున్నారు. ఈ అణచివేత కొత్తగా సాధించాల్సిన ప్రజాస్వామిక హక్కుల విషయంలో పక్కకు పెట్టినా, సాధించుకున్న హక్కులకు కూడా రక్షణ లేని స్థితి ఏర్పడుతున్నది. ప్రజాస్వామ్యం స్థానంలో ఫాసిజం అమలవుతున్నది. రాజ్యాంగం ఉండాల్సిన చోట మనువాదం అమలవుతున్నది. 'బుద్ధి జీవులను చెరసాలలకు పరిమితం చేస్తున్నారు' ముద్దాయి హక్కులే కాదు, కనీసం నేరస్తుల హక్కులు కూడా బుద్ధిజీవుల పట్ల అమలుకావడం లేదు. నాడు హైదరాబాదు జైలులో చెరబండరాజును చంపేసినట్లుగా నేడు ముంబై తలోజ జైల్లో విరసం కవి వరవరరావు జీవించే హక్కుకు తీవ్ర ప్రమాదానికి గురిచేస్తున్నారు. ఇప్పటికే రెండు

సార్లు ఆరోగ్యం విషమ పరిస్థితిలో నానావతి హాస్పిటల్ మెట్లు ఎక్కించడానికి కుటుంబ సభ్యులు పడ్డ కష్టం అంతా ఇంతా కాదు. కరోనా సమయంలో హాస్పిటల్‌లో అడ్మిట్ అయినప్పుడు పెట్టిన యూరిన్ కాథటర్‌ను కూడా నిన్న మొన్నటి వరకు అంటే సుమారు 45 రోజులు ఉంచడం ఎంత ప్రమాదమో, కనీస మెడికల్ పరిజ్ఞానం ఉన్నవాళ్లందరికి తెలుస్తున్నది. యూరిన్ కాథటర్ ఉందంటేనే అనారోగ్యంగా ఉన్నాడని హాస్పిటల్‌లో ఉంచాలని అర్థం. వరవరరావు ఆరోగ్యం అంతకంతకూ క్షీణిస్తున్నది. నేర విచారణ పద్ధతి ఇంత కర్కశంగా ఉండకూడదు. ఎంత పెద్ద కేసు అయినా ఆరోపితుల, ముద్దాయిల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొనే విచారణ కొనసాగాలి, కానీ తలోజా జైలు పరిస్థితి కూడా సాయిబాబా అండాసెల్ స్థితిని మరిపిస్తున్నది. సుమారుగా ఆరోపితులు 16 మంది 50, 60 ఏళ్ల నుండి 80 ఏళ్ల వరకు వయసు ఉన్నవారే. ఒకరైతే 84 ఏళ్ల అతను కూడా. వీళ్లంతా ప్రభుత్వం దృష్టిలో ముద్దాయిలు. ప్రజల దృష్టిలో హక్కుల కార్యకర్తలు. హక్కుల కోసం ప్రశ్నించడం, పీడిత ప్రజలకు అండగా నిలబడడం. నేరంగా కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. అందుకే తప్పుడు కుట్ర కేసులకు కేంద్రం నిలయంగా మారింది. ఒక వైపు భీమా కొరేగాం కుట్ర కేసు అంటూనే ప్రధాని మోడి హత్యకు కుట్ర చేసారని మరొక కుట్ర కేసును వీరందరిపై పెట్టారు. కనీసం కుట్ర కేసులకైనా ఒక నిజాయితీ ఉండాలి కదా. 84 ఏళ్ల ఫాదర్ స్టాన్ స్వామి నిత్యం చేతులు వణకడం నియంత్రించు కోలేని ముసలి వ్యక్తిపై తప్పుడు కేసులు బనాయించడం కేంద్రానికే చెల్లింది. ముసలి వాళ్లను ముద్దాయిలుగా మార్చి బెయిల్ రాకుండా రెండేళ్లుగా జైళ్లో నిర్బంధిస్తున్న అమానుష స్థితిలో వారి వారి విశ్రాంత జీవితాన్ని కల్లోలం పరిచినట్లే కదా. ఈ స్థితి వారి వారి కుటుంబాలను అనేక కష్టాలకు, నష్టాలకు గురి చేస్తున్నది.

మోడీ ప్రభుత్వం తనకు తానే ఒక బలమైన రాజ్యంగా ప్రకటించుకుంటున్నది. నిజంగా కూడా బలమైన రాజ్యమే, సందేహం లేదు. అయినా తనకు ఏదో ప్రమాదం ఉన్నట్లుగా ఎందుకు కుట్ర చేస్తున్నదో మనందరికి అనుమానం రావచ్చు. అనుమానం కాదు అది కూడా నిర్బంధంలో ఒక రూపమే. అది ప్రభుత్వ కుట్రే. మౌలిక సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు ప్రధానంగా ఆదివాసీ ఉద్యమాలు బలంగా కొనసాగుతున్నాయి. వాటిని నియంత్రించాలంటే బుద్ధిజీవుల మద్దతు లేకుండా చేయాలనే రాజ్యం తపన. ఒక వైపు ఆదివాసీలపై పూర్తి ఆయుధ సంపత్తితో, కేంద్ర సైనిక బలగాలతో దాడి చేసి మారణహోమం సృష్టిస్తున్నారు. శ్రీలంకలో అధ్యక్షులు రాజపక్సే ఎల్.టి.టి.పై దాడిని కొనసాగిస్తూ, ప్రశ్నించే గొంతులను శ్రీలంకలో లేకుండా చేశాడు. రాజపక్సే అమలు చేసిన విధానాన్నే మోడీ ప్రభుత్వం కొనసాగించడానికి ప్రయత్నిస్తున్నది. ఈ స్థితి ఆదివాసుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నది. ఇలాంటి ప్రభుత్వ విధానాలే ప్రజలను, ప్రజా మేధావులను కలవరానికి గురి చేస్తున్నాయి. ప్రజల్ని ప్రేమించే ఈ 16 మంది ప్రజలకు ఎక్కడో ఒక దగ్గర ప్రజలకు ఓదార్పుగా నిలబడ్డవాళ్లే. కష్టాల్లో ఉన్న ప్రజలకు సానుభూతి ప్రకటించిన వాళ్లే. అడ్వకేట్ సుధా భరద్వాజ్, అడ్వకేట్ సురేంద్ర గడ్లింగ్‌లు ప్రజలకు న్యాయస్థానాల్లో నిబద్ధతతో సాయపడుతున్నవాళ్లే. గౌతమ్ నవ్లాఖా కాశ్మీర్ ప్రజల హక్కుల కోసం నిత్యం పోరాడుతున్నవాడే. ప్రొ. సోమసేన్, ప్రొ. ఆనంద్ తేల్తుంబ్డేలు దళిత ఉద్యమానికి మద్దతుగా నిలబడి, ఖైర్లాంజి లాంటి ఘటనలకు వ్యతిరేకంగా బలంగా తమ గొంతులను విప్పినవారే. అడవిలోని ఖనిజాల కోసం ఆదివాసీల అడవిని విస్తాపనకు గురి చేయడాన్ని ఆదివాసీలతో మమేకమై విస్థాపన్ విరోద్ మంచ్ కార్యకర్త మహేష్ రావత్ ప్రశ్నించడాన్ని ప్రభుత్వం నేరంగా భావిస్తున్నది. ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొ. హానిబాబును ప్రశ్నించడానికి ముంబైకి పిలిచి మళ్లీ కుటుంబాన్ని కలవనీయకుండానే అదుపులోకి తీసుకొని జైలుకు తరలించింది. మహారాష్ట్రలో విద్రోహి పత్రిక ఎడిటర్ సుధీర్ ధావ్లేను దళితులకు, కబీర్ కళామంచ్‌కు బలంగా ఉన్నాడని, దళితులలో పాటల ద్వారా కబీర్ కళామంచ్‌కు చెందిన కళాకారులను సాగర్ గోర్కె, రమేశ్ గైయిచోర్, జ్యోతి జగ్‌తప్‌ల నేరంగా, రాజకీయ ఖైదీలకు బాసటగా నిలబడి, రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలనే నినాదంతో మమేకమైన అడ్వకేట్ అరుణ్‌పెరారె, అడ్వకేట్ వెర్నాన్ గొంజల్వేస్, రోనా విల్సన్‌లను తప్పుగా భావించి ప్రభుత్వం వారిపై నిర్బంధాన్ని కొనసాగిస్తున్నది.

మనుషుల విధ్వంసంలో రాజ్యం పోషిస్తున్న పాత్ర ఎన్‌కౌంటర్లతోనే కాదు, వారిపై ఆధారపడ్డ కుటుంబం కకావికలమవుతున్న స్థితి నుంచి చిన్నాభిన్నమై, చివరికి జీవితమంటేనే అసహ్యించుకొని స్థితికి నెట్టుతున్నాయి. ఏమాత్రం రాజకీయ అలోచన ఉన్న నిర్బంధ పునాది రూపాల్లో ఇదొక సారంగా భావించిన వాళ్లు మాత్రమే నిర్బంధాన్ని నిలువరించడానికి సిద్ధమవుతున్నారు. ఎన్.టి.ఆర్ కాలంలో కొనసాగిన ఆట, మాట, పాట బంద్ స్థితిని మరిపించేల రాజ్య నిర్బంధం పరుచుకొని ఉంది. నేడు పండు ముసలి వాల్లే కాదు, పసి వాళ్లను, ప్రాయంలో ఉన్న వాళ్లను, యువతులను ఎవరిని వదలడం లేదు. మన మౌనం మనల్నే కాదు సమాజాన్నే దహించి వేస్తున్నది. సబ్బండ వర్గాలను బలి పశువులను చేస్తున్నారు. నూతన అర్థిక విధానాలు, సామ్రాజ్యవాద అనుకూల విధానాలు, హిందూ మతోన్మాద ఫాసిస్టు విధానాలను నిలువరించగలిగే పరిస్థితికై నిరీక్షించడం ఒక పద్ధతి ఆ నిరీక్షణ కాలంలోనే బంధీలుగా ఉన్న కుటుంబాల్లో భరోస కల్పించే సామాజిక బాధ్యత కూడా మనందరిది.

న్యాయవ్యవస్థ పనితీరు, యాంకర్ అర్ణబ్ గోస్వామి పట్ల సుప్రీం కోర్టు స్పందన చట్టం తన పరిధి దాటి ప్రవర్తించిందని సుప్రీం కోర్టు న్యాయవాదులు, మాజీ న్యాయమూర్తులు భావిస్తున్నారు. ఈ రీతిలో స్పందించడం మిగతావారి పట్ల లేకపోవడం, రాజ్యాంగ విలువలు కనుమరుగవుతున్న న్యాయవ్యవస్థ విశ్వరూపాన్ని ప్రత్యక్షంగా గమనించగలుగుతున్నాం. ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థలోని జడ్జీలు ప్రెస్ మీట్‌లో బహిరంగంగా తమపై ఆధిపత్యం కొనసాగిస్తున్న వైఖరిపట్ల నిరసన తెలిపినపుడే పారదర్శకత లోపంగా ప్రజలకు అర్థమైంది. ఈ బుద్ధి జీవులపై అక్రమ కేసుల్లో కాని ప్రొ. సాయిబాబాపై వెలువడిన తీర్పులో కాని పారదర్శకత ఉందని మనం అనుకోగలమా? లేక ప్రజల పక్షపాతిగా ఉంటున్నందున కక్షపూరిత చర్యలుగా భావించాలా? కక్షపూరితంగా పాలన ఉంటే అది ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలుగా కొనసాగించే అర్హత ఉందని మనం భావించగలమా? రాజ్యాంగ

సుధీర్ ధావ్లేకు కోపం ఎందుకు రాదు?

భీమా కోరేగాం కేసులో నిందితుడిగా రెండున్నర సంవత్సరాలుగా విచారణ లేకుండా మహారాష్ట్ర జైళ్లలో మగ్గుతున్న సుధీర్ ధావ్లే గురించి **సోషలిస్ట్ పార్టీ (ఇండియా)** *తయారు చేసిన పిటిషన్*

రచయిత, కవి, కళాకారుడు, నిరంతర నిరసనకారుడు, దళిత నాయకుడైన సుధీర్ ధావ్లేను 2018 జూన్ 6న అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఆయనపై ఉపా చట్టం, భారత శిక్షాస్మృతిలోని అనేక అధికరణల కింద అభియోగాలు మోపారు. ఆయన ఇప్పటికీ జైల్లోనే ఉన్నారు.

2011-2014 మధ్యకాలంలో ఆయనపై ఉపా చట్టంలోని ఏ సెక్షన్లకు అనుగుణంగా కేసుపెట్టి జైల్లో నిర్బంధించారో, ఇప్పుడు కూడా అవే సెక్షన్ల కింద ఆయన్ను జైల్లో పెట్టడం విచిత్రం. అప్పట్లో ఆయనపై పెట్టిన అన్ని అభియోగాలను న్యాయస్థానం కొట్టివేసింది. ఆయనపై నిర్బంధాన్ని తొలగిస్తూ, ఆ కేసును పరిశీలించిన న్యాయమూర్తి ఆర్.జి. అస్మార్ 108 పేజీల తీర్పునిచ్చారు.

అందులో ఆయన 'ఒక సంస్థలో సభ్యుడు' అనే కాలం చెల్లిన అభియోగాన్ని మోపినందుకేకాక, ఆమోదించదగిన ఎలాంటి సాక్ష్యాన్ని ప్రవేశపెట్టలేకపోయిన కారణంగా కూడా, పోలీసులపైనా, ప్రాసిక్యూషన్ అధికారులపైనా విరుచుకు పడ్డారు. ఆ తీర్పులో ఆయన ఇలా పేర్కొన్నారు

'కోర్టువద్ద ఉన్న రికార్డుని బట్టి ముద్దాయి ఎలాంటి టెర్రరిస్టు క్యాంపును నిర్వహించాడనడానికి గానీ, టెర్రరిస్టు చర్యలలో పాల్గొనడానికి ఏ వ్యక్తినైనా రిక్రూట్ చేసుకున్నాడనడానికి గానీ కనీసం ఒక్క సాక్ష్యమూ లేదు.'

మూడు సంవత్సరాల జైలు జీవితం గడిపాక ఆ విధంగా సుధీర్ విడుదలయ్యాడు. కాని, హాస్యాస్పదంగా ఉన్న ఈ పౌరహక్కుల ఉల్లంఘన కేసును ప్రోత్సహించిన, సహకరించిన- 'కేవలం ఆదేశాలను పాటిస్తున్నామని చెప్పుకొంటున్న' పోలీసులు గానీ, అధికార యంత్రాంగం గానీ, వారితో కుమ్మక్కైన రాజకీయ నాయకులు గానీ- సుధీర్, ఆయన కుటుంబం పోగొట్టుకున్న ఆ మూడు సంవత్సరాల కాలానికి ఎలాంటి పెనాల్టీ చెల్లించలేదు.

ధావ్లేను విడుదల చేస్తూ 2014లో ఈ తీర్పు ఇచ్చిన న్యాయమూర్తి అంతకు కొద్ది నెలల క్రితం, అప్పటికి రెండు సంవత్సరాలుగా నిర్బంధంలో ఉన్న మరొక ముగ్గురు సాంస్కృతిక కార్యకర్తలకు సంబంధించిన కేసులో తీర్పునిస్తూ ఇంతే తీవ్రంగా స్పందించారు. ఆయన ఇలా అన్నారు :

'ఈ కార్యకర్తల కార్యకలాపాలు వాళ్లు నేరం చేసారని భావించడానికి అనుకూలంగా ఉన్నాయని ప్రభుత్వం అనుకోవడం ఆశ్చర్యంగా ఉంది. అవినీతి, సాంఘిక అసమానత, పేద ప్రజలపై దోపిడి వంటి అంశాల గురించి మాట్లాడడం, ఇంతకంటే మెరుగైన సమాజం వునికిలోకి రావాలని కోరుకోవడం మనదేశంలో నిషేధించబడ్డవి కావు. అనేక మంది జాతీయ, ప్రసిద్ధ నాయకులు ఇవే భావాలను వ్యక్తీకరించారు. ఈ భావాలను వ్యక్తీకరించినందుకుగాను, ఒక వ్యక్తిని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అని ముద్ర వేయడానికి వీలు లేదు.

వ్యక్తులు ఏదైనా హింసాత్మక చర్యలకు పాల్పడినప్పుడు గానీ, ఒక నిర్దిష్టమైన హింసాత్మక లేక చట్ట వ్యతిరేక చర్యకు పాల్పడమని ఎవరినైనా రెచ్చగొట్టినప్పుడు గానీ మాత్రమే నేరం చేసినట్లవుతుందని చట్టం చెబుతోంది. అంతేకాక నేర శిక్షా స్మృతిలోని సెక్షన్ 95 ప్రకారం గానీ లేక ఇంకే చట్టం ప్రకారంగా గానీ నిర్దిష్టంగా నిషేధించబడని సాహిత్యాన్ని కలిగి ఉండడం ఎలాంటి నేరమూ కాదు. అలాంటి సాహిత్యాన్ని కలిగి ఉన్నంత మాత్రాన ఆ వ్యక్తి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)లో క్రియాశీలక సభ్యుడని భావించడానికి వీలులేదు. వివిధ ముద్దాయిల వద్ద దొరికాయని చెప్పబడుతున్న పుస్తకాలలో చాలా పుస్తకాలు మార్కెట్లో లభ్యమవుతున్నవే. దీన్ని ప్రభుత్వం కూడా నిరాకరించలేదు.'

ఒక ట్వీట్ ద్వారా వ్యక్తం చేసిన అభిప్రాయం ఎవరినో

ఉల్లంఘనలతో ఉన్న పాలకులు నేరస్తులవుతారా? పాలకులవుతారా? ప్రజల అశాంతిని, అసంతృప్తులను నియంత్రించగలమని ప్రభుత్వాలు భావిస్తాయి. అందులో భాగంగానే ఇప్పటికే భారతదేశంలో జైళ్లు ఉండాల్సిన స్థాయిని దాటి రెట్టింపుగా నింపబడుతున్నాయి. అదీగాక అమాయకులు, ఆదివాసీలు, బూటకపు ఎన్‌కౌంటర్లలో తనువు చాలిస్తునే ఉన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను తెలుసుకొమ్మని, మేధావుల మధ్యవర్తిత్వంతో చర్చలు జరపండి అని 2004లో సీనియర్ ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్. శంకరన్ కొనసాగించిన చర్చలను తిరిగి కొనసాగించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు జీవించే హక్కుకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాల పైనే ఉన్నది. ప్రభుత్వంపై విశ్వాసం, భరోసాలే ప్రజాస్వామ్య పరిపాలనలో ప్రధాన భూమిక నిర్వర్తిస్తాయి. వరవరరావు, స్టాన్ స్వామిలతో పాటు 16 మంది ఆరోపితులకు బెయిల్ మంజూరు చేయించి, కేసు విచారణ చేపట్టండి. జాతీయ విచారణ సంస్థ పేరుతో విచారణలు, కేసులు వారి వారి స్థాయిని దిగజార్చే విధంగా కూడా ఉంటున్నాయి. అంతేకాక క్రూర నిర్బంధ చట్టమైన ఉపా చట్టాన్ని సైనైడ్‌గా మార్చి ప్రజా సంఘాల నాయకుల్ని భయపెడుతున్నాయి. ప్రభుత్వాలకు ఎవరి పేరునైనా ఉపా కేసు నమోదు చేయడం, ఎన్.ఐ.ఎతో విచారించడం అప్రజాస్వామికంగా, అప్రతిహతంగా కొనసాగుతున్నది.

(రచయిత ప్రధాన కార్యదర్శి, పౌర హక్కుల సంఘం తెలంగాణ) వీ

గాయపరిచిందన్న ఊహతోనే కోర్టు ధిక్కారపు నేరాన్ని ఆపాదిస్తున్న ఇలాంటి సమయంలో, వ్యక్తి స్వేచ్ఛలను హరించివేస్తూ రాజ్యం అత్యుత్సాహాన్ని చూపుతున్న స్థితి ఆందోళనకరంగా ఉంది. సాహిత్యాన్ని కలిగి ఉన్నారని, ఒక రాడికల్ సంస్థలోగానీ, నిషిద్ధ సంస్థలోగానీ సభ్యుడనిగానీ, ఆలోచనల్లో నేరం చేసాడని గానీ ఎవరిపైనా అభియోగాలు మోపరాదని, న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులు ఇంతకు ముందే స్పష్టం చేశాయి. అయినా ప్రభుత్వం కావాలనే గతంలో కోర్టులిచ్చిన తీర్పులపట్ల అగౌరవంగా ప్రవర్తిస్తోంది. న్యాయస్థానాలు తమకేవీ పట్టనట్టు మరోవైపుకు చూస్తున్నాయి.'

2011లో డా. బినాయక్‌సేన్ బెయిల్‌కు సంబంధించిన ఇలాంటి కేసులోనే సుప్రీం కోర్టు న్యాయమూర్తి, ప్రభుత్వ న్యాయవాదులు ఉపయోగించిన తర్కాన్ని తిరగతిప్పి ఇలా ప్రశ్నించారు. 'గాంధీ ఆత్మకథను కలిగివున్నంత మాత్రాన ఒక వ్యక్తిని గాంధేయవాది అని అనవచ్చునా?'

సుధీర్ ప్రమాదకరమైన ఆలంకారిక భాషను బహిరంగంగా వాడాడన్న ఆరోపణతో ఆయన్ను జైల్లో పెట్టారు. 'ఆధునిక కాలపు పీష్వా పాలనకు స్వస్తి చెప్పండి' అని పిలుపు నిచ్చినట్లు ఆయనపై ఆరోపించారు. 2014లో ఆయన తరపున వాదించిన సురేంద్ర గడ్లింగ్‌ను కూడా ప్రస్తుతం అదే ఆరోపణ మీద అరెస్టు చేశారు.

పోలీసులు తమ అసమర్థత కారణంగా గానీ, అంతకంటే ప్రధానంగా దుర్బిద్ధితో గానీ ప్రభుత్వం పట్ల నిరసనను వ్యక్తం చేయడానికి ప్రభుత్వాన్ని విమర్శించడానికి, హింసకు దారితీసేలా కావాలని రెచ్చగొట్టడానికి మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకోవడంలో మరోసారి విఫలమయ్యారు. వినికిడి మీద, శాస్త్రీయతలేని కంప్యూటర్ సాక్ష్యాల మీద ఆధారపడి నమోదు చేసిన ఈ కేసుల్లో అతనికీ ఇతరులకూ బెయిల్ ఇవ్వడానికి న్యాయస్థానాలు పదేపదే తిరస్కరిస్తున్నాయి.

సుధీర్‌ను అరెస్టు చేసిన తరవాత ఈ కేసును ఎన్.ఐ.ఏ.కు అప్ప చెప్పారు. అటూ ఇటూ తిప్పి ఇప్పటికి రెండేళ్లు గడిపారు. విచారణ కాలమే శిక్ష అనే పద్ధతికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు అర్థం అవుతుంది. ఈ మధ్య కాలంలో చాలామంది సుధీర్ విడుదలను డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం పట్ల ఆయనకున్న ఊగిసలాటలేని నిబద్ధత గురించి రాశారు. ఆయన నిబద్ధత గురించి ఆయనే చెప్పిన మూడు నిమిషాల వీడియో రికార్డు వినడం అవసరం.

దళితుల పోరాటాలపట్ల సుధీర్ నిబద్ధత మూడు దశాబ్దాల క్రితం నాటిది. ఖైర్లాంజీ నరమేధానికంటే ముందు నుండే ప్రారంభమైన ఆయన నిబద్ధత ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నది. అప్పటి నుండీ రాజ్యపు డేగకన్ను ఆయన్ను నిత్యం గమనిస్తూనే ఉన్నది. కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడడం ఆయనకు అలవాటు.

2016లో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన నిర్దిష్టంగా ఇలా అన్నారు–

'నిశ్చయంగా ప్రభుత్వానికి ప్రజానుకూల స్వభావం లేదు. విద్యార్థిగా, తరవాత సాహిత్యకారుడిగా, ఒక రాజకీయ కార్యకర్తగా మనందరి మనస్సుల్లోనూ ఒకే ఒక లక్ష్యం ఉన్నది. అది ప్రజా పోరాటాలను నిర్మాణం చేయడం, వాళ్ల పోరాటాల్లో పాల్గొనడం, ఒక నిజమైన ప్రజాస్వామిక సమాజాన్ని సృష్టించడం. ఇలాంటి ఆకాంక్షలే నాలాంటి లక్షలాది మందిని ప్రజాస్వామిక పోరాటాల గోదాలోకి నడిపించాయి. మీరు కావాలనుకుంటే దీన్ని యుద్ధంగా పిలవవచ్చు. ఈ దేశపు సైన్యం, పోలీసులు తమ ప్రజలకు వ్యతిరేకంగా ఆయుధాలు ప్రయోగించారు. తప్పనిసరైన పరిస్థితుల్లో ప్రజలు దాన్ని ప్రతిఘటించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది నేటి వాస్తవం. దీన్ని మీరు ఏ పేరుతోనైనా పిలవండి, కాని ఇది మాత్రం యుద్ధం.'

గత రెండేళ్ల తన రెండో జైలు జీవితం గురించి ప్రస్తావించినప్పుడు ధావ్లే నిర్వికారంగా ఉన్నారు. ఆయన మీద తప్పుడు అభియోగాలు మోపి జైల్లో పెట్టిన కారణంగా పోగొట్టుకున్న సమయం గురించిన ప్రశ్న అడిగితే 2014లో ఆయన ఇలా అన్నారు.

'నా జీవితంలో నాలుగు సంవత్సరాలు పోగొట్టుకున్నానని నేననుకోవడం లేదు. మనందరి హక్కుల కోసం పోరాడి జైళ్లకు వెళ్లిన ఈ లక్షలాది మంది ప్రజల బాధల నుండి నా బాధ విడదీయదగింది కాదు. కల్పిత ఆరోపణల మీద వేటాడబడి జైళ్లకు పంపబడ్డ లక్షలాది మందిలో నేనుకూడా ఒక భాగం. ఇలా చూస్తే దాని గురించి నేను ప్రత్యేకంగా ప్రస్తావించాల్సింది ఏమీ లేదు.'

ఒక సుదూర ప్రాంతంలోని జైలులో నిర్బంధంలో ఉన్న ఒక దళిత నాయకుడి పరిస్థితి గురించి ఎవరైనా ఎందుకు పట్టించుకోవాలి? హెబియస్ కార్పస్, బెయిల్ నిరాకరణ, సంవత్సరాల తరబడిన నిర్బంధంలో ఉంచడం వంటి తీవ్రమైన స్వేచ్ఛా ఆటంకాలు వ్యక్తుల పైన తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తాయి. అలాంటి స్థితి ఎప్పుడో ఒకప్పుడు మిమ్మల్ని లేదా మీకు తెలిసిన వాళ్లను గాయపరిచే అవకాశం ఉంది. సమాజంలో స్థిరపడ్డ మత నైతిక విలువలకి, ప్రస్తుత పాలకుల విధానాలకు, మెజారిటీ భావజాలానికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని బహిరంగంగా కూడగట్టడానికి ప్రయత్నించాలనే ఆలోచన మీకు ఎన్నటికీ ఊహలోకి కూడా రానప్పుడే మీరు ఈ దృష్టి కోణంతో విభేదించడానికి అవకాశం ఉంది.

అయితే అలా చేయాలంటే ముందుగా మనందరికి అవసరమైన ప్రజాస్వామిక వాతావరణం ఉండాలి. సుధీర్ చేస్తున్నది అదే. అతడు తన ప్రజల తరపున మాట్లాడుతున్నాడు. దానితో మనకు అంగీకారం ఉన్నా లేకపోయినా తన అభిప్రాయాలు వ్యక్తం చేసే హక్కు తనకున్నది. ఆ అభిప్రాయాలు తక్షణం హింసాత్మక చర్యలను సృష్టించడానికి కారణం కానంతవరకు ఆ హక్కు ఉంటుంది.

మన ప్రభుత్వంలోని కార్యనిర్వాహక శాఖ వాస్తవంగా కోర్టు ధిక్కారానికి పాల్పడిందని స్పష్టమవుతోంది. అలా కాని పక్షంలో వాళ్లు లోగడ న్యాయ స్థానాలిచ్చిన తీర్పులను పట్టించుకొని ఉండేవారు. ప్రజల డబ్బును దుర్వినియోగం చేస్తూ తప్పుడు ఉపా కేసులు పెట్టడం కొనసాగించి ఉండేవారు కాదు. మన ప్రజాస్వామ్యంలోని ఒక శాఖ 'నిరోధ సమతౌల్య' సూత్రాన్ని నిర్వీర్యం చేసింది. రాజ్య నిర్బంధం కారణంగానూ కార్పొరేట్ల నియంత్రణ కారణంగానూ మీడియా రాజీపడ్డది. బావిలో కప్పల్లారా మీ కింద నీళ్లు మరుగుతున్నాయి.

సుధీర్ విడుదలై మన స్వేచ్ఛకోసం పోరాటాన్ని కొనసాగించడానికి వీలుగా ఈ పిటిషన్‌పై సంతకం చేయండి.

(అనువాదం సిఎస్ఆర్ ప్రసాద్) వీ

దేశ భక్తికి యోగ్యతా పత్రాలు

***సంఘ్ పరివార్ పాలక వర్గాలు ప్రచారంలోకి తెచ్చిన దేశభక్తి భావన నేపథ్యంలో మొత్తంగా దేశభక్తి భావనను ఎలా పరిశీలించాలో విశ్లేషిస్తున్నారు* కె. మురళి (అజిత్)**

వందేమాతర గీతాన్ని పాడటమే దేశభక్తికి గీటురాయి అని కొన్ని ఏళ్లుగా విపరీతమైన ప్రచారం జరుగుతోంది. దీనికి అభ్యంతరం చెప్పినవాళ్ళందరినీ దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారు. ఆర్ఎస్ఎస్, ఇతర హిందూవాద సంస్థలు ఈ విషయంలో చాలా క్రియాశీలకంగా ఉన్నాయి. అయితే ఇందులో ఆ సంస్థలు మాత్రమే లేవు.

'వందేమాతర' గేయ రచయిత నవలాకారుడైన బంకించంద్ర ఛటర్జీ. 19 శతాబ్దపు చివరి రోజులలో వచ్చిన అతని నవల 'ఆనందమఠ్' లో "సనాతన" గెరిల్లాలు గానం చేసే సామూహిక గీతం అది. ఈరోజు జాతీయ గేయంగా ఉన్న 'వందేమాతరం' నవలలో ఉన్న మొత్తం గేయంలోని మొదటి చరణం మాత్రమే. హైందవేతరులు దూరం కాకుండా ఉండటం కోసం రవీంద్రనాథ్ ఠాగూర్ సలహామేరకు సుభాష్ చంద్ర బోస్ దానిని మొదటి చరణానికి కుదించాడు. జాతీయ గీతంగా అందరి ఆమోదం పొందే ఉద్దేశ్యంతో ఈ రకంగా దీన్ని 'శుద్ధి' చేసారు.

బ్రిటిష్ రాజ్‌కు వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టి పోరాడుతున్న మిలిటెంట్ జాతీయవాదులకు అప్పటికే అది అభిమాన గీతం. 1905లో బెంగాల్ ప్రావిన్స్ విభజనకు వ్యతిరేకంగా జరిగిన ప్రతిఘటనోద్యమ సందర్భంగా ఆ గీతానికి చాలా ప్రాచుర్యం, ప్రజాదరణ లభించాయి. అయినా ఆ గీతంలో హిందూ ప్రతీకాత్మకత, సందేశం చాలా బహిరంగంగా ఉన్నందువల్ల దాని ప్రాచుర్యానికి కొన్ని పరిమితులు ఉండినాయి. అందుకే ఠాగూర్ దానికి సవరణలు సూచించాడు. గేయంలోని మొదటి చరణంలో దేశాన్ని మాతృమూర్తిగా చిత్రీకరించి ఆమె ఎంత సుసంపన్నమైనదో వర్ణన ఉంది. కాబట్టి ఈ మొదటి చరణం అన్ని మతాల వారికీ సర్వ సమ్మతమౌతుందని ఠాగూర్ అనుకొని ఉంటాడు. కానీ అది అంత సరళమైన విషయం కాదు.

ఆనంద మఠ్ నవల 18 వ శతాబ్దంలో జరిగిన సన్యాసి తిరుగుబాటు మీద స్థూలంగా ఆధారపడి చేసిన రచన. ప్లాసీ యుద్ధంలో సిరాజ్ ఉద్దౌలాకు ద్రోహం చేసిన సైన్యాధికారి మీర్ జాఫర్ కు ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారం కట్టబెట్టింది. అయితే కంపెనీయే పరోక్ష పాలన కొనసాగించేది. కరువుకాటక పరిస్థితులున్నా సరే నిర్దాక్షిణ్యంగా పన్నులు వసూలు చేసేది. అటువంటి పరిస్థితులలో సన్యాసి తిరుగుబాటు జరిగింది. అది ప్రధానంగా బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగింది. నవలలో బంకించంద్ర ఈ తిరుగుబాటును మొత్తంగా ముస్లింలపై మతవిద్వేషపూరిత దాడిగా చిత్రీకరించాడు. బంకించంద్ర కొన్నింటిని చాలా వివరంగా వర్ణించాడు:

"సోదరులారా! మీరు విష్ణువును పూజిస్తారా?" అని (సన్యాసులు పంపించిన వేగులు) అడిగారు. అట్లా అడిగి ఇరవై-ఇరవై ఐదు మందితో మూకలను జమ చేసి ముసల్మానులున్న గ్రామాలపై పడి వారి ఇళ్లను తగలబెట్టేవారు. ముసల్మానులు తమ ప్రాణ రక్షణలో ఉంటే సనాతనులు వారికున్నదంతా దోచి కొత్తగా విష్ణు భక్తులైనవారికి పంచిపెట్టేవారు.

ముస్లిం పాలకుడిని విజయవంతంగా పదవీచ్యుతుడిని చేసిన తరువాతి దృశ్యాన్ని వర్ణించిన తీరు చదివితే రక్తం గడ్డ కడుతుంది.

ముసల్మానులు ఎక్కడ కనిపిస్తే అక్కడ వారిని గ్రామస్తులు వెంట తరిమారు. కొందరు జమకూడి ముస్లింల ఇళ్లకు పోయి వాటిని తగులబెట్టి ఉన్నదంతా దోచుకున్నారు. ఎందరో ముస్లింలను చంపివేశారు. కొందరు ముస్లింలు తమ గడ్డాలను తొలగించుకొని గంగా నది మట్టిని ఒళ్ళంతా రాసుకొని హరి నామ జపం చేశారు. ఎవరైనా అడిగితే తాము హిందువులమని చెప్పుకున్నారు.

ఆనందమఠ్ లో బంకించంద్ర తన ఊహా చిత్రంలోని మాతృభూమిని ఆవిష్కరించాడు. అది ముస్లిం రహిత హిందూ రాష్ట్రం. అందులో సనాతన ధర్మ పునఃప్రతిష్టాపన జరుగుతుంది. బంకించంద్ర సనాతన ధర్మం (బ్రాహ్మణులు తమ మతానికి ఇచ్చిన పేరు అది) వైష్ణవ ముసుగులోని దూకుడు తరహా బ్రాహ్మణవాదానికి ఒక నమూనా. తన తరహా వైష్ణవానికీ, తన చుట్టూ అప్పటికే ప్రాచుర్యంలో ఉన్న తరహా వైష్ణవానికీ మధ్య ఉన్న తేడాను రచయిత తన ముఖ్య పాత్ర ద్వారా "అది చైతన్యదేవుని వైష్ణవం" అని చెప్పిస్తాడు. "ఈ వైష్ణవం నాస్తిక బౌద్ధ మతం నుండి పుట్టింది. అహింస దాని చిహ్నం. నిజమైన వైష్ణవ లక్షణం దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ. ఎందుకంటే విష్ణువు లోక రక్షకుడు".

నిజమైన దేశభక్తులెవ్వరైనా సరే సనాతనుల గీతాన్ని తిరస్కరించడానికి పై కారణం చాలు. ఆ గీతానికి ప్రేరణ జాతీయ ప్రయోజనాలు కావు. అది విద్వేషపూరితమైన బ్రాహ్మణవాద దృష్టితో ప్రేరణ పొందింది. దాన్ని జాతీయ గేయం అనడమంటే ప్రజలను అపహాస్యం చేయడమే. అంతే కాదు. బంకించంద్ర ముందుకు తీసుకొచ్చిన "జాతీయవాదపు" స్వభావమేమిటి? నవల చివరలో నవల కథానాయకునికీ, అతని గురువుకీ మధ్య ఒక సంభాషణ ఉంటుంది. ముస్లిం రాజుపై గెలుపు తరువాత సనాతన రాజ్యాన్ని స్థాపించడానికై ఆంగ్లేయులను కూడా పారదోలదామని నాయకుడు అన్నప్పుడు ఆయన గురువు ఈ కింది వివరణతో వ్యతిరేకిస్తాడు.

> "ఆంగ్లేయులు ఈ నేలను పాలించకపోతే సనాతన ధర్మం పునరుద్ధరణ పొందే అవకాశం లేదు... నిజమైన హిందూ మతం జ్ఞానం మీద ఆధారపడినది, కార్యాచరణ మీద కాదు. ఆ జ్ఞానం రెండు రకాలు - లౌకికమైనది లేదా బాహ్యామైనది; ఆధ్యాత్మికమైనది లేదా అంతర్గతమైనది. అంతర్గతమైన ఆధ్యాత్మిక జ్ఞానం నిజమైన

మతంలోని ముఖ్యమైన భాగం. కానీ బాహ్య ప్రపంచానికి సంబంధించిన లౌకిక జ్ఞానాన్ని పొందితే తప్ప అంతర్గత ప్రపంచానికి సంబంధించిన జ్ఞానం పెరగజాలదు. సనాతన ధర్మాన్ని పునరుద్ధరించాలంటే మొదట భౌతిక ప్రపంచానికి సంబంధించిన జ్ఞానాన్ని ఉపదేశించాలి. ప్రస్తుతం మన దేశంలో భౌతిక జ్ఞానం పెద్దగాలేదు. దానిని బోధించగలవారు ఎవ్వరూ లేరు. ప్రజలందరికీ విద్యనందించే సామర్థ్యం మనకు లేదు. కాబట్టి అందుకు అవసరమైన జ్ఞానాన్ని మనం విదేశాల నుండి తెచ్చి పరిచయం చేయాలి. భౌతికప్రపంచానికి సంబంధించిన జ్ఞానంలో ఆంగ్లేయులు నిష్ణాతులు.... బోధించడంలో కూడా వారు నిపుణులు. కాబట్టి ఆంగ్లేయులను మనం మన పాలకులుగా చేద్దాం. ఆంగ్ల విద్య ద్వారా భౌతిక ప్రపంచ జ్ఞానాన్ని సంపాదించిన మన ప్రజలలో అంతర్గత జ్ఞానాన్ని అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించవచ్చు. అప్పుడు నిజమైన సనాతన ధర్మాన్ని బోధించడానికి ఎటువంటి ఆటంకమూ ఉండదు. అట్టి పరిస్థితుల్లో నిజమైన ధర్మం స్వతస్సిద్ధంగా పెరుగుతుంది. అలా జరగనంత కాలం, హిందువులు తెలివిమంతులూ, శక్తిమంతులూ కానంత కాలం ఆంగ్లేయుల పాలన కొనసాగుతుంది. ఆంగ్లేయుల అదుపులో పాలితులు సంతోషంగా ఉంటారు. ఎటువంటి ఆటంకం లేకుండా తమ ధార్మిక జీవితాన్ని కొనసాగించగలుగుతారు. కావున ఓ వివేకశీలుడా! ఆంగ్లేయులతో పోరాడకుండా నన్ను అనుసరించు."

అతడింకా ఇలా కొనసాగించాడు:

"ఆంగ్లేయులు ప్రస్తుతం వర్తకులుగా ఉన్నారు. వారు డబ్బు సంపాదించడంలో నిమగ్నమై ఉన్నారు. పరిపాలనా బాధ్యతలు తీసుకోవడానికి వారు సిద్ధంగా లేరు. ఈ సనాతనుల తిరుగుబాటు ఒత్తిడి వలన వారు ఈ దేశపు పాలనా బాధ్యతలను కూడా చేపట్టవలసి వస్తుంది. ఆంగ్లేయులను గద్దె మీద కూర్చోపెట్టడానికే ఈ సనాతనుల తిరుగుబాటు వచ్చింది."

ఈ విధంగా "నాగరికతను వ్యాపింపజేసే కర్తవ్యాన్ని" గురించి బ్రిటిష్ వలసవాదం చెప్పే విషయాన్నే బంకించంద్ర చాలా విశ్వాసంతో పునరుద్ఘాటించాడు. సనాతనమైన ప్రాచ్యవాద దేశంలో లోతైన ఆధ్యాత్మికత ఉందని చెప్పినప్పటికీ ఆధునికత విషయంలో చాలా వెనుకబడి ఉందని ఆయన అన్నాడు. ప్రగతి సాధించాలంటే పాశ్చాత్య దేశం చూపించే మార్గంలో నడవాలి. ఇటువంటి ప్రాచ్య సిద్ధాంతంతో మొదలై బ్రాహ్మణవాదం వలసవాదపు తోక పట్టుకుని అపరిమితమైన అధికారాన్ని తిరిగి పొందాలని చూసింది. ఛాందస బ్రాహ్మణవాదం ఇక ఇప్పుడు వలస యాజమాని పొగడ్తలలో మునిగిపోయింది. ప్రాచ్యదేశాలకు ప్రాపంచిక జ్ఞానం చాలా తక్కువగా ఉందని పాశ్చాత్య దేశాలకు ఉన్న చిన్న చూపును కొత్తగా సంతరించుకున్న ఈ దళారీ దృష్టికోణం ప్రశ్నించకుండా స్వీకరించింది. వలసవాదులేమో దీనిని కావాలని ప్రచారం చేసేవారు. వలస ప్రజల మనసులలో వలసవాదపు గొప్పతనాన్ని నింపడానికి ఇది ఒక ముఖ్యమైన ఎత్తుగడ. బ్రాహ్మణ పునరుద్ధరణవాదులు కూడా ఈ వాదనను ఉద్దేశపూర్వకంగానే చేసారు. కానీ వీరు మాత్రం తమ బానిస ప్రవృత్తి నుండి ఆ పని చేసారు.

అప్పటిదాకా భారత ఉపఖండం లౌకిక జ్ఞానంలో సాధించిన గణనీయమైన విజయాలనన్నింటినీ కూడా బంకించంద్ర కథనం నిరాకరించింది. ఈ నవల వచ్చిన నాటి కంటే ఒకటి రెండు శతాబ్దాల కిందటి వరకు కూడా ఇక్కడ ఉన్న నైపుణ్యాలూ, హస్త కళలూ, వివిధ రకాల ఉత్పత్తులూ, వాటి నాణ్యతా పాశ్చాత్య దేశాలలో కంటే ఎంతో ఉన్నతంగా ఉండేవి. బంకించంద్ర తరానికి ఈ విషయం తప్పక తెలిసే ఉంటుంది. ఉపఖండంలో ఉన్న సమృద్ధికరమైన "బాహ్య జ్ఞానాన్ని" వదిలి పెట్టినా ఆధ్యాత్మికత విషయంలో కూడా అతనికి వలసవాది ఒక మధ్యవర్తిగా అవసరమయ్యాడు. సనాతన ధర్మం బలోపేతం కావడం, దాని పునఃస్థాపన వలస పాలన ద్వారానే సాధ్యమనే దాకా అతను వెళ్ళాడు. ముస్లింలను నిర్మూలించడానికీ లేదా అణచివేయడానికీ, హిందువులలో క్రమశిక్షణ అలవరచడానికీ, సనాతన ధర్మం విలసిల్లడానికి అవసరమైన "బాహ్య" జ్ఞానాన్ని అందించడానికీ వలసపాలన అవసరమని వాదించాడు.

బంకించంద్ర వలసవాద పాలనా యంత్రాంగంలో ముఖ్యమైన హోదాలలో పని చేశాడు. కానీ అతడు వ్యక్తీకరించిన అభిప్రాయాలు అతని వంటి స్థానాలలో ఉన్న వ్యక్తులకే పరిమితం కాలేదు. కొత్తగా ఉదయించిన దళారీ మేధావులలో అతను ఒకడు మాత్రమే. అట్లాంటి వారందరూ సవర్ణ కులాలలోని ఉన్నతస్థాయిలకు చెందినవారు. వారందరూ ఆంగ్లేయుల పాలన ఒక అవసరమనీ, ఇంకా చెప్పాలంటే ఒక వరమనీ భావించారు. వాస్తవానికి, భారత "పునరుజ్జీవనమని" పిలిచేదానికి ఆద్యులని పేరు పడిన రాజా రామ్ మోహన్ రాయ్, అతని సమకాలికులైన ఇతరులందరూ ఇదే అభిప్రాయాలతో ఉండేవారు. అయితే, వీటిలో కొన్ని కొన్ని తేడాలు ఉండేవి. కొందరి దృష్టిలో బ్రాహ్మణవాదం బలోపేతం కావడానికి కూడా ఆంగ్ల పాలన అవసరం. మరి కొందరి దృష్టిలో మాత్రం, బ్రాహ్మణవాదపు ఆధ్యాత్మిక ఆధిక్యత ఎటువంటి దెబ్బ తినకుండా ఉంది. దీని నుండి పాశ్చాత్య దేశాలు నేర్చుకోవలసినది ఎంతో ఉంది. విజ్ఞాన శాస్త్రంలో మాత్రం ప్రాచ్య దేశాలకు పాఠాలు అవసరం.

ఏళ్లు గడిచేకొద్దీ ఇందులో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. బ్రిటిష్ పాలన "గుణగణాలనూ", దాని వల్ల కలిగే "లాభాలనూ" పొగడటం కొనసాగింది. అయితే అధికారం నుండి తమను దూరం ఉంచడం పట్ల నిరసన మాత్రం పెరగసాగింది. అది త్వరలోనే "స్వరాజ్యం" అనే డిమాండ్ రూపం సంతరించుకున్నది. స్వరాజ్యమంటే స్వాతంత్ర్యం కాదు. బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగంగా ఉంటూనే స్వయం ప్రతిపత్తి కలిగి ఉండటం. బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలో విభిన్న ఉన్నత తరగతి ధోరణులకు ఇది ఒక వేదికగా పనిచేసింది. "అతివాదులు"గా పేరుపడిన వారు కూడా ఈ చట్రం పరిధిలోనే ఉండిపోయారు. ఉదాహరణకు బాల గంగాధర్ తిలక్ న్యాయస్థానంలో "స్వరాజ్యం నా జన్మహక్కు" అనే చాలా ప్రసిద్ధికెక్కిన ప్రకటన చేసినప్పుడు కూడా అతని ఉద్దేశంలో ఉన్నది బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగానే స్వపరిపాలన లేదా స్వయం ప్రతిపత్తి అని. స్వాతంత్ర్యం గురించిన ఆలోచనే లేదు. తిలక్ సన్నిహిత సహచరుడైన లాలా లజపతి రాయ్ రాసిన "భారతదేశ రాజకీయ భవిష్యత్తు" పుస్తకంలో స్వపరిపాలనను అడగటం కోసం మోర్లే, మాంటేగ్–చెమ్స్‌ఫోర్డ్ ల నివేదికలపై ఆధార పడినాడు. వాస్తవానికి స్వరాజ్యం అంటే నిజమైన అర్థం స్వాతంత్ర్యం అనే. ఉదాహరణకు మొఘలుల పాలనను కూలదోసి శివాజీ ఏర్పరచిన మరాఠా సామ్రాజ్యాన్ని "స్వరాజ్యం" అనే వాళ్ళు. కానీ దళారీ మేధావులు, రాజకీయవేత్తలు

"స్వరాజ్యా"నికి ఉన్న నిజమైన అర్థాన్ని తుంగలో తొక్కేసారు. కాలం గడిచే కొద్దీ బ్రిటిష్ సామ్రాజ్యంలోనే "స్వపరిపాలన" అని దీని అర్థాన్ని మార్చేసారు.

"అతివాద శిబిరా"నికి చెందిన వాడైనప్పటికీ తిలక్ చట్టబద్ధ స్రవంతికి పరిమితమైనవాడే. మరి సాయుధ కార్యకలాపాలను చేపట్టిన వారి మాటేమిటి? తన విప్లవ కార్యకలాపాల వల్ల అండమాన్ సెల్యులార్ జైలులో నిర్బంధంలో ఉన్న వినాయక దామోదర్ సావర్కర్ విషయమే చూద్దాం. మొదటి ప్రపంచ యుద్ధం మొదలవ్వడంతో 1914 లో అతను గవర్నర్ జనరల్ కు ఒక విజ్ఞాపనా పత్రం పంపించాడు. బ్రిటిష్ వాళ్ళు ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని సానుకూలంగా మలుచుకోవడానికి అన్నట్టుగా అది ధ్వనిస్తుంది.

> "హిందూస్తాన్ ను ఒక స్వతంత్ర దేశంగా చేయడం మా లక్ష్యం. ఆ లక్ష్యం ఇప్పటికీ అట్లాగే ఉంది. అయితే, ఈ లక్ష్య సాధనకు హింసాయుత సాయుధ ప్రతిఘటనా మార్గమే ఏకైక మార్గమని మేమేం ప్రతిన పూనలేదు. అంతే కాదు, మరేదైనా పరిష్కారానికి అవకాశం ఉండి ఉంటే మేము సాయుధ ప్రతిఘటనకు పూనుకునేవాళ్ళమే కాదు... విభిన్న జాతులనూ, నర వర్గాలనూ ఒకే పాలన కింద కలిపి ఉంచిన సామ్రాజ్యం ఆ లక్ష్యాన్ని (మానవ జాతి ఐక్యతను సాధించే లక్ష్యాన్ని) చేరుకోవడానికి ఎంతో ఉపయుక్తమైనది. బ్రిటిష్ సామ్రాజ్యపు ఛత్రఛాయల కింద విభిన్న జాతుల ప్రయోజనాలు నెరవేరే విధంగా స్వేచ్ఛను పొందగలిగితే అటువంటి సామ్రాజ్యాన్ని వ్యతిరేకించాలనే కోరిక మాకేమీ లేదు... బ్రిటిష్ సామ్రాజ్యం అనే దానిలో ఉన్న హిందూస్తాన్.. తన స్వభావానికి అనుగుణంగా స్వేచ్ఛను అనుభవించగలిగితే.. అప్పుడిక మేము ఆ సామ్రాజ్యానికి కట్టుబడి ఉండటం మా విధ్యుక్త ధర్మమని భావిస్తాము. అటువంటి స్వేచ్ఛను అనుభవించేందుకు వీలుగా అటువంటి అధికారాలను వెంటనే హిందుస్తాన్ జాతికి ఇవ్వాలి. ఒకవేళ యుద్ధ పరిస్థితుల కారణంగా అలా చేయలేకపోతే కనీసం హిందూస్తాన్‌కు వలస స్వపరిపాల ఇవ్వాలి."

తన విజ్ఞాపనా పత్రాన్నుంచి ఉటంకిస్తూ, దీని వెనక తనకు ఉన్న ఆలోచనను కూడా సావర్కర్ వివరించాడు. విప్లవకారులు ఎప్పటినుంచో జర్మనీ, బ్రిటన్‌ల మధ్య యుద్ధం జరుగుతుందని ఆశిస్తూ ఉన్నారు. అప్పుడు జర్మనీ సహాయంతో తమ లక్ష్యాలను సాధించవచ్చని వారి అంచనా. సరిగ్గా తాము ఆశించిన ఘటన జరిగిన తరుణంలోనే జైలు పాలు కావడం, దానిని తమకు సావకాశంగా మలుచుకోలేకపోవడం ఒక పెద్ద నిరాశను కలిగించింది. అయినప్పటికీ అతనూ, అతని జైలు సహచరులూ ఉన్న పరిస్థితిని తమకు వీలైనంత సానుకూలంగా మలుచుకోవడానికి ప్రయత్నించారు. కానీ టర్కీ జర్మనీతో ఒడంబడిక చేసుకొని యుద్ధంలోకి ప్రవేశించిందని తెలియగానే అతని ఆలోచనలో పెను మార్పుకు దారితీసింది. అతని మాటల్లోనే చెప్పాలంటే:

> "...... దీని వల్ల, నా మనసులో నేను అనుకున్న పథకం (జోక్యం చేసుకోవాలన్న పథకం) పెను మార్పుకు లోనయ్యింది. ఇస్లాంను విస్తరించాలనే ముస్లింల కోరిక గురించి బాగా తెలిసినవాణ్ణి కావడం వల్ల, ఇంగ్లాండ్‌కు వ్యతిరేకంగా టర్కీ యుద్ధంలోకి ప్రవేశించిందని తెలియగానే హిందూస్తాన్‌పై పొంచిఉన్న మరో ప్రమాదాన్ని గురించిన భయం మొదలైంది. టర్కీ యుద్ధంలోకి ప్రవేశించినందువల్ల జర్మనీ హస్తం హిందూస్తాన్ దాకా చేరగల అవకాశాలు పెరిగాయి. దాని వల్ల బ్రిటిష్ పాలన చాలా ఇబ్బందులకు గురి కావడం తథ్యం. ఒక విధంగా ఇది నా తక్షణ కార్యాచరణ పథకానికి అనుగుణంగా ఉంది. ఈ మార్పుల వల్ల హిందూస్తాన్ న్యాయమైన కోరికలను నెరవేర్చడం బ్రిటన్ కు తప్పనిసరి అవుతుంది. మరోమాటలో చెప్పాలంటే ఆంగ్లో–జర్మన్ యుద్ధం మధ్యలో హిందూస్తాన్‌కు తన ఇచ్ఛను నెరవేర్చుకునే అవకాశం లభిస్తుంది. కానీ, రష్యాపై మిడతలదండు వంటి ముస్లింల దాడి హిందూస్తాన్‌పై కూడా దాడి చేయడానికి పురికొల్పుతుంది. కోల్పోయిన తమ ముస్లిం పాలనను తిరిగి నెలకొల్పడానికి హిందూస్తాన్ ముస్లింలు చేసే దుష్ట ప్రయత్నం విజయవంతమయ్యే అవకాశం వస్తుంది."

ఆ విజ్ఞాపనా పత్రం వెనక ఉన్న ఆలోచన ఇది. దీని తార్కిక ముగింపుగా సావర్కర్, తానూ, తన సహచరులూ హిందూస్తాన్‌ను విదేశీ ముస్లిం శక్తులైన టర్క్ లు, ఆఫ్ఘన్ల నుండి పరిరక్షించడానికి బ్రిటిష్ సైన్యంలో చేరడానికి సిద్ధమని బ్రిటిష్ వాళ్ళకు తెలియజేశాడు. సావర్కర్ తరహా "దేశభక్తి"లో ఇప్పుడు ఉన్న బ్రిటిష్ పాలనను కూలదోయడం ప్రధానం కాదు. ఎవరో ముస్లింలు పాలించే అవకాశం ఉండటమే ఎక్కువ ప్రమాదకరం. విదేశీ పాలనను సహించవచ్చు, దానిని రక్షించవచ్చు కూడా. కానీ ముస్లింలు అయితే మాత్రం వారు హిందూస్తానీలు అయినా సరే భరించడానికి వీలు లేదు. ఇవీ అతని అభిప్రాయాలు. వాటికి దేశభక్తితోనో, జాతీయవాదంతోనో – అవి సంకుచితమైనవి అయినప్పటికీ కూడా – ఎటువంటి సంబంధం లేదు. అవి దళారీ బ్రాహ్మణ హిందూవాది మత విద్వేష అభిప్రాయాలు. బంకించంద్ర "సనాతన" స్వప్నానికీ, దీనికీ మధ్య కొనసాగుతున్న నిరంతరాయతను మనం చూడవచ్చు.

గాంధీ నాయకత్వంలోని భారత జాతీయ కాంగ్రెస్ దూకుడుతో కూడిన బ్రాహ్మణవాదం స్థానంలో మధ్యేమార్గంలో ఉండే బ్రాహ్మణవాదాన్ని ముందుకు తెచ్చింది. అయితే, స్వాతంత్ర్యం విషయానికి సంబంధించి మాత్రం గాంధీ కూడా 'స్వపరిపాలన'తోనే సరిపెట్టుకున్నాడు. ఈ దళారుల బానిసత్వానికి భిన్నంగా జాతీయ విప్లవ కారులు, కమ్యూనిస్టులు స్వాతంత్ర్య నినాదాన్ని ఇచ్చారు. స్వరాజ్ అంటే స్వాతంత్ర్యం అనే అర్థం ఇక ఎంతమాత్రం లేదు కాబట్టి సంపూర్ణ స్వరాజ్యం (సంపూర్ణ స్వాతంత్ర్యం అనే అర్థంలో) అనే కొత్త పదాన్ని వాడుకలోకి తెచ్చారు. అది త్వరలోనే జనామోదం పొంది ప్రజల డిమాండ్‌గా మారింది. సమాజంలోని కింది పొరల నుండి విభిన్న కాంగ్రెసేతర ఉద్యమాలు తలెత్తడంతో దీనికి బలం చేకూరింది. బ్రిటిష్ వ్యతిరేక పోరాటంపై తన ఆధిపత్యాన్ని కోల్పోతాననే భయంతో కాంగ్రెసు కూడా 1930 లో ఈ నినాదాన్ని ఆమోదించింది.

జాతీయ విప్లవకారులు రూపొందించిన "సంపూర్ణ స్వరాజ్యం" అంటే బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుండి పూర్తిగా తెగతెంపులు చేసుకోవడం అని కమ్యూనిస్టులు దీనికి మరింత లోతైన అర్థం ఇచ్చారు. మొత్తం సామ్రాజ్యవాద వ్యవస్థ నుండి తెగతెంపులు చేసుకోవాలనీ, భూస్వామ్యాన్ని నాశనం చేయాలనీ వాళ్ళు పిలుపునిచ్చారు. కాంగ్రెసు ఇచ్చిన నినాదంలో ఈ అర్థాలేవీ లేవు. "సంపూర్ణ స్వరాజ్యం" అనే నినాదాన్ని కాంగ్రెసు ఆమోదించడం ఒక ఎత్తుగడ మాత్రమే. దెబ్బతిన్న తన ప్రతిష్టను సరిదిద్దుకోవడం, జాతీయ విముక్తి మార్గం నుండి ప్రజా బాహుళ్యాన్ని దూరంగా ఉంచడం దీని ఉద్దేశ్యం.

భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పినప్పటికీ వాస్తవం మాత్రం అది కాదు. అధికారికంగా చూసినప్పటికీ 1950 దాకా భారత దేశం బ్రిటిష్ సామ్రాజ్యంలో ఒక స్వపరిపాలనా ప్రాంతం. ఆ కాలంలో పెద్ద ఎత్తున సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు చెలరేగి ఉండకపోతే అది అలాగే కొనసాగి ఉండేది. 1950లో భారత దేశాన్ని సర్వ సత్తాక రాజ్యం అని ప్రకటించటంతో అది బ్రిటిష్ సామ్రాజ్యంలో ఒక అంతర్భాగంగా ఉండడం ఆగిపోయింది. సామ్రాజ్యవాదంపై అప్రకటితంగా పరోక్షంగా ఆధారపడడం మాత్రం కొనసాగుతోంది.

ఇదీ పాలకవర్గాల దేశభక్తిలోని వాస్తవం! భారత ప్రభుత్వ సంస్థల ద్వారా ఇది ఎట్లా ప్రచారమవుతోంది? అటువంటి సంస్థలలో ఒకటయిన సాయుధబలగాల గురించి చూద్దాం. రాజ్య సంస్థలన్నిటిలోకి అత్యంత దేశభక్తి కలిగిన సంస్థ అని దీనిని చిత్రీకరిస్తారు. దానికి వ్యతిరేకంగా ఎటువంటి విమర్శ చేసినా దాన్ని దేశద్రోహం అని ముద్ర వేస్తారు. కాని ఇది ఎత్తిపడుతున్న "దేశభక్తి" సంప్రదాయం ఎటువంటిదో చూద్దాం. ఈ మధ్య కాలంలో జరిగిన కొన్ని ఘటనలను చూస్తే మనం ఒక అంచనాకు రావచ్చు.

ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి భారత దేశానికి వచ్చినపుడు నరేంద్రమోదీ హైఫా దాడి స్మారక దినాన్ని మళ్ళీ ఒకసారి జరిపాడు. (అంతకు ముందు ఇజ్రాయెల్ వెళ్ళినపుడు కూడా ఒకసారి ఇదే పని చేసాడు.) హైఫా దాడి మొదటి ప్రపంచ యుద్ధంలోని ఒక ముఖ్యమైన ఘట్టం. బ్రిటిష్ సైన్యానికి చెందిన 25వ ఇంపీరియల్ కేవల్రీ బ్రిగేడ్ లోని హైదరాబాద్, జోధ్ పూర్, మైసూర్ ల్యాన్సర్లు ఇందులో పాల్గొన్నారు. 1918 సెప్టెంబర్ 23 నాడు జర్మన్, టర్కిష్, ఆస్ట్రో- హంగేరియన్ బలగాలను ఓడించి హైఫా పట్టణాన్ని స్వాధీనం చేసుకోవడంలో వారు విజయవంతం అయ్యారు. దీనివల్ల మిత్రపక్ష బలగాలు ముందుకు సాగగలిగాయి. సైనికపరంగా చూస్తే ఈ దాడికి మరొక ప్రాముఖ్యత ఉంది. సరి అయిన ఆయుధ సంపత్తిలేని బలగం తనకన్నా ఎంతో మెరుగ్గా ఉన్న బలగాన్ని విజయవంతంగా ఓడించగలిగింది. నిస్వార్థ త్యాగంతో కూడిన భారత సంప్రదాయానికి ఇది ఒక ఉదాహరణ అని మోదీ అభివర్ణించాడు.

కానీ ఎవరికి సేవ చేయడం కోసం ఈ యుద్ధం జరిగింది? ఏ ఉద్దేశ్యం కోసం? త్యాగం, బలిదానం అనేవి ఈ బలగాల బుర్రల్లో ఉండే అవకాశమే లేదు. బ్రిటిష్ ఇండియన్ సైన్యంలో భారత సైనికులను తెల్ల అధికారులు ఏ రకంగా చిన్న చూపు చూసేవారో, ఎంత దుర్మార్గంగా వ్యవహరించేవారో అందరికే తెలిసిందే. యుద్ధ సమయంలో కూడా ఇలాగే ఉండేది. అత్యంత దయనీయమైన పేదరికం వల్లమాత్రమే వారు సైన్యంలో చేరి యుద్ధ రంగానికి వెళ్ళే వాళ్ళు. ల్యాన్సర్లు హైఫా పట్టణాన్ని రక్త మోడ్చి స్వాధీనం చేసుకోడం కానీ భారత సైనికుల ఇతర విజయాలు కానీ భారత ప్రజల ప్రయోజనాలను ఏవిధంగానూ నెరవేర్చేవి కావు. వారి అణచివేతదారైన బ్రిటిష్ సామ్రాజ్య ప్రయోజనాలనే అది నెరవేర్చింది. కాబట్టి బ్రిటిష్ సామ్రాజ్యపు ఫిరంగులలో గుండ్ల లాగా ఉపయోగపడిన వీరి సేవలను గొప్పభారత సంప్రదాయమని పొగడడం ఏం తెలియజేస్తుంది? ఇది దేశభక్తా లేక దళారీ వక్రబుద్ధా?

ల్యాన్సర్ల విజయ ఘట్టం ఒక విడి ఘటన కాదు. బ్రిటిష్ ఇండియన్ సైన్యంలో భాగంగా ఏదో ఒక యుద్ధ విజయాన్ని స్మారక దినంగా జరపడం భారత సాయుధ బలగాల్లోని అన్ని విభాగాల్లోనూ పాటించే ఒక సంప్రదాయం. భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన వాళ్ళను అణచివేసిన ఘటనలను కూడా విజయ వేడుకగా జరుపుకుంటారు. దీనికి పూర్తిగా వ్యతిరేకమైన మరొక విషయంతో దీన్ని పోల్చి చూడవచ్చు. బ్రిటిష్ ఇండియన్ సాయుధ బలగాలలోని భారత సైనికులు చేసిన తిరుగుబాట్లకు సంబంధించిన ఒక్క ఘటనను కూడా భారత రాజ్యం కానీ పాలక వర్గాలకు చెందిన ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా వేడుకగా జరుపుకోదు. ఆంగ్లేయుల దేశద్రోహ ఆరోపణలకు గురైన ఆజాద్ హింద్ ఫౌజ్ సైన్యాధికారుల పక్షాన తాము వాదించామని జవహర్ లాల్ నెహ్రూ తదితర కాంగ్రెస్ నాయకులు పెద్దగా గప్పాలు కొడతారు. కానీ ఆజాద్ హింద్ ఫౌజ్ కు సంబంధించిన ఒక్క సిపాయిని కూడా మళ్ళీ భారత సైన్యంలో చేర్చుకోలేదు. దేశభక్తి పేరుతో ఊరేగే వీరెవ్వరికీ ఇందులో గర్వకారణమైనదేదీ కనిపించదు. ఒక్క ఘటన మాత్రమే ఇందుకు మినహాయింపు.

సరిగ్గా 200 సంవత్సరాల క్రితం 1818 జనవరిలో ఖడ్కి (పూణే) వద్ద ఉన్న బ్రిటిష్ సైన్యం తనకంటే నాలుగు రెట్లు పెద్దదైన పీష్వా సైన్యాన్ని ఓడించింది. ఈ యుద్ధం చాలా పరిణామాలకు దారి తీసింది. పీష్వాల మరాఠీ రాజ్యం కూలిపోవడానికి ఇది దారితీసింది. ఇక్కడ మోహరించిన బ్రిటిష్ సైన్యంలో ఎక్కువ మంది మహర్లు ఉన్నారు. మహర్లు అంటే మహారాష్ట్రలోని ఒక ప్రముఖ దళిత కులస్థులు. ఆ యుద్ధ స్మారకంగా ఆంగ్లేయులు భీమా కోరేగావ్ వద్ద ఒక విజయ స్తంభాన్ని నెలకొల్పారు. 1927లో డా. బి.ఆర్. అంబేద్కర్ దీనిని సందర్శించాడు. బ్రిటిష్ ఇండియా సైన్యంలో మహర్ రెజిమెంటును పునరుద్ధరించాలని ఆయన చాలా ప్రయత్నించాడు. సమయం గడిచే కొద్దీ పీష్వా సైనికులపై సాధించిన విజయ వేడుకలను జరపడం కోసం జనవరి ఒకటి నాడు ప్రతి యేటా దళితులు పెద్ద ఎత్తున ఈ విజయ స్తంభాన్ని సందర్శిస్తున్నారు. మహారాష్ట్రలో దళిత అస్తిత్వ ప్రకటనకు ఇది ఒక కేంద్ర బిందువుగా మారింది. 2018లో ఇక్కడ ద్విశత జయంతి ఉత్సవాలు పెద్ద ఎత్తున జరిపారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుండి వచ్చిన ప్రతినిధులతో ఒక సభ జరిగింది. జనవరి ఒకటి నాడు జరిగిన ప్రదర్శనపై హిందూవాద శక్తులు దాడి చేశాయి. దీనితో అప్పటి దాకా పేరుకు పోయిన దళితుల ఆగ్రహం ఒక్కసారిగా మిలిటెంట్ రాష్ట్ర వ్యాప్త బంద్ రూపంలో బయట పడింది. నేను ఈ వ్యాసం రాసే నాటికి ఈ విషయం ఇంకా రాజుకుంటూనే ఉంది. ఈ వ్యాసంలో దేశభక్తి గురించి చర్చిస్తున్నాము. ఆ సందర్భంలో చూసినపుడు హిందూవాదులు తాము భీమా కోరేగావ్‌ను ఎందుకు వ్యతిరేకిస్తున్నామో చెప్పిన విషయం గమనించదగింది. ఈ యుద్ధం కారణంగా మరాఠీ సామ్రాజ్యం కూలిపోయి భారత ఉపఖండం అంతా ఆంగ్లేయుల పాలన స్థాపించడానికి దారి సుగమం అయ్యింది కాబట్టి, దానిని విజయోత్సవంగా జరిపి మహర్ల విజయంగా కీర్తించడం అంటే అది దేశద్రోహం కాదా? అవునా?

భారత ఉపఖండంలో స్థానికులు ఆంగ్లేయుల కోసం ఎన్నో విజయాలను సాధించిపెట్టారు. ఇటువంటి ఘటనలను పోల్చి చూస్తే ఖడ్కీ యుద్ధం తమదని మహర్లు సొంతం చేసుకోవడం మిగిలిన వాటికంటే చాలా సరైందేనని మనకు తెలుస్తుంది. బ్రాహ్మణ పీష్వా పాలన అత్యంత దారుణంగా కుల అణచివేతను అమలుచేసేది. శివాజీ నాయకత్వంలో

మహర్లు మొఘలు వ్యతిరేక పోరాటంలో చేరారు. మరాఠా సామ్రాజ్య స్థాపనలో తాము నిర్వహించిన పాత్ర గురించి వారు చెప్పేది న్యాయసంగతమైనది. కానీ పీష్వాల పాలనలో వారిని సైన్యం నుండి తొలగించారు. అంతకు ముందు ఎన్నడూ చూడని విధంగా ఘోరమైన అస్పృశ్యతను అమలు జరిపారు. అటువంటి శత్రువుతో తలపడి ఓడించడం అంటే అది మరో అణచివేతదారుల పాలనను నెలకొల్పినదైనా సరే, మహర్లకు చాలా గొప్ప ఆనందాన్ని కలిగించి ఉంటుంది. వేరే ఏ యుద్ధాన్ని గురించి కూడా ఈ మాట అనలేం. ఉదాహరణకు రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో కొహిమాలో బ్రిటిష్ ఇండియన్ సైన్యం జపాన్-ఐఎన్ఏ దాడిని ఓడించడం, అలాగే నార్త్ -వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్స్‌లో (ప్రస్తుత పాకిస్థాన్ లో ఉంది) తిరుగుబాటు చేస్తున్న ఆదివాసీ తెగల ప్రజల పైనా, 1942లో క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంలో పశ్చిమ బెంగాలు లోని మేదినీపూర్ లో స్వాతంత్ర్య పోరాట యోధులపైనా వైమానిక దాడులు జరపడం ఈ కోవకు చెందినవి. కొహిమా తరహా యుద్ధాలను భారత రాజ్యం సంస్మరించుకుంటుంది. వాటిల్లో పాల్గొన్న సైనికాధికారుల సర్వీసు రికార్డులగురించి చెప్పేటప్పుడు ఆ దాడులలో పాల్గొనడం గురించి గౌరవప్రదంగా పేర్కొంటారు.

ఆంగ్లేయులు సాధించిన విజయాలను మన దేశంలో ప్రతి సంవత్సరం స్మరించుకునే వాటిలో ఒక్క భీమా కోరేగావ్‌ను మాత్రమే హిందూవాదులు దేశద్రోహపూరితమైనదని అంటారు. బంకించంద్రకు గానీ సావర్కర్‌కు కానీ జాతి అంటే మతపరమైనది. ఇప్పుడు దానికి ఇంకా మెరుగులు దిద్దుతున్నారు. దేశం అందరు హిందువులకు చెందినది కాదనీ, ప్రత్యేకంగా సవర్ణులకు చెందినదనీ అంటున్నారు. వారి ప్రయోజనాలకు భంగకరమైనది ఏదైనా "దేశద్రోహమే." ఇటువంటి కులపరమైన కథనం ఏదైనా విశాల బాహుళ్యానికి కచ్చితంగా ఆమోద యోగ్యం కాదు. సవర్ణులలో కూడాఎక్కువ మందికి ఇది ఆమోద యోగ్యం కాదు.

అయినప్పటికీ "విదేశీయులు-స్థానికులు" అనే ద్వంద్వ విభజన కొంత మందికి రుచించవచ్చు. దీని మనం మరింత సన్నిహితంగా పరిశీలిద్దాం. ఒకరిని విదేశీయులని ఎలా నిర్ణయిస్తారు? మరాఠీ సామ్రాజ్యమే దాని సరిహద్దుల్లోని ఎన్నో ప్రాంతాల్లో "స్థానికం" కాదు. ఆ సామ్రాజ్యపు దక్షిణ, ఉత్తర భాగాలలోని ప్రజలకు అది విదేశీ పరిపాలనే. మరాఠాలు తాము హిందువులమేనన్నా అది నిలబడలేని వాదన. మరాఠా సామ్రాజ్య స్థాపన, విస్తరణ అంటే అది ఇతర హిందూ రాజ్యాలను ఓడించి నెలకొల్పినదే. వలసవాద దురాక్రమణను ప్రతిఘటించిన మేరకు పీష్వాలు దేశభక్తి గురించి మాట్లాడవచ్చు. కానీ దీనికి కూడా చాలా పరిమితు లున్నాయని గుర్తించాలి. పైగా అది చాలా ప్రతీఘాతుకమైనది. శివాజీ తన నాయకత్వంలో మొఘలులకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య యుద్ధంలో అందరినీ కలుపుకుపోయే దేశభక్తికి సంబంధించి ఉన్నత ప్రమాణాలను నెలకొల్పి ఉన్నాడు. ఆ తరహా దేశభక్తి అణచివేతకు గురవుతున్న కులాలతో సహా విశాల ప్రజా రాశులను కదిలించింది. పీష్వాలు మాత్రం బ్రాహ్మణవాద వెలివేతలో చాలా మొండిగా ఉండేవారు. వారి కల్పనలోని మాతృభూమిలో దళితులకు గానీ అణచివేతకు గురవుతున్న ఇతర కులాలకు గానీ స్థానం లేదు. అది వారికి రుచించదనిదే.

ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పీష్వాల ప్రతిఘటన మైసూరు టిప్పు సుల్తాను, ఉత్తర కేరళం లోని కొట్టాయంకు చెందిన పలాసి, ఝాన్సీకి చెందిన లక్ష్మీబాయిల ప్రతిఘటన వంటిదే. వీటిలో కొన్ని అందరినీ కలుపుకుపోయే తరహావి. అయినప్పటికీ వీరంతా తమ కుల-భూస్వామ్య సామాజిక సంబంధాలనూ, జీవిత పద్ధతినీ సంరక్షించుకుని కొనసాగించడానికే ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడారు. వారి దేశభక్తికి ఉన్న నిజమైన సందర్భం అదే. అయితే, వలసవాద పరిస్థితులలో వారి ప్రతిఘటన వారి వ్యక్తిగత కోరికలకంటే భిన్నమైన వస్తుగత పాత్ర నిర్వహించింది. ఒక కొత్తతరహా దేశభక్తి ఉదయించడానికి వారు బీజం వేసారు. వలసవాద వ్యతిరేక పోరాటంలో ప్రజల ప్రత్యక్ష ప్రవేశం పెరిగే కొద్దీ ఈ దేశభక్తి భౌగోళిక, సామాజిక సరిహద్దులను అధిగమించింది. అది మరింత ఎక్కువగా అందరినీ కలుపుకునేదిగా ప్రజాస్వామికంగా మారింది. అదే సమయంలో మరొక కోణం కూడా వచ్చి చేరింది.

వలస పాలనలో కుల భూస్వామ్యం పాక్షికంగా పరిణామం చెందడంతో అది సనాతన బ్రాహ్మణ వాదాన్ని బలహీన పరిచింది. అణచివేతకు గురవుతున్న కులాలు కొంత ప్రగతిని సాధించడానికి దారులు తెరుచుకున్నాయి. వారికి బ్రాహ్మణ వాద సామాజిక వ్యవస్థ నుండి ఉపశమనానికి బ్రిటిష్ పాలన తోడ్పడింది. దానిని వీలయినంత విశాలం చేయడానికి ప్రయత్నించారు. వలస పాలనలో ఎన్నో అణచివేత చర్యలు బలోపేతమైనాయి, కొత్త రూపు సంతరించు కున్నాయి. వాటికి తోడు కొత్త అణచివేత రూపాలు కూడా వచ్చి చేరాయి. దానితో ఈ సెక్షన్లలో కూడా వలస పాలన పట్ల వ్యతిరేకత మొదలైంది. అయితే దళారీ, భూస్వామ్య ఉన్నత వర్గాల నయా బ్రాహ్మణ వాదం ఒక విశాలమైన ఐక్యత ఏర్పడే అవకాశాన్ని నిరోధించింది. అణచివేతకు గురవుతున్న కులాల ప్రజాస్వామిక ఆకాంక్షలకు వ్యతిరేకంగా వారు "జాతి ప్రయోజనాలను" నిలబెట్టారు. కుల వ్యవస్థను రద్దుచేయాలని పట్టుబట్టిన దళిత, ఇతర కులాల నాయకులను వీరు "విశాలమైన", "ఉన్నతమైన" దేశ ప్రయోజనాలకు భిన్నంగా "సంకుచిత" ప్రయోజనాల కోసం పట్టుబడుతున్నారని నిందించారు.

తమకు సమానమైన స్థానాన్ని ఇవ్వని దేశం అణచివేయబడిన కులాలకు ఆమోదయోగ్యం కాదు. విదేశీ పాలన అంతంతో తాము కొత్తగా పొందిన సామాజిక చలనాన్ని పోగొట్టుకోవడం కంటే, అటువంటి "అస్వాతంత్ర్య" పోరాటానికి ఎడంగా ఉండటమే తమకు మేలని వారు భావించారు. ఈ విభజనకు మూలాలు ఉప ఖండంలోని ప్రత్యేక పరిస్థితులలో ఉన్నాయి. ఆ పరిస్థితులను నయా-బ్రాహ్మణవాదం బలోపేతం చేసింది. ఆంగ్లేయులు ఈ విభజనను మరింత పెంచడానికి తమకు వీలయినంతగా ప్రయత్నించారు. వలస పాలన కూడా అందుకు తోడ్పడినప్పటికీ దాన్ని సృష్టించింది మాత్రం వలస పాలకులు కాదు.

ఇక దళితుల దృష్టిలో భీమా కోరేగావ్ విజయం బ్రిటిష్ రాజ్‌కు ఒక చిహ్నంగా ఉండటం ఎప్పుడో మానేసింది. వారి ఊహా చిత్రంలో అది తమ పూర్వీకుల చేతిలో బ్రాహ్మణ అణచివేతదారుల ఓటమికి ఒక చిహ్నం. అది వారి పోరాట పటిమకూ, సామర్థ్యానికీ, పట్టుదలకూ ఒక జ్ఞాపిక. అణగారిన వారు నిలబడి పోరాడితే బ్రాహ్మణవాదాన్నీ, దాని నిర్మాణాలనూ, విలువలనూ నిర్మూలించగలమనే ఒక ఆశా రేఖ అది. దళిత ప్రతిఘటన ద్వారా రూపు దిద్దుకున్న ఈ కథనం హిందూవాదులు నిలబెట్టాలని చూసే "విదేశీ-స్వదేశీ" అనే తప్పుడు ద్వంద్వాన్ని చీల్చివేస్తుంది. తాము స్థానికులే అయినప్పటికీ బలవంతంగా తమపై

"విదేశీయత"ను రుద్దితే, ఊరుమ్మడి స్థలాల నుండి వెలివేతకూ, ఉమ్మడి హక్కుల నిరాకరణకూ గురైతే అటువంటి స్థితి గురించి ఎవరైనా ఎట్లా "దేశభక్తి"ని ప్రదర్శించగలరు?

బ్రాహ్మణవాదమంటేనే అది లోతుగా విభజించే సిద్ధాంతం. అది దానిలోని అవిభాజ్యమైన లక్షణం. ముస్లింలను "ఇతరులు"గా చిత్రీకరించి హిందువులంతా ఒకటే అనే భావనను ముందుకు తీసుకు వస్తే అది తాత్కాలికంగా మాత్రమే విభజనలపై ముసుగు కప్పగలుగుతుంది. బ్రాహ్మణవాదం ఈ విభజనలను కొనసాగిస్తుంది, ఆ విభజనలు తిరిగి బ్రాహ్మణవాదాన్ని కొనసాగిస్తాయి. అవన్నీ ఇప్పుడో అప్పుడో మళ్ళీ తమ వికృత రూపంలో బయట పడతాయి. దూకుడుతో కూడిన బ్రాహ్మణవాదం దీనికి మరింత క్రూరమైన రూపాన్నిస్తుంది. కేంద్రంలోనూ, వివిధ రాష్ట్రాలలోనూ ఉన్న బిజెపి ప్రభుత్వాల ద్వారా దేశంలోని విశాల భాగంలో ఆర్ఎస్ఎస్ చేస్తున్న పరోక్ష పాలన ఈ విషయాలను ధృవీకరిస్తున్నది. దాడుల తీవ్రత పెరిగే కొద్దీ ప్రతిఘటన కూడా తీవ్రమవుతుంది. ఈ విషయాన్ని పలు ఘటనలలో చూస్తున్నాం. ఎస్.సి., ఎస్.టి. అత్యాచారాల వ్యతిరేక చట్టాన్ని సుప్రీం కోర్టు నీరుగార్చినప్పుడు అందుకు వ్యతిరేకంగా పెల్లుబికిన దళిత ఆగ్రహం ఈ ప్రతిఘటనా పరంపరలో సరి కొత్తది. దళితులు మాత్రమే కాదు, ముస్లింలు, వామపక్షం, పై తరగతితో సహా సమాజం లోని విభిన్న సెక్షన్లు నిరసనలలో ముందుకు వస్తున్నారు. కఠువా అత్యాచారానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెల్లుబికిన నిరసన ఒక పసిపాపపై చేసిన అఘాయిత్యానికి వ్యతిరేకంగా వచ్చిన ప్రతిస్పందన మాత్రమే కాదు. హిందూవాదులు అతి క్రూరంగా బలాత్కారాన్నీ, హత్యనూ ఉపయోగించి ఒక ముస్లిం తెగకు చెందిన ప్రజలను పారదోలడానికి ప్రయత్నించడం వల్ల కూడా ఆ నిరసనలు అంత పెద్ద ఎత్తున వచ్చాయి.

మనం పెద్ద ఎత్తున ప్రజాస్వామిక కదలికలను చూస్తున్నాం. అక్కడక్కడా అవి మిలిటెంట్ రూపాలను కూడా సంతరించుకుంటున్నాయి. వీటిలో పెద్ద ఎత్తున యువతీ యువకులు పాల్గొనడం గమనించతగిన విషయం. "కొత్త తరం రాజకీయ విహీనంగా తయారవుతోంది" అనే తప్పు సిద్ధాంతాన్ని ఇది బద్దలు చేస్తుంది. చిన్న స్థానిక గ్రూపుల చొరవతో స్వతస్ఫూర్తిగా ఈ నిరసనలు, సమీకరణలు జరుగుతున్నాయి. సోషల్ మీడియా ద్వారా విశాల ప్రజానీకం కదులుతున్నారు. చాలా సార్లు పార్లమెంటరీ ప్రతిపక్షం ఈ ఉద్యమాల వెంట కదలవలిసిన పరిస్థితి వస్తోంది. ఈ కదలికలన్నీ రాష్ట్రస్థాయిలో కానీ దేశ వ్యాప్తంగా కానీ ఒక కొత్త ఉద్యమ రూపు ఇంకా తీసుకోవలసి ఉంది. అయినా రాజకీయ క్షేత్రంలో ఇదొక ముఖ్యమైన అంశంగా మారింది. ప్రతి రాజకీయపార్టీ కూడా ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రతిస్పందించ వలసి వస్తోంది.

ఇది చాలా ముఖ్యమైన పరిణామం. అయితే ఇందులో ఒక లోపం కూడా ఉంది. జాతి/దేశం విషయంలో హిందూ వాదులు చెపుతున్న విషయాలను అతి ముఖ్యమైన స్థాయిలో ఇవి ప్రశ్నించడం లేదు. బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలో పాల్గొనని వారి పిరికితనాన్ని గురించీ, మతం ఆధారంగా వారు లేవనెత్తిన "హిందూ రాష్ట్ర"డిమాండు ఆంగ్లేయుల "విభజించి పాలించే" నీతికి మద్దతు నిచ్చిందనే విషయాన్ని గురించీ, ఇటువంటి మరిన్ని ద్రోహపూరిత చర్యలూ, విధానాల గురించి పెద్ద ఎత్తున విమర్శించి బహిర్గత పరచడం జరుగుతూనే ఉంది. కానీ వీటన్నిటికంటే మించి ప్రపంచ సామ్రాజ్యవాద వ్యవస్థ నుండి పూర్తిగా తెగతెంపులు చేసుకునే విధంగా దేశ ప్రయోజనాలనూ, దేశభక్తినీ నిర్వచించవలసి ఉంది. హిందూ వాదుల "జాతీయ కథనం" లో ఇది ఒక పెద్ద లోటు. మొట్ట మొదటి దళారీ మేధావుల నుండి వీరి వారసత్వం కొనసాగుతోంది.

హిందూ వాదుల "జాతి"కి ఉన్న విశిష్ట లక్షణం కులతత్వం, మతతత్వం, పితృస్వామికం, జాత్యహంకారాలతో కూడి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మలుచుకున్న దూకుడు బ్రాహ్మణవాదం. కానీ బ్రాహ్మణ వాదం హిందూ వాదులకు మాత్రమే పరిమితమైనది కాదు.అది మొత్తం పాలక వర్గాల సైద్ధాంతిక దృక్పథానికి ఆయువు పట్టు. కాబట్టి కాంగ్రెసు స్రవంతి కూడా బ్రాహ్మణవాదాన్ని ఇముడ్చుకుని ప్రోత్సహిస్తుంది. కాకపోతే కొంత తక్కువ దూకుడుగా, పైకి అంతగా కనిపించని రీతిలో చేస్తుంది. అయితే సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించకపోవడంలో మాత్రం ఇద్దరూ ఒకే తాను లోని ముక్కలే. జాతి, దేశభక్తి భావనలలో ఉన్న ఈ దళారీ దృక్పథాన్ని ఓడించడాన్ని మన లక్ష్యంగా చేసుకోవాలి. మూడవ ప్రపంచ దేశాలలో దేశభక్తి అర్థవంతమైనదిగా ఉండాలంటే సామ్రాజ్యవాద ప్రపంచ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో దాని మూలాలు ఉండాలి. గతంలో మాదిరిగా నియంత్రణ, దోపిడీలు ఇక ఎంతమాత్రం ప్రత్యక్షంగా లేవు. అయినా వాటి విషతుల్య ప్రభావాలు ఏ మాత్రం తగ్గలేదు.

పెరుగుదల అంకెల గురించి చర్చలు చేసే బదులు ఆర్థిక వ్యవస్థ స్వభావాన్ని పరిశోధించాలి. అది దేశాన్ని స్వయం సంపూర్ణంగా చేస్తుందా? లేదా ఇంకా పరాధీనంగా మలుస్తుందా? (నింపాదిగానైనా సరే) యువత శక్తి సామర్థ్యాల అభివ్యక్తీకరణ జరిగేలా ఉద్యోగాల సృష్టి జరుగుతోందా? లేక చదువుకున్న వారి బుర్రలు, నైపుణ్యాలు ఏదో ఒక బహుళ జాతి కంపెనీనో లేక దళారీ గుత్తాధిపత్య సంస్థనో బలిపించడానికి ఉపయోగపడుతున్నాయా? కాంగ్రెసు "మేడ్ ఇన్ ఇండియా" కానీ లేదా ఆర్ఎస్ఎస్ "మేక్ ఇన్ ఇండియా" కానీ భారత దేశానికి గానీ దాని ప్రజలకు గానీ ఎటువంటి ప్రయోజనం చేకూర్చలేదు. ఇక రెండు రంగాలలో యుద్ధం చేయడం అనే దేశ దురభిమాన ప్రగల్భాల విషయాని కొస్తే – గత యుద్ధాల అనుభవాలను పరిశీలిస్తే ఒకవైపు సామ్రాజ్యవాద ఆయుధ బేహారులు తమ బొక్కసాలను నింపుకుంటుంటే మరొక వైపు భారతీయులు (దక్షిణ ఆసియా వాసులు) మాత్రం తమ పొట్టలను కట్టుకోవలసి వస్తుంది.

"జాతీయ" ప్రయోజనాలకూ, "ప్రజాస్వామిక" ప్రయోజనాలకూ మధ్య ఉన్న అగాధాన్ని పూడ్చాలి. అవి రెండూ ఒక దాని నుండి మరొకటి బలాన్ని సమకూర్చుకుని ఒకే మహాశక్తిగా ఐక్యం కావాలి. దేశభక్తికి సంబంధించిన ఒక బలమైన ప్రత్యామ్నాయం ఈ లక్ష్యాన్ని సాధించడంలో ప్రముఖమైన పాత్ర నిర్వహిస్తుంది.

(మే, 2018లో రాసిన ఈ వ్యాసం క్రిటికింగ్ బ్రాహ్మణిజం అనే పుస్తకం లోనిది. రచయిత మావోయిస్టు రాజకీయ ఖైదీగా ఐదు సంవత్సరాలు జైలులో గడిపి ఇటీవలే విడుదలయ్యారు)

(అనువాదం: రవి నర్ల) వీ

వలస రాయలసీమలో మహిళా చైతన్యం

బ్రిటిష్ వలస పాలనలో వెలుగుచూడని రాయలసీమ ప్రాంత మహిళల చైతన్యాన్ని సంఘటిత నిర్మాణాలను వివరిస్తున్నారు **డా. షేఖ్. మహబూబ్ బాషా**

ఆంగ్ల వలస పరిపాలనా ప్రభావ ఫలితంగా పందొమ్మిదవ శతాబ్దంలో పురుష సంఘ సంస్కర్తలు దేశవ్యాప్తంగా చేపట్టిన సంఘ సంస్కరణోద్యమం ఆ శతాబ్ది చివరి దశకాలనాటికి ప్రధానంగా అగ్ర ఆధిపత్య కులాలకు చెందిన స్త్రీలలో సామాజిక చైతన్యం చిగురించడానికి కారణభూతమైంది. క్రమక్రమంగా పెరిగిన జండర్ చైతన్యం వలన స్త్రీలు సంఘ సంస్కరణోద్యమంలో పాలుపంచుకో నారంభించారు. తమ సొంత విద్యాభివృద్ధికై కృషి చేయడం, బాలికల కోసం పాఠశాలలు నడపడం, ప్రత్యేక మహిళా సంఘాల నేర్పరచడం, స్త్రీల పత్రికలను నిర్వహించడం మొదలగు కార్యక్రమాల్లో వారు నిమగ్నమయ్యారు. ఈ విధంగా వలస భారతదేశంలో మహిళోద్యమ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. మహిళోద్యమ నిర్మాణంలో మహిళా సంఘాలు మహత్తరమైన పాత్రను పోషించాయి. దాదాపుగా వలస భారతదేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ 20వ శతాబ్ది ప్రారంభం నాటికంతా అనేక మహిళా సంఘాలు ఏర్పడ్డాయి. పట్టణ, నగర స్థాయిల్లో ఏర్పాటైన సంఘాలతో పాటుగా మండల స్థాయి, జిల్లా స్థాయి సంఘాలు కూడా రూపుదిద్దుకున్నాయి. ప్రస్ఫుటమౌతోన్న స్త్రీ చైతన్యానికి సంకేతంగా మూడు జాతీయ స్థాయి మహిళా సంఘాలు కూడా ఏర్పడ్డాయి 20వ శతాబ్ది మూడవ దశకాంతానికల్లా. (మార్గరెట్ కజిన్స్, డొరోథీ చినరాజదాస మొదలగు తొలితరం స్త్రీ వాదుల ప్రయత్నాల ఫలితంగా 1917లో మద్రాస్‌లో స్థాపించబడిన 'ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్' జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయబడ్డ మహిళా సంఘాలలో మొట్ట మొదటిది. స్థాపించబడ్డ సంవత్సరంలోనే స్త్రీల ఓటు హక్కు విషయమై భారత రాజ్య కార్యదర్శి అయిన మాంటేగును కలిసి చర్చించడానికి ఒక ప్రతినిధి బృందాన్ని పంపింది. స్త్రీల ఆకాంక్షల ప్రచారానికై స్త్రీధర్మ అనే పత్రికను ప్రచురించింది. త్రిభాషా పత్రిక అయిన స్త్రీధర్మలో తెలుగు భాగం కూడా ఉండింది (మిగతా రెండు భాషలు ఆంగ్లం, తమిళం). 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఇన్ ఇండియా' అనే జాతీయ మహిళా సంఘం 'ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్'కు భారత శాఖగా ప్రారంభమైంది. 1927లో స్థాపించబడ్డ 'ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్' వలస భారతదేశంలో మహిళోద్యమాన్ని పటిష్టంగా నడపడమే కాకుండా ఇప్పాల్టికీ కృషి చేస్తోంది).

బెంగాల్, బొంబాయి ప్రెసిడెన్సీలలోని స్త్రీలతో పోలిస్తే మద్రాస్ ప్రెసిడెన్సీలోని ఆంధ్ర ప్రాంత స్త్రీలు ఆలస్యంగా ప్రారంభించినప్పటికీ త్వరలోనే సంఘ సంస్కరణోద్యమాన్ని బలోపేతం చేస్తూ అందులో భాగంగా మహిళోద్యమ నిర్మాణానికి ఉద్యుక్తులయ్యారు. (సంస్కర్తల కుటుంబాలకు చెందిన స్త్రీలే కాకుండా అంతంత మాత్రమే విద్యావంతులైన సామాన్య స్త్రీలు కూడా సంఘ సంస్కరణోద్యమం పట్ల సానుకూలంగా స్పందించారు. అనేక మహిళా సంఘాలనేర్పరిచి స్త్రీలలో 'ఐకమత్యం' సాధించాల్సిన ఆవశ్యకతను గూర్చి సభలూ, సమావేశాల్లో తీవ్రంగా చర్చించేవారు. సంఘ సంస్కరణలో ప్రధానాంశం స్త్రీల స్థితిగతులలో మార్పులు తీసుకురావడం కాబట్టి, స్త్రీలు దీన్ని 'తమ విషయం'గా భావించి పనిచేసేవారు. మహిళా సంఘాల ఏర్పాటుతో పాటుగా సంస్కరణానుకూల వాతావరణాన్ని తయారు చేయడానికి బౌద్ధికాయుధాలుగా స్త్రీల పత్రికల్ని ప్రచురించారు. సతీహిత బోధిని, తెలుగు జనానా పత్రిక మొదలైన తొలినాటి స్త్రీల పత్రికల్ని పురుషులు నడిపినప్పటికీ, త్వరలోనే స్త్రీలు పత్రికా నిర్వహణ రంగంలో ప్రవేశించారు. హిందూ సుందరి, సావిత్రి, అనసూయ, వివేకవతి, ఆంధ్రలక్ష్మి, ఆంధ్ర మహిళ మొదలైన పత్రికలు స్త్రీల సంపాదకత్వంలో వెలువడ్డాయి. ఈ అక్షరాయుధాలు మహిళోద్యమ సందేశం విస్తృతంగా వ్యాప్తి చెందడానికీ, ఉద్యమం సంఘటితం కావడానికీ దోహదపడ్డమే కాకుండా మహిళా మేధావుల్నీ, రచయితల్నీ తయారు చేయడంలో కూడా గణనీయమైన పాత్రను పోషించాయి. వలసాంధ్రలోని మహిళోద్యమానికి స్త్రీల పత్రికలు వెన్నుపూసలుగా ఉండినాయని చెప్పడం అతిశయోక్తి ఎంతమాత్రమూ కాదు). బ్రిటిష్ భారతదేశంలోని మిగతా ప్రాంతాల్లోని తమ సోదరీమణుల లాగానే బ్రిటిషాంధ్రలోని స్త్రీలు వివిధ ప్రాంతాలలో అనేక మహిళా సంఘాలను ఏర్పరచి సోదరీతత్వ భావాల పరిమళాన్ని గుబాళింపజేశారు. ఏర్పాటైన ప్రాంతాలకే పరిమితమైన వివిధ సంఘాలు ఒకవైపు పనిచేస్తుండగా ఆంధ్ర స్త్రీలందర్నీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చే కృషి ఫలించి 'ఆంధ్ర మహిళా మహాసభ' 1910 జూన్ 2న ఏర్పాటైంది. గుంటూరులోని 'స్త్రీ సనాతన ధర్మ మండలి' ఆధ్వర్యంలో జరిగిన ప్రథమ 'ఆంధ్ర మహిళా మహాసభ' కాన్ఫరెన్స్‌కు ప్రముఖ ఛాందసవాద మేధావీ, కార్యకర్త అయిన పులుగుర్త లక్ష్మీనరసమాంబ అధ్యక్షత వహించింది. (సావిత్రి పత్రికా సంపాదకురాలైన లక్ష్మీనరసమాంబ వితంతు పునర్వివాహాలను తీవ్రంగా ఖండించి వీరేశలింగం వంటి సంఘ సంస్కర్తలపై చిరుత పులిలాగా లంఘించింది; బాల్య వివాహాలను సమర్థించింది; స్త్రీ విద్యను మాత్రం ప్రోత్సహించింది). వలసాంధ్రలోని వివిధ పట్టణాలలో వార్షిక సదస్సులను నిర్వహించడం ద్వారా 'ఆంధ్ర మహిళా మహాసభ'ను అఖిల భారత మహిళా సంఘం (ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్) రాష్ట్ర శాఖగా ఏర్పాటు చేసి ఆంధ్ర మహిళోద్యమాన్ని అఖిల భారత మహిళోద్యమంతో జోడించారు ఆంధ్ర స్త్రీలు. (ఆంధ్ర

రాష్ట్ర మహిళా మహాసభ మొదటి సమావేశం 1927లో కాకినాడలో జరిగింది. పూర్తి వివరాలు ప్రస్తుతానికి తెలియట్లేదు. గృహలక్ష్మి, జనవరి 1940, పు. 754.). 'ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభ' వలసాంధ్రలోని అనేక పట్టణాలలో వార్షిక సదస్సులను నిర్వహించేది.

ఈ క్రమంలో 'ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభ' 14వ వార్షిక సదస్సు 1939 డిసెంబర్ 16-17న కడపలో జరిగింది. ఈ మహిళా సదస్సు కార్యక్రమాన్ని వివరించడం, అందులో ఆహ్వాన సంఘాధ్యక్షురాలి హోదాలో కడప రామసుబ్బమ్మ ఇచ్చిన ప్రసంగాన్ని విశ్లేషించి ఆమె జండర్ చైతన్యాన్ని స్థూలంగా మదింపు చేయడం ఈ వ్యాసం ఉద్దేశం. ప్రధాన విషయంలోకి వెళ్లే ముందు రామసుబ్బమ్మ ఉపన్యసించిన నాటి చారిత్రక సందర్భాన్నీ ముఖ్యంగా వలన రాయలసీమలో చోటుచేసుకుంటూండిన సామాజిక సంచనాలను రేఖా మాత్రంగానే అయినా తెలుసుకోవడం ప్రధాన విషయాన్ని మెరుగ్గా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

1

విద్యావకాశాల పరంగా కోస్తాంధ్ర స్త్రీలకన్నా వెనుకబడి ఉండినప్పటికీ ('దత్త మండలాలు, నెల్లూరు జిల్లాలో తక్కువ బాలికా పాఠశాలలుండి స్త్రీ విద్యా పరంగా అవి వెనకబడి ఉండినాయ'ని 1905-6 నాటి బాలికల ప్రాథమిక విద్యా స్థితిని గూర్చి వివరిస్తూ వైకుంఠం అభిప్రాయపడ్డారు. 1921-22 నాటికి దత్త మండలాల్లో బాలికల ప్రాథమిక విద్యా స్థితి కొంచెం మెరుగుపడ్డప్పటికీ, మొత్తానికి వెనుకబడి ఉండినట్లు గణాంకాధారాలతో ఆయన నిరూపించారు. పైదే. పు. 97-99. విద్యా పరమైన వెనుకబాటుతనం కారణంగా స్త్రీల చైతన్య స్థాయి కూడా (కోస్తాంధ్ర మహిళలతో పోలిస్తే) తక్కువగానే ఉండిందన్న విషయాన్ని నొక్కి చెప్పాల్సిన అవసరం లేదు కదా!). రాయలసీమ స్త్రీలు సంఘ సంస్కరణోద్యమంలోనూ, వలసవాద వ్యతిరేక జాతీయోద్యమంలోనూ, మహిళోద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారు. రాయలసీమ ప్రాంతంలోని మొట్ట మొదటి మహిళా సంఘమేదో స్పష్టంగా తెలియట్లేదు. 1909లో అనంతపురంలో 'భారత మహిళా శారదా సమాజం' అనే మహిళా సంఘం ఉద్భవించింది. ఈ సంఘం చాలా కాలం కొనసాగినట్లుంది. ఈ సమాజ స్త్రీల ఛాయాచిత్రం 1935 జూన్ నెల గృహలక్ష్మిలో ప్రచురించబడింది. 1910 నవంబర్ 9న కర్నూలులో ప్రారంభమై 'హిందూ స్త్రీ విద్యాభివర్ధనీ సమాజం' కోస్తాంధ్రకు చెందిన క్రియాశీలక మేధావీ మహిళోద్యమ నాయకురాలూ అయిన బుర్రబుచ్చి బంగారమ్మ చొరవతో ఏర్పాటైనప్పటికీ, రాయలసీమ ప్రాంత స్త్రీల సహకారంతో వర్ధిల్లింది. (హైకోర్టు వకీలు పి.యస్. పార్థసారథి అయ్యంగార్ భార్య అయిన జానమ్మ ఈ సంఘపు శాశ్వత అధ్యక్షురాలు కాగా, యస్. సుభద్రమ్మ కార్యదర్శి. ప్రతి శనివారం జరిగే సమావేశాలకు సుమారు 30 నుండి 40 మంది స్త్రీలు హాజరయ్యేవారు. మొదటి సంవత్సరంలో 35 సమావేశాలు జరగ్గా, రెండో సంవత్సరంలో 40 జరిగాయి. 'భక్తి జ్ఞానము', 'భూతదయ', 'సత్యము', 'పరిశుభ్రత', 'పాతివ్రతము', 'గృహ నిర్వాహకము', 'స్త్రీ విద్య' మొదలగు అంశాలపై చర్చించేవారు. సమాజ సభ్యురాండ్రు తమ విద్యాభివృద్ధితో పాటు బాలికల విద్యాభివృద్ధికి కూడా పాటుపడేవారని కార్యదర్శి ప్రశంసించింది. 1911 నవంబర్ 9న జరిగిన సమాజ ప్రథమ వార్షికోత్సవానికి కొంతమంది పాశ్చాత్య స్త్రీలను కూడా కలుపుకొని సుమారు రెండు వందల మంది హాజరయ్యారు. పక్క జిల్లాల స్త్రీలు కూడా ఈ సమాజ సమావేశాలకు హాజరయ్యేవారు. కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన యస్. రాజమ్మ వేరే పనిమీద కర్నూలుకు వచ్చి ఉండి ఈ సంఘాన్ని సందర్శించడమే కాకుండా, రెండు – మూడు ఉపన్యాసాలు ఇవ్వడంతో పాటుగా సంగీత కచేరీని కూడా నిర్వహించింది. సమకాలీన స్త్రీల పత్రికలైన హిందూ సుందరి, వివేకవతి మొదలైన వాటి ద్వారా ఈ సమాజపు సమాచారం లభ్యమౌతున్నది. 'హిందూ స్త్రీ విద్యాభివర్ధనీ సమాజం' స్థాపకురాలైన బుర్రబుచ్చి బంగారమ్మ తొలితరం మహిళోద్యమ నిర్మాత. వలస పాలనలో ఉద్యోగి అయిన భర్త ఏ ప్రాంతానికి బదిలీ అయితే ఆ ప్రాంతంలో ఆమె మహిళోద్యమ బీజాల్ని చల్లుకుంటూ వెళ్లింది. కర్నూలు స్త్రీ సమాజాన్ని ప్రారంభించక ముందే ఆమె ప్రస్తుతం ఒడిశాలో ఉన్న గంజాం జిల్లాలోని అసికాలో 'అసికా హిందూ స్త్రీ సమాజం' (ప్రారంభం 18 సెప్టెంబర్ 1902), విశాఖపట్నంలో 'భారతీ సమాజం' (ప్రారంభం 1904) మొదలైన స్త్రీ సమాజాలను ప్రారంభించింది. నిడుదవోలులో జరిగిన మూడవ ఆంధ్ర మహిళా మహాసభకు ఆమె అధ్యక్షత వహించింది. మహిళోద్యమానికి ఆమె ఎంతగా అంకితమైందంటే నిడుదవోలు మహాసభ ప్రారంభానికి కేవలం ఒక్కరోజు ముందే ఆమె తల్లికి శస్త్ర చికిత్స జరిగినా తన వాగ్దానాన్ని నిలుపుకొంది అధ్యక్ష స్థానాన్నలంకరించడం ద్వారా. ఆమె భర్త బుర్రా వెంకటేశ్వరరావు పంతులు కర్నూలు జిల్లా మునసబుగా పనిచేశారు) 1939 డిసెంబర్ నెల గృహలక్ష్మిలో నంద్యాలలోని మహిళా సమాజపు ఛాయాచిత్రం ప్రచురించారు. 'మదనపల్లి మహిళా సమాజం' 1942లో చిత్తూరు జిల్లా మదనపల్లిలో ఆవిర్భవించింది. (ఈ సమాజ ఏడవ వార్షికోత్సము 1949 జూలై 31న హోప్‌హాల్‌లో జరిగింది. ఆంధ్రరాష్ట్ర మహిళా మహాసభ కార్యదర్శి అయిన శ్రీమతి పద్మాసనమ్మ బి.ఏ., అధ్యక్షత వహించింది. శ్రీమతి కె. సుందరాబాయి సమాజ అధ్యక్షురాలు, శ్రీమతి వి. గౌరీదేవి కార్యదర్శి. చిత్తూరు నాగయ్య, టంగుటూరి సూర్యకుమారి (ఈమె సంగీత కచేరి చేసింది) మున్నగు ప్రముఖులు ఈ వార్షికోత్సవానికి హాజరయ్యారు. చిత్తూరు నాగయ్య ఉపన్యసిస్తూ 'ఇటువంటి మహిళా సంస్థలే భావి భారత భాగ్యమునకు వన్నెదెచ్చును. ఇటువంటి మహిళా సంస్థలను ప్రతి భారతీయుడూ ఆదరించి తగిన సహాయాలనూ, ప్రోత్సహమునూ ఇవ్వవలెను' అని చెప్పి మహిళా సంఘాల ప్రాముఖ్యతను గుర్తించారు. ఈ సంఘం ఆంధ్రరాష్ట్ర మహిళా మహాసభకు మదనపల్లె శాఖగా పనిచేసింది. ఆనాడే నూతన కార్యనిర్వాహకులను ఎన్నుకోవడం జరిగింది. కార్యనిర్వాహక సంఘంలో శ్రీమతి సలీమ సుల్తాన్ అనే ముస్లిం స్త్రీ కూడా ఉండడం విశేషం).

రాష్ట్ర స్థాయి మహిళా సంఘాల వార్షిక సదస్సులకు కూడా రాయలసీమ ప్రాంతం వేదికయ్యింది. బ్రిటిషాంధ్ర స్త్రీల స్వీయ చైతన్యం, చొరవతో ముందుకొచ్చిన 'ఆంధ్ర మహిళా మహాసభ' తొమ్మిదవ వార్షిక సదస్సు 1918 జూన్‌లో కడపలో జరిగింది. ('స్త్రీల అభివృద్ధియే భోజనము నిద్రలు'గా జీవించిన సల్లా సౌందర్యవల్లి అమ్మ దీనికి అధ్యక్షత వహించింది. బులుసు సూరమ్మ, చిల్లరిగె శ్రీనివాస రాయసతి మాత్రమే

ఉత్తర జిల్లాల నుండి వచ్చారు. నెల్లూరు జిల్లా నుండి పొనకా కనకమ్మ, కంచనపల్లి కనకమ్మ, ఎర్రంరెడ్డి కృష్ణమ్మ, ఒంగోలు భువనేశ్వరమ్మ, బెజవాడ నుండి వెంకట సుబ్బమ్మలు వచ్చారు. మాడభూషి చూడమ్మ (కాకినాడ) సభను ప్రోత్సాహపరుస్తూ అభినందన లేఖనంపింది. సరోజినీ దేవి కూడా శుభాభినందనల ఉత్తరం రాసింది. రాయలసీమలో స్త్రీలకు ప్రత్యేకంగా ఒక కళాశాలనేర్పరచడం, ఆంధ్ర మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం మొదలైన తీర్మానాలు చేయడం జరిగింది) అఖిల భారత మహిళా సంఘం (ఎఐడబ్ల్యుసి) రాష్ట్ర శాఖ అయిన 'ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభ' ఎనిమిదవ, పదునాల్గవ, పదిహేనవ వార్షిక సదస్సులు రాయలసీమలోని పట్టణాల్లో జరిగాయి. (ఎనిమిదవ ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌గా విఖ్యాతురాలైన గుమ్మడిదల దుర్గాబాయమ్మ అధ్యక్షతన 1934 నవంబర్ 18న మదనపల్లెలో జరిగింది. కొంతమంది 'హరిజన స్త్రీల'తో కలుపుకొని సుమారు 500 మంది స్త్రీలు హాజరయ్యారు. ఈ మహాసభ నిర్వహణలో కడప రామసుబ్బమ్మ చురుకైన పాత్ర పోషించింది. ఈ పరిశోధనా వ్యాస విషయమైన పదునాల్గవ మహాసభ కడపలో జరిగిందని ముందే తెలుసుకున్నాం. పదిహేనవ మహాసభ కామేశ్వరమ్మ అధ్యక్షతన 1904 నవంబర్ 24న కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగింది) రాయలసీమకు చెందిన కొందరు చైతన్యవంతులైన స్త్రీలు సమకాలీన మహిళోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. వీరిలో డా. కె. లక్ష్మమ్మ (లక్ష్మీదేవి)ను గూర్చి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. బళ్లారికి చెందిన ఈమె వివిధ ప్రాంతాల్లో జరిగే మహిళా సదస్సులకు హాజరై చర్చల్లో పాల్గొనేది. 1931 నవంబర్ 21-22న గుంటూరులో జరిగిన ఐదవ 'ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభ'కు మొత్తం రాయలసీమ ప్రాంతం నుండి ఈమె ఒక్కర్తే హాజరైంది. (ఢిల్లీలోనూ, తర్వాత బొంబాయిలోని నేషనల్ మెడికల్ కాలేజీలోనూ చదివిన డాక్టర్ లక్ష్మమ్మ బొంబాయిలోని కామా అండ్ ఆల్బెన్ ఘోషా ఆసుపత్రిలో సేవలందించింది. అకుంఠిత సంఘ సేవాదీక్ష ఫలితంగా ఆమె 'బొంబాయి ఆంధ్ర మహాసభ'కు సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైంది. 1929 నవంబర్ సంచికలో గృహలక్ష్మి పత్రిక డాక్టర్ లక్ష్మమ్మ సాధించిన విజయాలను ప్రశంసించింది. మద్రాసు ప్రెసిడెన్సీలోని అత్యంత వెనుకబడ్డ తెలుగు జిల్లా అయిన బళ్లారికి చెందిన లక్ష్మమ్మ ఉన్నత విద్యనభ్యసించడం గూర్చి గృహలక్ష్మి ప్రస్తావించడం గమనార్హం) వి. సీతమ్మ బి.ఎ., ఎల్.టి. అనే క్రియాశీల మేధావి 1933 ఏప్రిల్ 16న విశాఖపట్నంలో జరిగిన మొదటి ఉత్తర సర్కారు రెడ్డి స్త్రీల సదస్సుకు అధ్యక్షత వహించింది. తొలితరం క్రియాశీలక మేధావీ, స్త్రీవాదీ అయిన భండారు అచ్చమాంబ (వలసాంధ్రలోని సాంస్కృతిక జీవితాన్ని విశేషంగా ప్రభావితం చేసిన కొమర్రాజు వేంకటలక్ష్మణరావు అక్క అయిన అచ్చమాంబ స్త్రీలను సబలలుగా నిరూపించే ప్రయత్నంలో భాగంగా అబలా సచ్చరిత్ర రత్నమాల అనే స్త్రీల చరిత్ర గ్రంథాన్ని రచించింది) లాగా అల్పాయుష్కురాలైనప్పటికీ సమకాలీన ఉద్యమాలన్నింటిలోనూ, ముఖ్యంగా సంఘ సంస్కరణోద్యమ, మహిళోద్యమాలలో గణనీయమైన పాత్ర పోషించిన దరిశి అన్నపూర్ణమ్మ జన్మించింది బళ్లారిలో. గదర్ పార్టీ స్థాపకులలో ఒకరూ, వీరేశలింగానంతర ఆంధ్ర దేశంలో సంఘ సంస్కరణోద్యమానికి, ముఖ్యంగా వైశ్యులలో సంస్కరణోద్యమానికి వెన్నెముకగా నిలిచిన దరిశి చెంచయ్య మొదటి భార్య అన్నపూర్ణమ్మ. ప్లేగు వ్యాధి భారిన పడినవారికి సేవలు చేస్తూ అచ్చమాంబ అసువులు బాస్తే, ఒక వితంతు పునర్వివాహానికి హాజరై వచ్చిన తర్వాత అన్నపూర్ణమ్మ చనిపోయింది. (వలసాంధ్రలోని అత్యంత ప్రభావవంతులైన క్రియాశీలక మహిళా మేధావులలో పేర్కొనదగ్గది దరిశి అన్నపూర్ణమ్మ (1907 - 28 నవంబర్ 1931). సంఘ సంస్కరణలో అనురక్తురాలైన వితంతువైన తల్లి ప్రోత్సాహంతో బళ్లారి కాన్వెంట్ స్కూలులోనూ, తిరువళిక్కేణి బాలికల ట్రెనింగ్ కాలేజీలోనూ, గుంటూరులోని శారదానికేతనములోనూ విద్యాభ్యాసం చేసిన ఈమె రజస్వలానంతరం తన పదిహేనవ ఏట దరిశి చెంచయ్యను పెండ్లి చేసుకొని దరిశి అన్నపూర్ణమ్మగా సుప్రసిద్ధురాలైంది. భర్తకు 'అనుకూలవతి అయిన భార్య'గా ఉండి సంఘ సంస్కరణోద్యమం లోనూ, వలసవాద వ్యతిరేక జాతీయోద్యమంలోనూ, మహిళోద్యమంలోనూ ప్రముఖ పాత్ర వహించింది. వితంతు పునర్వివాహోద్యమంలో చురుకుగా పాల్గొన్న ఆమె (వివిధ కులాలలో) 18 వితంతు పునర్వివాహాలను జరిపించడంలో కృతకృత్యురాలైంది. యామినీ పూర్ణ తిలకమ్మతో కలిసి కళావంతుల సంస్కరణకు పాటుపడింది. విజయవాడలోని 'భారత మహిళా మండలి' ద్వారా కొమర్రాజు అచ్చమాంబ, తుర్లపాటి రాజరాజేశ్వరమ్మలతో కలిసి మహిళోద్యమ వ్యాప్తికి కృషి చేసింది. 1929లో బొంబాయిలో జరిగిన అఖిల భారత మహిళా సభకు ఆంధ్ర ప్రాంతం నుండి వెళ్లిన ముగ్గురు ప్రతినిధులలో ఈమె ఒకరు. అద్భుతమైన బహిరంగ కార్యకర్తే కాకుండా, సునిశిత మేధావీ రచయితా అయిన అన్నపూర్ణమ్మ పలు సామాజిక విషయాలపై రచనలు చేసింది. ఆమె రచనలు చాలా వరకు సంస్కరణ పక్షం వహించిన ఆర్య వైశ్యుల మాస పత్రిక అయిన వాసవిలో ప్రచురించబడ్డాయి. గృహలక్ష్మిలో కూడా కొన్ని రచనలు ప్రచురించింది. 1931 నవంబర్‌లో బందురులో జరిగిన ఒక వైశ్య వితంతు పునర్వివాహము నుండి వెనక్కి వచ్చిన తర్వాత అన్నపూర్ణమ్మ చనిపోవడం కేవలం కాకతాళీయం కాదు: బహిరంగ కార్యకలాపాల్లో ఎంత తీవ్రంగా లీనమై దస్సిపోయిందో ఇది మనకు చెప్పకనే చెబుతుంది. సంఘ సంస్కరణకై తన ప్రాణాలను పణంగా పెట్టిందంటే అతిశయోక్తి ఎంతమాత్రమూ కాదు. 'చనిపోవు సరికి ఈయమకు ఇరువదియైదు సంవత్సరములు. ఇట్టిదే వైదుష్యము, ఇట్టిదే సంఘ సంస్కరణాభిలాష, ఇట్టిదే దేశహితకాంక్ష, ఇదే పేరు. శ్రీ మాగంటి అన్నపూర్ణ దేవియు ఇదే వయసున చనిపోయెను. ఆంధ్రుల దురదృష్టము' అని 1932 జనవరి 1 నాటి గృహలక్ష్మి సంపాదకీయం అన్నపూర్ణమ్మకు అశ్రు నివాళులర్పించింది. ఇంత గొప్ప కార్యశీలి గూర్చి ప్రస్తుత ఆంధ్రదేశం పూర్తిగా మరిచిపోయినట్లుంది) ఈ విధంగా చైతన్యవంతులైన రాయలసీమ ప్రాంత స్త్రీలు బహిరంగ రంగంలో కృషి చేస్తూండినారు. (వలసాంధ్రలో సంఘ సంస్కరణపై వెలువడ్డ పుస్తకాలు దాదాపుగా కోస్తా జిల్లాల్లోని మేధావుల గూర్చీ, కార్యకలాపాల గూర్చీ మాత్రమే చర్చించడం కారణంగా రాయలసీమ ప్రాంతంలో చోటుచేసుకొన్న సామాజిక సంచలనాలకు సంబంధించిన సమాచారం పెద్దగా తెలియడం లేదు. ఈ ప్రాంతంలోని చరిత్రకారులు ఎక్కువగా జాతీయోద్యమం మీద దృష్టి పెట్టడం కారణంగా సామాజికోద్యమాలకు సంబంధించి పైపై సమాచారం మాత్రమే తెలుస్తున్నది. వలస రాయలసీమ సామాజిక చరిత్రను

వెలికితీయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది: ముఖ్యంగా ఈ ప్రాంత చరిత్రకారులు ఈ దిశలో కృషి చేస్తే బాగుంటుంది).

ఈ చారిత్రక నేపథ్యంలో కడప రామసుబ్బమ్మ సామాజిక రాజకీయ కార్యకలాపాల వేదికపైకొచ్చింది. కపడ జిల్లా జమ్మలమడుగు తాలూకా సుద్దపల్లె గ్రామానికి చెందిన పండితుడూ, చేతికి ఎముకలేని దాతా అయిన కొనుదుల రామచంద్రారెడ్డి, అచ్చమాంబ దంపతులకు 1902లో జన్మించింది రామసుబ్బమ్మ. 1917లో పదిహేనవ ఏట కడప కోటిరెడ్డిని పెళ్లాడింది. కోటిరెడ్డి లండన్ నుండి బారిష్టర్ పట్టా పుచ్చుకున్నాడు. భర్త ప్రోత్సాహంతో సమకాలీన విషయాల్లో అద్భుతమైన శ్రద్ధ కనపరచిన రామసుబ్బమ్మ భారత వలసవాద వ్యతిరేక జాతీయోద్యమంలో పాల్గొనడం ఆశ్చర్యకరమైనదేమీ కాదు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రోద్యమంలో కూడా రామసుబ్బమ్మ తలమునకలైంది. 1933లో కడప డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్‌కు అధ్యక్షురాలైన ఆమె 1938లో కడప జిల్లా బోర్డు అధ్యక్షురాలైనంత వరకూ ఆ పదివలో కొనసాగింది. జిల్లా బోర్డుకు అధ్యక్షత వహించిన మొట్ట మొదటి స్త్రీ అయిన రామసుబ్బమ్మ 1943 ఆగస్టు 15 దాకా సదరు పదవి ద్వారా శ్లాఘనీయమైన సేవలనందించింది. జిల్లా బోర్డు అధ్యక్షురాలుగా రామసుబ్బమ్మ సాధించిన విజయాల్ని 'శ్రీమతి రామసుబ్బమ్మ గారి పరిపాలనా ప్రాభవము' శీర్షికన సెప్టెంబర్ 1940 నాటి గృహలక్ష్మి (పు. 432) ప్రశంసించింది.

2

పదునాల్గవ 'ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభ' 16-17 డిసెంబర్ 1939లో జరిగింది. 'గృహలక్ష్మి ప్రత్యేక ప్రతినిధి' కార్యక్రమ విషయాలనూ, విశేషాలనూ మిక్కిలి శ్రద్ధతోనూ కడుదీర్ఘంగానూ రిపోర్ట్ చేయడం జరిగింది. (డా. కె.యన్. కేసరి సంపాదకత్వంలో 1928 మార్చ్ నుండి మద్రాస్‌లో ప్రచురించబడ్డ గృహలక్ష్మి 1960కి పైగా కొనసాగింది. వలసాంధ్రలోని స్త్రీల పత్రికలలో ప్రధానమైనది. ప్రచురణ నిమిత్తం స్త్రీల రచనలకు అగ్ర తాంబూలం ఇచ్చిన గృహలక్ష్మి స్త్రీ రచయితలను ప్రోత్సహించడంతో పాటుగా వారు తమ ఆకాంక్షలను స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి మహత్తరమైన అవకాశాన్ని కల్పించింది. స్త్రీ రచయితలకు ప్రేరణా ప్రోత్సాహాలనిచ్చే నిమిత్తం కేసరి ప్రతి సంవత్సరం 'గృహలక్ష్మి స్వర్ణకంకణం'ను బహుకరించేవారు. స్త్రీల హక్కులకు సంబంధించిన చైతన్యం కలిగించడంలో దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సంపాదకత్వంలో వెలువడ్డ 'ఆంధ్ర మహిళ'కు ఏమాత్రం తగ్గలేదు గృహలక్ష్మి కృషి. స్త్రీలలో క్రమేణా పెరుగుతున్న జండర్ చైతన్యాన్ని గృహక్ష్మి తన పుటలలో నిక్షిప్తం చేసి భావితరాలకు అందించింది. మహిళోద్యమ నిర్మాణం వ్యాప్తిలో గృహలక్ష్మి సేవ వేనోళ్ల కొనియాడ తగింది. సమకాలీనంగా అనేక మందిలో ఆసక్తిని రేపిన పదునాల్గవ ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభ కార్యక్రమ విశేషాలనూ, సభాధ్యక్షురాలి ఉపన్యాసాన్నీ, ఆహ్వాన సంఘాధ్యక్షురాలి స్వాగతోపన్యాసాన్నీ ప్రముఖంగా ప్రచురించడమే కాకుండా ఒక సంపాదకీయాన్ని కూడా ప్రచురించింది) 'అత్యంత వైభవముగ' జరిగిన ఈ సదస్సుకు 'హైదరాబాద్ వాస్తవ్యుర్యాలును, సుప్రసిద్ధ సంఘ సేవాధురీణయు' అయిన శ్రీమతి బేగం అమీరుద్దీన్ అధ్యక్షత వహించింది. కడప రామసుబ్బమ్మ ఆహ్వాన సంఘాధ్యక్షురాలు కాగా, కుముదం భోగి, వామగిరి కృష్ణారావు సతిలు కార్యదర్శులు. 'ప్రస్తుత పరిస్థితులయందు మహిళా సమస్యలను సింహావలోకనమొనర్చుటకును, రాబోవు సంవత్సరమునకు కార్యక్రమమునేర్పాటు చేసికొనుటకును, అఖిల భారత మహిళా సభకు ఆంధ్ర దేశము నుండి ప్రతినిధులను పంపుటకును మొదలైన వివిధ విషయములను చర్చించుట' ఈ మహిళా మహాసభ ఉద్దేశం. వలసాంధ్రలోని వివిధ ప్రాంతాల నుండి సుమారు 200 మంది స్త్రీలు ప్రతినిధులుగా సదస్సు కొచ్చారు. వారిలో కొందరు : గంధం అమ్మన్న రాజా ఎం.ఎల్.ఎ, పెద్దాడ సుభద్రమ్మ (ఏలూరు), మాగంటి శకుంతలాదేవి (మద్రాసు), సి.హెచ్. చంద్రమతి (రాజమండ్రి), ఎగ్గారు వెంకటరత్నమ్మ (నంద్యాల), కె. పిచ్చమ్మ (బెజవాడ), రామ తులశమ్మ (గుడివాడ), వేముగంటి పాపాయమ్మ (కాకినాడ), రెడ్డి లక్ష్మమ్మ (కర్నూలు). సభకు రాలేకపోయిన బొబ్బిలి రాణి, చల్లపల్లి రాణి, విజయనగరం మహారాణి, వెంకటగిరి రాణి, పెద్దాడ కామేశ్వరమ్మ, ముత్తులక్ష్మి రెడ్డి, భారతీదేవి రంగ, మార్గరేట్ కజిన్స్ మొదలైనవారు సభ 'జయప్రదముగ' జరగాలని కోరుతూ ఉత్తరాలు రాశారు. ముసాఫర్ బంగళా ఆహూతులకు విడిది.

సభ ప్రారంభ దినాన 'అధ్యక్షురాలిని, తదితర ప్రతినిధులను బ్యాండు వాయిద్యములతో, ప్రొద్దుటూరు సేవాసదనపు బాలికల జాతీయ గీతములతో ఊరేగించి' సభా వేదిక అయిన జిల్లా బోర్డు కార్యాలయానికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ప్రారంభమైన మొదటి రోజటి సమావేశానికి సుమారు వేయి మంది స్త్రీలు పరిసర గ్రామాల నుండి వచ్చారు. రెండవ రోజు ఆశ్చర్యకరంగా ఈ సంఖ్య రెండు వేలకు పెరిగింది. 'పెక్కు మంది మహమ్మదీయ స్త్రీలును, క్రైస్తవ స్త్రీలును' రావడం విశేషం. 'వివిధ భాషలు గల స్త్రీ జనమైనను, అందరును అత్యంతోత్సాహముతో కార్యకలాపమునందు పాల్గొనిరి' అని గృహలక్ష్మి ప్రతినిధి ఉత్సాహంగా నివేదించారు.

ఆహ్వాన సంఘాధ్యక్షురాలి హోదాలో రామసుబ్బమ్మ స్వాగతోపన్యాసం చేసింది. ఆమె ప్రసంగ కాలం నాటికి భారతీయ మహిళల్లో హక్కులకు సంబంధించి మహత్తర చైతన్యం ఏర్పడి ఉండింది. 'ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభ' మాతృ సంస్థ అయిన అఖిల భారత మహిళా సంఘం (ఎఐడబ్ల్యుసి) ఆధ్వర్యంలోని మహిళోద్యమం స్త్రీల హక్కులకై పోరాడుతుండింది. సార్వజనీన వయోజన ఓటు హక్కు, సమాన వారసత్వపు హక్కు, విడాకుల హక్కు, వ్యభిచార వృత్తి నిర్మూలన మొదలగు విషయాల్లో చట్టపరమైన మార్పుల కోసం ముమ్మరంగా కృషి చేస్తూండింది. 1934 నవంబర్ 24ను లీగల్ డిసెబిలిటీస్ డేగా ప్రకటించింది. మహిళోద్యమ కృషి ఫలితంగా బ్రిటిష్ భారత ప్రభుత్వం బి.యన్. రావ్ అధ్యక్షతన హిందూ లా కమిటీని 1940లో ఏర్పరచి హిందూ చట్టంలో స్త్రీల స్థానాన్ని పరిశీలించి మార్పులకై తగిన సూచనలనివ్వవలసిందిగా కోరింది. కాబట్టి సహజంగానే అఖిల భారత మహిళోద్యమ ఆకాంక్షలు రామసుబ్బమ్మ ఉపన్యాసంలో ప్రతిఫలించాయి.

రామసుబ్బమ్మ ఉపన్యాసంలో స్త్రీ విద్య, బాల్య వివాహాలు, బాల వైధవ్య సమస్య, స్త్రీల వారసత్వ హక్కులు, విడాకులు, స్త్రీ స్వాతంత్ర్యము, పురుష దురహంకారము, దేశ స్వాతంత్ర్యము, మత సామరస్యం మొదలైన విషయాలు చర్చించబడ్డాయి.

బాల్య వివాహ, బాల వైధవ్య సమస్యలను తీవ్రంగా ఖండించిన రామసుబ్బమ్మ ఈ దురాచారములు 'మన సంఘమును పీల్చి పిప్పిచేయుచున్నవి' అని ప్రకటిస్తూ 'వీటిని రూపుమాపుట మన కర్తవ్యము' అని స్త్రీలకు కర్తవ్య ప్రబోధ చేసింది. పందొమ్మిదో శతాబ్దం నుండీ సంఘ సంస్కర్తలు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా తీవ్ర ప్రచారం సల్పినప్పటికీ, ఇరవయ్యో శతాబ్ది ప్రథమార్థం నాటికి కూడా పెద్దగా ఆశావహమైన వాతావరణమేమీ ఏర్పడలేదు. ఈ కింది పట్టికలు ఈ విషయాన్ని స్పష్టపరచగలవు.

పట్టిక 1

1931 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో బాల వివాహితులు, బాల వితంతువులు (0–15 వయస్సుల వరకు)

వయస్సు	బాల్య వివాహితలు		బాల వితంతువులు	
	1921	**1931**	**1921**	**1931**
0–1	2,144	21,330	197	594
1–5	82,860	3,77,983	6,536	13,196
5–10	8,26,483	20,19,675	46,275	54,475
10–15	27,69,858	33,33,957	1,36,509	98,326
0–15	36,81,072	57,52,945	1,89,517	1,66,591

ఆధారం: 'సప్తమాంధ్ర రాష్ట్రీయ మహిళా సభ, ఏలూరు, 4–11–33లో డా. ముత్తులక్ష్మిరెడ్డి అధ్యక్షకోపన్యాంలోని ప్రధాన భాగం', గృహలక్ష్మి, డిసెంబర్ 1933, పు. 832–834, పట్టిక – 833. (మద్రాసు, బెంగాలు, బీహారు, ఒరిస్సా, అస్సాంలలోని సమిష్టి జనాభా లెక్కల ప్రకారం)

పట్టిక 2

1931 జనాభా లెక్కల ప్రకారం ప్రతి వేయి మంది స్త్రీలలో 5 సంవత్సరాలలోపు, 5–10 సంవత్సరాలలో వివాహితులైనవారి సంఖ్య

జిల్లా	0–5 సం॥	5–10 సం॥
విశాఖపట్నం నాటు	111	442
తూర్పు గోదావరి నాటు	104	193
గుంటూరు	103	167
గంజాము నాటు	98	416
పశ్చిమ గోదావరి	87	177
కృష్ణా	57	145
నెల్లూరు	24	86
విశాఖపట్నం కొండలు (ఏజెన్సీ)	13	77
గంజాము కొండలు	8	416
తూర్పు గోదావరి కొండలు	4	96

ఆధారం: గరిమెళ్ల సత్యనారాయణ, 'ఆంధ్రులు–అతి బాల్య వివాహములు, గృహలక్ష్మి, మే 1933, పు. 194–197; పై పట్టికకై పు. 195. ('నాటు' అంటే బహుశా మైదాన ప్రాంతం.)

పట్టిక 3

1931 జనాభా లెక్కల ప్రకారం 5 సంవత్సరాల హిందూ బాలికలలో వివాహితలైనవారు (ప్రతి వెయ్యికి)

జిల్లా	వివాహిత బాలికల సంఖ్య
చిత్తూరు	1.87
అనంతపురం	2.00
కడప	3.35
తూర్పు గోదావరి కొండలలో	4.00
కర్నూలు	4.80
బళ్లారి	6.60
గంజాము కొండలలో	8.00
విశాఖపట్నం కొండలలో	13.00
నెల్లూరు	24.00
కృష్ణా	57.00
పశ్చిమ గోదావరి	87.00
గంజాము నాటు	98.00
గుంటూరు	103.00
తూర్పు గోదావరి నాటు	104.00
విశాఖపట్నం నాటు	111.00

ఆధారం: గరిమెళ్ల సత్యనారాయణ, 'ఆంధ్రులు – అతి బాల్య వివాహములు', గృహలక్ష్మి, మే 1933, పు. 195–196. సత్యనారాయణ ఇచ్చిన పట్టికలోని తెలుగు జిల్లాల సమాచారాన్ని మాత్రమే ఇక్కడ మనం పొందుపరచడం జరిగింది.

బ్రాహ్మణ, వైశ్య కులస్థులలోనే కాకుండా శూద్రులుగా వర్ణధర్మ ముద్రలు వేయబడ్డ కులాల ప్రజల్లోనూ, 'అంటరానివారు'గా ఛీత్కరింపబడ్డ కులాలకు చెందిన ప్రజల్లోనూ, ఖురాను సూత్రాలను గాల్లో వదిలేసిన ముస్లింలోనూ, క్రైస్తవులలోనూ బాల్య వివాహ షైతాను ఇళ్లు చేసుకోనుండింది. (22) బ్రాహ్మణులు, వైశ్యులలో ఇది అత్యంత భయంకరంగా తాండవమాడింది. వితంతు పునర్వివాహాలు జరగకపోవడం కారణంగా (ముఖ్యంగా బ్రాహ్మణ, వైశ్య కులాలలో) 'రండా గర్భాలూ', భ్రూణ హత్యలూ, శిశు హత్యలూ జరిగేవి. (23) బాల్య వివాహం కారణంగా 'బాల మాతల' మరణాలూ, శిశు మరణాలూ అధికంగా ఉండేవి. (24) బాలికా విద్యాభివృద్ధికి తీవ్ర ప్రతిబంధకంగా పరిణమించిన బాల్య వివాహాలు బాలికల 'బాల్యానుభవాన్ని' హరించివేసేవి. పరిస్థితి తీవ్రతను గమనించిన సంస్కర్తల, ముఖ్యంగా మహిళోద్యమ, కృషి ఫలితంగా శారదా శాసనంగా ప్రఖ్యాతి గాంచిన బాల్య వివాహ నిరోధక చట్టాన్ని బ్రిటిష్ భారత ప్రభుత్వం చేసింది. 1927 సెప్టెంబర్‌లో చేయబడ్డ చట్టం 1930 ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం, 14 సంవత్సరాలలోపు బాలికల వివాహాన్ని నిషేధించడం జరిగింది.

(ఇంకా ఉంది)

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, హిస్టరీ, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, హైదరాబాద్)

వీ

డిసెంబ్రిస్ట్ సైనిక తిరుగుబాటు పరిణామాలు - 11

జారిజం మీద 1825 డిసెంబర్‌లో జరిగిన తిరుగుబాటు రెండు వందల సంవత్సరాల తర్వాత కూడా ప్రభావం చూపుతున్నదంటున్నారు ఎన్.వి.యస్. నాగభూషణ్

(గత సంచిక తరువాయి..)

ప్రజలలో ప్రబలిన అశాంతిని పోగొట్టడానికి జార్ నీకొలాస్2 ప్రజలకొక విజ్ఞప్తి చేస్తూ, ఇకపై రాజ్యంలో అధికారం రాజ్యాంగపరమైన రాజరికంగా ఉంటుందని కల్లబొల్లి కబుర్లు చెబుతూ, విప్లవకారుల నుండి ప్రజాస్వామిక వాదుల్ని చీల్చి, సామాన్య ప్రజల్ని బుజ్జగించేందుకు అక్టోబర్ ప్రణాళికను ప్రకటించాడు. ఎన్నికలు జరిపి, దూమ (పార్లమెంటు)ను ఏర్పాటు చేస్తానని వాగ్దానం చేశాడు గాని, ఆ దూమకు ఎలాంటి అధికారాలూ లేవు. అది చేసిన తీర్మాణాలు చట్టరూపం దాల్చాలంటే జార్ ఆమోదం తప్పనిసరి. అతడు ఆమోదించకపోతే అవి ఉట్టి చిత్తు కాగితాలు మాత్రమే. అయినప్పటికీ, ఇది ప్రజాస్వామిక వాదులను కొంతమేర సంతృప్తి పరిచేదిగా ఉన్నందున అల్లర్లు క్రమేణా సర్దుమణిగాయి. దీంతో మొదటి సారిగా రష్యాలో ఎన్నికల ద్వారా (ఇందులో ఓటింగ్ నియోజకవర్గాల విభజన, ఓట్ల విలువ భూస్వాములకు అధికం, సామాన్య, కార్మిక జనాలకు అతి తక్కువ విలువ) ఒక మంత్రి మండలి దూమ ద్వారా ఏర్పడింది. అయినప్పటికీ, ఈ మంత్రి మండలి గానీ, దూమ గానీ అతికొద్ది కాలమే ఉన్నది. అనతి కాలంలోనే అది రద్దయింది. ఏమైనా ప్రజల్లో ఏర్పడ్డ నిరసనల ఊపు 1905 చివరి కల్లా తగ్గిపోయింది. రాజ్యానికీ, ఉదారవాదులకూ మధ్య ఒక అవగాహన ఏర్పడింది. ఇక మరోవైపు 1905 తర్వాత సైద్ధాంతిక దేశభక్తి వాదం ప్రాముఖ్యత అడుగంటింది. ఇదంతా క్రిమియా యుద్ధం తర్వాత జరిగింది. ఇదంతా 1856-1863 మధ్య ఏం జరిగిందో, అది అలాగే సైద్ధాంతిక దేశభక్తి వాదం నశించినందువల్ల ఏర్పడ్డ ఐక్యస్లావ్ ఉద్యమం కూడా ప్రాముఖ్యత కోల్పోయి, మరీ దిగజారి, అత్యంత తిరోగమనమైన ఆధ్యాత్మిక వాదంలోకి మారిపోయింది. 'సోలోవియేవ్' దీని ప్రవక్త. ఈ కాలంలోనే దేశీయాంగ మంత్రిగానూ, ప్రధాన మంత్రిగానూ పనిచేసిన స్తోలీపిన్ అతి భయంకరంగా సాగించిన తిరుగుబాటుదారుల వేటతో 'అంధకార యుగా'నికి ప్రేరకుడయ్యాడు. తిరుగుబాటుదారులను కనిపించిన వారిని కనిపించినట్లు దాడిచేసి చంపడం, ఏ చిన్న అనుమానం వచ్చినా జైళ్లలో బంధించి అమానుష చిత్రహింసలు పెట్టడం సాగించి, చరిత్రలో ఒక చీకటి అధ్యాయానికి కారకుడయ్యాడు స్తోలీపిన్. వేలాది మందిని ఉరికొయ్యలకు వేలాడదీస్తుండడంతో ఆ ఉరులను 'స్తోలీపిన్ నెకొటై' లని జనాలు పిలిచేవారు.

ఏమైనా చరిత్రలో ప్రథమ విప్లవంగా ప్రసిద్ధికెక్కిన 1905 నాటి సాయుధ తిరుగుబాటు ఓటమి చెందింది. అయితే ఈ సాయుధ తిరుగుబాటు ప్రాధాన్యత ఎంతో ఉన్నదన్న విషయం 1907లో గానీ బాగా అర్థం కాలేదు. విప్లవకారులు తమ ఓటమి నుండి గుణపాఠాలు గ్రహించారు. దాంతో రానున్న విప్లవాలకు మరింత సన్నద్ధత చూపించారు. ఒక చిన్న నిప్పుకణమే సరిపోయింది విప్లవం మొదలవడానికి. ఆకస్మికంగా జరిగిన సంఘటన ద్వారా మొదలైన ప్రథమ ప్రపంచ యుద్ధం (1914-18) వల్ల చాలా కాలంగా ఎదురు చూసిన అవకాశం లభించింది. ఈసారి ప్రతిక్రియ జరపవలసిన వర్గాలు (కార్మిక జనం, రైతాంగం, సామాన్య ప్రజలు, మధ్యతరగతి) దృఢంగా నిలబడ్డారు. వారు వీధుల్లోకి రాకుండా ఆలస్యం చేసేందుకు, లోగడ 1905 ప్రథమ విప్లవ కాలంలో లాగా కొన్ని ఆశలు చూపించి చీల్చేందుకు ఈసారీ జార్ యత్నించబోయాడు గానీ, అతడి ప్రయత్నం ఫలించలేదు. దాంతో నీకొలాస్2 తన అధికారాన్ని మాత్రమే గాక, అసలు జారిస్టు అధికారమే, నిజానికి రాజరికమే అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. అతడు 1917 మార్చ్ 15న పదవి నుంచి దిగిపోయాడు. నిజానికి 1917 ఫిబ్రవరిలోనే విప్లవం విజయం సాధించింది. తిరుగుబాటు జరిపిన వర్గాలలో కొన్ని వర్గాలకు, ముఖ్యంగా బోల్షివిక్కులకు తెలీకుండా, చర్చలు రహస్యంగా సాగించి, అధికార స్వీకరణ విషయంలో ఒక అవగాహనకు వచ్చారు బూర్జువాలూ, మెన్షివిక్కులూ.

1917 మార్చి 16న తాత్కాలిక ప్రభుత్వం, రాకుమారుడు గ్రిగరీల్వోవ్ ఆధ్వర్యంలో బూర్జువాలకూ, మెన్షివిక్కులకూ, రివల్యూషనరీ సోషలిస్టులకూ ఒక అవగాహన కుదిరి మంత్రివర్గం ఏర్పడింది. ఈ అవగాహన ప్రకారం రాజకీయ, ఇతర సంస్కరణలు అమలు జరగాలి. ముఖ్యంగా ప్రజలకిచ్చిన వాగ్దానం రైతాంగానికి భూమీ, ప్రజలకు తిండీ, ప్రజలందరికీ శాంతీ (యుద్ధం నుండి విరమణ చేసి) అందివ్వాలి. కానీ ప్రభుత్వం ఈ వాగ్దానాలు అమలు చేయకుండా, వాయిదాల మీద వాయిదాలు ప్రకటిస్తూ, సామ్రాజ్యవాదులతో కుమ్మక్కై యుద్ధాన్ని కొనసాగించడమే గాక, యుద్ధ కాంట్రాక్టుల ద్వారా ప్రభుత్వానికి మద్దతు నిస్తున్న బూర్జువాలు విపరీత లాభాలార్జిస్తూ, ప్రజల సమస్యల్ని పెడచెవిన పెట్టసాగారు. ఇలాంటి సమయంలో విదేశాలలో ప్రవాస జీవితం గడుపుతున్న లెనిన్, స్వదేశం రావడానికి ఎంతో సాహసవంతంగా రహస్యంగా ప్రయాణించి ఎలాగో రష్యాకు రాగలిగాడు. మరోపక్క తాత్కాలిక ప్రభుత్వం కరువు, తీవ్ర ఆహార కొరతతో ఆకలితో అలమటిస్తున్న ప్రజల సమస్యలను గాలికి వదిలేయడంతో ప్రజాందోళనలు మరల పెరిగాయి, తీవ్రరూపం దాల్చి, బోల్షివిక్కులకు మద్దతుదారులుగా ఆందోళనకారులు మారిపోయారు. మరోపక్క తాత్కాలిక ప్రభుత్వం ప్రజాందోళనల్ని అణచివేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుండడంతో బోల్షివిక్ సెంట్రల్ కమిటీ ఒక తీర్మానాన్ని ఆమోదిస్తూ ప్రభుత్వాన్ని రద్దు చేయమని, పెట్రోగాడ్ సోవియట్‌కు మద్దతునివ్వమని పిలుపునివ్వడంతో అక్టోబర్ సాయుధ తిరుగుబాటు విప్లవం మొదలైంది. కేవలం ఒక రోజున్నర వ్యవధిలోనే అక్టోబర్ 25న బోల్షివిక్కులు విజయం సాధించి, ప్రపంచంలోనే తొలిసారిగా రష్యాలో శ్రామికవర్గ నియంతృత్వ ప్రభుత్వాన్ని స్థాపించి, సోషలిజాన్ని అమలు చేయసాగారు.

సమన్వయం

17వ శతాబ్దం రెండో అర్ధ భాగంలో రష్యన్ రాజరికం, తన కేంద్రీకృత పాలనావ్యవస్థను బలోపేతం చేస్తూ దాంతో పాటు పనిలో పనిగా రైతాంగ ప్రజల స్వేచ్ఛను రద్దుచేసి, వారిని చట్టబద్ధంగానే 'బానిసలు'గా ప్రకటించింది. (1649లో నాటి జార్, ఈ దురాగతానికి పాల్పడినవాడు

'అలెక్సిచ్ మిహాయిల్ విచ్'. అతడు రూపొందింప జేసిన 'లాకోడ్–1649' చట్టాన్ని 'జెమ్స్కీసోబోర్' (నాటి పార్లమెంటు) ఆమోదించింది. రైతాంగాన్ని నాటి నుంచీ 'ఖోలోప్' (బానిస రైతు) అనే పేర పిలవసాగారు – రచ.)

ఇలాంటి అత్యంత ఘోరమైన, వర్ణించడానికే వీలులేనంత దుర్మార్గమైన చట్టం కారణంగా ప్రజలలో అత్యధిక సంఖ్యాకులైన రైతాంగ ప్రజల జీవితాలు ఎంతగా కుమిలిపోతాయో, వందల సంవత్సరాల పాటు వారి జీవితాలూ, వారి పిల్లల జీవితాలూ అవమాన భారంతో కుంగిపోతూ, బతుకులు ఎంతగా దిగజారిపోతాయో కూడా ఆ జార్ ఏమాత్రం ఆలోచించాడు కాదు. ఒకవేళ ఆలోచించినా లెక్కచేసి ఉండేవాడు కాదు. ఎందుకంటే ఇలాంటి పాలకులకు సామాన్య ప్రజలు కేవలం ప్రాణం లేని మట్టి బొమ్మలు లేదా జంతువులకన్నా హీనం. తాము ప్రజలపై సాగించే దాష్టికాలను అమలు చేసే గూండా సైన్యాల సాయంతో వారు తలచుకుంటే ఏదైనా చేయగలరు. ఏవైనా తిరుగుబాట్లు జరిగితే ఆ గూండా సైన్యాల సహాయంతో కేవలం వారిని నరికివేయడం ఒక్కటే వారికి తెలుసు.

అయితే ఏది ఏమైనా ప్రాణాలకు సైతం తెగించి ప్రజలు తిరగబడ్డారు – పుగాచేవ్ ఆధ్వర్యంలో ఆ తిరుగుబాటు కేథరిన్2 కాలంలో జరిగింది. ఆ తిరుగుబాటు (1773–75) అతి తీవ్ర స్థాయిలో జరిగి, కేథరిన్ సింహాసనానికే ముప్పొచ్చిందా అని కూడా ఒకానొక సమయంలో అనిపించింది. ఈ తిరుగుబాటు ఆమెను ఎంతగా భయపెట్టిందంటే, తానుండే రాజ సౌధాన్ని కూడా విడిచి బయటకు రాకుండా, ఇంట్లోనే పాలనా బాధ్యతలు కూడా, సైనిక వ్యూహాలు కూడా పన్నేంతగా. ఒక్క సెయింట్ పీటర్స్ బర్గ్ నగరం రక్షణకే 40 వేల మంది సాయుధ సైన్యాలను పెట్టి కాపలా కాయించింది. ఇదంతా పుగాచేవ్ అనుచరులు కొద్దిమంది కేవలం సెయింట్ పీటర్స్ బర్గ్‌కు 1100 కిలోమీటర్లకు పైగా ఉన్న నీఝ్ని – నొవొగొరోద్ పట్టణానికి వచ్చారన్న సమాచారం వినగానే! అంతగా ఆ పుగాచోవ్ రైతాంగ తిరుగుబాటు ఆమెను భయపెట్టడానికి కారణం, పలు విశాల ప్రాంతాలను పుగాచోవ్ రైతాంగ సేనలు జయించి ఆ ప్రాంతాలపై ఆధిపత్యాన్ని నెలకొల్పి, ప్రజల నుండి పన్నులు కూడా వసూలు చేయగలగడం వల్లనేనని గ్రహించాలి. రెండు, మూడు సార్లు జారిస్టు సైన్యాలు పుగాచోవ్‌ను ఓడించి, ఒకసారైతే బంధించగలిగినా కూడా అతడు తప్పించుకుని తిరిగి ప్రజలలోకి వెళ్లి సైన్యాలను పోగుచేసుకుని మరల వెంటనే దాడులు చేసి ప్రభు వర్గాన్నీ, భూస్వాములనూ వణికించాడంటేనే తెలుసుకోవచ్చు పుగాచోవ్‌కు ఎంతగా ప్రజల మద్దతు ఉన్నదీ, జారిజాన్ని రైతాంగ ప్రజలు ఎంతగా అసహ్యించుకుంటున్నదీ, ప్రాణాలకు తెగించైనా బానిసత్వాన్ని వదిలించుకుని స్వేచ్ఛను పొందాలని వారంతా ఎంత కాంక్షించిందీ! అయినప్పటికీ, జారిస్టు సైన్యాలకు గల అపార అనుభవం, సంఖ్య రీత్యా, ఆయుధ బలాల రీత్యా, శిక్షణ రీత్యా లక్షలాది సంఖ్యా బలం ఉన్న జారిస్టు సైన్యాల చేతుల్లో పుగాచోవ్ సేనలు ఓడిపోక తప్పలేదు, ఊచకోతకు గురికాక తప్పలేదు. బంధించబడ్డ పుగాచోవ్‌కు మరణ శిక్షను క్రూరురాలైన కేథరిన్ ఎంత క్రూరంగా అమలు చేసిందంటే నాలుగు ముక్కలుగా అతని శరీరాన్ని ఖండించి, వాటిని బల్లాలకు గుచ్చి, నగరం ప్రధాన కూడళ్లల్లో, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు ఎత్తైనస్థలాల్లో నిలబెట్టి ప్రదర్శించేంతగా!

తిరుగుబాటునైతే జారిజం అణచివేయగలిగింది గానీ, అవసరమైన గుణపాఠాలను మాత్రం అది గ్రహించలేకపోయింది. అది తీసుకున్న ప్రతిక్రియ ఏమంటే, తిరుగుబాటుదార్ల పేర్లను కూడా తలవకుండా ఉండేందుకు వారి గృహాల్ని, వారి కుటుంబాల్ని కూడా ధ్వంసం చేయడం, వారి నాయకుడు పుట్టిన ఊరును కూడా తగలబెట్టించడం, ఆఖరికి ఆ గ్రామం పక్కనుండే నది పేరును కూడా మార్చేయడం, ప్రజలపై మరింత నిర్బంధాన్ని అమలు చేయడం వగైరాలు! ఆ విధంగా రైతాంగ బానిసత్వం అనేది అతిపెద్ద, ముఖ్యమైన సమస్యగానే మిగిలిపోయింది. అయితే తత్సంబంధిత సంస్కరణల ఆవశ్యకత ఒత్తిడి పెడుతున్నా గానీ జార్ అలెగ్జాండర్1 యథాతథ స్థితిని కొనసాగించడానికే చూశాడు తప్ప, తగిన చర్య తీసుకోకుండానే వదిలేశాడు. తద్వారా అసాధారణంగా తన వర్గం వారిలోనే అసంతృప్తి రగిలి, డిసెంబ్రిస్టు తిరుగుబాటుకు అది ఒక ముఖ్య కారణంగా బద్ధలైంది.

డిసెంబ్రిస్టు తిరుగుబాటు జరిగి ఇప్పటికి దాదాపు రెండు శతాబ్దాలు అవుతోంది. అయినప్పటికీ రష్యన్ చారిత్రక దృష్టి కోణంలో ఇప్పటికీ ప్రకంపనలు రేపుతూనే ఉంది. ఒక ప్రధానమైన బహిరంగంగా జరిగిన సైనిక చర్య ప్రధాన లక్ష్యం 'రాజరికం రద్దు' అవడంతో రష్యన్ విప్లవోద్యమ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇదేదో ఆకస్మికంగా జరిగింది కూడా కాదు. అందువల్లనే లెనిన్ రష్యన్ విప్లవోద్యమ చరిత్రను దశల వారిగా విభజిస్తూ, దాన్ని డిసెంబ్రిస్టులతోనే మొదలు పెట్టడం గమనార్హం! అంతేగాక ఆయన (లెనిన్) డిసెంబ్రిస్టు తిరుగుబాటు గురించీ, తిరుగుబాటుదారులైన ప్రభువర్గ యువకుల గురించీ ఎలా విశ్లేషించాడో చూడండి: అక్టోబర్ విప్లవానికి ముందు, 1917లో శ్రామిక వర్గ యువకులతో జరిపిన ఒక సమావేశంలో ఆయన ఈ విధంగా అన్నాడు...

'...1825లో రష్యాలో మొదటి సారిగా జారిస్టు పాలనకు వ్యతిరేకంగా ఒక విప్లవోద్యమం జరిగింది. ఈ ఉద్యమానికి ప్రాతినిధ్యం వహించినవారు కేవలం కులీన వర్గం వారు. నిజమే మనకు తెలుసు, వారంతా ఒక చిన్న అల్ప సంఖ్యాకులైన కులీనులు, అధికారం లేని, ప్రజల మద్దతు లేనివారు. కాని వారు కులీనుల నుంచి వచ్చిన శ్రేష్టమైనవారు. ప్రజలను మేల్కొల్పడానికి తోడ్పడినవారు. వీరు ప్రజలకు ఎంతో దూరంలో ఉన్నా, వీరి ప్రయత్నం విఫలమైనా, వీరు హెర్జెన్‌ని మేల్కొల్పారు. అతడు (హెర్జెన్) విప్లవోద్యమాన్ని ప్రారంభించాడు. చెర్నిషేవిస్కీ చేరికతో ఊపందుకున్న ఈ ఉద్యమం నరోద్నయావోల్యకు చెందిన వీరులతో ముగిసిపోయింది. అయితే ఈ ఉద్యమం నుంచి వచ్చిన విప్లవకారుల వల్ల సామాన్య మానవుల్లో విప్లవం పుంజుకుని, విస్తరించి, బలపడింది, పదునెక్కింది...'

(లెనిన్ సంకలిత రచనలు, ఇంగ్లిష్ ప్రతి, 21వ సంపుటం, పేజీ 261).

ఇక డిసెంబ్రిస్టు తిరుగుబాటు నాయకులలో పెక్కు మందికి మిత్రుడైన నాటి ప్రముఖ కవీ, రచయితా అయిన పూష్కిన్, తదితరులు డిసెంబ్రిస్టు తిరుగుబాటు చారిత్రక ప్రాధాన్యతను నిలిపి ఉంచడానికి దాన్నొక చారిత్రక గాథగా (మిత్) చేయడానికి ఎంతో కృషి చేశారు. ఆ 'మిత్' శతాబ్దాలు గడుస్తున్నా అలా నిలిచే ఉన్నది. ఆ మిత్‌ని నేటి యువతరం కూడా ఎంతో శ్రద్ధగా, ఎంతో గౌరవంగా, ఒక విలువైన తమ చరిత్రలోని ప్రాధాన్యతా అంశంగా తలచుకుంటున్నారు. వివరాలు తెలుసుకుంటున్నారు. డిసెంబ్రిస్టు తిరుగుబాటు తర్వాత వచ్చిన వేర్వేరు రాజకీయ భావాలుగల విప్లవకారులు, తమ విప్లవ పాఠాలను డిసెంబ్రిస్టు ఉద్యమం నుండే ప్రారంభించారు, తద్వారా తమ తిరుగుబాట్లలో అలాంటి పొరపాట్లు జరక్కుండా జాగ్రత్త పడేందుకు ప్రయత్నించారు. వారు మరింత సంఘటితంగా తయారై, మరింత సన్నద్ధతతో తమ పోరాటాన్ని నడిపేందుకు ప్రయత్నించారు. దాంతో 'డిసెంబ్రిజమ్' అనేది విప్లవకారులకు ఒక రాజకీయ తిరుగుబాటుకు సంబంధించిన తత్వశాస్త్రంగా పరిణమించింది!

ఏమైనా, జారిస్టు పాలనా విధానం మీద డిసెంబ్రిస్టు తిరుగుబాటు ప్రత్యక్షంగా పరోక్షంగానూ కూడా లోతైన ప్రభావాన్ని నెరపింది. జార్ నికోలాస్1 పాలనా కాలం ప్రారంభమైన తొలిరోజే ఆ తిరుగుబాటు జరగడంతో డిసెంబ్రిస్టు తిరుగుబాటు జరగడంతో, లోతుగా తగిలిన మానసిక గాయంతో కఠినంగా మారి, పట్టుదలతో విప్లవం తుదముట్టేంత వరకూ దానిపై పోరాడాలని నిశ్చయించుకున్నాడు. నికోలాస్1 పాలనా

కాలం అంతా డిసెంబ్రిస్టు పోరాట ఫలితంగా – సైనిక తత్వం, ఉద్యోగస్వామ్యం రెంటి కలయిక కలిగిన పాలనలలో ఒకటిగా నిలిచింది. నీకొలాస్ తన పాలనా కాలం అంతం దాకా డిసెంబ్రిస్టు తిరుగుబాటుపై ఏర్పడ్డ కసితోనే ఉన్నాడు. అతడు ఎలాంటి ఉదారవాద భావాలనైనా అణచివేయడం కోసం ఏర్పరచిన 'చాన్సిలరీ మూడో సెక్షన్' అనేది అతడి పాలన పోలీసు రాజ్యంగా మారడానికి కారణమైంది.

డిసెంబ్రిస్టు తిరుగుబాటు వల్ల కలిగిన మరొక ప్రత్యక్ష ఫలితం, జారిజం రూపొందిన అధికారిక దేశభక్తి సిద్ధాంతం. దేశభక్తి సిద్ధాంతంగా అప్పటిదాకా యూరప్‌లో ప్రచారంలో ఉన్న సిద్ధాంతాన్ని పునర్నిర్వచించి, రష్యన్ ప్రత్యేకతలు కలిగిన సైద్ధాంతిక దేశభక్తి సిద్ధాంతాన్ని రూపొందించడం ద్వారా నీకొలాస్1ను కేంద్రంగా చేసుకొని, జార్ యెడ విదేయత కలిగి ఉండడమే ఆ సిద్ధాంతానికి పరమావధిగా అది రూపొందించబడింది. 1917 ఫిబ్రవరి దాకా ఈ సిద్ధాంతమే అధికారిక రాజకీయ సిద్ధాంతంగా రష్యన్ ప్రభుత్వం ప్రచారం చేసి అమలులో పెట్టింది.

డిసెంబ్రిస్టు తిరుగుబాటు వల్ల కలిగిన మరొక ప్రత్యక్ష ఫలితం – 200 సంవత్సరాల నుంచీ నేటి దాకా కొనసాగుతున్న చర్చ – రష్యా తూర్పు దేశాలకు చెందిందా, లేదా పశ్చిమ దేశాలకు చెందిందా అనే ప్రశ్న. అలాగే తూర్పు దేశాల సంస్కృతిని అభిమానించే మేధావులకూ, పశ్చిమ దేశాల సంస్కృతిని అభిమానించే మేధావులకూ మధ్య నడిచే చర్చా కూడా, పశ్చిమ దేశాల సంస్కృతిని అభిమానించే వారి దృష్టిలో, 'తూర్పు'తో జతకలవడమంటే 'నియంతృత్వం', 'క్రూరత్వం', 'సామ్రాజ్యం' – వీటితో సంబంధం ఉండడమే అంటే ఆ భావాలను అభిమానించడమే. కానీ వారి వ్యతిరేకులైన, తూర్పు సంస్కృతిని ఇష్టపడే మేధావుల దృష్టిలో పై మూడు లక్షణాల (నియంతృత్వం, క్రూరత్వం, సామ్రాజ్య తత్వం) 'సంకేతం', 'బలమైన రాజ్యం', 'ఐక్యత', 'క్రమశిక్షణ' అని! డిసెంబ్రిస్టు తిరుగుబాటు – రష్యాలో సంస్కరణలు అమలు కావాలని, దానర్థం రష్యా ఇతర యూరపియన్ దేశాల స్థాయిలో ఉండే విధంగా దేశాన్ని తీర్చి దిద్దాలని! అయితే పై భావాలకు విరుద్ధంగా, కొంత విచిత్రంగా కూడా అనిపించవచ్చు, కొందరు యువ మేధావులు, ఉదాహరణకు వ్లదీమిర్ ఫ్యొదొరోవిచ్ ఒదోయేవ్‌స్కీ లాంటివారి ఉద్దేశంలో ఎలా యూరపియన్‌ల భావాలు నెమ్మదిగా రష్యాను కులుషితం చేస్తున్నాయో తెలుసుకునేందుకు డిసెంబ్రిస్టు తిరుగుబాటు ఉపయోగపడుతుంది అనేది. పీటర్ చాదాయేవ్, పూర్తి పేరు ప్యోత్రోయాకోవ్ లేవిచ్ చాదాయేవ్ తన ప్రసిద్ధ రచన 'పిత్ర భూమికి లేఖలు'లోని మొదటి లేఖలో మరో ప్రశ్న లేవనెత్తాడు – ప్రపంచ చరిత్రలో రష్యా స్థానం ఏమిటి అని. చాదాయేవ్ ఉత్తరం సైద్ధాంతిక దేశ భక్తులలో గొప్ప కదలిక తీసుకొచ్చింది. తద్వారా బహుళ ప్రయోజనాలు గల సిద్ధాంతం రూపొందించడానికి అదే 'స్లావోఫిలిజం' అనగా 'రష్యన్ స్లావ్ ప్రజల సంప్రదాయిక వాదం' రూపొందించడానికి దోహదపడింది అని చెప్పవచ్చు. తద్వారా ఈ సిద్ధాంతవాదులు చెప్పేది ఏమంటే, రష్యన్ జీవన విధానం, యూరప్ ప్రజల జీవన విధానం కంటే ఎంతో ముందున్నది! ఈ చర్చను ప్రారంభించిన చాదాయేవ్ ఒక వివాదాన్ని, ఎడతెగనిదాన్ని స్లావ్‌ఫిల్ వాదులకూ, పాశ్చాత్యానుకూల వాదులకూ మధ్య సృష్టించిన దాన్ని గురించి ఇంతకుముందే చెప్పుకున్నాం. ఈ చర్చ రష్యన్ రాజకీయ వాదుల ఆలోచనల్ని ఇప్పటికి కూడా ప్రభావితం చేయడం గురించి.

ఇక డిసెంబ్రిస్టు విప్లవ కారణంగా, యూరప్‌లో జరిగిన 1848 నాటి విప్లవాల నుంచి రష్యన్ జారిజం తగిన పాఠాలను స్వీకరించడంలో కూడా విఫలమైందని అనుకోవచ్చు. ఎందుకంటే, యూరప్‌లోని 1848 లాంటి విప్లవాలు తిరిగి తలెత్తకుండా చేయడం కోసం తక్షణమే ఆర్థిక, రాజకీయ పరమైన సంస్కరణలను రష్యన్ జారిజం అమలు చేయాల్సి ఉన్నా, డిసెంబ్రిస్టు తిరుగుబాటు కారణంగా అది (జారిజం) మరింత క్రూర పాలన అనుసరించింది. ఇదంతా కేవలం ఒకే ఒక వ్యక్తి స్వార్థం కోసం జరిగిన తంతు మాత్రమే. అది వ్యవసాయిక ఆధారిత ఆర్థిక విధానాలను అవలంభించి ఉండవలసింది. అలా చేయకపోవడం వల్లనే 1856 క్రిమియా యుద్ధంలో ఓడిపోవడానికి దారితీసిందని, జార్ అలెగ్జాండర్2 సరిగ్గానే గ్రహించాడని చెప్పవచ్చు.

సరిగ్గా ఆ కారణం వల్లనే యుద్ధానంతర రష్యా, పాశ్చాత్య యూరప్ వైపు అడుగులు వేసింది. సరిగ్గా ఆ కారణం రీత్యానే అలెగ్జాండర్2 బానిస రైతాంగానికి స్వేచ్ఛను ప్రసాదించాడు. అయితే ఈ సంస్కరణ చర్యలు కూడా తగినంతగా సంస్కరణాత్మకంగా లేకపోవడం వల్ల పాశ్చాత్యానుకూల వాదులు తీవ్రవాదం వైపు మళ్లడం జరిగింది. ఇదే సమయంలో మరొక వైపు స్లావోఫిలిజాన్ని అనుసరిస్తున్నవారు ఐక్యస్లావ్ ఉద్యమం వైపు, యూరప్ వాదులతో ఘర్షణ వైపుకు మళ్లారు. దీంతో మొదటి సారిగా డిసెంబ్రిస్టు తిరుగుబాటు అనంతరం మొదటి సారిగా విప్లవాత్మక ఊపుతో అలెగ్జాండర్ హత్య, తదనంతర పరిణామాలూ జరిగాయి. అనంతరమే ఇతర విప్లవాలూ జరిగాయని చెప్పవచ్చు.

నిజానికి సంస్కరణోద్యమానికి తీవ్ర అవరోధం అలెగ్జాండర్2ని 1881లో హత్య చేయడం. ఆ కారణం వలన కొత్త జార్ అలెగ్జాండర్3 అణచివేతను మరింత హెచ్చించగా ఆ తర్వాత వచ్చిన నీకొలాస్2 ఆ అణచివేతలో కొత్తపుంతలు తొక్కాడు. దాంతో ఆ అణచివేతలకు వ్యతిరేకంగా కార్మిక శక్తి గళం విప్పి, కదంతొక్కి, మార్క్సిస్టుల బలం పెరుగుదలకు కారణమైంది. అయితే ఆ పార్టీలో 1903లో చీలిక రాగా, ఆ చీలికద్వారా విప్లవ కమ్యూనిస్టు పార్టీ అయిన బోల్షివిక్ పార్టీ ఏర్పడింది.

రక్తసిక్త ఆదివారం తర్వాత జార్ నీకొలాస్2 అక్టోబర్ ప్రణాళికను ప్రకటించి, ప్రజాందోళన తీవ్రతను తగ్గించే కృషి చేశాడు. 1905 విప్లవం రాజ్యాంగాన్ని సాధించడానికి తోడ్పడింది. అది ఎలాంటిదైనా గానీ, కానీ ఇది నియంతృత్వాన్ని ప్రజాస్వామ్యం వైపు మళ్లించేదిగా లేదు. ఈ ప్రథమ విప్లవం విఫలమైనా, అది 1917 నాటి బోల్షివిక్ విప్లవానికి తగిన భూమికను సిద్ధం చేసింది. బోల్షివిక్కులు అధికారంలోకి వచ్చాక డిసెంబ్రిస్టు తిరుగుబాటుకి న్యాయం చేసేందుకు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో వారు డిసెంబ్రిస్టుల భావాలను గౌరవిస్తూ, వారి త్యాగాన్నీ, ప్రజల యెడ వారి అంకిత భావాన్నీ ఒక ఆదర్శంగా తీసుకోవలసిందిగా వారు ప్రజలకు ఉద్బోధించారు. డిసెంబ్రిస్టు భావాలు సరైనవిగా, అవి తాజాదనం కలిగినవిగా చూపించేందుకు బోల్షివిక్ ప్రభుత్వం డిసెంబ్రిస్టుల వర్ధంతుల్నీ, డిసెంబ్రిస్టు తిరుగుబాటు వార్షికోత్సవాల్నీ నిర్వహించడం మొదలెట్టింది. వాటన్నింటిలోనూ అత్యంత ప్రసిద్ధికెక్కింది 1925లో జరిగిన డిసెంబ్రిస్టు తిరుగుబాటు శతవార్షికోత్సవం! ఇది కొత్తగా ఏర్పడ్డ సోవియట్ యూనియన్ చరిత్రలో ఒక గొప్ప మరచిపోలేని క్షణం!

డిసెంబ్రిస్టు తిరుగుబాటు తన తక్షణ లక్ష్యాన్ని అందుకోవడంలో విఫలం చెందినప్పటికీ, దేశ అంతర్గత రాజకీయ పరిణామాల వెల్లువకు – 1825 నుంచీ 1917 దాకా గల కాలంలో – కారణభూతమైందని చెప్పవచ్చు. ఈ తిరుగుబాటు ఒక గొప్ప పరిణామాత్మక సాంస్కృతిక మార్పుకి కూడా కారణమైంది. ముఖ్యంగా సోవియట్ అనంతర కాలంలో రష్యన్ సంస్కృతిలో డిసెంబ్రిస్టు భావన అంతర్భాగం చేస్తూ 20వ శతాబ్దంలో నుంచీ సినిమాల నిర్మాణంలో, సంగీత స్వర సమ్మేళనాలలో డిసెంబ్రిస్టు తిరుగుబాటు గొప్ప ప్రేరణనిచ్చింది. ఎన్నో సినిమాలు ఆ తిరుగుబాటు నేపథ్యంలో నిర్మించారు, ఇంకా నిర్మిస్తూనే ఉన్నారు. ఒపేరాలు కూడా వచ్చాయి, వస్తూనే ఉన్నాయి. ఇక సంగీతంలో అయితే అసంఖ్యాకం!

(అయిపోయింది)

(రచయిత రష్యన్ విప్లవాల, లెనిన్ జీవిత చరిత్ర పరిశోధకుడు, సాహిత్యకారుడు, విమర్శకుడు)

వీ

మంగ్లేష్ దబ్రాల్ మృతి

ప్రముఖ హిందీ కవి మంగ్లేష్ దబ్రాల్ కరోనా కారణంగా అనారోగ్యానికి గురై డిసెంబర్ 9న ఎయిమ్స్ ఆసుపత్రిలో మృతిచెందారు. పహాడ్ పర్ లాల్టేన్ (కొండపై లాంతరు), ఘర్ కా రాస్తా (ఇంటిదారి) వంటి అనేక అద్భుత సంకలనాలు ఆయన్ను ఎల్లప్పుడు సజీవంగా మనముందు నిలబెడతాయి. మంగ్లేష్ దబ్రాల్ మే 16, 1948లో జన్మించారు. ఇప్పటి ఉత్తరాఖండ్ ప్రాంతానికి చెందినవారు. గఢ్వాల్‌లోని కాఫల్పానీ గ్రామంలో ఆయన పుట్టారు. డెహ్రాడూన్‌లో చదువుకున్నారు. ఢిల్లీలో ప్రారంభంలో అనేక పనులు చేసిన తర్వాత మధ్యప్రదేశ్ వెళ్లిపోయారు. అక్కడ కళాపరిషద్ ప్రచురించే సాహిత్య పత్రిక పూర్వాగ్రహ్‌లో సహాయ సంపాదకుడిగా చేరారు. జనసంస్కృతి మంచ్‌లో జాతీయ ఉపాధ్యక్షుడిగా కూడా పనిచేశారు. నేషనల్ బుక్ ట్రస్ట్‌కు కూడా ఆయన సేవలు అందించారు. ఢిల్లీ నుంచి వచ్చే జనసత్తాలో కూడా సాహిత్య సంపాదకుడిగా పనిచేశారు. మొత్తం ఐదు కవిత్వ సంపుటాలు ప్రచురించారు.

పార్లమెంట్ శీతాకాల సమావేశాలను రద్దుచేసిన కేంద్రం

పార్లమెంట్ సీతాకాల సమావేశాలను నిర్వహించడంలేదని, బడ్జెట్ సమావేశాలను జనవరిలో జరపనున్నట్లు లోక్‌సభ కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌధరికి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి లేఖ రాశారు. కరోనా వైరస్ ఈ సీతాకాలంలో విజృంభిస్తోంది. ఢిల్లీలో కరోనా తీవ్రత ఎక్కువగా ఉంది. వ్యాక్సిన్ త్వరలో రానుందని లేఖలో రాశారు. సమావేశాల వాయిదా విషయమై అన్ని పార్టీలతో చర్చించామని కరోనా నేపథ్యంలో అన్ని పార్టీలు సమావేశాల వాయిదాకే మొగ్గు చూపాయని తెలిపారు. సమావేశాల నిర్వహణపై ప్రతిపక్షాలను సంప్రదించామన్న కేంద్రమంత్రి ప్రహ్లాద్ ప్రకటనను కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ ఖండిస్తూ రాజ్యసభలో తమ నేత గులామ్ నబీ అజాద్‌ను సంప్రదించలేదన్నారు. బీహార్ ఎన్నికలను వాయిదా వేయలేదు. పార్లమెంట్ కొత్త భవనానికి శంకుస్థాపనా వాయిదా వేయలేదు. రైతుల ఆందోళనలపై చర్చను తప్పించుకోవాలనే ఉద్దేశంతోనే బిజెపి ప్రభుత్వం వాయిదాను ముందుకు తెచ్చిందన్నారు.

విస్ట్రాన్ పరిశ్రమలో కార్మికుల తిరుగుబాటు

కర్ణాటక రాజధాని బెంగళూరు శివారులోని కోలారు జిల్లా నరసాపుర పారిశ్రామిక వాడలోని ఐఫోన్ కంపెనీ విస్ట్రాన్‌లో యాజమాన్యం, కార్మికుల మధ్య వివాదంతో భారీ నష్టానికి దారితీసింది. కంపెనీలో కార్మికులు కొన్ని రోజులుగా వేతనాలతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్నారు. నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆగ్రహానికి లోనైన కార్మికులు డిసెంబర్ 12న రాళ్లతో దాడి చేసి కార్యాలయంల్లో ఓ భాగానికి నిప్పుపెట్టి కార్లను ధ్వంసం చేశారు. పోలీసులు కార్మికులపై లాఠీచార్జి చేసి కొందరిని అదుపులోకి తీసుకున్నారు. విస్ట్రాన్ కంపెనీ ప్రారంభించినప్పుడు 15 వేల మందికి పని కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా నియమించుకుని, నాల్గవ గ్రేడ్ కింద 12 వేల మంది స్థానికులను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించుకున్నారు.

హాథ్రస్ సామూహిక అత్యాచార ఘటన నిజమే

హాథ్రస్ సామూహిక అత్యాచార ఘటన పట్ల కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాలు వ్యక్తంచేసిన ఆరోపణలే నిజమని సిబిఐ తేల్చింది. ఈ ఘటనకు పాల్పడిన నలుగురు నిందితులపై అత్యాచారం, హత్య అభియోగాల కేసు నమోదుచేస్తూ డిసెంబర్ 18న చార్జిషీట్ దాఖలు చేసింది. నిందితులపై ఎస్‌సి/ఎస్‌టి అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, హాథ్రస్ కోర్టు ముందు అభియోగ పత్రాన్ని ఉంచింది. సెప్టెంబర్ 14న యుపిలోని హాథ్రస్‌లో దళిత యువతిని ఉన్నత కులానికి చెందిన నలుగురు యువకులు అత్యాచారం చేసి నాలుకను కోసి గొంతు పిసికారు. చికిత్సకోసం ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తీసుకెళ్లగా సెప్టెంబర్ 29న మరణించింది. అదే రోజు అర్ధరాత్రి కుటుంబ సభ్యులు లేకుండానే పోలీసులు అంత్యక్రియలు చేశారు. ఈ విషయం బయటికి తెలవడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవ్వడంతో ఆధిత్యనాథ్ ప్రభుత్వం కేసును సిబిఐకి అప్పగించింది.

మానవాభివృద్ధి సూచిలో దిగజారిన భారత్ స్థానం

ఐక్యరాజ్య సమితీ ప్రకటించిన మానవాభివృద్ధి సూచిలో భారతదేశం రెండు స్థానాలు కిందికి పడిపోయింది. 189 దేశాల జాబితాలో భారత్ స్థానం 139. దేశాలు వెలువరించే కార్బన్ ఉద్గారాల వల్ల జరిగే కాలుష్యం ఆధారంగా ఐక్యరాజ్య సమితీ ఈ జాబితాను రూపొందిస్తుంది.

ఢిల్లీ సరిహద్దుల్లో కొనసాగుతున్న రైతు ఉద్యమం

నూతనంగా తెచ్చిన వ్యవసాయ చట్టాలను రద్దుచేయాలని కోరుతూ నవంబర్ 26 నుంచి ఢిల్లీ సరిహద్దుల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఉత్తర భారత రైతాంగం ఉద్యమిస్తూనే ఉన్నారు. ఈ ఉద్యమానికి దేశ వ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయంగా ప్రభుత్వ అమానుశ వైఖరిపై ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాలకు చెందిన ఎం.పి.లు ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించారు. ప్రవాస భారతీయులు, మానవ హక్కుల సంఘాల ఆధ్వర్యంలో పలుచోట్ల సంఘీభావ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. సింఘూ సరిహద్దుల్లో సమావేశమైన 40 యూనియన్ల ప్రతినిధులు డిసెంబర్ 26న ప్రభుత్వం రాసిన లేఖపైనా, ప్రధాని మోదీ చర్చలకోసం ఇచ్చిన పిలుపుపైనా చర్చించారు. డిసెంబర్ 29న ప్రభుత్వంతో జరుగనున్న చర్చల్లో మూడు వ్యవసాయ చట్టాల రద్దు, ఎంఎస్‌పికి చట్టబద్ధత ఉండితీరాలని అందులో షరతు విధించారు.

మత మార్పిడుల కట్టడికి సిద్ధమైన యు.పి, ఎం.పి

మత మార్పిడి బిల్లుకు మధ్యప్రదేశ్ కేబినెట్ డిసెంబర్ 26న ఆమోదం తెలిపింది. మధ్యప్రదేశ్ మత స్వేచ్ఛ బిల్లు–2020 పేరుతో రూపొందించిన ఈ బిల్లును కేబినెట్ ఆమోదించినట్లు రాష్ట్ర హోంశాఖ మంత్రి నరోత్తమ్ మిశ్రా తెలిపారు. ఈ బిల్లు కింద పెళ్లి లేదా ఇతరత్రా తప్పుడు మార్గాల ద్వారా మతమార్పిడులకు పాల్పడే వారికి గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్ష, ఒక లక్ష రూపాయల జరిమానా విధిస్తారు. మతం మార్చుకోవాలనుకునే వారు 60 రోజుల ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని మంత్రి తెలిపారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కరోనా కాలంలో 'చట్ట వ్యతిరేక మతాంతీకరణ నిషేధ చట్టం–2020' ఆర్డినెన్స్‌ను తెచ్చి గవర్నర్ చేత హడావిడిగా ఆమోదింప చేసుకుంది.

మానవత్వం కొరవడిన ప్రభుత్వం, జైలు అధికారులు

భీమా కోరేగాం కేసులో రెండు సంవత్సరాలకు పైగా మహారాష్ట్రలోని తలోజ జైలులో నిర్బంధంలో ఉన్న హక్కుల కార్యకర్తల పట్ల ప్రభుత్వాలు, జైలు అధికారులు అమానవీయంగా వ్యవహరిస్తున్నారు. 70 ఏళ్ల వయసున్న గౌతమ్ నవ్లాఖా కళ్ల జోడు పోయిందని చెప్పినా అధికారులు పట్టించుకోక కల్లున్న గుడ్డివాడిని చేశారు. 83 ఏళ్ల వృద్ధుడు పార్కిన్‌సన్ వ్యాధితో బాధపడుతున్నప్పటికీ స్ట్రా, సిప్పర్‌లు కూడా కోర్టు జోక్యంచేసుకునే వరకు అధికారులు ఇవ్వలేదు. అదే స్టాన్ స్వామిని దశాబ్దాలుగా గిరిజనులకు సేవలందించినందుకు 2020 సంవత్సరానికి ముకుందన్ మీనన్ అవార్డుకు ఎంపిక చేసినట్లు మానవ హక్కుల సంఘాల జాతీయ సమాఖ్య ప్రకటించింది. 81 ఏళ్ల వృద్ధుడు వరవరరావు కరోన తదితర సమస్యలతో బాధపడుతూ బెయిల్ ఇవ్వమంటే ఇవ్వకుండా అంతర్జాయ సమాజం స్పందిస్తే తప్ప ఆస్పత్రికి పంపలేని పరిస్థితి ఈ ప్రభుత్వాలది. సోమా సేన్, సుధా భరద్వాజ్ తదితరులు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 231 - January 2021 ● **ISSN 2231-6892**

● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/12/2020 ● Postal Regn. No. HD/1100/2020-22

Date of Posting : 29th, 30th

If undelivered please return to:

VEEKSHANAM
Mytri Residency, 3-6-394, St. No. 3,
Himayatnagar, Hyderabad - 500 029.
Phone: 040 66843495

To:
Mr./Mrs.____________________

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao